సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50


సంపుటి: 18 సంచిక: 45

బుధవారం 7-5-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'నా అక్కలూ.. చెల్లెళ్లు.. తమ్ముళ్ల కళ్లలో వెలుగులు చూసినపుడే నా నిజమైన పుట్టిన రోజు'



పాక్‌తో ఐసీసీ టోర్నీల్లోనూ ఆడవద్దు

దీనిపై భారత ప్రభుత్వానిదే తుది నిర్ణయం హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ వ్యాఖ్య -14లో



పసిడికి డిమాండ్

రూ.2,400 పెరుగుదల. భౌగోళిక ఉద్రిక్తతలు, టారిఫ్ షాక్‌లు -15లో



మోదీకి ముందే తెలుసు

పహల్గాంలో ఉగ్రవాద దాడి జరిగే అవకాశం ఉన్నట్లు ప్రధాని మోదీకి 3 రోజుల ముందే తెలుసని మల్లికార్జున ఖర్గే చెప్పారు.

వివరాలు 6లో ▸



యూకేతో ఇక స్వేచ్ఛా వాణిజ్యం

భారత్–యూకే ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంతోపాటు డబుల్ కంట్రిబ్యూషన్ కన్వెన్షన్ ఒప్పందం కుదిరింది.

వివరాలు 6లో ▸



నాటి బికినీల పోటీ..

'అద్భుతాలు కేవలం అనుకుంటే జరగవు. పరిస్థితులే వాటిని సృష్టిస్తాయి' అనడానికి ఉదాహరణ... మిస్ వరల్డ్ పోటీలు.

వివరాలు 13లో ▸



కొత్త పోప్ ఎవరో !

తదుపరి పోప్ ఎవరనే ఉత్కంఠ తీవ్రమైంది. కార్డినల్స్ వాటికన్ సిటీలో రహస్య ఓటింగ్‌కు సిద్ధమయ్యారు.

వివరాలు 6లో ▸

ఫ్లాష్ ఫ్లాష్

పాక్‌లోని ఉగ్ర శిబిరాలపై భారత్ దాడి

పహల్గాం దాడికి ప్రతీకారంగా ఆపరేషన్ సిందూర్‌తో విరుచుకుపడిన భారత్ సైన్యం

12 మంది ఉగ్రవాదులు హతం



బహవల్‌పూర్‌లో క్షిపణి దాడి దృశ్యం

పహల్గాం దాడికి భారత్ ప్రతీకారం తీర్చుకుంది. మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత 'ఆపరేషన్ సిందూర్' పేరిట పీవోకేతో పాటు పాకిస్తాన్‌లోని ఉగ్రవాద శిబిరాలపై భారత్ వైమానిక దాడులు జరిపింది. మొత్తం 9 ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేసినట్టు వెల్లడించింది. ఈ దాడిలో 12 మంది ఉగ్రవాదులు మృతి చెందగా 55 మందికి పైగా గాయపడ్డారు. పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్‌లోని కోట్లి, ముజఫరాబాద్, పంజాబ్‌లోని బహవల్‌పూర్‌తో పాటు లాహోర్‌లోని ఒక ప్రదేశంపై భారత్ క్షిపణి దాడులు జరిపింది. ఈ సందర్భంగా 'ఎయిర్ టు సర్ఫేస్' మిస్సైళ్లను ప్రయోగించారు. దాడి అనంతరం 'న్యాయం జరిగింది.. జైహింద్' అంటూ భారత్ సైన్యం 'ఎక్స్'లో పోస్ట్ చేసింది. ఇవి సర్జికల్ స్ట్రైక్స్ కాదు. భారత భూభాగంనుంచే అత్యంత కచ్చితత్వంతో చేసిన దాడులని వెల్లడించింది. పహల్గాందాడిలో ఉగ్రవాదులు పురుషులను మాత్రమే ఎంచుకుని కాల్చి చంపి ఎందరో మహిళల నుదుటి సిందూరం తుడిచేసిన కారణంగానే ఆపరేషన్‌కు 'సిందూర్' అని నామకరణం చేశారు. మసూద్ అజర్, హఫీజ్ సయీద్ ప్రధాన స్థావరాలు లక్ష్యంగా ఈ దాడులు జరిగాయని తెలుస్తోంది. భారత దాడి అనంతరం పాకిస్తాన్‌లో ఎమర్జెన్సీ ప్రకటించారు. విమానాశ్రయాలు మూసివేశారు.

ఓబుళాపురం మైనింగ్ కేసు..

సబిత నిర్దోషి



- పరిశ్రమల శాఖ అప్పటి కార్యదర్శి కృపానందం కూడా..
- తీర్పు వెల్లడించిన సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం
- గాలి జనార్దనరెడ్డి, బీవీ శ్రీనివాసరెడ్డి, వీడీ రాజగోపాల్, అలీఖాన్ దోషులు.. ఏడేళ్ల జైలు
- రాజగోపాల్‌కు అదనంగా నాలుగేళ్లు
- 10 వేల చొప్పున జరిమానా.. ఓఎంసీకి రూ.2 లక్షల ఫైన్

సాక్షి, హైదరాబాద్: ఓబుళాపురం మైనింగ్ కంపెనీ (ఓఎంసీ) కేసులో నాంపల్లి సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం మంగళవారం తుది తీర్పు వెల్లడించింది. గనుల శాఖ మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి, గనుల శాఖ అప్పటి కార్యదర్శి కృపానందంలను నిర్దోషులుగా ప్రకటించింది. దాదాపు 15 ఏళ్ల సుదీర్ఘ విచారణ అనంతరం ఈ కేసులో మంగళవారం మొత్తం ఐదుగురిని దోషులుగా, ఇద్దరిని నిర్దోషులుగా తేల్చింది. ప్రధాన నిందితులైన ఓఎంసీ అప్పటి డైరెక్టర్, కర్ణాటక మాజీ మంత్రి గాలి జనార్దన్‌రెడ్డి, కంపెనీ ఎండీ బీవీ శ్రీనివాసరెడ్డి, గనుల శాఖ అప్పటి డైరెక్టర్ వీడీ రాజగోపాల్, గాలి జనార్దనరెడ్డి పీఏ మెహఫూజ్ అలీఖాన్‌లను దోషులుగా నిర్ధారిస్తూ.. ఏడేళ్ల జైలు శిక్ష, రూ.10 వేల చొప్పున,

మిగతా 3వ పేజీలో ▶

న్యాయం గెలిచింది

నన్ను ముందు పెట్టి వైఎస్‌ను దోషిగా నిలబెట్టాలని చూశారు: సబితా ఇంద్రారెడ్డి



- ➤ మేము ఎక్కడా చట్టవిరుద్ధంగా అనుమతులివ్వలేదు
- ➤ తప్పు చేయకపోయినా నాడు కన్నీళ్లతో కోర్టు మెట్లు ఎక్కా.. పన్నెండున్నరేళ్ల పాటు మానసిక వేదన అనుభవించా
- ➤ వాస్తవాలను పరిశీలించిన కోర్టు నన్ను నిర్దోషిగా ప్రకటించింది

3లో

న్యూస్‌రీల్

ఆర్టీసీలో సమ్మె యోచన వాయిదా



డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించటంతో ఆర్టీసీలో మంగళవారం నుంచి నిర్వహించ తలపెట్టిన సమ్మె యోచనను కార్మిక సంఘాలతో కూడిన ఓ జేఏసీ వాయిదా వేసుకుంది.

- వివరాలు 2లో▶

కొత్తగా 81 అంగన్‌వాడీ కేంద్రాలు



రాష్ట్రంలో కొత్తగా 81 అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతి అంగన్‌వాడీ కేంద్రానికి ఒక అంగన్‌వాడీ టీచర్, ఒక హెల్పర్ పోస్టును కేంద్రప్రభుత్వం మంజూరు చేసింది.

- వివరాలు 3లో▶

అకాలానికి 'ముందే' సరైన మందు!



ఏటా ఏప్రిల్, మే నెలల్లో కురిసే అకాల వర్షాలు అన్నదాతలకు కన్నీళ్లే మిగిలిస్తున్నాయి. ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకునే ప్రభుత్వం.. త్వరగా పంట చేతికొచ్చే వరి వంగడాలను అందుబాటులోకి తెచ్చింది.

- వివరాలు 12లో▶

పోతిరెడ్డిపాడుపై టెలిమెట్రీ కేంద్రం



శ్రీశైలం జలాశయం నుంచి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ద్వారా శ్రీశైలం కుడి ప్రధాన కాల్వకి ఏపీ తరలిస్తున్న కృష్ణా జలాలను లెక్కించడానికి టెలిమెట్రీ కేంద్రం ఏర్పాటుకు కేఆర్ఎంబీ చర్యలు చేపట్టింది.

- వివరాలు 16లో▶

ఇదండీ సంగతి



మొదట్నుంచి మీరే ఏదో రకంగా విదేశీయులకు హర్రర్, క్రైమ్ థ్రిల్లర్ సినిమాను చూపిస్తున్నారుగా సార్!!

వచ్చే 50 ఏళ్లకు తగ్గట్లుగా

రోడ్ల అలైన్‌మెంట్లు

- ఆర్ఆర్ఆర్, రేడియల్ రోడ్ల పనులను వేగవంతం చేయాలి
- శాటిలైట్ టౌన్‌షిప్‌లు, పారిశ్రామిక పార్కులకు అనుగుణంగా రోడ్లు ఉండాలి
- ఉన్నతస్థాయి సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి



సమీక్షలో మాట్లాడుతున్న సీఎం రేవంత్. చిత్రంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

సాక్షి, హైదరాబాద్: వచ్చే 50 ఏళ్ల అవసరాలకు తగ్గట్లుగా రీజనల్ రింగ్‌రోడ్డు (ఆర్ఆర్ఆర్), రేడియల్ రోడ్లు, ఇతర రహదారుల నిర్మాణం, వాటికి సంబంధించి జంక్షన్లు, వాటి అనుసంధానం ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం, రేడియల్ రోడ్లు, ఇతర రహదారుల నిర్మాణంపై మంగళవారం రాత్రి తన నివాసంలో సీఎం సమీక్ష నిర్వహించారు. అందుకు సంబంధించిన అలైన్‌మెంట్‌ను పరిశీలించి పలు మార్పులు సూచించారు. అటవీ ప్రాంతం, జలవనరులు, మండల కేంద్రాలు, గ్రామాల విషయంలో ముందుగానే లైడర్ సర్వే చేపట్టాలని ఆదేశించారు. అలైన్‌మెంట్ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, పొరపాట్లకు తావివ్వరాదన్నారు. శాటిలైట్ టౌన్‌షిప్‌లు, పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు అనుగుణంగా రేడియల్ రోడ్లకు రూపకల్పన చేయాలని చెప్పారు.

గందరగోళానికి తావులేకుండా..

ఓఆర్ఆర్ నుంచి ఆర్ఆర్ఆర్ వరకు

మిగతా 3వ పేజీలో ▶

ఉద్యోగులతో చర్చలకు

త్రిసభ్య కమిటీ

- చైర్మన్‌గా రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్

ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలు ఆలకించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో చర్చలకు ఉపక్రమించింది. వివిధ ఉద్యోగ సంఘాలతో చర్చలు జరపడం, ప్రాధాన్యమైన, ఆచరణ యోగ్యమైన అంశాలపై సిఫారసులతో నివేదికను సమర్పించేందుకు ముగ్గురు ఉన్నతాధికారులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసింది. రాష్ట్ర రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్ కమిటీకి చైర్మన్‌గా వ్యవహరిస్తారు. -2లో▶

చేతకాకపోతే తప్పుకో..

సీఎం రేవంత్‌పై కేటీఆర్ ధ్వజం



'తెలంగాణ ప్రతిష్టను దెబ్బతీసేలా మాట్లాడితే సహించేది లేదు. పాలన చేతకాక రేవంత్ కాడి కింద పడేసి పారిపోయేందుకు మార్గాలు వెతుక్కుంటున్నాడు. ఉద్యోగుల విషయంలో రేవంత్ చేసిన వ్యాఖ్యలతో ఆయనకు సమర్థత, దక్షత లేదని తేలిపోయింది. తెలంగాణ ఉద్యమంలో కదం తొక్కిన ఉద్యోగులను రేవంత్‌రెడ్డి అవమానిస్తున్నాడు.

- వివరాలు 12లో▶

రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులు!

మిస్ వరల్డ్ పోటీలతో అవకాశం

విదేశీ పర్యాటకులు పెద్ద సంఖ్యలో వచ్చే ఆస్కారం


మంత్రి జూపల్లి కృష్ణారావు



సాక్షి, హైదరాబాద్: ప్రపంచ సుందరి పోటీలు.. తెలంగాణ, హైదరాబాద్ ఖ్యాతి ప్రపంచ వ్యాప్తంగా విస్తరించేందుకు, రాష్ట్రంలోకి విదేశీ పెట్టుబడులు పెరిగేందుకు దోహద పడతాయని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఇటీవలే ముఖ్యమంత్రి బృందం దావోస్, జపాన్‌లలో పర్యటించి పెద్ద మొత్తంలో పెట్టుబడులు సాధించిందని, ఇప్పుడు ప్రపంచ సుందరి పోటీలు తెలంగాణలో జరగటం ద్వారా మరిన్ని పెట్టుబడులకు అవకాశం చిక్కినట్టవుతుందని పేర్కొన్నారు. తెలంగాణ, హైదరాబాద్ గురించి

మిగతా 2వ పేజీలో ▶

మంచి జీతమొస్తే.. మారుడే!



వేతన పెంపు, సౌకర్యాలకే భారతీయ ఉద్యోగుల మొగ్గు

ఉద్యోగం మారేందుకు పదింట 8 మంది సిద్ధం

అయాన్ '2025 ఎంప్లాయీస్ సెంటిమెంట్స్ స్టడీ' వెల్లడి

వర్క్–లైఫ్ బ్యాలెన్స్, మెడికల్ కవరేజీ, కెరీర్ డెవలప్‌మెంట్.. పెయిడ్ టైమ్ ఆఫ్, రిటైర్‌మెంట్ సేవింగ్స్‌కే ఓటు

ఎక్కడ మంచి వేతనం, సౌకర్యాలు లభిస్తే అక్కడికి మారిపోయేందుకు భారతీయ ఉద్యోగులు మొగ్గుచూపుతున్నారు. కంపెనీ పేరు ప్రతిష్టలు, జాబ్ నేచర్ కంటే.. సంపాదన పెంచుకోవటం, ప్రశాంతమైన కుటుంబ జీవితంపైనే ఎక్కువ దృష్టిపెట్టినట్లు తాజా సర్వేలో తేలింది. ఇందుకోసం వచ్చే 12 నెలల్లో కంపెనీలు, చేస్తున్న ఉద్యోగాలు మారేందుకు పదింట 8 మంది సిద్ధంగా ఉన్నట్లు ప్రొఫెషనల్ సర్వీసెస్ సంస్థ అయాన్ (ఏవోఎన్) తాజాగా విడుదల చేసిన '2025 ఎంప్లాయీస్ సెంటిమెంట్ స్టడీ'లో వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా చూస్తే పదిమందిలో ఆరుగురే 'జాబ్ మొబిలిటీ' (ఉద్యోగం మారటం)కి ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపింది. ఈ నివేదికను 23 దేశాల్లో 9,000 మంది ఉద్యోగుల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా రూపొందించారు. - సాక్షి, హైదరాబాద్

భారతీయ ఉద్యోగులు కీలకంగా భావిస్తున్న అంశాలు

- **మెడికల్ కవరేజ్:** అన్ని తరాల ఉద్యోగులు, ముఖ్యంగా యువతరం దీనిని కీలకంగా పరిగణిస్తోంది.
- **కెరీర్ డెవలప్‌మెంట్:** నైపుణ్య అభివృద్ధి, ఉద్యోగ పురోగతి అవకాశాలకు ప్రాధాన్యత.
- **పెయిడ్ టైమ్ ఆఫ్:** విశ్రాంతి, వ్యక్తిగత సమయం వెచ్చించడానికి ప్రాధాన్యత.
- **రిటైర్‌మెంట్ సేవింగ్స్:** భవిష్యత్తు కోసం పొదుపు పథకాలను పరిశీలిస్తున్నారు.

ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేసిన అంశాలు..

- భారత్‌లోని 7 శాతం మంది ఉద్యోగులు తమ విలువను యాజమాన్యాలు గుర్తించడం లేదని భావిస్తున్నారు. ఈ విషయంలో ప్రపంచ సగటు 13 శాతం ఉంది.
- యజమానులు భవిష్యత్ ఉద్యోగ అవసరాల కోసం నైపుణ్య శిక్షణలో పెట్టుబడి పెట్టడం లేదని 10 శాతం ఉద్యోగులు ఆందోళన వ్యక్తంచేశారు. ఏఐ నైపుణ్యాల అభివృద్ధిపై భారత ఉద్యోగులు ఆసక్తి చూపుతున్నారు.
- 43 శాతం మంది కొత్త నైపుణ్యాలు నేర్చుకోవడానికి ప్రేరణ పొందినట్లు తెలిపారు. ఇది ప్రపంచ సగటు 35 శాతంగా ఉంది.

ఈ ఆలోచనా ధోరణి ఆశ్చర్యకరమే..

యువఉద్యోగులలో రిటైర్‌మెంట్, ఆర్థిక ప్రణాళికపై ఆసక్తి ఆశ్చర్యకరం. స్థిరమైన ఎంట్రీ–లెవెల్ వేతనాలు, 30 ఏళ్లలోపు వ్యక్తిగత రుణాలు తీసుకోవడంతో ఈ ధోరణి ఏర్పడింది. యజమానులు ఆర్థిక శ్రేయస్సును ప్రోత్సహించే ప్రయోజనాలను హైలైట్ చేసి ఉద్యోగుల ఎంగేజ్‌మెంట్‌ను పెంచే అవకాశముంది.

- అష్లే డిసిల్వా, హెల్త్ అండ్ వెల్త్ సొల్యూషన్స్ హెడ్, అయాన్

బెనిఫిట్స్ ఇస్తేనే ఉత్తమ కంపెనీగా పేరు

కోవిడ్ తర్వాత ఉద్యోగులు బెనిఫిట్స్, వెల్‌నెస్, హెల్త్‌కేర్ ప్రోగ్రామ్‌లకు ఎక్కువ విలువిస్తున్నారు. కంపెనీలు ఈ ప్రోగ్రామ్‌లను బ్రాండింగ్ చేసి, వాటి లభ్యతను ఉద్యోగులకు తెలియజేస్తున్నాయి. వచ్చే దశాబ్దంలో బెనిఫిట్స్, వెల్‌నెస్‌లో రాణించే కంపెనీలు ఉత్తమ యజమానులుగా నిలుస్తాయి.

- నితిన్ సేథీ, అయాన్ టాలెంట్ సొల్యూషన్స్ హెడ్

నివేదికలోని ముఖ్యాంశాలు

- భారత్‌లోని 82% మంది ఉద్యోగులు వచ్చే 12 నెలల్లో ఉద్యోగాలు మారేందుకు సిద్ధంగా ఉన్నారు. ప్రపంచవ్యాప్తంగా 60% మంది ఉద్యోగం మారేందుకు మొగ్గుచూపారు.
- భారతీయ ఉద్యోగులు వర్క్–లైఫ్ బ్యాలెన్స్, మెడికల్ కవరేజ్, కెరీర్ డెవలప్‌మెంట్, పెయిడ్ టైమ్ ఆఫ్, రిటైర్‌మెంట్ సేవింగ్స్‌ను అత్యంత ప్రాధాన్యతగల ప్రయోజనాలుగా గుర్తించారు.
- సర్వేలో పాల్గొన్నవారిలో 76 శాతం మంది ఉద్యోగులు తమ ప్రస్తుత ప్రయోజనాలను వదులుకుని, మెరుగైన ఎంపికల కోసం సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఇది భారత కంపెనీలు తమ రివార్డులు, బెనిఫిట్స్ వ్యూహాలను మార్చాల్సిన అవసరాన్ని సూచిస్తోంది.
- కంపెనీలు తమ రివార్డు వ్యూహాలను సర్దుబాటు చేయడం, వెల్‌నెస్ ప్రోగ్రామ్‌లను బలోపేతం చేయడం ద్వారా పోటీ ప్రయోజనాన్ని సాధించవచ్చునని నివేదిక సూచించింది.
- ఏఐ నైపుణ్యాల అభివృద్ధి.. ఆర్థిక ప్రణాళికపై వర్క్‌ఫోర్స్ భవిష్యత్ ధోరణులను సూచిస్తోంది. ఇది యజమానులకు కొత్త అవకాశాలను అందిస్తుందని ఈ అధ్యయనం అభిప్రాయపడింది.

క్లుప్తంగా...

తెలంగాణలో మూడు సైనిక్ స్కూళ్లు ఏర్పాటు చేయండి

రక్షణ శాఖ సహాయమంత్రికి ఎంపీ రఘునందన్‌రావు విజ్ఞప్తి



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో మూడు సైనిక్ స్కూళ్లు ఏర్పాటు చేయాలని రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్‌కు మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ సైనిక్ స్కూల్స్‌లో ఈ విద్యా సంవత్సరంలో తెలంగాణ విద్యార్థుల కోటాను కొనసాగించాలని కోరారు. ఈ మేరకు మంగళవారం ఢిల్లీలో రఘునందన్‌రావు సంజయ్ సేథ్‌ను కలిసి వినతిపత్రాలు అందజేశారు. అనంతరం తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలో సైనిక పాఠశాలలు ప్రారంభం అయ్యే వరకు ఏపీలోని సైనిక్ స్కూల్స్‌లో 67 శాతం లోకల్ కోటా ఉంచాలని కోరినట్లు తెలిపారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు రేవంత్ రెడ్డి మాట్లాడిన మాటలు ఒకసారి గుర్తు చేసుకోవాలని రఘునందన్‌రావు సూచించారు. చేతకాకపోతే ఎన్నికలకు వెళ్తారా? అసెంబ్లీని రద్దు చేస్తారా? రేవంత్ రెడ్డి నిర్ణయించుకోవాలన్నారు. రేవంత్ అంతటి అసమర్థ ముఖ్యమంత్రిని ఎప్పుడూ చూడలేదని విమర్శించారు.

సెలవుల్లోనూ తరగతులు

- ఇష్టారాజ్యంగా క్లాస్‌లు నిర్వహిస్తున్న ఇంటర్మీడియెట్ కాలేజీలు
- హైకోర్టులో పిల్.. నేడు డివిజన్ బెంచ్ విచారణ!


సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఇంటర్మీడియెట్ విద్యా మండలి (టీఎస్‌బీఐఈ) జారీ చేసిన వార్షిక కేలండర్‌లో ప్రకటించిన విధంగా ప్రైవేట్ కళాశాలలు సెలవులు ప్రకటించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ బందెల క్రాంతికుమార్ తరఫున న్యాయవాది సీఆర్ సుకుమార్ పిల్ దాఖలు చేశారు. ఆదివారాలు, ప్రభుత్వ సెలవు రోజులు అని తేడా లేకుండా ఫిజికల్‌గా, వర్చువల్‌గా తరగతులను నిర్వహిస్తున్నారని, వెంటనే ఆపేలా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. 'విద్యార్థుల సమగ్ర వృద్ధి, మానసిక ఆరోగ్యం, ఒత్తిడి తగ్గించేందుకు విద్యా మండలి సెలవులతో కేలండర్‌ను రూపొందించింది. ప్రైవేట్ కళాశాలలు దీన్ని పాటించకుండా తరగతులను నిర్వహిస్తున్నాయి. దీంతో విద్యార్థులు తీవ్ర ఒత్తిడి, అలసట, ఆందోళన, నిరాశతో పాటు ఆత్మహత్యకు పాల్పడే అవకాశం ఉంది. కళాశాలల పనితీరుపై తనిఖీలు చేస్తూ కఠినంగా పర్యవేక్షించాల్సిన అధికారులు మౌనంగా ఉంటు న్నారు. కొందరు వాటికి సహకరిస్తున్నారు. దీనిపై అత్యవసర విచారణ జరపాలి'అని విజ్ఞప్తి చేశారు. దీంతో ఈ పిల్‌పై బుధవారం డివి జన్ బెంచ్ విచారణ చేపట్టే అవకాశం ఉంది.

మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు 9న ఆర్థిక సహాయం

మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: అనారోగ్య కారణాలతో మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు ఈ నెల 9న ఆర్థిక సహాయం అందించనున్నామని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. వర్కింగ్ జర్నలిస్టు సంక్షేమనిధి నుంచి ఇచ్చే ఆర్థిక సహాయాన్ని చనిపోయిన జర్నలిస్టు కుటుంబాలకు, అనారోగ్యం, ప్రమాదాల బారినపడి పనిచేయలేక నిస్సహాయ స్థితిలో ఉన్న జర్నలిస్టులకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అందజేస్తారని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని మీడియా అకాడమీ ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఇటీవల 38 మంది జర్నలిస్టులు మరణించారని, ఒక్కో కుటుంబానికి రూ.లక్షతోపాటు ఐదేళ్ల పాటు వారి కుటుంబానికి రూ.3 వేల పింఛన్, ఎల్‌కేజీ నుంచి టెన్త్ వరకు నెలకు రూ.2 వేల ట్యూషన్‌ఫీజు ఇస్తామని చెప్పారు. ఇదే కార్యక్రమంలో మీడియా అకాడమీ వెబ్‌సైట్ https://mediaacademy.telangana.gov.in, జర్నలిస్టుల పునశ్చరణ తరగతుల ఉపయోగపడే చిరు పుస్తకాలను పొంగులేటి ఆవిష్కరిస్తారు.

రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులు!



మాట్లాడుతున్న మంత్రి జూపల్లి. చిత్రంలో నందినీగుప్తా, జయేశ్‌రంజన్, పటేల్ రమేశ్‌రెడ్డి, సినీనటుడు సోనూసూద్, జూలియా మోర్లే, , గౌరవ్ కే కుమ్రా, శ్రీకాంత్

▶ మొదటి పేజీ తరువాయి

ప్రపంచ వ్యాప్తంగా సానుకూల ప్రచారం జరిగి విదేశీ పర్యాటకులు పెద్ద సంఖ్యలో రావటానికి అవకాశం లభిస్తుందని వెల్లడించారు. మిస్ వరల్డ్ లిమిటెడ్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి హైటెక్ సిటీలోని ట్రైడెంట్ హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

రాష్ట్ర శక్తిని నిరూపించుకునే సమయం

'మన ఘనమైన చరిత్ర, సంస్కృతిపై ప్రపంచ స్థాయిలో బలంగా ప్రచారం జరగటానికి ఈ పోటీలు కారణమవుతాయి. ఈ ప్రతిష్టాత్మక పోటీలను నిర్వహించే అవకాశం పొందేందుకు పలు దేశాలు, దేశంలోని పలు రాష్ట్రాలు ప్రయత్నించినప్పటికీ, ముఖ్యమంత్రి చొరవతో తెలంగాణకే చాన్స్ దక్కింది. పోటీలు ఘనంగా నిర్వహించడం ద్వారా రాష్ట్ర శక్తిని నిరూపించుకునే సమయం వచ్చింది. ఈ పోటీలు ఎలాంటి లోపాలు లేకుండా ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం..'అని జూపల్లి తెలిపారు.

సామాన్యులు తిలకించేందుకూ అవకాశం: జయేశ్

ఈ పోటీలు కేవలం ధనవంతుల కోసమే అన్న విమర్శను చెరిపేసే ప్రయత్నం చేస్తున్నామని, సాధారణ ప్రజలు కూడా ఈ పోటీలను తిలకించేందుకు సీఎం ఆదేశం మేరకు అవకాశం కల్పిస్తున్నామని ప్రభుత్వం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ చెప్పారు. ప్రారంభ వేడుకలు, పోటీదారుల స్పోర్ట్స్ ఈవెంట్, టాలెంట్ కాంటెస్ట్, హైటెక్స్‌లో 23, 25 తేదీల్లో జరిగే కార్యక్రమాలను సామాన్యులు కూడా తిలకించేందుకు కూడా వీలు కల్పిస్తున్నామని, ఆసక్తి ఉన్నవారు తెలంగాణ పర్యాటక శాఖ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

తెలంగాణ సరైన వేదిక: జూలియా మోర్లే

ప్రపంచ సుందరి పోటీలకు తెలంగాణను ఎందుకు ఎంచుకున్నారని కొందరు అడుగుతున్నారని, తెలంగాణను ఎందుకు ఎంచుకోవద్దని తాను అంటున్నానని మిస్ వరల్డ్ లిమిటెడ్ చైర్‌పర్సన్ జూలియా మోర్లే అన్నారు. ఈ పోటీలకు తెలంగాణ సరైన వేదికగా తాము భావించామని, ఇక్కడి ప్రజలు ఎంతో ప్రేమ ఆప్యాయత చూపేవారని, గొప్ప పర్యాటక ప్రాంతాలు ఇక్కడ ఉన్నాయని ఆమె పేర్కొన్నారు.

బిర్యానీ, ఇరానీ చాయ్ ఇష్టం

హైదరాబాద్, తెలంగాణ అంటే తనకు అమితమైన అభిమానమని, ఇక్కడి ప్రజలు ఎంతో ప్రేమ, ఆప్యాయతను పంచుతున్నారని మిస్ వరల్డ్ ఇండియా నందినీ గుప్తా చెప్పారు. హైదరాబాద్ బిర్యానీ, ఇరానీ చాయ్ అంటే తనకు ఇష్టమని తెలిపారు. ప్రముఖ నటుడు, ఈ పోటీల జ్యూరీ సభ్యుడు సోనూసూద్, తెలంగాణ పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, హైటెక్స్ నిర్వాహక వర్గం ప్రతినిధి శ్రీకాంత్, ట్రైడెంట్ హోటల్స్ వైస్ ప్రెసిడెంట్ గౌరవ్ కే కుమ్రా తదితరులు పాల్గొన్నారు.

అట్ట ముక్కలతో తోరణాలా?

గచ్చిబౌలి: మిస్ వరల్డ్ అందాల పోటీల ప్రారంభ వేడుకలకు వేదికైన గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో స్వాగత ఏర్పాట్లపై మంత్రి జూపల్లి అసహనం వ్యక్తం చేశారు. మంగళవారం అక్కడి ఏర్పాట్లను పరిశీలించిన ఆయన షోబోట్ ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థ స్వాగత తోరణాలకు అట్ట ముక్కలను ఉపయోగించడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా మామిడి, అరటి ఆకులు, పూలతో తోరణాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

మిస్ వరల్డ్ వేదికలకు 3 కి.మీ. దాకా డ్రోన్లపై నిషేధం

అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హైదరాబాద్ సీపీ హెచ్చరిక



సాక్షి, హైదరాబాద్: మిస్ వరల్డ్ అందాల పోటీలు జరిగే వేదికలతోపాటు పోటీదారులు పర్యటించే ప్రాంతాల్లో పోలీసు శాఖ కట్టుదిట్టమైన బందోబస్తు, భద్రతా ఏర్పాట్లు చేస్తోంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఆయా ప్రాంతాల్లోని గగనతలాన్ని నిర్దేశిత తేదీల్లో నో ఫ్లై జోన్‌గా ప్రకటించింది. ఆయా ప్రాంతాల నుంచి 3. కి.మీ. పరిధిలో డ్రోన్లు, పారాగ్లైడర్లు, రిమోట్ కంట్రోల్‌తో పనిచేసే మైక్రో ఎయిర్‌క్రాఫ్టులు ఎగరేయడాన్ని నిషేధిస్తూ హైదరాబాద్ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ మంగళవారం ఉత్తర్వు లు జారీ చేశారు. ఉత్తర్వులను అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నిషేధం అమల్లో ఉండే తేదీలు, ప్రాంతాలు ఇలా..

మే 13: చార్మినార్, లాడ్‌బజార్, చౌమొహల్లా ప్యాలెస్, ఖిల్వత్, శాలిబండ
మే 18: బంజారాహిల్స్‌లోని ఐసీసీసీ, సచివాలయం, ట్యాంక్‌బండ్
జూన్ 2: రాజ్‌భవన్, సోమాజిగూడ రోడ్డు

ఆర్టీసీలో సమ్మె యోచన వాయిదా

రవాణాశాఖ మంత్రి పొన్నంతో చర్చల అనంతరం జేఏసీ ప్రకటన

సాక్షి, హైదరాబాద్: డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించటంతో ఆర్టీసీలో మంగళవారం నుంచి నిర్వహించ తలపెట్టిన సమ్మె యోచనను కార్మిక సంఘాలతో కూడిన ఓ జేఏసీ వాయిదా వేసుకుంది. మరో జేఏసీ, మరో రెండు సంఘాలు సమ్మెకు దూరంగా ఉన్నాయని, దీంతో సమ్మె మొదలైనా కూడా బస్సుల్లో సింహభాగం నడిచే పరిస్థితి ఉండటంతో ప్రభుత్వం కూడా దీనిపై పెద్దగా స్పందించలేదు. మూడ్రోజుల క్రితం రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్.. చర్చలకు ఎవరైనా రావచ్చని, డిమాండ్లపై మాట్లాడేందుకు సిద్ధమంటూ ప్రకటన విడుదల చేశారు. దీంతో సమ్మెకు దూరంగా ఉన్న ఓ జేఏసీ నేతలు సోమవారం ఆయనతో చర్చించి, సమస్యలు పరిష్కరించాలని కోరారు. మరోపక్క సమ్మెకు సమాయత్తమైన జేఏసీ నేతలు మంగళవారం ఉదయం, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ కోదండరామ్‌తో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్‌తో సమావేశమై తమ డిమాండ్లపై చర్చించారు. సమ్మె నోటీసులోని 21 డిమాండ్లలో 18 డిమాండ్లను తన స్థాయిలోనే పరిష్కరించే వీలుందని, మిగతా మూడు డిమాండ్లపై సీఎంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం దేశ సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితులున్న తరుణంలో సమ్మె చేయటం సరికాదంటూ మంత్రితో పాటు కూనంనేని, కోదండరామ్ కూడా కార్మిక సంఘాల నేతలతో మాట్లాడారు. దీంతో సమ్మెను వాయిదా వేసుకుంటున్నామని, తదుపరి ప్రభుత్వం ఇచ్చే హామీలు, పరిష్కార చొరవ ఆధారంగా నిర్ణయం తీసుకుంటామని కార్మిక సంఘాల నేతలు పేర్కొన్నారు. చర్చల్లో జేఏసీ నేతలు వెంకన్న, థామస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం, పాత్రికేయులు కలిసి పనిచేయాలి

హైబిజ్ టీవీ మీడియా అవార్డ్స్ కార్యక్రమంలో మంత్రి ఉత్తమ్

ప్రింట్, ఎలక్ట్రానిక్ రంగాల్లో పలువురికి అవార్డుల ప్రదానం



సాక్షి అడ్వర్టైజింగ్ అండ్ మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ పి.శ్రీధర్‌కు హైబిజ్ టీవీ విజనరీ అవార్డ్‌ను అందజేస్తున్న మంత్రి ఉత్తమ్. చిత్రంలో ఎం.రవీందర్‌రెడ్డి, వి.రాజశేఖర్‌రెడ్డి

మాదాపూర్ (హైదరాబాద్): సమాజంలో మీడియాపాత్ర గొప్పదని తెలంగాణ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖమంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో మంగళవారం హైబిజ్ టీవీ మీడియా అవార్డ్స్ 5వ ఎడిషన్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, స్వాతంత్ర్యోద్యమం, తెలంగాణ ఉద్యమం వంటి ఎన్నో సందర్భాల్లో జర్నలిస్టులు కీలకంగా వ్యవహరించారని కొనియాడారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు.

ముగ్గురికి లెజెండరీ పురస్కారాలు: దేవులపల్లి అమర్ (ఎడిటర్–మన తెలంగాణ), షేక్ సుభానీ(కార్టూనిస్ట్–డీసీ), జగదీశ్– ఓటీఎస్ అడ్వర్టైజింగ్.

ఇద్దరికి విజనరీ అవార్డులు: పి.శ్రీధర్(అడ్వర్టైజింగ్ అండ్ మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్–సాక్షి), లక్ష్మీరావు (చైర్మన్–రాజ్‌న్యూస్)లకు విజనరీ అవార్డులు అందజేశారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు రేడియో కేటగిరీతో కలిపి 60 మందికి పైగా పురస్కారాలు అందుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్, భారతీ సిమెంట్ మార్కెటింగ్ డైరెక్టర్ ఎం.రవీందర్‌రెడ్డి, క్రెడాయ్ హైదరాబాద్ ప్రెసిడెంట్ వి.రాజశేఖర్‌రెడ్డి, హైబిజ్ టీవీ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సోలార్ పంప్‌సెట్లు కేటాయించండి

వ్యవసాయరంగ అభివృద్ధికి సహకారం అందించండి

- పీఎం కుసుమ్ కింద మరిన్ని కేటాయింపులు ఇవ్వండి
- కేంద్రమంత్రి ప్రల్హాద్ జోషికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విజ్ఞప్తి



కేంద్రమంత్రి ప్రల్హాద్ జోషికి పుష్పగుచ్ఛం ఇస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

సాక్షి, న్యూఢిల్లీ: పునరుత్పాదక ఇంధన రంగంలో రాణిస్తున్న తెలంగాణకు సౌర పంప్‌సెట్లను భారీగా కేటాయించాలని కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం ఢిల్లీలో కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధన వనరుల శాఖ మంత్రి ప్రల్హాద్‌జోషిని కలిశారు. రాష్ట్ర అవసరాలకు అను గుణంగా చర్యలు చేపట్టాలని కేంద్రమంత్రికి భట్టి మూడు ప్రత్యేక వినతి పత్రాలు అందజేశారు.

అలా తగ్గిస్తే.. నిర్దేశించిన లక్ష్యాలపై ప్రభావం

కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధన వనరుల శాఖ (ఎంఎన్ఆర్ఈ) ముందే నిర్ణయించినట్టుగా పీఎం కుసుమ్ కంపోనెంట్ (ఏ) కింద 500 కిలోవాట్ల నుంచి 2 మెగావాట్ల సామర్థ్యం కలిగిన మొత్తం 4 వేల మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్లను రాష్ట్రానికి కేటాయించాలని భట్టి విక్రమార్క కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషిని కోరారు. ఎంఎన్ఆర్ఈ ఈఓఐ పీరియడ్ ప్రకారం పునఃసమీక్ష అనంతరం కేటాయింపులను 4,000 మెగావాట్ల నుంచి 1,000 మెగావాట్లకు తగ్గించి ఇవ్వాలని సమాచారం అందిందని కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అలా తగ్గించి ఇస్తే రాష్ట్రం నిర్ధారించుకున్న లక్ష్యాలపై తీవ్ర ప్రభావం పడే పరిస్థితులున్నందున కేంద్రం ఆచుతూచి వ్యవహరించాలని కోరారు.

లక్ష సౌర పంప్‌సెట్లు కేటాయించండి

సాగునీటి కల్పనకు శాశ్వత పరిష్కారంగా సౌర పంప్‌సెట్లు ఏర్పాటు చేయాలని రాష్ట్రం భావిస్తున్నదని, ఈ నేపథ్యంలో పీఎం కుసుమ్ కంపోనెంట్ (బి) కింద ఒక లక్ష సౌర పంప్‌సెట్లను స్థాపించాలని ప్రహ్లాద్‌జోషిని భట్టి కోరారు. ఇప్పటికే ఈ ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్‌ను టీఎస్ రెడ్కో ద్వారా కేంద్ర ప్రభుత్వానికి సమర్పించామన్నారు.

2 లక్షల పంప్‌సెట్లు ఇవ్వండి

పీఎం కుసుమ్ కంపోనెంట్ (సి) కింద తెలంగాణకు 2 లక్షల పంప్ సెట్లను కేటాయించాలని భట్టి విక్రమార్క కేంద్ర మంత్రిని కోరారు. ఇప్పటికే రాష్ట్రంలో సాగునీటి అవసరాల కోసం లక్షల పంప్ సెట్లు వినియోగంలో ఉన్నందున సాంప్రదాయ విద్యుత్ రంగంపై భారాన్ని తగ్గించేందుకుగాను వీటి అవసరాన్ని కేంద్ర మంత్రికి వివరించారు.

ఉద్యోగులతో చర్చలకు త్రిసభ్య కమిటీ

- చైర్మన్‌గా రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్
- సభ్యులుగా లోకేశ్‌కుమార్, కృష్ణ భాస్కర్‌ల నియామకం
- వారంలోగా నివేదిక సమర్పించాలన్న సీఎస్



నవీన్ మిత్తల్‌ను కలిసిన తెలంగాణ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు తదితరులు

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలు ఆలకించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో చర్చలకు ఉపక్రమించింది. వివిధ ఉద్యోగ సంఘాలతో చర్చలు జరపడం, ప్రాధాన్యమైన, ఆచరణ యోగ్యమైన అంశాలపై సిఫారసులతో నివేదికను సమర్పించేందుకు ముగ్గురు ఉన్నతాధికారులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసింది. రాష్ట్ర రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్ కమిటీకి చైర్మన్‌గా వ్యవహరిస్తారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేశ్‌కుమార్, ట్రాన్స్‌కో సీఎండీ, ఉప ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి కృష్ణ భాస్కర్ సభ్యులుగా ఉంటారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

కమిటీ ఏం చేయాలి..?

ఉన్నతాధికారుల కమిటీకి రాష్ట్ర ప్రభుత్వం పలు ప్రత్యేక సూచనలు జారీ చేసింది. 'రాష్ట్రంలో గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాలతో పాటు ఉద్యోగులతోనూ క్రమం తప్పకుండా సమావేశమవుతూ చర్చలు జరపాలి. సమావేశాల మినట్స్ రికార్డు చేయాలి. వారి వినతులు, విజ్ఞాపనలు స్వీకరించాలి. చర్చల సారాంశాన్ని, వినతులన్నిటినీ నమోదు చేయాలి. అందులో ప్రాధాన్యతలు, ఆచరణ సాధ్యమైన అంశాలు, యుద్ధ ప్రాతిపదికన అమలు చేయాల్సిన విషయాలను గుర్తించాలి. ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసులతో వారం రోజుల్లో నివేదిక సమర్పించాలి..'అని తెలిపింది.

నేటి నుంచే రంగంలోకి..

ప్రభుత్వ ఉత్తర్వుల నేపథ్యంలో బుధవారం ఉన్నతాధికారుల కమిటీ.. ఉద్యోగ సంఘాలు, ఉద్యోగుల సమావేశం జరగనుంది. తెలంగాణ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావులతో పాటు జేఏసీ బాధ్యులు దామోదర్‌రెడ్డి, జి.సదానందం గౌడ్, చావా రవి, వంగా రవీందర్‌రెడ్డి, ముజీబ్, సత్యనారాయణ, శ్యామ్ తదితరులు పాల్గొననున్నారు. మంగళవారం కమిటీ చైర్మన్ నవీన్ మిత్తల్‌ను కలిసిన ఉద్యోగ సంఘాల నేతలు చర్చల కోసం సమయం తీసుకున్నారు. వారం రోజుల్లోగా నివేదిక సమర్పించాలని కమిటీని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో.. ఈ నెల 15వ తేదీ నుంచి ఉద్యోగ సంఘాల జేఏసీ తలపెట్టిన జిల్లాల వారీ ఆందోళన కార్యక్రమాలకు బ్రేక్ పడే అవకాశం ఉంది. అయితే దీనిపై జేఏసీ ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయలేదు.

ఉద్యోగుల సమస్యలపై కమిటీ ఏర్పాటు హర్షణీయం

టీజీఈ జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి



టీజీఈ జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో నవీన్ మిత్తల్‌ను కలిసిన సంఘాల నాయకులు

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఉన్నతాధికారుల కమిటీని ఏర్పాటు చేయడం శుభపరిణామమని టీజీఈ జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి అన్నారు. మంగళవారం నాంపల్లిలోని సీసీఎల్ఏ కార్యాలయం ఆవరణలోని డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ కార్యాలయంలో టీజీఈ జేఏసీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చేపట్టాల్సిన చర్యలు, ఉద్యోగులకు చెందాల్సిన హక్కుల గురించి శాఖలవారీగా ఉద్యోగులు ప్రస్తావించిన అంశాలను వివరించారు. జేఏసీ సమావేశంలో చర్చించిన అంశాలు, తీసుకున్న నిర్ణయాలు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత త్వరలోనే పరిష్కరించుకోవాలని ఈ సమావేశంలో తీర్మానం చేశారు. సమావేశం అనంతరం అధికారుల కమిటీ చైర్మన్ నవీన్ మిత్తల్‌ను జేఏసీ నాయకులతో కలిశారు. బుధవారం టీజీఈ జేఏసీ ప్రతినిధి బృందం ఉన్నతాధికారులతో సమావేశం కానుంది. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు కె.రామకృష్ణ, నిర్మల, ఎస్.రాములు, బాణాల రాంరెడ్డి, రమేష్ పాక, హన్మంతరావు, సీపీఎస్ దర్శన్ గౌడ్, సాల్మన్ నాయక్, శశిధర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, రవికుమార్, చంద్రశేఖర్‌గౌడ్, హరి కిషన్, వెంకట్, గోపాల్, హబీబ్ మస్తాన్, లక్ష్మయ్య పులి, హేమలత, సుగంధిని తదితరులు పాల్గొన్నారు.

నాటు కోళ్లు, గుడ్లు ఇంటికే వస్తాయి

తక్కువ ఖర్చుతో సగటు జీవికి పౌష్టికాహారాన్ని పళ్లెంలో నింపేవి కోడి మాంసం, గుడ్లు. అందుకే అవి 'పూర్ మాన్స్ ప్రొటీన్'.

కోడి కూరతో రాగి సంగటి కలిపి ఆరగించి ఆనందించే వాళ్లు కొందరైతే.. బ్రేక్‌ఫాస్ట్‌లో కోడి కూరతో ఇడ్లీ ఆస్వాదించేవారు మరికొందరు. అది గ్రామమైనా, నగరమైనా.. నాటుకోడి కూర, బ్రౌన్ కోడి గుడ్లకు ఉన్న ఆదరణే వేరు. అలాంటి నాటు కోడి పిల్లలు, గుడ్లు మీరు ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేస్తే.. అవి మీ ఇంటికే వస్తే.. భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) అనుబంధ సంస్థ అయిన హైదరాబాద్ (రాజేంద్రనగర్)లోని 'కోళ్ల పరిశోధన సంచలనాలయం' (ఐసీఏఆర్-డీపీఆర్).. ఇప్పుడు ఈ పని చేస్తోంది.



ప్రజలకు పౌష్టికాహారాన్ని అందుబాటులోకి తేవటంతో పాటు, ఉపాధి అవకాశాలను సైతం అందించేది దేశీ ఉత్తమ జాతి కోళ్ల పెంపకం. ఈ కోళ్ల స్వచ్ఛతను కాపాడుతూనే, వాటిని మరింత మెరుగుపరచి దేశవ్యాప్తంగా రైతులకు అందుబాటులోకి తెస్తోంది హైదరాబాద్ (రాజేంద్రనగర్)లోని 'కోళ్ల పరిశోధన సంచలనాలయం' (ఐసీఏఆర్-డీపీఆర్). డీపీఆర్ శాస్త్రవేత్తల కృషితో.. మెరుగైన ఫలితాలనిచ్చే 11 రకాల నాణ్యమైన దేశీ ఉత్తమ కోళ్ల జాతులు అందుబాటులోకి వచ్చాయి. ఈ కోళ్లకు చెందిన నాణ్యమైన కోడి పిల్లలను డిపిఆర్ రైతులకు విక్రయిస్తోంది. పొదిగే గుడ్లను కూడా అమ్ముతున్నారు. వీటిని కొనుక్కొని పిల్లలు పొదిగించుకొని, పెంచుకోవచ్చు.

యాంటీబయాటిక్స్ వాడకుండా..

ఈ సంస్థ అభివృద్ధి చేసిన వనరాజా, గ్రామప్రియ వంటి దేశీ జాతుల కోళ్లు దేశవ్యాప్తంగా ఇప్పటికే బాగా ప్రాచుర్యం పొందాయి. యాంటీబయాటిక్స్ వాడకుండా సమతుల్యమైన దాణాలు, మునగ ఆకు వంటివి మేపి చక్కని ఫలితాలు సాధించారు. వీరు రైతులకు అందుబాటులోకి తెస్తున్న ఉత్తమ కోళ్ల రకాల్లో ముఖ్యమైనవి.. శ్రీనిధి, జనప్రియ, కృషిలేయర్, కృషిబ్రో, వనశ్రీ, అసీల్, కడక్‌నాథ్, ఘాగస్, నికోబారీ.


ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేస్తే చాలు

ఏ రాష్ట్రానికైనా పార్సిల్	అందుబాటులో 11 రకాల జాతులు
	అందిస్తున్న కేంద్ర ప్రభుత్వ సంస్థ డీపీఆర్

- సాక్షి, స్పెషల్ డెస్క్

మాంసం, గుడ్ల కోసం..

వనరాజా, శ్రీనిధి, జనప్రియ కోళ్లను మాంసం, గోధుమ రంగు గుడ్ల కోసం పెరట్లో పెంచుకోవచ్చు. ఔషధ విలువ ఉన్న నల్ల కోడి కడక్‌నాథ్‌ను నల్ల గుడ్లు, మాంసం కోసం పెంచుకోవచ్చు.



కృషిబ్రో మాంసం కోసం పెంచుకోదగిన కోళ్ల జాతి.


గుడ్ల కోసం.. గ్రామప్రియ, వనశ్రీ, అసీల్ కోళ్లను పెరట్లో పెంచుకోవచ్చు. కృషి లేయర్‌ను గుడ్ల కోసం వాణిజ్యపరంగా పెంచుకోవచ్చు.

వనరాజా, గ్రామప్రియలకు క్రేజ్



వనరాజా, గ్రామప్రియ దేశీయ కోళ్ల జాతులు దేశవ్యాప్తంగా బాగా ప్రాచుర్యం పొందాయి. వనరాజా రోగనిరోధక శక్తి కలిగిన జాతి. ఆరు నెలల్లో 2 కిలోల వరకు బరువు పెరుగుతుంది. ఏడాదికి 110 గుడ్లు పెడుతుంది. జత పెంచుకుంటే రూ.500 ఆదాయం వస్తుంది. ఇక గ్రామప్రియ జత కోళ్లు పెంచుకుంటే రూ.వెయ్యి ఆదాయం వస్తుంది. మా వద్ద నుంచి దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల రైతులు బుక్ చేసుకుంటారు.

- డాక్టర్ యు.రాజ్‌కుమార్, డీపీఆర్ ప్రధాన శాస్త్రవేత్త, పౌల్ట్రీ జెనెటిక్స్ - బ్రీడింగ్ విభాగం అధిపతి





ఇంటికే పార్సిల్

జాతిని బట్టి గుడ్డు ధర రూ. 9-23 మధ్య, పిల్ల ధర రూ. 22-120 వరకు ఉంటుంది. ముందుగా బుక్ చేసుకొని, నగదు చెల్లించిన వారికి ఏ రాష్ట్రానికైనా సరే, నేరుగా స్వస్థలాలకు పార్సిల్ పంపుతారు. బుకింగ్స్ రద్దీని బట్టి, బుక్ చేసుకున్న తర్వాత 1 నుంచి 3 నెలల్లో సరఫరా చేస్తున్నారు.

ప్యాకింగ్ రుసుము (అదనం)

గుడ్ల కార్టన్ పెట్టె (210 గుడ్లకు).. రూ. 50

కోడి పిల్లల కార్టన్ పెట్టె (50 కోడి పిల్లలు).. రూ. 45

బుకింగ్ చేసుకునేదెలా?

ఫోన్స్
040-24018687,
040-24015651.
dprhatchery@gmil.com
www.pdonpoultry.org

క్లుప్తంగా...

ఏపీ ఎమ్మెల్యే సుజనా చౌదరికి కిమ్స్‌లో సర్జరీ

సనత్‌నగర్: ఏపీ బీజేపీ నేత, విజయవాడ వెస్ట్ నియోజకవర్గ ఎమ్మెల్యే సుజనా చౌదరి లండన్ పర్యటనలో ప్రమాదవశాత్తూ పడిపోవడంతో కుడి చెయ్యి విరిగింది. ఈ నేపథ్యంలో మంగళవారం హైదరాబాద్ తిరిగొచ్చిన ఆయన్ను ఎయిర్‌పోర్ట్ నుంచి నేరుగా బేగంపేటలోని కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్‌కు తీసుకొచ్చారు. ఆస్పత్రి ఎండీ, చీఫ్ రొబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ ఏవీ గురవారెడ్డి నేతృత్వంలో నలుగురు డాక్టర్ల బృందం వెంటనే విజయవంతంగా ఆపరేషన్ నిర్వహించింది. నాలుగైదు ముక్కలుగా విరిగిన భుజం ఎముకకు నాలుగు గంటలపాటు శ్రమించి ప్లేట్స్, స్క్రూలు అమర్చి ఆపరేషన్ నిర్వహించినట్లు గురవారెడ్డి తెలిపారు.

పవన్ కల్యాణ్‌పై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు

జహీరాబాద్: ముస్లింలు ఉగ్రవాదులు అంటూ ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను నిరసిస్తూ సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పోలీసు స్టేషన్‌లో ముస్లిం యువకులు ఫిర్యాదు చేశా రు. మంగళవారం మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఖాజా ఆధ్వర్యంలో ఎస్.ఐ కాశీనాథ్‌కు వారు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పవన్ కల్యాణ్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వందశాతం ముస్లింలు ఉగ్రవాదులే అని పవన్ కల్యాణ్ ద్వేషపూరిత ప్రకటన చేశారని ఇస్లాంకు ఉగ్రవాదంతో సంబంధం లేదని స్పష్టం చేశారు. ఇస్లాం శాంతి, ప్రేమకు సంబంధించిన మతమన్నారు. ముస్లింల గుర్తింపు అయిన టోపీలు, గడ్డాలు, కుర్తాలు, స్కార్ఫ్‌లను పవన్ కల్యాణ్ ఉగ్రవాదానికి చిహ్నాలుగా ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. ఆయనపై చట్ట పరంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రకాశం జిల్లాలో భూకంపం

పొదిలి: ఏపీలోని ప్రకాశం జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారం స్వల్ప భూకంపం సంభవించింది. పొదిలిలోని విశ్వనాథపురంలో ఉదయం గం.9.45 సమయంలో ఐదు సెకన్ల పాటు భూమి కంపించింది. ఒక్కసారిగా పెద్ద శబ్దం రావడంతో ప్రజలు భయాందోళనలతో బయటకు పరుగులు తీశారు. విశ్వనాథపురం, బ్యాంక్ కాలనీ, ఇస్లాంపేట, ప్రకాష్‌నగర్ ఏరియాలో భూకంపం ప్రభావం స్పష్టంగా కనిపించినట్లు స్థానికులు తెలిపారు. మార్కాపురంలో ఎస్ఎస్ నగర్, ఏబీఎం కాంపౌండ్ పరిసర ప్రాంతాల్లో, కురిచేడు మండలంలోని బోధనంపాడు గ్రామంలో కూడా భూమి కంపించిందని స్థానికులు చెప్పారు. ఇటీవల కాలంలో మాదాలవారిపాలెంతో పాటు పొదిలిలో కూడా భూప్రకంపనలు వచ్చాయి. నెలల వ్యవధిలో మూడు పర్యాయాలు భూప్రకంపనలు రావడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

న్యాయం గెలిచింది: సబితా ఇంద్రారెడ్డి

నన్ను ముందు పెట్టి వై.ఎస్.ను దోషిగా నిలబెట్టాలని చూశారు

- మేము ఎక్కడా చట్టవిరుద్ధంగా అనుమతులివ్వలేదు
- తప్పు చేయకపోయినా నాడు కన్నీళ్లతో కోర్టు మెట్లు ఎక్కా
- పన్నెండున్నర సంవత్సరాలపాటు మానసిక వేదన అనుభవించా
- వాస్తవాలను పరిశీలించిన కోర్టు నన్ను నిర్దోషిగా ప్రకటించింది
- ఇక మరింత ఉత్సాహంతో ప్రజాశ్రేయస్సు కోసం పనిచేస్తా



సాక్షి, హైదరాబాద్: 'ఓబుళాపురం మైనింగ్ అంశంలో ఎలాంటి తప్పు చేయకపోయినా పన్నెండున్నర సంవత్సరాలపాటు అవమానాలు భరించా. మానసిక వేదన అనుభవించా. న్యాయ వ్యవస్థపై నమ్మకంతో ఇన్నాళ్లు పోరాడా. అంతిమంగా న్యాయం గెలిచింది. వాస్తవాలను పరిశీలించిన సీబీఐ కోర్టు నన్ను నిర్దోషిగా ప్రకటించడం ఆనందంగా ఉంది'అని మాజీ మంత్రి, ప్రస్తుత బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. రాజకీయ ప్రేరేపితంగా ఈ కేసు నమోదు చేశారని ఆమె వ్యాఖ్యానించారు. 'నన్ను ముందు పెట్టి అన్న వై.ఎస్. రాజశేఖరరెడ్డిని దోషిగా నిలబెట్టడానికి ప్రయత్నించారు. మేము ఈ మైనింగ్ లీజు వ్యవహారంలో ఎలాంటి తప్పు చేయలేదు. చట్టపరంగా, న్యాయపరంగానే అన్ని నిర్ణయాలు తీసుకున్నాం. కేబినెట్ ఆమోదంతోపాటు కేంద్ర ప్రభుత్వ అనుమతులు సైతం ఉన్నాయి. విధానపరమైన నిర్ణయంలో ఎక్కడా మేము తప్పు చేయలేదు. మాపై మోపిన అభియోగాలను నిరూపించలేకపోయారు. కాబట్టే న్యాయస్థానం నన్ను నిర్దోషిగా ప్రకటించింది'అని సబితా ఇంద్రారెడ్డి మంగళవారం 'సాక్షి'తో మాట్లాడుతూ చెప్పారు.

జైలుకు పోతానని ప్రత్యర్థులు హేళన చేసినా..

'కన్నీళ్లతో తొలిసారి ఇదే సీబీఐ కోర్టు మెట్లెక్కా. నేను అవినీతికి పాల్పడ్డానని.. జైలుకు పోతానని నా ప్రత్యర్థులు హేళన చేశారు. ప్రతి ఎన్నికల్లోనూ అవినీతి చేశానని.. దోపిడీకి పాల్పడ్డానని ఎన్నో నిందలు, ఆరోపణలు చేశారు. అసెంబ్లీలో చర్చ జరిగినప్పుడు అన్న వై.ఎస్. రాజశేఖరరెడ్డిని, నన్ను దోషులుగా నిలిపేందుకు ప్రయత్నించారు. మా నైతికతను దెబ్బతీయడానికి ప్రయత్నించారు. ప్రత్యర్థులు ఎన్ని ఆరోపణలు, నిందలు మోపినా నా నియోజకవర్గ ప్రజలు నన్ను నమ్ముకొని నా వెంట నిలిచారు. నేను బాధపడ్డప్పుడు ఇంట్లోని వారంతా నాకు ఎంతో ఆప్యాయతతో సహకారం అందించారు. కోర్టుకు వెళ్లినప్పుడు నా ప్రజలు వెంట వస్తే లాఠీచార్జి చేసిన పరిస్థితులు ఉండేవి. మేము ఎలాంటి తప్పు చేయలేదన్న ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లా. నా నమ్మకం గెలిపించింది. ఏళ్లుగా ఎదుర్కొంటున్న బాధ నుంచి బయటపడ్డా. ఇక మరింత ఉత్సాహంతో ప్రజాశ్రేయస్సు కోసం పనిచేస్తా' అని సబితా ఇంద్రారెడ్డి చెప్పారు.

అంతా చట్టబద్ధమే..: కృపానందం

'ఓబుళాపురం మైనింగ్ లీజు విషయంలో చట్ట నియమ నిబంధనల ప్రకారమే నడుచుకున్నాం. ఎక్కడా పొరపాటు చేయలేదు. న్యాయపరంగా కూడా ఎక్కడా తప్పు చేయలేదు. అందుకే న్యాయస్థానం ఈ కేసు నుంచి నన్ను నిర్దోషిగా ప్రకటించింది'అని అప్పట్లో గనుల శాఖ కార్యదర్శిగా పనిచేసిన బి. కృపానందం ఆనందం వ్యక్తం చేశారు. గనుల లీజు అంశం కేవలం ఒక రాష్ట్ర ప్రభుత్వం తీసుకొనేది కాదని.. కేంద్ర ప్రభుత్వం నుంచి కూడా అన్ని అనుమతులు తీసుకున్న తరువాతే మంజూరు అవుతాయని ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ చెప్పారు. మొదటి రెండు చార్జిషీట్లలో తమ పేర్లు లేకపోయినా మూడో చార్జిషీట్‌లో సీబీఐ తన పేరు ఎందుకు చేర్చిందో ఆ సంస్థకే తెలియాలన్నారు. గనులను లీజుకిచ్చే విధానపరమైన నిర్ణయంలో ప్రభుత్వం ఎలాంటి తప్పు చేయలేదని న్యాయస్థానం నమ్మినందునే నిర్దోషిగా తనను, ప్రజాప్రతినిధిని ప్రకటించిందని ఆయన చెప్పారు.

కొత్తగా 81 అంగన్‌వాడీ కేంద్రాలు

- పీఎం- జన్‌మన్ పథకం కింద మంజూరు
- గిరిజన ప్రాంతాల్లో సేవలందించనున్న అంగన్‌వాడీలు
- ఒక్కో కేంద్రంలో ఒక టీచర్, హెల్పర్ నియామకం
- అంగన్‌వాడీలుగా 3,989 మినీ అంగన్‌వాడీల అప్‌గ్రేడ్
- వీటిల్లో పనిచేస్తున్న హెల్పర్లకు టీచర్లుగా ప్రమోషన్
- కొత్తగా 3,989 మంది హెల్పర్లను నియమించనున్న సర్కారు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కొత్తగా 81 అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రధానమంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ (పీఎం-జన్‌మన్) పథకం కింద వీటిని ఏర్పాటు చేస్తోంది. ప్రతి అంగన్‌వాడీ కేంద్రానికి ఒక అంగన్‌వాడీ టీచర్, ఒక హెల్పర్ పోస్టులు కేంద్రప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో మొత్తం 162 మందిని నియమించనుంది. పోషణ్ 2.0 కార్యక్రమం కింద గిరిజన, ఆదివాసీ ప్రాంతాల్లో ఈ కేంద్రాల ద్వారా పోషకాహార పంపిణీతోపాటు పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్యను అందించనున్నారు. ఈ కేంద్రాల నిర్వహణకు ఏటా రూ.3.91 కోట్లు కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తుంది.

మినీ అంగన్‌వాడీ కేంద్రాలు అప్‌గ్రేడ్

రాష్ట్రంలో ఇప్పటివరకు కొనసాగిన 3,989 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు పూర్తిస్థాయిలో అప్‌గ్రేడ్ అయ్యాయి. గతంలో ఈ కేంద్రాల్లో ఒక హెల్పర్ మాత్రమే అందుబాటులో ఉంటూ పోషకాహార పంపిణీ, ఇతర సేవలు అందించేవారు. ఇప్పుడు వీటిని అప్‌గ్రేడ్ చేయడంతో ఇవన్నీ ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలుగా మారాయి. ఈ కేంద్రాల అప్‌గ్రెడేషన్ రెండున్నరేళ్ల క్రితమే ప్రతిపాదించినప్పటికీ, కేంద్ర ప్రభుత్వం అనుమతి రావటానికి కాస్త ఆలస్యమైంది. తాజాగా 3,989 సెంటర్లు ప్రధాన కేంద్రాలుగా మారడంతో ఇక్కడ 3,989 టీచర్లు, 3,989 హెల్పర్లు పని చేస్తారు. వీరికి ప్రభుత్వం గౌరవవేతనం ఇస్తూ నియామకాలు చేపట్టనుంది. ఇప్పటికే ఈ కేంద్రాల్లో పనిచేస్తున్న హెల్పర్లకు టీచర్లుగా పదోన్నతి కల్పించడంతో.. కొత్తగా హెల్పర్లు అందుబాటులోకి రానున్నారు. అతి త్వరలో రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఈ పోస్టులను తాత్కాలిక పద్ధతిలో భర్తీ చేయనుంది.

సబిత నిర్దోషి

▶ మొదటి పేజీ తరువాయి

ఓఎంసీకి రూ.2 లక్షల జరిమానా విధించింది. రాజగోపాల్‌కు అవినీతి నిరోధక చట్టం కింద అదనంగా నాలుగేళ్ల జైలు శిక్ష విధించింది. కాగా, పరిశ్రమల శాఖ అప్పటి కార్యదర్శి ఐఏఎస్ అధికారి యర్రా శ్రీలక్ష్మిని ఈ కేసు నుంచి డిశ్చార్జ్ చేస్తూ తెలంగాణ హైకోర్టు 2022లో తీర్పునిచ్చిన విషయం తెలిసిందే.

2009లో కేసు నమోదు

ఏపీ-కర్ణాటక సరిహద్దు అనంతపురం, బళ్లారి రిజర్వు ఫారెస్టులో ఓబుళాపురం గ్రామ పరిధిలోని ఇనుప గనుల తవ్వకాలను ఓఎంసీ నిర్వహించేంది. అయితే, నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు చేపట్టిందని 2009 డిసెంబరు 7న సీబీఐకి ఫిర్యాదు అందింది. అనుమతి పొందిన 68.5 హెక్టార్ల ప్రాంతాన్ని దాటి ఇనుప ఖనిజాన్ని తవ్వించదని అందులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన సీబీఐ.. బీవీ శ్రీనివాస రెడ్డి, గాలి జనార్దన్‌రెడ్డి, వీడీ రాజగోపాల్, ఓఎంసీ, కృపానందం, సబితాఇంద్రారెడ్డి, గనుల శాఖ నాటి ఏడీ లింగారెడ్డి, శ్రీలక్ష్మిలపై అభియోగాలు నమోదు చేసింది. ఐపీసీ సెక్షన్లతో పాటు కొందరిపై అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్లు పెట్టింది. రూ.884.13 కోట్ల మేర అక్రమ మైనింగ్‌కు పాల్పడ్డారని 2011లో సీబీఐ తొలి చార్జిషీట్ దాఖలు చేసింది. 2014 వరకు ఇలా నాలుగు చార్జిషీట్లు వేసింది. 60 లక్షల మెట్రిక్ టన్నుల ఇనుప ఖనిజాన్ని అక్రమంగా విదేశాలకు ఎగుమతి చేశారని, బినామీ లావాదేవీలు జరిగాయని సీబీఐ పేర్కొంది. కాగా, కేసు విచారణ ఏళ్లకు ఏళ్లు పడుతుండడంతో సుప్రీంకోర్టు విచారణను పర్యవేక్షిస్తూ.. మే నెలలోగా పూర్తి చేయాలని గడువు విధించింది. ఇక 219 మంది సాక్షులను విచారించి, 3,330 డాక్యుమెంట్లను పరిశీలించిన సీబీఐ న్యాయస్థానం గత నెలలో తీర్పు రిజర్వు చేసింది. కాగా, లింగారెడ్డి విచారణ దశలోనే మృతి చెందారు.

కోర్టుకు హాజరైన నిందితులు: తీర్పు వెల్లడి సందర్భంగా కేసులో నిందితులు కోర్టుకు హాజరయ్యారు. ఈ నెల 18న తన కుమారుడి పెళ్లి ఉందని అప్పటివరకు అరెస్టు నుంచి మినహాయింపు ఇవ్వాలని శ్రీనివాసరెడ్డి కోరారు. తాను ఎన్నో ప్రజాపయోగ కార్యక్రమాలు చేశానని, పేద కుటుంబం నుంచి వచ్చి వేలాదిమందికి ఉపాధి కల్పించానని గాలి జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. కోర్టు తనను బళ్లారిలో అడుగుపెట్టొద్దని ఆదేశించినా, మరో నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలిచానని తెలిపారు. ఉపశమనం కల్పిస్తే ఆధ్యాత్మిక పథంలో వెళ్తానని విన్నవించారు. ప్రభుత్వ ఉద్యోగులందరినీ వదిలేసి తనను శిక్షించడం అన్యాయమని రాజగోపాల్ నివేదించారు. తనపై ఆధారపడి తల్లిదండ్రులు, నలుగురు పిల్లలు ఉన్నారని అలీ విజ్ఞప్తి చేశారు. సబితాఇంద్రారెడ్డి, కృపానందం కూడా కోర్టుకు హాజరయ్యారు.

కేసు సాగిందిలా..

సంవత్సరం	వివరం
2009	డిసెంబర్‌లో కేసు నమోదు చేసిన సీబీఐ
2011	ఏడుగురు నిందితులతో తొలి చార్జిషీట్ దాఖలు
2014	9 మంది నిందితులతో తుది చార్జిషీట్ దాఖలు
2025	ఏప్రిల్‌లో తీర్పు రిజర్వు చేసిన సీబీఐ కోర్టు
2025	మే 6న తీర్పు వెలువరించిన న్యాయస్థానం

దోషులు: శ్రీనివాస్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, రాజగోపాల్, అలీఖాన్ (ఓఎంసీని కూడా..)

నిర్దోషులు: సబితా ఇంద్రారెడ్డి, కృపానందం (శ్రీలక్ష్మిని కేసు నుంచి తొలగించిన హైకోర్టు)

నిందితులు	అరెస్టు	విడుదల	బెయిల్ ఇచ్చింది
బీవీ శ్రీనివాస్‌రెడ్డి	5-9-2011	22-1-2015	హైకోర్టు
గాలి జనార్దన్‌రెడ్డి	5-9-2011	20-1-2015	సుప్రీంకోర్టు
వీడీ రాజగోపాల్	12-11-2011	18-01-2013	సీబీఐ కోర్టు
వై.శ్రీలక్ష్మి	28-11-2011	14-3-2013	సీబీఐ కోర్టు
కె.ముఫాజ్ అలీఖాన్	5-10-2012	28-1-2015	సీబీఐ కోర్టు

(దోషులకు పడిన శిక్షలో ఈ కాలాన్ని మినహాయించుకోవాల్సి ఉంటుంది)

కేటీఆర్ నీకెంత ధైర్యం.. సీఎం నాలుక చీరేస్తానంటవా?

పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: 'మా సీఎం రేవంత్‌రెడ్డిని నాలుక చీరేస్తానని అంటవా.. నీకెంత ధైర్యం కేటీఆర్'అని పరిగి కాంగ్రెస్ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి నిప్పులు చెరిగారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇలాంటి వ్యాఖ్యలపై కాంగ్రెస్ కార్యకర్తలు ఆవేశంగా ఉన్నారని, వాళ్లు నీ వెంటపడి తరమితే మాకు ఎలాంటి సంబంధంలేదన్నారు. 'నిన్ను పిచ్చికుక్కలా కొట్టినా.. నీ మూతి పగలగొట్టినా దానికి కాంగ్రెస్ బాధ్యత వహించదు. కేటీఆర్ ఎన్ని మాట్లాడినా భయపడేది లేదు'అని అన్నారు.

వచ్చే 50 ఏళ్లకు తగ్గట్లుగా రోడ్ల అలైన్‌మెంట్లు

▶ మొదటి పేజీ తరువాయి

రేడియల్ రోడ్ల నిర్మాణం ప్రక్రియను వేగవంతం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నుంచి వెళ్లే జాతీయ, రాష్ట్ర రహదారులు ఆర్ఆర్ఆర్ వెలుపలికి వెళ్లే ప్రాంతంలో తగిన రీతిలో 'ట్రంపెట్స్'నిర్మించాలని.. ఎటువంటి గందరగోళానికి తావులేకుండా, ట్రాఫిక్ సిగ్నల్స్ లేకుండా దాటేలా చూడాలన్నారు. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిలో ఎలివేటెడ్ కారిడార్.. నూతన అలైన్‌మెంట్‌కు సంబంధించి సీఎం పలు సూచనలు చేశారు. రాజీవ్ రహదారికి ప్రత్యామ్నాయంగా ఓఆర్ఆర్ నుంచి మంచిర్యాల వరకు నూతన రహదారి నిర్మాణానికి సంబంధించి ప్రత్యామ్నాయ అలైన్‌మెంట్‌ను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆ మార్గంలో పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు ఉన్న అనుకూలతలను పరిశీలించాలన్నారు. సమీక్షలో రోడ్లు భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి, సీఎం కార్యదర్శి మాణిక్‌రాజ్, ఆర్అండ్‌బీ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్, ప్రత్యేక కార్యదర్శి హరిచందన, పురపాలక పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శి ఇలంబర్తి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, పరిశ్రమలు, పెట్టుబడుల విభాగం అదనపు సీఈవో ఈ.వీ. నరసింహారెడ్డి, ఎన్‌హెచ్ ప్రాంతీయ అధికారి శివశంకర్ పాల్గొన్నారు.

భారత్-యూకే వాణిజ్య ఒప్పందంతో తెలంగాణకు లబ్ధి

- రాష్ట్రంలోని వస్త్ర, ఐటీ పరిశ్రమకు ప్రయోజనం
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి



సాక్షి, న్యూఢిల్లీ: భారత్- బ్రిటన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) కుదరడంతో తెలంగాణ రాష్ట్రానికి ఎంతో మేలు జరుగుతుందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. తెలంగాణలో వస్త్ర, ఐటీ పరిశ్రమకు ఈ ఒప్పందంతో లబ్ధి చేకూరుతుందని చెప్పారు. రెండు దేశాల మధ్య వాణిజ్యానికి సంబంధించి చరిత్రాత్మక ఒప్పందంగా ఇది నిలిచిపోతుందని పేర్కొన్నారు. ఈ ఒప్పందంతో దేశంలోని వస్త్ర పరిశ్రమ, సముద్ర ఉత్పత్తులు, లెదర్ ఉత్పత్తులు, ఫుట్‌వేర్ రంగం, రాళ్లు, ఆభరణాల రంగం, ఇంజనీరింగ్ ఉత్పత్తులు, ఆర్గానిక్ రంగాలకు లబ్ధి చేకూరుతుందని వెల్లడించారు. భారతదేశం నుంచి బ్రిటన్ దిగుమతి చేసుకునే దాదాపు 99 శాతం ఉత్పత్తులపై ఎలాంటి సుంకం ఉండదని, దీంతో మనదేశం నుంచి భారీగా ఎగుమతులు చేసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. దీనివల్ల ఉద్యోగ అవకాశాలు పెరగడంతోపాటు దేశ ఆర్థికవృద్ధికి ఊతం లభిస్తుందని పేర్కొన్నారు.

తెలంగాణకు ప్రత్యేక లబ్ధి

భారత్-బ్రిటన్ వాణిజ్య ఒప్పందంతో తెలంగాణకు ప్రత్యేక లబ్ధి చేకూరుతుందని కిషన్‌రెడ్డి తెలిపారు. 'మనరాష్ట్రంలోని చేనేత వస్త్రాలను బ్రిటన్‌కు ఎగుమతి చేయటం తేలికవుతుంది. దీనివల్ల మన నేతన్నలకు లబ్ధి చేకూరనుంది. హైదరాబాద్ ఐటీ సర్వీసులకు మరింత ప్రోత్సాహం లభిస్తుంది'అని వివరించారు. 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ వైపు దేశాన్ని పరుగులు పెట్టించేందుకు నరేంద్ర మోదీ చేస్తున్న కృషిని ఈ ఒప్పందం మరో అడుగు ముందుకు తీసుకెళ్లనుందని అన్నారు. ఇటీవలే జపాన్‌ను వెనక్కు నెట్టి ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారతదేశం అవతరించిన సంగతి తెలిసిందే. 2030 నాటికి 7 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదుగుతుందని కిషన్‌రెడ్డి తెలిపారు.

రేవంత్‌రెడ్డి.. నీకు పాలన చేతకాకపోతే రాజీనామా చెయ్

బీజేపీ నేత, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్



సాక్షి, హైదరాబాద్: 'సీఎం రేవంత్‌రెడ్డి.. నీకు పాలన చేతకాకపోతే రాజీనామా చేసి ముక్కు నేలకు రాసి పదవి నుంచి తప్పుకో'అని బీజేపీ నేత, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. ఎన్నికలప్పుడు పలికిన ప్రగల్భాలు, ఇచ్చిన హామీలు నెరవేర్చలేనని ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలన్నారు. ఈ విధంగా కాదు సిగ్గుమాలిన పద్ధతిలో అలాగే పదవిలో కొనసాగుతా అంటే సందర్భం వచ్చినప్పుడు ప్రజలు కర్రు కాల్చి వాత పెడతారని హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలు యావత్ తెలంగాణ ప్రజలు తలదించుకునేలా, వారి ఆత్మస్థైర్యం దెబ్బతినేలా ఉన్నాయని మండిపడ్డారు. రాష్ట్ర పరిస్థితిపై సీఎం చేసిన వ్యాఖ్యలతో తెలంగాణ సమాజం తలదించుకుంటోందని, దేశంలో మన పరువుపోయిందన్నారు. మంగళవారం బీజేపీ కార్యాలయంలో ఈటల మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ ప్రజలు, ఉద్యోగులు భయపడేవారు కాదని ప్రేమకు లొంగుతారు బెదిరింపులకు కాదని స్పష్టంచేశారు. 'మాయచేసుడు మత్తరించుడు తెలంగాణ ప్రజల రక్తంలో ఉండదు బిడ్డా.. ఎస్మా ప్రయోగించిన వారి గతమేమైందో తెలుసుకదా! దసరా పండుగే వద్దు తెలంగాణ కావాలని కొట్లాడిన గొప్పవారు ఆర్టీసీ కార్మికులు'అని పేర్కొన్నారు. 2014లో రూ.30 వేల కోట్ల ఓన్ ట్యాక్స్ రెవెన్యూ ఉన్న రాష్ట్రం 11 ఏళ్లలో రూ.లక్షా 30 వేల కోట్ల ఆదాయానికి చేరుకుందంటే ఇది దివాలా రాష్ట్రమా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో నెలకు రూ.18,500 కోట్ల ఆదాయం వస్తున్నదని రేవంత్ చెబుతున్నారంటే ఏడాదికి రూ.2.40 లక్షల కోట్ల ఆదాయం వస్తుందని, మరి దీన్ని ఎందుకు మేనేజ్ చేయడం లేదని ఈటల నిలదీశారు.



> కోపాన్ని జయించు. దుష్టత్వాన్ని జయించు.
> ఉదాసీనతను జయించు. నిజం మాట్లాడి ఈ లోకాన్నే జయించు.
> – బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, 7 మే 2025

ప్రాణంపోసే నిర్ణయం

అనునిత్యం నెత్తుటి చరిత్ర రచిస్తున్న రహదారులపై దుర్మరణాలను తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం ఒక మంచి ప్రయత్నం చేసింది. సోమవారం విడుదలైన ఒక నోటిఫికేషన్ ప్రకారం ఇకపై రోడ్డు ప్రమాదాల్లో చిక్కుకున్నవారికి ఆస్పత్రుల్లో నగదురహిత చికిత్స వెనువెంటనే అందుతుంది. ప్రమాద బాధితులకు లక్షన్నర రూపాయల వరకూ చికిత్స సదుపాయం లభించటంతోపాటు వారం రోజుల వరకూ వైద్య సేవలు పొందే వెసులుబాటునిచ్చారు. దేశంలో ఏ రోడ్డుపై ప్రమాదం జరిగినా ఈ పథకం వర్తిస్తుందని నోటిఫికేషన్ చెబుతోంది. ప్రధాని నరేంద్ర మోదీ ఏడాది పాలన పూర్తి చేసుకున్నాక 2015 జూలైలో 'మన్ కీ బాత్' కార్యక్రమంలో రోడ్డు ప్రమాదాలను ప్రస్తావించారు. బాధితులకు చికిత్స చేయటంలో ఆస్పత్రులు వెనుకంజ వేయకుండా నగదురహిత వైద్యానికి వీలుకల్పిస్తామని ఆ సందర్భంలోనే చెప్పారు. అది ఇన్నాళ్లకు సాకారమైంది. ప్రమాదాల నియంత్రణకు కేంద్రం అనేక చర్యలు తీసుకుంటూనేవుంది. కానీ పెద్దగా ఫలితాన్నిస్తున్న జాడ కనబడదు. ఏటా వెల్లడయ్యే గణాంకాలే ఇందుకు సాక్ష్యం. కేంద్ర ఉపరితల రవాణా, జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ మొన్న పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో మాట్లాడుతూ ఏటా మన రహదారులపై దాదాపు 4,80,000 ప్రమాదాలు సంభవిస్తున్నాయని, 1,78,000 మంది ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పినప్పుడు అందరూ దిగ్భ్రాంతి చెందారు. ఈ ప్రమాద మృతుల్లో 60 శాతం మంది 18–34 యేళ్ల మధ్య వయస్కులేనని ఆయన ప్రకటించారు. ఈ సందర్భంగా తన మంత్రిత్వశాఖ నిస్సహాయతను కూడా వివరించారు. 2024 ఆఖరుకల్లా రోడ్డు ప్రమాదాలు, మరణాల సంఖ్య 50 శాతం మేరకు తగ్గించాలని నిర్ణయించుకున్నా ఏమాత్రం సాధ్యపడలేదని, పైపెచ్చు అవి మరింత పెరిగాయని ఆయన ఒప్పుకున్నారు. ప్రమాదాల నివారణ మాట అటుంచి బాధితులకు సకాలంలో వైద్యసాయం అందితే చాలామందిని మృత్యుముఖం నుంచి బయటకు తీసుకురావొచ్చని నిపుణులు ఎప్పటినుంచో చెబుతున్నారు. ఎక్కడో మారుమూల ప్రాంతాల్లో ప్రమాదాలు సంభవిస్తే చికిత్స ఆలస్యం కావటాన్ని అర్థం చేసుకోవచ్చు. కానీ డబ్బు విదిలిస్తే తప్ప చికిత్సకు ముందుకురాని ఆస్పత్రుల కారణంగా అనేకమంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఇది గమనించే ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో ఆరోగ్యశ్రీ పథకంలో క్షతగాత్రులకు తక్షణ వైద్యసాయం అందే వెసులుబాటు కల్పించారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక అదికాస్తా అటకెక్కింది.

ప్రపంచంలో రోడ్డు ప్రమాదాల బెడదపై నాలుగేళ్లక్రితం ఐక్యరాజ్యసమితి దృష్టి సారించింది. 2021–30 మధ్య ఈ ఉదంతాల్లో మరణాల సంఖ్యను 50 శాతం తగ్గించాలని లక్ష్యనిర్దేశం చేసింది. ఆ మాటెలా వున్నా కేవలం పెను వేగంతో వెళ్లే వాహనాల వల్లనే ప్రమాదాలు చోటుచేసుకుంటాయన్నది నిజం కాదు. మొన్న మార్చిలో జరిగిన సదస్సులో కేంద్రమంత్రి గడ్కరీయే ఈ విషయాన్ని అంగీకరించారు. ఇరుకురోడ్డని, మలుపు వున్నదని, వేగం తగ్గించాలని సూచించే బోర్డులూ, మార్కింగ్‌లూ అవసరమైనచోట్ల లేకపోవటం దగ్గర్నుంచి నిర్మాణపరంగా వుండే లోపాల వరకూ అనేకానేకమైనవి ప్రమాదాలకు దారితీస్తున్నాయి. సివిల్ ఇంజనీర్లు మొదలుకొని కన్సల్టెంట్లు, కాంట్రాక్టర్ల వరకూ ఎవరికీ దీనిపై జవాబుదారీతనం లేదు. సవివర ప్రణాళికా నివేదిక (డీపీఆర్)లు నాసిరకంగా వున్నా అడిగేవారు లేరు. ఆధునిక సాంకేతికతలు అందుబాటులోకి రావటం వల్ల లోపాలను ముందుగానే సులభంగా పసిగట్టడం సాధ్యమవుతోంది. వాటిని అనుసరిద్దామన్న ఆలోచన కూడా రాదు. అతి తక్కువ ప్రమాదాలు జరుగుతున్న ఆస్ట్రియా, స్విట్జర్లాండ్, స్పెయిన్ దేశాల్లో ఎలాంటి విధానాలు అనుసరిస్తున్నారో గమనించి, వాటిని అమల్లోకి తెచ్చినా ఎంతో ప్రయోజనం కలుగుతుంది.

అసలు మన రోడ్ల నాణ్యతకూ, అమ్మే వాహనాలకూ సంబంధమే లేకుండా పోయింది. అమ్మకాలు పెంచుకోవటం కోసం అనేక రకాల పథకాలు ప్రవేశపెట్టి, బ్యాంకు లోన్ల సదుపాయం కల్పించి జనంలో వ్యామోహాన్ని పెంచటం రివాజైంది. ద్విచక్ర వాహనాలు సైతం వాయు వేగంతో పోయేలా డిజైన్ చేస్తుంటే...అవి నిండా ఇరవయ్యేళ్లు లేనివారి చేతికొస్తుంటే ప్రమాదాలు జరగటంలో వింతేముంది? రోడ్డు ప్రమాదాల విషయంలో సర్వోన్నత న్యాయస్థానం చొరవ తీసుకుని అప్పటి సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కెఎస్ రాధాకృష్ణన్ నేతృత్వంలో ముగ్గురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేసింది. కేరళ, యూపీ, నాగాలాండ్ మినహా మరే రాష్ట్రమూ రహదారి భద్రతకు సంబంధించిన విధానమే రూపొందించుకోలేదని ఆ కమిటీ నివేదిక ఎత్తిచూపింది. డ్రైవింగ్ లైసెన్సుల జారీలో, భద్రతా నిబంధనల అమలులో ప్రభుత్వాలు అలసత్వాన్ని చూపుతున్నాయని చెప్పింది. ఇప్పటికైనా అన్ని రాష్ట్రాలూ ఈ లోపాలన్నిటినీ సరిదిద్దుకున్నాయో లేదో సందేహమే!

తొలి గంటలో చికిత్స ప్రారంభిస్తే గాయపడినవారిలో కనీసం 50 శాతంమందికి ప్రాణాపాయం తప్పుతుందని వైద్య నిపుణులంటున్న మాట. గతంలో అయితే అసలు ప్రమాదంలో చిక్కుకున్నవారిని ఆస్పత్రికి తరలించటానికి ఎవరూ ముందుకొచ్చేవారు కాదు. పోలీసులు తమనే అనుమానితులుగా చూస్తారని, కోర్టుల చుట్టూ తిరగాల్సివస్తుందని చాలామంది భయపడేవారు. ఇందుకు సంబంధించిన నిబంధనలు మార్చాక ఈ విషయంలో చాలా మార్పువచ్చింది. నగదు రహిత చికిత్స అందించటానికి వీలుకల్పించే చర్య ప్రశంసనీయమైనది. కానీ అంతకన్నా ముందు ప్రమాదాలకు దారితీస్తున్న పరిస్థితుల్ని చక్కదిద్దటానికి ప్రయత్నించాలి. అన్ని స్థాయిల్లో జవాబుదారీతనం నిర్ణయించాలి. అప్పుడుగానీ ప్రమాదాల నియంత్రణ సాధ్యంకాదు.

ఇది ఐక్యతా సమయం

విశ్లేషణ



శశి శేఖర్

గత వారం ఓ రోజు ఉదయం 6 గంటల తర్వాత నా మొబైల్‌లో నోటిఫికేషన్ పింగ్ అయింది. నా స్నేహితుడి కొడుకు నుండి ఒక సందేశం వస్తున్నట్లు నేను చూశాను. పహల్గామ్‌లో జరిగిన సంఘటనల గురించి అతను కలత చెందాడు. సంఘటన తర్వాత వెంటనే ఎటువంటి ప్రతీకార చర్యా తీసుకోనందుకు మన ప్రభుత్వంపై అతడు అసహనం వ్యక్తం చేశాడు. ప్రభుత్వం తక్షణ చర్య తీసుకోవడానికి తీవ్రస్థాయిలో మీడియా ప్రచారాన్ని నడపటం ద్వారా నా వంతు కృషి నేను చేస్తానని అతను ఆశించాడు.

నేను షాక్ అయ్యాను. చిన్నప్పటి నుండి అతడు నాకు తెలుసు. దేశంలోని ఉత్తమ పాఠశాలల్లో అతను చదువుకున్నాడు. ఇంజనీరింగ్ డిగ్రీని సాధించాడు. ఇన్‌స్టిట్యూట్ నుండి పట్టభద్రుడయ్యే ముందు, అతనికి ఓ బహుళజాతి సంస్థ ఉద్యోగం ఆఫర్ కూడా ఉండేది. ఉన్నత స్థాయికి ఎదిగాడు. నేడు కార్పొరేట్ వర్గాల ఆకర్షణీయమైన సర్కిల్‌లో ఉంటున్నాడు. తన తెలివితేటలు, జ్ఞానం వల్ల మంచి గుర్తింపు, గౌరవం పొందాడు. అందుకే తాను ప్రకటించిన విద్వేష భావానికి నేను పెద్దగా కలత చెందలేదు. తనను ప్రశాంతంగా ఉండమని సలహా ఇచ్చాను. ప్రభుత్వాన్ని విశ్వసించమని నచ్చ చెప్పాను. సరైన సమయం వచ్చినప్పుడు, ప్రపంచం భారత్ నుండి పూర్తి స్థాయి చర్యను వీక్షిస్తుందని చెప్పాను. 1971లోనూ భారతదేశంలో ఇలాంటి యుద్ధ సన్నద్ధతే పెరుగుతూ వచ్చిందని అతనికి గుర్తు చేశాను.

తిరుగులేని వ్యూహకర్త మానెక్ షా!

అప్పటి ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ, ఆర్మీ చీఫ్ జనరల్ శ్యామ్ మానెక్ షాను పిలిపించారు. ''తూర్పు పాకిస్తాన్‌పై భారత సైన్యం వెంటనే దాడి చేసి, దాన్ని స్వతంత్ర దేశంగా, బంగ్లాదేశ్‌గా మార్చడానికి సహాయం చేయగలదా?'' అని ఆమె అడిగారు. అద్భుతమైన వ్యూహకర్త మానెక్ షా. కొన్ని నెలల్లో రుతుపవనాలు రానున్నాయని ప్రధానితో చెప్పారు. వర్షాకాలంలో, బంగ్లాదేశ్‌లోని పొలాలు చిత్తడి నేలలుగా మారతాయి. అందువల్ల అలాంటి సమయంలో దాడి చేయడం అంటే అది పెద్ద ఎత్తున సైనికుల మరణానికి దారితీస్తుందని వివరించారు. దాంతో మానెక్ షా తొందరపాటు ఆదేశాలు జారీ చేయబోవడం లేదని నిర్ధారణ అయింది. అనంతరం, తొమ్మిది నెలలపాటు జాగ్రత్తగా వేసుకున్న ప్రణాళిక, సమన్వయం, కచ్చితమైన వ్యూహం తర్వాత, భారత దళాలు తూర్పు పాకిస్తాన్‌పై దాడి చేసినప్పుడు, శత్రువు ఓడిపోవడమే కాకుండా, 90,000 మందికి పైగా పాక్ సైనికులు భారత్‌కు లొంగిపోయారు. మానవాళి చరిత్రలో, ఇంత పెద్ద సైనిక దళం ఎప్పుడూ ప్రత్యర్థికి లొంగిపోలేదు. 1971 డిసెంబర్ 16న, భారత సైన్యం తన అత్యుత్తమ ఘడియను ఆస్వాదిస్తూ, మన సైనిక చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయాన్ని లిఖిస్తున్న సమయంలో బంగ్లాదేశ్ ఆవిర్భవించింది.

1971ని తలపిస్తున్న మంతనాలు

ప్రస్తుత ప్రధాని కూడా భారత సాయుధ దళాలకు పాక్‌పై తగిన చర్య తీసుకోవడానికి అధికారం ఇచ్చారు. నెంబర్ 7 – లోక్ కల్యాణ్ మార్గ్, నార్త్ బ్లాక్, సౌత్ బ్లాక్‌లలో వ్యూహాత్మక సమావేశాలు జరిగాయి. సైనిక చర్యలు ఆర్థిక, దౌత్యపరమైన పర్యవసానాలను కలిగి ఉంటాయి. కనీస ప్రాణనష్టంతో త్వరిత విజయాన్ని సాధించడానికి, శక్తిమంతమైన మిత్రులు మద్దతు ఇవ్వడానికి లేదా నిర్ణాయక సమయంలో కనీసం తటస్థంగా ఉండటానికి కొన్ని నిబద్ధతలు అవసరం. 1991లో మొదటి గల్ఫ్ యుద్ధంలో సంకీర్ణ సైన్యానికి నాయకత్వం వహించిన యు.ఎస్. జనరల్ నార్మన్ స్క్వార్జ్‌కోఫ్, ''మీరు శాంతిలో ఎంత ఎక్కువ చెమట చిందిస్తే, యుద్ధంలో అంత తక్కువ రక్తస్రావం అవుతుంది...'' అని అన్నారు.



భారత్-పాక్ ప్రధానులు నరేంద్ర మోదీ, షెహబాజ్ షరీఫ్

రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ అమెరికా సహా వివిధ దేశాలలో తమ సమ ఉజ్జీలతో ముమ్మరంగా చర్చలు జరుపుతున్నారు. ఈ చర్చలు 1971ని గుర్తుకు తెస్తున్నాయి. ఆనాడు మానెక్ షా, నావికాదళ, వైమానిక దళ అధిపతులు యుద్ధానికి సిద్ధమవుతుండగా, ఇందిరా గాంధీ కూడా నమ్మకమైన దౌత్య భాగస్వాముల కోసం వెతికే పనిలో పడ్డారు. భారతదేశం అప్పటికి కొంతకాలం క్రితం పాశ్చాత్య జోక్యానికి వ్యతిరేకంగా హామీ కోసం నాటి సోవియట్ యూనియన్‌తో కీలక ఒప్పందాన్ని కుదుర్చుకుంది. తరువాత, యుద్ధ సమయంలో బంగాళాఖాతంలో అమెరికన్ సిక్స్‌త్ ఫ్లీట్ కనిపించడం, దాన్ని ఎదుర్కోవడానికి సోవియట్ జలాంతర్గాములు రావడం వంటి సంఘటనలు భారతదేశపు దౌత్యపరమైన మాస్టర్ స్ట్రోక్ (పైఎత్తు)ను ధ్రువీకరించాయి.

నేడు రెండూ అణ్వాయుధ శక్తులే!

నేటి పరిస్థితి కూడా అంతే ప్రమాదకరమైనది. ట్రంప్ 2.0 యుగంలో ఇది మరింత క్లిష్టంగా మారింది. ఎటువంటి భావజాలం లేకుండా, సోషల్ మీడియా నిరంతర చూపు కింద నడిచే భౌగోళిక రాజకీయాలు ఎప్పటికప్పుడు మారిపోతున్నాయి. 1971లో మాదిరిగా కాకుండా భారతదేశం, పాకిస్తాన్ రెండూ ఇప్పుడు అణ్వాయుధ శక్తులు. మనకు మద్దతు ఇవ్వడానికి ఇప్పుడు సోవియట్ యూనియన్ లేదు. ఏదైనా సహాయం అందించే పరిమిత సామర్థ్యంతోనే రష్యా ఇప్పుడు ఉక్రెయిన్‌తో పోరాడుతోంది, చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యి వ్యాఖ్యలు బీజింగ్ జాగరూకతా వైఖరిని వెల్లడిస్తున్నాయి: ''సంఘర్షణ అనేది భారత్ లేదా పాకిస్థాన్ ప్రాథమిక ప్రయోజనాలకు నష్టం చేస్తుంది..'' అని వాంగ్ వ్యాఖ్యానించారు. అయితే చైనా సానుభూతి పాక్ వైపు ఉంది. ప్రపంచంలోని ఏకైక అగ్రరాజ్యమైన అమెరికా, మిశ్రమ సంకేతాలను పంపుతోంది. ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ ప్రకటనను పరిగణించండి: ''పహల్గామ్ దాడి పట్ల భారత్ విస్తృత ప్రాంతీయ సంఘర్షణకు దారితీయని విధంగా ప్రతిస్పందిస్తుందని మేము ఆశిస్తున్నాము'' అన్నారాయన.

ప్రమాదకరంగా సోషల్ మీడియా!

ప్రభుత్వం చేతులు కట్టివేయడం, దాని ఎంపికలను పరిమితం చేయడం వంటి సంక్లిష్టతలను గ్రహించకుండా, లెక్కలేనన్ని స్వరాలు సోషల్ మీడియాలో ఇప్పుడు ఉగ్రదాడి పట్ల, పాక్ పైన నిరంతరం మండిపడుతున్నాయి. సర్జికల్ స్ట్రయిక్స్ అయినా, లేదా బాలాకోట్ వైమానిక దాడి అయినా సరే, తన మాటను నిలబెట్టుకోవడంలో ప్రధాని మోదీకి ఉన్న విశ్వసనీయతను వారు విస్మరిస్తున్నారు. దాంతో మన సోషల్ మీడియా కార్యకలాపాలు శత్రువులకు ఫిరంగి మేతగా మారాయి. ఎవరైనా సరే, ప్రభుత్వ పక్షాన నిశ్శబ్దంగా నిలబడాల్సిన సమయం ఇది. అనవసరమైన వాగ్వాదాలకు పాల్పడకుండా ఉండాల్సిన సమయం ఇది. మతతత్వపు విష బీజాలు నాటడానికి కొందరు ఈ పరిస్థితిని మలచుకుంటున్నారు. కొన్ని రోజుల క్రితం బృందావన్‌లో ఆలయ సేవలో పాల్గొన్న ముస్లింలను బహిష్కరించాలని డిమాండ్ చేస్తూ బాంకే బిహారీ ఆలయం ముందు ఒక మూక నిరసన తెలిపింది. అయితే ఆలయ ట్రస్ట్... స్పష్టంగా ప్రతిస్పందించింది. ఆ ముస్లింలు శతాబ్దాలుగా శ్రీకృష్ణుని దుస్తులను తయారు చేస్తున్నారని ట్రస్ట్ నిర్వాహకులు నొక్కి చెప్పారు.

ఐక్యంగా ముందుకు సాగాలి

ఉగ్రవాద దాడిని జమ్మూ – కశ్మీర్ అసెంబ్లీ ఏప్రిల్ 29న ఏకగ్రీవంగా ఖండించింది. దేశంలోని మిగిలిన ప్రాంతాలకు సంఘీభావం తెలిపింది. లోయలో ఉగ్రవాదం అంతం ప్రారంభమైందని శాసన సభ్యులు భావిస్తున్నారు. ద్వేషపూరిత వ్యక్తులు అలాంటి సంఘీభావ ప్రదర్శనను విస్మరించడమే కాకుండా, దేశవ్యాప్తంగా అనేక మసీదులు మొన్నటి ఉగ్రవాద దాడిని ఖండించడాన్ని సులువుగా మరచిపోతారు. ఇప్పుడు పాకిస్థాన్‌ను బహిరంగంగా ఖండించని ముస్లిం నాయకుడు లేడు. ద్వేషం, విభజన రాజకీయాలతో రెచ్చగొట్టడం కాకుండా, అందరూ ప్రభుత్వంతో కలిసి నిలబడి సామాజిక ఐక్యత కోసం పనిచేయాల్సిన సమయం ఇది!

వ్యాసకర్త సీనియర్ సంపాదకులు

> ◆ మన రక్షణ మంత్రి, విదేశాంగ మంత్రి వివిధ దేశాలలో తమ సమఉజ్జీలతో చర్చిస్తున్నారు. ఈ చర్చలు 1971 నాటి భారత్ యుద్ధ సన్నాహాలను గుర్తుకు తెస్తున్నాయి.
>
> ◆ 1971లో మాదిరిగా కాకుండా భారత్, పాక్ రెండూ ఇప్పుడు అణ్వాయుధ శక్తులే. మనకు మద్దతు ఇవ్వడానికి ఇప్పుడు సోవియట్ యూనియన్ లేదు.
>
> ◆ అందరూ. ప్రభుత్వ పక్షాన నిలబడాల్సిన సమయం ఇది. అనవసర వాగ్వాదాలకు పాల్పడరాదు. మతతత్వపు విష బీజాలు నాటడానికి కొందరు ఈ పరిస్థితిని మలచుకుంటున్నారు. అలా జరగనివ్వకూడదు.

సోషల్ మీడియా

యుద్ధాన్ని రానివ్వొద్దు



సులభంగా నియంత్రణను కోల్పోయే సైనిక ఘర్షణను నివారించటం ఎంతైనా అవసరం. సైనిక పరిష్కారం అసలు పరిష్కా రమే కాదు. భారత్, పాక్‌లు ప్రస్తుత పరిస్థితుల్లో సాధ్యమైనంతగా సంయమనాన్ని పాటించి, దక్షిణాసియాలో ఉద్రిక్తతలు తలెత్తకుండా చూడాలి.

– ఆంటోనియో గుటెరెస్, ఐరాస ప్రధాన కార్యదర్శి

పక్షపాత ధోరణి!



దక్షిణాసియాలో ఉద్రిక్తతలు తీవ్రతరం అవటానికి భారతదేశమే కారణమని నిందిస్తూ 'ఆర్గనై జేషన్ ఆఫ్ ఇస్లామిక్ కో–ఆపరేషన్' ఒక ప్రకటన విడుదల చేయటం ద్వారా తన పక్షపాత ధోరణిలో కొత్త స్థాయికి దిగజారింది. అదే సమయంలో 'పాకిస్థాన్ నిరంతర సంయమనం ప్రదర్శిస్తోందని' ఆ ప్రకటనలో ప్రశంసించటం గమనించాలి.

– ధైర్య మహేశ్వరి, మల్టీమీడియా జర్నలిస్టు

ఆకలి మరణాలు



తీవ్రమైన పోషకాహార లేమి కారణంగా కనీసం 65,000 మంది పాలస్తీనా చిన్నారులు ఆసుపత్రి పాలయ్యారు. గాజాను ఇజ్రాయెల్ పూర్తిగా దిగ్బంధించటంతో అక్కడి పిల్లలంతా ఆకలికి అల్లాడిపోతున్నారు. తిండి దొరక్కుండా చేసి చంపటం కూడా జాతి నిర్మూలన చర్యే!

– మొహమ్మద్ సఫా, యు.ఎన్. దౌత్య అధికారి

అరుదైన ఒప్పుకోలు



"నేను లేనప్పుడు కాంగ్రెస్ చాలా తప్పులు చేసింది. కానీ 1984 సిక్కు వ్యతిరేక అల్లర్లు సహా కాంగ్రెస్ చేసిన అన్ని తప్పులకూ నేను బాధ్యత వహిస్తాను" అని రాహుల్ గాంధీ 'వాట్సన్ ఇన్‌స్టిట్యూట్' ఇష్టాగోష్ఠిలో చెప్పారు. ఒక నాయకుడు తన తప్పును అంగీకరించటం, క్షమాపణ చెప్పటం భారత రాజకీయాలలో అరుదైన దృశ్యం.

– రోషన్ రాయ్, ఇంటర్నెట్ పర్సనాలిటీ

ఇన్ బాక్స్

కర్రె గుట్టలు మనవి కావా?

కర్రె గుట్టలపై జాతీయ జెండాను భద్రతా దళాలు ఎగరవేసిన ఫోటోలు బయటికి వచ్చాయి. వాటిని చూసి ఈ గుట్టలు ఈ దేశంలోనివే కదా... శత్రు సైన్యం నుంచి గుట్టలను విడిపించినట్లు ఈ ఫొటోలేమిటి అనే అనుమానం కలుగుతోంది. వరంగల్ జిల్లా చివరి నుంచి ఛత్తీస్‌గఢ్ వరకూ విస్తరించి ఉన్న కర్రె గుట్టలు నేడు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన అంతిమ యుద్ధానికి కేంద్రమయ్యాయి. కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరుపుతామన్న మావోయిస్టుల ప్రతిపాదనను కేంద్రం తిరస్కరించి ఆపరేషన్ కగార్‌ను కొనసాగిస్తోంది. మావోయిస్టులు ఎంచుకున్న మార్గం భిన్నమైనప్పటికీ రాజ్యాంగ పరిధిలో చర్చలు జరిపేందుకు అనుకూలమైన, సానుకూల వాతావరణం కల్పించాలని కోరడంలో ప్రజాస్వామ్య ఆకాంక్ష ఉంది. నేడు మధ్య భారతంలో మావోయిస్టుల ఏరివేత పేరిట నరమేధం కొనసాగుతోంది. ఆదివాసుల హననానికి ప్రభుత్వాలు పూనుకోవడం ఇక్కడ పెను విషాదం.

ఏడాది కాలంలోనే మావోయిస్టుల ఏరివేత పూర్తవుతుందని సాక్షాత్తూ కేంద్ర హోం మంత్రి అమిత్ షా తేదీని సైతం ప్రకటించారు. మావోయిస్టులు నేరం చేస్తే వారిని శిక్షించడానికి కోర్టులు, చట్టాలు ఉన్నాయి. కానీ, పాలకులే చట్టాల్ని చేతుల్లోకి తీసుకొని నరమేధానికి పాల్పడటం విచారకరం. పాలక వర్గం కార్పొరేట్లకు ఈ ప్రాంతంలోని సహజవనరులను దఖలు పరచకుండా అడ్డుకుంటున్నారనే మావోయిస్టులను తుడిచి పెట్టడానికి కేంద్రం పూనుకుంది.

దేశ సరిహద్దుల్లో విదేశీ శత్రువులతో యుద్ధం చేసే సైన్యాన్ని సొంతభూభాగంలో సొంతపౌరులపైనే ప్రయోగించడం ఏమిటి? కర్రె గుట్టలపై జెండాను ఎగురవేసి ఏ సందేశం ఇస్తున్నట్లు? ఇది భారత భూభాగంలోని ప్రాంతం కాదా? వేరే దేశ భూభాగంలోకి చొచ్చుకు పోయినట్లు, విజయం సాధించినట్లు ఈ ప్రదర్శన ఏమిటి? కేంద్రం తక్షణమే ఆపరేషన్ కగార్‌ను, ఆదివాసి హననాన్ని నిలిపివేసి మావోయిస్టులతో చర్చలు జరపాలి.

– మామిండ్ల రమేష్ రాజా, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి

ప్రజల సొమ్ము గంగపాలు చెయ్యొద్దు!

అభిప్రాయం



నైనాల గోవర్ధన్

కాళేశ్వరం మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లలోని తప్పులనే చంద్రబాబు ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు విషయంలో చేస్తోంది. తెలంగాణలో నాణ్యతా ప్రమాణాలను తుంగలో తొక్కి, భారీ ఎత్తిపోతల ప్రాజెక్టు అయిన కాళేశ్వరంలో భాగంగా అనేక బ్యారేజీల నిర్మాణాలను మూడేళ్లలో పూర్తి చేసి కేసీఆర్ ప్రారంభించారు. ఇదే అడుగుజాడల్లో ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నడుస్తూ 2027 నాటికి పోలవరం ప్రారంభిస్తామని డెడ్‌లైన్ ప్రకటించడం ఆందోళనకరం.

2014లో తెలంగాణకు కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక నీరు లేదనే సాకుతో తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును రద్దు చేశారు. రీ–ఇంజనీరింగ్, రీ–డిజైనింగ్ పేరిట మేడిగడ్డకు మార్చారు. అన్నారం, సుందిళ్ళ బ్యారేజీలు నిర్మించారు. బడ్జెట్‌ను లక్ష కోట్లకు చేర్చారు. కాళేశ్వరం ప్రాజెక్టు 2016లో మొదలుపెట్టి, 2019లో ప్రారంభించారు. 4 ఏళ్ల లోపే, అసెంబ్లీ ఎన్నికల ముందే 2023 అక్టోబర్ 21న ఏడవ బ్లాకులోని కొన్ని పియర్లు ఐదు అడుగుల లోతుకు పైగా కుంగిపోయాయి. ఏడవ బ్లాక్‌లోని మొత్తం 11 పియర్లను కూల్చి నిర్మించడం తప్ప మరో గతి లేదని జాతీయ డ్యామ్ రక్షణ అథారిటీ (ఎన్డీఎస్ఏ) పేర్కొంది. మళ్లీ నిర్మించినా, మరో బ్లాక్‌లోని పియర్ల గేట్లు కుంగిపోవనే గ్యారెంటీ లేదు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీలో పునాది అడుగున కూడా లీకేజీలు, సీపేజీలు బయటపడ్డాయి. ఎన్డీఎస్ఏ అత్యున్నత స్థాయి ఇంజనీర్ల బృందం కుంగిన మేడిగడ్డను పరిశీలించింది. నీటిని నిలువ ఉంచితే ప్రమాదమని, అత్యవసరంగా అన్ని బ్యారేజీలలో పూర్తి నీటిని ఖాళీ చేయించాలని నాటి సీఎం కేసీఆర్‌కు చెప్పి ఖాళీ చేయించింది. జాతీయ డ్యామ్ రక్షణ అథారిటీ మధ్యంతర నివేదిక సంవత్సరం క్రితమే వచ్చింది. ఇటీవలే వచ్చిన పూర్తిస్థాయి నివేదిక కాళేశ్వరం మూడు బ్యారేజీల నిర్మాణంలో గత తెలంగాణ ప్రభుత్వం చేసిన అత్యంత ఘోరమైన తప్పుల నిగ్గు తేల్చింది. దీని ప్రకారం ఇంజనీరింగ్ ప్రమాణాల ప్రకారం, పునాదులకు సంబంధించిన, ఏ రకమైన భూగర్భ పరీక్షలూ చేయకుండానే నిర్మాణం చేపట్టారు. బలహీనమైన ఇసుక పునాదులపై బ్యారేజీల నిర్మాణం జరిగింది. బ్యారేజీలలో వచ్చిన నీరు వచ్చినట్టు కాలువకు వెళ్లాలి. ఎక్కువైన నీరు నదిలోకి వెళ్లాలి. కానీ బలహీన పునాదులపై నిర్మించిన బ్యారేజీలలో ప్రాజెక్టులలో మాదిరిగా భారీ ఎత్తున నీటిని నిలువ చేసింది ప్రభుత్వం. ఇలా చేయడం ప్రమాదకరం. భారీ నీటి నిలువ ఒత్తిడి, తాకిడికి పునాదులు దెబ్బతిన్నాయి. పునాదుల కింద నుంచి భారీగా ఇసుక కొట్టుకు పోయి, లీకేజీలు నిరంతరం సాగుతున్నాయి. ఆగమేఘాల మీద దోపిడే లక్ష్యంగా సాగిన, ఈ తప్పుడు డిజైన్ వల్ల ఇసుక కొట్టుకుపోవడం నిరంతరంగా సాగుతోంది. స్పిల్‌వే నిట్ట నిలువుగా మూడు ఫీట్ల వెడల్పుతో చీలిపోయి, రెండు చెక్కలైంది. భూమిలో ఐదు అడుగులు లోపలికి కుంగిపోయింది.



> ◆ ఏపీలో చంద్రబాబు ప్రభుత్వం కూడా కాళేశ్వరం మేడిగడ్డలో జరిగిన తప్పిదాన్నే పునరుక్తం చేయబోతున్నట్లనిపిస్తోంది. పోలవరం పునాది అడుగున 460 కోట్లతో కట్టిన డయాఫ్రమ్ వాల్ కూలిపోయింది. మేడిగడ్డ లాంటి విపత్తు, పోలవరంలో జరగదని చంద్రబాబు ఆంధ్ర ప్రజలకు హామీ ఇవ్వగలరా? పోలవరం ప్రాజెక్టు 2027కల్లా ప్రారంభమవుతుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇంజినీర్లను డమ్మీలను చేస్తున్నారు.

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ళ బ్యారేజీలు ఇప్పుడు ఉన్నవి ఉన్నట్లుగా పనికి రావని ఎన్డీఎస్ఏ పేర్కొంది. నీటి ఒత్తిడి ఎక్కువైనందువల్ల సీకెంట్ పైల్స్ కూలిపోయాయనీ, బ్యారేజీ ఎగువ, దిగువ భాగాల్లో భారీ రంధ్రాలు పడ్డాయని తేల్చింది. మూడు బ్యారేజీలకు విస్తృత నష్టం జరిగిందని పేర్కొంది. ఈ నష్టం ఇక్కడితో ఆగదనీ, నీటి ఒత్తిడి ఎక్కువైతే మొత్తం బ్యారేజీలకే ప్రమాదం పొంచి ఉందని పేర్కొంది. ఒక బ్లాక్‌ను కూల్చి పునర్నిర్మాణం చేస్తే, మరొకటి మళ్లీ కుంగి కూల్చవలసిన ప్రమాదపు అంచులలోకి వెళ్లవచ్చని చెప్పింది. అంటే మూడు బ్యారేజీల నిర్మాణానికి ఖర్చు చేసిన 30 వేల కోట్లు గంగలో కలిసినట్లే.

సమగ్ర పునర్నిర్మాణ డిజైన్ చేయాలని, జియో ఫిజికల్ పరీక్షలు, జియో సాంకేతిక పరీక్షలు చేసి, ఆధునిక హైడ్రాలిక్ నమూనాల (నీటి ప్రవాహ ఒత్తిడికి సంబంధించిన నమూనాల)ను ఉపయోగించి ఈ పునర్నిర్మాణ రీడిజైన్ చేయాలని ఎన్డీఎస్ఏ చెప్పింది. కానీ ఈ పరీక్షలన్నీ చేస్తే ఇంతకంటే ప్రమాదకర తప్పులన్నీ బయటపడతాయి. మూడు బ్యారేజీలలో ఇంత ప్రమాదకరమైన పరిస్థితి ఉన్న నేపథ్యంలో మేడిగడ్డ పునరుద్ధరణ అసంబద్ధమైనది. మేడిగడ్డ ముగిసిన అధ్యాయం. పునరుద్ధరణ తెలంగాణను మళ్లీ అప్పుల విష వలయంలోకి ఈడ్చడమే! తుమ్మిడిహెట్టి ప్రాణహిత ప్రాజెక్టు మాత్రమే దీనికి నిజమైన ఏకైక ప్రత్యామ్నాయం. దాన్ని వెంటనే చేపట్టాలి.

ఇక ఏపీలో చంద్రబాబు ప్రభుత్వం కూడా కాళేశ్వరం మేడిగడ్డలో జరిగిన తప్పిదాన్నే పునరుక్తం చేయబోతున్నట్లనిపిస్తోంది. పోలవరం పునాది అడుగున 460 కోట్లతో కట్టిన డయాఫ్రమ్ వాల్ కూలిపోయింది. మేడిగడ్డ లాంటి విపత్తు, పోలవరంలో జరగదని చంద్రబాబు ఆంధ్ర ప్రజలకు హామీ ఇవ్వగలరా? పోలవరం ప్రాజెక్టు 2027కల్లా ప్రారంభమవుతుందని ప్రకటించడం ద్వారా ఇంజినీర్లను బాబు కూడా డమ్మీలను చేసినట్లే! ఎన్డీఎస్ఏ కాళేశ్వరం బ్యారే జీలపై తుది నివేదిక ఇచ్చింది. పోలవరంపై లోతైన రక్షణ నివేదికను ఎన్డీఎస్ఏ ఇవ్వగలదా? డయాఫ్రమ్ వాల్ కూలిన క్రమంపై ప్రఖ్యాత ఇంజనీర్లు, భూగర్భ నిపుణులు పోలవరం ప్రాజెక్టును నిశితంగా పరిశోధించారు. చంద్రబాబు ఆ నివేదికలను వెల్లడించాలి.

వ్యాసకర్త నీటిపారుదల ప్రాజెక్టుల విశ్లేషకులు

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి.
ఈ-మెయిల్: editpage@sakshi.com ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

దైవేచ్ఛ

మనం కొన్ని పనులను చేయాలనుకొంటాం, చేస్తాం. అవి మంచి పనులై పదిమంది మనల్ని పొగిడితే అదంతా మన ఘన కార్యమేనని ఉప్పొంగి పోతాం. అహంకారాన్ని పెంచుకుంటాం. మనం అనుకొన్నవి జరక్కపోతే మాత్రం 'అంతా దైవేచ్ఛ, శివాజ్ఞ లేనిది చీమైనా కదలదు' అని వేదాంతాన్ని చెబుతాం. అలాకాక ఎప్పుడు ఏది జరిగినా దైవేచ్ఛ ప్రకారమే జరుగుతుందన్న ఎరుక కలిగి ఉండాలి. భగవద్గీతలో శ్రీకృష్ణ పరమాత్మ, 'ఈశ్వరస్సర్వభూతానాం' అనే శ్లోకంలో (8-8- 613) 'ఓ అర్జునా! జగన్నియామకుడు పరమేశ్వరుడు మాయచేత సమస్త ప్రాణులను యంత్రము నారోహించిన వారిని వలె (కీలు బొమ్మల వలె) త్రిప్పుచు సమస్త ప్రాణుల యొక్క హృదయమున వెలయుచున్నాడు' అని చెబుతాడు. (పుట 10592 గీతా మకరందము – శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వామి).



జ్యోతిర్మయం

శ్రీకృష్ణ భగవానుడు జగన్నియామకుడు. ఆయన కేవలం అర్జునుని రథ సారథి మాత్రమే కాదు. సమస్తలోక రథసారథి. ఆయన ఎలా నడుపుతాడో అలాగే నడుస్తుంది ఈ లోకం అంతా! ఆయనే జగన్నాటక సూత్రధారి. ఈ నాటకంలో మనమంతా పాత్రధారులమే. ఆ పాత్రలను సమర్థంగా పోషించాలి. మనం పాత్రధారులనీ, నిమిత్త మాత్రులమనీ ఒక్క క్షణం కూడా మరువరాదు.

శ్రీరామకృష్ణ పరమహంస లాంటి వాడు, 'ఓ జననీ! నేను రథాన్ని, నువ్వు రథ సారథివి. నువ్వు నడిపించేటట్లు నేను నడచుకొంటాను (పుట 133–శ్రీ రామకృష్ణ కథామృతం-01) అని అంటాడు.

– రాచమడుగు శ్రీనివాసులు

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, **తిథి:** శు.దశమి ప.12.38 వరకు, తదుపరి ఏకాదశి, **నక్షత్రం:** పుబ్బ రా.8.19 వరకు, తదుపరి ఉత్తర, **వర్జ్యం:** తె.4.03 నుండి 5.46 వరకు (తెల్లవారితే గురువారం). **దుర్ముహూర్తం:** ఉ.11.31 నుండి 12.22 వరకు, **అమృతఘడియలు:** ప.1.34 నుండి 3.16 వరకు ; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 5.35, **సూర్యాస్తమయం:** 6.17.

15 నుంచి సరస్వతీ పుష్కరాలు

- లక్షలాదిగా వచ్చే భక్తులకు కాళేశ్వరం వద్ద సకల ఏర్పాట్లు చేయాలి
- అధికార యంత్రాంగానికి మంత్రులు కొండా సురేఖ, శ్రీధర్‌బాబు ఆదేశం


సరస్వతీనది పుష్కరాలకు రావాలని సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానిస్తున్న మంత్రి కొండా సురేఖ

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 15 నుంచి సరస్వతీనది పుష్కరాలు ప్రారంభం కానున్నాయని మంత్రులు కొండా సురేఖ, శ్రీధర్‌బాబు తెలిపారు. భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలోని త్రివేణి సంగమం వద్ద అంతర్వాహినిగా ప్రవహించే సరస్వతీ నది పుష్కరాలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని అధికార యంత్రాంగాన్ని మంత్రులు ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో పుష్కర ఏర్పాట్లపై మంత్రులు సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 14న రాత్రి 10.35 గంటలకు బృహస్పతి మిథునరాశిలోకి ప్రవేశించే సమయంలో పుష్కర కాలం ప్రారంభమవుతుందన్నారు. 15వ తేదీన మెదక్ జిల్లా రంగంపేటకు చెందిన శ్రీ శ్రీ శ్రీ మాధవానంద సరస్వతి స్వామి పుష్కరాలను ప్రారంభిస్తారన్నారు. పుష్కరాల సందర్భంగా ప్రతిరోజు ఒక పీఠాధిపతి పుష్కర స్నానం చేస్తారన్నారు. త్రివేణి సంగమం వద్ద పుష్కర స్నానానికి లక్షలాది భక్తులు మన రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా వస్తారని తెలిపారు. కొన్ని చిన్నచిన్న పనులు పెండింగ్‌లో ఉన్నాయని, అవి కూడా పుష్కరాలు ప్రారంభం అయ్యేలోగా అయిపోతాయని అధికారులు మంత్రులకు నివేదించారు. ఈ పుష్కరాల కోసం ప్రభుత్వం చేపట్టిన ఏర్పాట్ల వివరాలు భక్తులకు సమగ్రంగా తెలిపేందుకు కాళేశ్వరం సరస్వతి పుష్కరాల వెబ్‌పోర్టల్, మొబైల్ యాప్‌ను ఇటీవల మంత్రులు ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ సమీక్షలో సీఎస్ రామకృష్ణారావు, డీజీపీ జితేందర్, దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్, ఆర్‌అండ్‌బీ ప్రిన్సిపల్ సెక్రటరీ వికాస్ రాజ్, సెర్ప్ సీఈఓ దివ్యా దేవరాజన్, ఎండోమెంట్ కమిషనర్ వెంకటరావు, అడిషనల్ కమిషనర్ కృష్ణవేణి, భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

సీఎంను ఆహ్వానించిన మంత్రి కొండా సురేఖ

ఈ నెల 15 నుంచి ప్రారంభం కానున్న సరస్వతీనది పుష్కరాలకు రావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ ఆహ్వానించారు. మంగళవారం జూబ్లీహిల్స్ సీఎం నివాసంలో సీఎంను మంత్రి కొండా కలిశారు. సీఎంతోపాటు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఏఐసీసీ సెక్రటరీ విష్ణునాథ్, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలను కూడా ఆహ్వానించారు.



గోదావరిలో ఇసుకలారీల బారులు

ములుగు జిల్లా మంగపేట మండలం మంగపేట, వాడగూడెం గ్రామాల సమీపంలోని నడి గోదావరి నది తమదే అన్న చందంగా ఇసుక రవాణా జరుగుతోంది. పంట పొలాల్లో ఇసుక మేటల తొలగింపు పేరుతో ఏజెన్సీ నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు పొంది వందలాది లారీల్లో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు తెలిసింది. - మంగపేట

ఆర్థిక లావాదేవీలపైనే ఆరా!

ముగిసిన ఈఎన్సీ హరిరామ్ ఏసీబీ కస్టడీ

సాక్షి, హైదరాబాద్: ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టయిన కాళేశ్వరం ఎత్తిపోతల పథకం గజ్వేల్ ఈఎన్సీ భూక్యా హరిరామ్ ఏసీబీ కస్టడీ మంగళవారంతో ముగిసింది. కోర్టు అనుమతితో వరుసగా నాలుగు రోజులపాటు హరిరామ్‌ను ఏసీబీ అధికారులు పలు కోణాల్లో విచారించారు. హరిరామ్ ఉద్యోగ జీవితంలో తీసుకున్న కీలక నిర్ణయాలు మొదలు.. ఆదాయానికి మించి కూడబెట్టిన ఆస్తులు, ఆర్థిక లావాదేవీలపై ఏసీబీ అధికారులు కీలక సమాచారం సేకరించారు. మొదటి రెండురోజులు ముక్తసరి సమాధానాలకే పరిమితమైన హరిరామ్..ఆ తర్వాతి రెండు రోజుల్లో మాత్రం కొన్ని విషయాలు అంగీకరించినట్టు తెలిసింది. గత నెల 26న హైదరాబాద్‌లోని హరిరామ్ నివాసంతో పాటు ఆయనకు, ఆయన కుటుంబ సభ్యులకు సంబంధించిన మొత్తం 14 ప్రాంతాల్లో నిర్వహించిన సోదాల్లో పలు ఆస్తులకు సంబంధించిన పత్రాలు ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. షేక్‌పేట, కొండాపూర్‌లలో లగ్జరీ విల్లాలు, శ్రీనగర్ కాలనీ, మాదాపూర్, నార్సింగిలో ఫ్లాట్లు, అమరావతిలో కమర్షియల్ ఆస్తి, మార్కూక్‌లో 28 ఎకరాల వ్యవసాయ భూమి, బొమ్మల రామారంలో ఆరు ఎకరాల మామిడి తోటతో కూడిన ఫామ్‌హౌస్, లగ్జరీ వాహనాలు, బంగారు ఆభరణాలు, బ్యాంకు డిపాజిట్లు..మొత్తం సుమారు రూ.200 కోట్ల విలువైన ఆస్తులకు సంబంధించిన పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ పత్రాలు ఒక్కొక్కటీ ముందు పెడుతూ ప్రశ్నించడంతో హరిరామ్ సమాధానాలు చెప్పినట్టు తెలుస్తోంది.

బినామీలపై ఫోకస్: కస్టడీ సమయంలో ఏసీబీ అధికారులు ప్రధానంగా హరిరామ్ బ్యాంకు ఖాతా వివరాలు, ఆర్థిక లావాదేవీలు, ఆస్తుల కొనుగోళ్లపై ప్రశ్నించారు. తక్కువ ధరలకు వ్యవసాయ, నివాస భూములలో పెట్టుబడి పెట్టానని, తర్వాత వాటి విలువ పెరిగిందని ఆయన పేర్కొన్నప్పటికీ, నగదు లావాదేవీలు, తక్కువగా నమోదు అయిన కొనుగోలు విలువలపై అధికారులు ఆరా తీశారు. హరిరామ్ మరికొన్ని ఆస్తులను బినామీల పేరిట పెట్టి ఉండొచ్చని ఏసీబీ అధికారులు అనుమానిస్తున్నారు. దీంతో హరిరామ్‌కు ఎవరెవరు సహకరించారు..వారిలో ఎవరితో ఆర్థిక సంబంధాలున్నాయన్న కోణంలోనూ ఏసీబీ అధికారులు సమాచారం సేకరిస్తున్నారు. మంగళవారంతో కస్టడీ ముగియడంతో బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 12లోని ఏసీబీ కేంద్ర కార్యాలయం నుంచి హరిరామ్‌ను చంచల్‌గూడ జైలుకు తరలించారు. అయితే 4 రోజుల కస్టడీలో హరిరామ్ పూర్తిగా సహకరించలేదని, మరికొంత కీలక సమాచారం రాబట్టాల్సి ఉందని భావిస్తున్న ఏసీబీ అధికారులు..మరోసారి హరిరామ్‌ను కస్టడీ కోరే అవకాశం ఉన్నట్టు సమాచారం.

బాలానగర్ సీతాఫలానికి 'జీఐ' సాధిస్తాం

- క్షేత్రస్థాయిలో నిపుణుల బృందం పర్యటన
- త్వరలోనే జీఐ కోసం దరఖాస్తు చేస్తాం
- కొండా లక్ష్మణ్ వర్సిటీ ప్రొఫెసర్ పిడిగం సైదయ్య

సాక్షి, హైదరాబాద్: మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రఖ్యాతిగాంచిన బాలానగర్ సీతాఫలానికి భౌగోళిక గుర్తింపు (జీఐ ట్యాగింగ్) సాధించేందుకు నిపుణులతో కూడిన అధ్యయన బృందం క్షేత్రస్థాయిలో పర్యటించింది. కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ పిడిగం సైదయ్య, రిజల్యూట్ ఫర్ ఐపీ హెడ్ సుభాజిత్ సాహ, నాబార్డ్ ఏజీఎం మనోహర్‌రెడ్డిలతో కూడిన బృందం మంగళవారం జిల్లాలోని నవాబుపేట మండలం పోమల్, కొల్లూరు, కేశరావులపల్లి కొత్తపల్లి గ్రామాల్లో పర్యటించింది. పంట పొలాల గట్లపై ఉన్న బాలానగర్ సీతాఫలం చెట్లను పరిశీలించారు. అనంతరం వికారాబాద్ జిల్లా చౌడపూర్ మండలంలోని కొత్తపల్లి, కల్మన్ కాల్వ గ్రామాలను ఆనుకొని ఉన్న అటవీ ప్రాంతాల్లో సహజంగా పెరిగే బాలానగర్ సీతాఫలం రకాలను పరిశీలించారు. పోమల్ గ్రామంలోని ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీకి చెందిన సీతాఫల్ ప్రాసెసింగ్ ప్లాంటులో అధ్యయనం చేశారు. బాలానగర్ సీతాఫలానికి చెన్నైలోని జియోగ్రాఫికల్ ఇండికేషన్ రిజిస్ట్రీలో దరఖాస్తు చేసేందుకు అవసరమైన ప్రాథమిక సమాచారాన్ని ఇప్పటికే సేకరించామని, త్వరలోనే దరఖాస్తు చేస్తామని డాక్టర్ పిడిగం సైదయ్య తెలిపారు. ప్రజలు, సమాజం, ప్రాంతాన్ని కలుపుతూ భౌగోళిక గుర్తింపు ఇచ్చేందుకు బాలానగర్ సీతాఫలం ప్రధాన ఉదాహరణగా చెప్పుకోవచ్చని సుభాజిత్ సాహ అన్నారు. దక్షిణ భారతదేశంలో జీఐ ట్యాగ్ పొందే మొట్టమొదటి సీతాఫలంగా ఇది నిలువబోతోందని నాబార్డ్ ఏజీఎంపి మనోహర్‌రెడ్డి అన్నారు.

ఎదురుకాల్పుల్లో మహిళా మావోయిస్టు మృతి

మరో ఘటనలో అసిస్టెంట్ కమాండెంట్‌కు గాయాలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం/చర్ల: ఛత్తీస్‌గఢ్‌- తెలంగాణ సరిహద్దుల్లోని కర్రిగుట్టల్లో సోమవారం జరిగిన ఎదురుకాల్పుల్లో మహిళా మావోయిస్టు మృతిచెందింది. బీజాపూర్ జిల్లా ఊసూరు అటవీ ప్రాంతంలో డీఆర్‌జీ, ఎస్‌టీఎఫ్, కోబ్రా, సీఆర్‌పీఎఫ్ బలగాలు కూంబింగ్ చేస్తుండగా తారసపడిన మావోయిస్టులు కాల్పులకు దిగారు. పోలీసులు జరిపిన ఎదురుకాల్పుల్లో మహిళా మావోయిస్టు మృతి చెందినట్టు గుర్తించారు. ఘటనాస్థలి నుంచి ఒక 303 రైఫిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. మరికొందరు మావోయిస్టులు కూడా గాయపడినట్టు తెలుస్తోందని బస్తర్ ఐజీ సుందర్‌రాజ్ తెలిపారు. సీనియర్ మావోయిస్ట్ కేడర్‌తో కూడిన బెటాలియన్ నంబర్-1 ఇక్కడే ఉందనే సమాచారంతో ఏప్రిల్ 21 నుంచి 24 వేల మంది బలగాలతో భారీ కూంబింగ్ ఆపరేషన్ కొనసాగుతోందన్నారు.

అసిస్టెంట్ కమాండెంట్‌కు గాయాలు
కర్రిగుట్టల్లో పోలీసు బలగాలు చేపడుతున్న సెర్చ్ ఆపరేషన్‌లో భాగంగా మంగళవారం ఓ అసిస్టెంట్ కమాండెంట్ పొరపాటున ఐఈడీపై కాలు వేయడంతో అది పేలి గాయాలయ్యాయి. గాయపడిన జవాన్‌ను హుటాహుటీన హెలీకాప్టర్‌లో ఢిల్లీ తరలించగా, వైద్యులు ఆయన ఎడమ కాలు తొలగించారు.

బీబీనగర్ ఎయిమ్స్ డైరెక్టర్ బదిలీ

బీబీనగర్: యాదాద్రి భువనగిరి జిల్లాలోని బీబీనగర్‌లో ఎయిమ్స్ కళాశాల డైరెక్టర్ వికాస్ భాటియా బదిలీ అయ్యారు. 2020లో భువనేశ్వర్ ఎయిమ్స్ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చిన వికాస్ భాటియా.. ఐదేళ్లలో ఎయిమ్స్ పురోగతికి పాటుపడ్డారు. వికాస్ భాటియా తిరిగి భువనేశ్వర్ ఎయిమ్స్‌కు బదిలీపై వెళ్తున్నట్లు సమాచారం. బీబీనగర్ ఎయిమ్స్‌కు ఏపీలోని మంగళగిరి ఎయిమ్స్ డైరెక్టర్ మాధవానంద ఇన్‌చార్జిగా కొనసాగనున్నారు. బుధవారం మాధవానంద బాధ్యతలు స్వీకరించనున్నారు.

4% అధిక ధరతో డిండి-ఏదుల లింక్ పనులు

రూ.304.9 కోట్లతో టెండర్లకు సీఓటీ ఆమోదం

సాక్షి, హైదరాబాద్: డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా ఏదుల-డిండి లింక్ ప్రాజెక్టు నాలుగో ప్యాకేజీ పనులను 4 శాతం అధిక ధరతో బిడ్లు వేసిన టీవీఆర్-ఎంఎస్ ప్రసాద్ జాయింట్ వెంచర్ కంపెనీకి అప్పగించేందుకు కమిషనర్ ఆఫ్ టెండర్స్ (సీఓటీ) ఆమోదం తెలిపింది. నీటిపారుదల శాఖ ఈఎన్సీ (జనరల్) జి. అనిల్‌కుమార్ అధ్యక్షతన మంగళవారం జరిగిన సీఓటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. రెండు కిలోమీటర్ల మేర సొరంగంతోపాటు 3 కిలోమీటర్ల మేర ప్రధాన కాల్వ పనులు, ఆ తర్వాత దుందుభి నదిలో పనుల కోసం రూ.290.41 కోట్ల అంచనా వ్యయంతో టెండర్లు పిలవగా, టీవీఆర్-ఎంఎస్ ప్రసాద్ జాయింట్ వెంచర్ 4.91 శాతం అధిక ధర రూ.304.9 కోట్లతో టెండర్లు వేసింది. ఏదుల రిజర్వాయర్ నుంచి 30 టీఎంసీల కృష్ణా జలాలను డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా తరలించి దుందుభి నదిలోకి వదులుతారు. ఆ తర్వాత పోతిరెడ్డిపల్లి వద్ద రబ్బర్ డ్యామ్ కట్టి, ఆ నీటిని డిండి ఎత్తిపోతల కింద మళ్లిస్తారు.

సన్నద్ధతకు సంసిద్ధం

దేశమంతటా నేడే మాక్‌డ్రిల్

సాక్షి, న్యూఢిల్లీ: మాక్‌డ్రిల్స్‌కు సర్వం సిద్ధమైంది. అనూహ్య పరిస్థితులను దీటుగా ఎదుర్కొనేందుకు, యుద్ధ సన్నద్ధతను పూర్తిస్థాయిలో చాటేందుకు దేశమంతా ఒక్కటవుతోంది. దాదాపు 54 ఏళ్ల అనంతరం దేశవ్యాప్తంగా పౌర రక్షణ, సన్నద్ధత విన్యాసాలు జరగనున్నాయి. పట్టణాల నుంచి గ్రామస్థాయి దాకా వాటిలో ప్రజలంతా చురుగ్గా భాగస్వాములు కానున్నారు. 6.5 లక్షల మందికి పైగా వలెంటీర్లు ఈ క్రతువులో వారికి సాయపడనున్నారు. 244 సివిల్ డిఫెన్స్ డిస్ట్రిక్ట్స్ (సీడీడీ) పరిధిలో బుధవారం సాయంత్రం నాలుగింటి నుంచి రాత్రి దాకా 'ఆపరేషన్ అభ్యాస్' పేరిట ఈ డ్రిల్స్ జరుగుతాయి. దేశవ్యాప్తంగా అణు విద్యుత్కేంద్రాలు, రిఫైనరీలు, కీలక కేంద్ర ప్రభుత్వ సంస్థలున్న, రక్షణపరంగా సున్నితమైన ప్రాంతాలను సీడీడీలుగా 2010లో కేంద్రం నోటిఫై చేసింది. వీటిలో చాలావరకు రాజస్తాన్, పంజాబ్, జమ్మూ కశ్మీర్, పశ్చిమబెంగాల్, ఈశాన్య రాష్ట్రాల్లో నెలకొని ఉన్నాయి. సున్నితత్వాన్ని బట్టి వాటిని మూడు కేటగిరీలుగా వర్గీకరించారు. ఢిల్లీ, చెన్నై వంటి నగరాలు అత్యంత సున్నితమైన కేటగిరీ 1లో ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లో హైదరాబాద్, విశాఖపట్నం డ్రిల్స్‌కు వేదిక కానున్నాయి. వాటిని సున్నితమైనవిగా పేర్కొంటూ కేటగిరీ 2లో చేర్చారు.

కేంద్రం సమీక్ష

పాక్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో కేంద్రం ఆదేశాల మేరకు జరుగుతున్న ఈ దేశవ్యాప్త డ్రిల్స్ సన్నద్ధతను కేంద్ర హోం శాఖ మంగళవారం సమీక్షించింది. డ్రిల్స్ విధివిధానాలు తదితరాలపై కేంద్ర హోం శాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ సారథ్యంలో ఉన్నతస్థాయి సమావేశంలో లోతుగా చర్చించారు. రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతోపాటు రక్షణ, పోలీసు విభాగాల అత్యున్నత స్థాయి అధికారులు భేటీలో పాల్గొన్నారు. డ్రిల్స్‌లో విద్యార్థులు, ఎన్‌సీసీ కాడెట్లు, యువతతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల ఉద్యోగులు, ఆస్పత్రుల సిబ్బంది, రైల్వే, మెట్రో ఉద్యోగులు తదితరులు భారీ సంఖ్యలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని నిర్దేశించారు. ఎక్కడికక్కడ పోలీసు, సైనిక సిబ్బంది వారితో సమన్వయం చేసుకోనున్నారు. 1971 తర్వాత రక్షణపరంగా దేశవ్యాప్తంగా మాక్ డ్రిల్స్ జరుగుతుండటం ఇదే తొలిసారి. అప్పుడు కూడా పాక్‌తో యుద్ధ నేపథ్యంలోనే ఈ కసరత్తు నిర్వహించారు. అంతకు ముందు 1962, 1965ల్లో కూడా చైనా, పాక్‌తో పూర్తిస్థాయి యుద్ధం సందర్భంగా మాక్ డ్రిల్స్ జరిపారు. మంగళవారం అన్ని రాష్ట్రాల్లోనూ మాక్ డ్రిల్స్ సన్నాహక కసరత్తులు పోలీసు తదితర బృందాల పర్యవేక్షణలో ముమ్మరంగా జరిగాయి. విద్యార్థులు, యువత మొదలుకుని ప్రజలంతా పెద్ద సంఖ్యలో వాటిలో పాల్గొన్నారు.


మంగళవారం కశ్మీర్‌లోని దాల్ సరస్సులో మాక్‌డ్రిల్ రిహార్సల్స్

డ్రిల్స్ ఇలా...

- మాక్ డ్రిల్స్‌లో భాగంగా వైమానిక దాడుల హెచ్చరికలతో సైరన్లు విన్పిస్తాయి.
- వెంటనే పరిసర ప్రాంతాల పౌరులంతా క్షణాల్లో అప్రమత్తమై సురక్షిత ప్రాంతాలకు తరలాలి. వీలైన చోట్ల బంకర్లు, సబ్‌వేలు, అండర్‌గ్రౌండ్ మెట్రో తదితర చోట్ల తలదాచుకోవాలి.
- ఈ కసరత్తులో యువత, విద్యార్థులు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ కాడెట్లు మొదలుకుని హోంగార్డుల దాకా అందరినీ భాగస్వాములను చేస్తారు.
- కీలక సంస్థలు, మౌలిక సదుపాయ వ్యవస్థలను దాడుల నుంచి కాపాడుకోవడం, అవి శత్రువు కంటపడకుండా జాగ్రత్త పడటం తదితరాల్లో జాతీయ, రాష్ట్ర విపత్తు నిర్వహణ, అగ్నిమాపక తదితర బృందాలు వారికి శిక్షణ ఇస్తాయి.
- బ్లాకౌట్ వంటివి చోటుచేసుకుంటే ఎలా స్పందించాలో, స్వీయరక్షణతో పాటు పౌరులను కాపాడేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో వివరిస్తాయి.
- రాత్రి 7.30 నుంచి 10 నిమిషాల పాటు క్రాష్ బ్లాకౌట్ 'లైట్లను ఆపేయడం) కసరత్తు జరుగుతుంది.
- డ్రిల్స్ కోసం హాట్‌లైన్, రేడియో కమ్యూనికేషన్ వంటివాటిని వైమానిక దళ లింకులతో అనుసంధానిస్తారు.
- కంట్రోల్ రూమ్స్, షాడో కంట్రోల్ రూమ్స్ విపత్తులకు ఎలా స్పందిస్తాయో పరీక్షిస్తారు.
- డ్రిల్స్ నిమిత్తం స్పందన బృందాలన్నింటికీ ఇప్పటికే కోడ్ వర్డ్స్ కేటాయించారు.
- ఎప్పుడేం చేయాలో పేర్కొంటూ టైమ్‌లైన్స్‌ను కూడా స్పష్టంగా నిర్దేశించారు.
- వైమానిక దాడుల హెచ్చరిక వ్యవస్థల సమర్థతను డ్రిల్స్ ద్వారా పరిశీలించనున్నారు.
- కేంద్ర హోం శాఖ పౌర రక్షణ నిబంధనలు (1968) సెక్షన్ 19 ప్రకారం మాక్ డ్రిల్స్ నిర్వహిస్తున్నారు.

ఈసారి తగ్గేదే లే!

- ఉరి, బాలాకోట్ మాదిరిగా కాదు
- త్వరలో బాహాటంగా భారీ 'ఆపరేషన్'
- ఆ రాజకీయ సందేశమే డ్రిల్స్ లక్ష్యం

2016లో సర్జికల్ స్ట్రైక్స్. 2019లో బాలాకోట్ వైమానిక దాడులు. ఉగ్రవాద దుశ్చర్యలకు గతంలో మోదీ సర్కారు ప్రతిస్పందనలు. రెండూ సైలెంట్‌గా నిర్వహించిన అండర్ కవర్ ఆపరేషన్లే. ఉరి, పుల్వామా ఉగ్ర చర్యలతో పోలిస్తే 'పహల్గాం' దాడి పరిస్థితి పూర్తి భిన్నం. 26 మంది అమాయక పర్యాటకులను ముష్కరులు అతి కిరాతకంగా పొట్టన పెట్టుకున్నారు. ఒక్కొక్కరినీ మతం అడిగి పిట్టల్లా కాల్చేసి పైశాచికత్వం ప్రదర్శించారు. అంతేగాక 'పోయి మోదీకి చెప్పుకోండి' అంటూ కేంద్రానికి సూటిగా సవాలు విసిరారు. దాడిని తలచుకుని భారతీయులంతా ఆగ్రహంతో రగిలిపోతున్నారు. ఈసారి కొట్టబోయే దెబ్బ జన్మలో మర్చిపోలేని విధంగా ఉండాలని కోరుతున్నారు. అందుకే ఈసారి భారత ప్రతి చర్య పూర్తి భిన్నంగా ఉండటం ఖాయమంటున్నారు. బాహాటంగా, అత్యంత భారీ స్థాయిలో సైనిక చర్య ఉండనుందని స్పష్టమైన సంకేతాలు వెలువడుతున్నాయి. ఈ నేపథ్యంలో యుద్ధ సన్నద్ధత, పౌర అవగాహన కోసం దేశవ్యాప్త మాక్ డ్రిల్స్ నిర్ణయం సర్వత్రా ఆసక్తి రేకెత్తిస్తోంది. సీమాంతర ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న దాయాదికి గట్టి రాజకీయ సందేశమివ్వడమే దీని లక్ష్యమని చెబుతున్నారు. ఉగ్రవాదానికి, దానికి తల్లివేరు వంటి పొరుగు దేశానికి బుద్ధి చెప్పే విషయంలో దేశమంతా ఒక్కతాటిపై ఉందని ప్రపంచానికి చాటేందుకే మోదీ సర్కారు ఈ చర్య చేపట్టినట్టు తెలుస్తోంది. భారత 'ఆపరేషన్'కు పాక్ స్పందనను బట్టి ఒకవేళ యుద్ధం వంటి పరిస్థితులు తలెత్తినా అందుకు దేశమంతా సంసిద్ధంగా ఉందని చాటడం కూడా ఈ డ్రిల్స్ ఉద్దేశమని రక్షణ రంగ పరిశీలకులు భావిస్తున్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

ఇవి అందుబాటులో ఉంచుకోవాలి

- మాక్ డ్రిల్స్‌కు పౌరులు పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలి.
- అత్యవసర చికిత్స నిమిత్తం మెడికల్ కిట్లు, కరెంటు కోత తదితరాల కోసం టార్చిలు, క్యాండిళ్లు వెంట ఉంచుకోవాలి. అలాగే వీలైనంత నగదు కూడా దగ్గరుంచుకోవాలి.
- వీటిపై పౌరులను అప్రమత్తం చేయాల్సిందిగా అధికారులను కేంద్ర హోం శాఖ ఆదేశించింది.
- ఢిల్లీ, పశ్చిమబెంగాల్ సహా పలు రాష్ట్రాల్లో పౌర రక్షణ బృందాలు ఇప్పటికే చురుగ్గా పని చేస్తున్నాయి.
- అయితే ఇవన్నీ స్వచ్ఛంద స్వభావంతో కూడిన బృందాలే.

ఎక్కడెక్కడ?

దేశవ్యాప్తంగా మొత్తం 33 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 244 సివిల్ డిఫెన్స్ డిస్ట్రిక్ట్స్ (సీడీడీ) పరిధిలో ఎంపిక చేసిన 259 చోట్ల మాక్‌డ్రిల్స్ జరుగుతాయి.

- వీటిలో ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నై వంటి మెట్రోలు కూడా ఉన్నాయి.

- 100కు పైగా సీడీడీలను అత్యంత సున్నితమైనవిగా గుర్తించి 'ఎ' కేటగిరీలో చేర్చారు. వాటి పరిధిలో సూరత్, వడోదర, కాక్రపార్ (గుజరాత్), కోట (రాజస్తాన్), బులంద్‌షహర్ (యూపీ), చెన్నై, కల్పకం (తమిళనాడు), తాల్చెర్ (ఒడిశా), ముంబై, ఉరన్, తారాపూర్ (మహారాష్ట్ర), ఢిల్లీ వంటివి ఉన్నాయి.

ఇక స్వేచ్ఛా వాణిజ్యం

భారత్–యూకే మధ్య ఫలించిన చర్చలు

- డబుల్ కంట్రిబ్యూషన్ కన్వెన్షన్‌కు ఒకే
- ఇదొక చరిత్రాత్మక మైలురాయి: మోదీ
- ఇండియా మార్కెట్‌లో తగ్గనున్న యూకే ఉత్పత్తుల ధరలు
- యూకేలో ఇండియా ఉత్పత్తులపై సున్నా టారిఫ్‌లు




న్యూఢిల్లీ/లండన్: భారత్–యునైటెడ్ కింగ్‌డమ్(యూకే) ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం(ఎఫ్‌టీఏ)తోపాటు డబుల్ కంట్రిబ్యూషన్ కన్వెన్షన్ ఒప్పందం కుదిరాయి. ఇరుదేశాల మధ్య మూడేళ్లుగా జరుగుతున్న చర్చలు ఫలించాయి. ఒప్పందంపై భారత్, యూకే మంగళవారం అంగీకారానికి వచ్చాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విదేశీ ఉత్పత్తులపై సుంకాల మోత మోగిస్తున్న తరుణంలో ఈ ఒప్పందాలు కుదరడం వల్ల భారత్, యూకే దేశాలకు ఎనలేని లబ్ధి చేకూరుతుందని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

బలపడనున్న బంధం

యూకేతో కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని చరిత్రాత్మకమైన మైలురాయిగా భారత ప్రధాని నరేంద్ర మోదీ అభివర్ణించారు. భారత్–యూకే మధ్య సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత బలపడుతుందని, వ్యాపారం, వాణిజ్యం, పెట్టుబడులు, ఆర్థిక ప్రగతి, ఉద్యోగాల కల్పన, నవీన ఆవిష్కరణలు వంటి అంశాల్లో రెండు దేశాలకు ఎంతో మేలు జరుగుతుందని హర్షం వ్యక్తంచేశారు. ప్రధాని మోదీ తాజాగా యూకే ప్రధానమంత్రి కీర్ స్టార్మర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఎఫ్‌టీఏపై చర్చించారు. ఎఫ్‌టీఏతోపాటు డబుల్ కంట్రిబ్యూషన్ కన్వెన్షన్ కుదరడాన్ని ఇరువురు నేతలు స్వాగతించారు. ప్రపంచంలో రెండు అతిపెద్ద, ఓపెన్–మార్కెట్ ఆర్థిక వ్యవస్థలైన భారత్, యూకే మధ్య ఎఫ్‌టీఏ కుదరడంతో వ్యాపారాలకు నూతన అవకాశాలు అందుబాటులోకి రావడంతోపాటు రెండు దేశాల మధ్య ఆర్థిక బంధంతోపాటు ప్రజల మధ్య సంబంధాలు మరింత బలం పుంజుకుంటాయని మోదీ, స్టార్మర్ ఉద్ఘాటించారు.

ఏమిటీ ఒప్పందం?

- భారత్–యూకే మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం చాలాఏళ్లుగా చర్చల్లో నలుగుతోంది. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ బాధ్యతలు చేపట్టడం, విదేశీ ఉత్పత్తులపై సుంకాల బాంబు పేల్చడంతో భారత్–యూకే మధ్య చర్చల్లో ఒక్కసారిగా వేగం పెరిగింది. 2022 జనవరిలో మొదలైన ఈ చర్చలు ఫలప్రదంగా ముగిశాయి. అదే సమయంలో ప్రతిపాదిత ద్వైపాక్షిక పెట్టుబడుల ఒప్పందంపై చర్చలు ఇంకా కొనసాగుతున్నాయి.
- స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంతో విస్కీ, అడ్వాన్స్‌డ్ తయారీ భాగాలు, వైద్య పరికరాలు, అడ్వాన్స్‌డ్ మెషినరీ, ఆహార ఉత్పత్తులపై టారిఫ్‌లు భారీగా తగ్గుతాయి.
- అంతర్జాతీయ మార్కెట్ల కోసం రెండు దేశాలు ఉమ్మడిగా వస్తువులు, సేవలను అభివృద్ధి చేయడానికి ప్రతిబంధకాలు తొలగిపోతాయి.
- యూకే ఉత్పత్తులను ఇండియా అనుమతించనుంది. అలాగే ఇండియా తమ ఉత్పత్తులను యూకేలో విక్రయించుకోవచ్చు.
- భారత్‌లో బ్రిటిష్ స్కాచ్ విస్కీ, బ్రిటిష్ కార్ల ధరలు తగ్గిపోతాయి. అలాగే బ్రిటన్‌లో ఇండియా వస్త్రాలు, తోలు ఉత్పత్తుల ధరలు తగ్గుతాయి.
- ఒప్పందం ప్రకారం... యూకే విస్కీ, జిన్‌పై సుంకాన్ని 150 నుంచి 75 శాతానికి భారత్ తగ్గిస్తుంది. పదేళ్లలో 40 శాతానికి తగ్గించనుంది.
- బ్రిటిష్ ఆటోమొబైల్స్‌పై ఇండియాలో టారిఫ్ ప్రస్తుతం 100 శాతం ఉండగా, ఇది 10 శాతానికి తగ్గిపోనుంది. ప్రతిఫలంగా భారత్ నుంచి వచ్చే పలు ఉత్పత్తులపై టారిఫ్‌లను యూకే ప్రభుత్వం భారీగా తగ్గిస్తుంది.
- యూకే మార్కెట్లలో 99 శాతం భారతీయ ఉత్పత్తులపై టారిఫ్‌లు సున్నాకు పడిపోతాయి. పాదరక్షలు, బంగారు అభరణాలు, రత్నాలు, రసాయనాలు, ప్లాస్టిక్, రబ్బర్, కలప, కాగితం, గాజు, సెరామిక్, బేస్ మెటల్స్, మెకానికల్, ఎలక్ట్రికల్ మెషినరీ, ఫర్నీచర్, క్రీడా సామగ్రి, శుద్ధి చేసిన ఆహారం, పాడి ఉత్పత్తులపై సుంకాలు ఉండవు. అంతేకాకుండా భారతీయులకు యూకేలో మరిన్ని ఉద్యోగావకాశాలు లభిస్తాయి.
- ఎఫ్‌టీఏతో ఇండియా–యునైటెడ్ కింగ్‌డమ్ నడుమ ద్వైపాక్షిక వాణిజ్యం 2030 నాటికి రెండు రెట్లు వృద్ధి చెందుతుందని అంచనా వేస్తున్నారు. 2040 నాటికి బ్రిటిష్ ఆర్థిక వ్యవస్థ ప్రతిఏటా అదనంగా 4.8 బిలియన్ పౌండ్ల మేర లాభపడుతుందని చెబుతున్నారు.
- భారత్, యూకే మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం ఏటా 41 బిలియన్ పౌండ్లుగా ఉంది. ఎఫ్‌టీఏతో ఇది 56 బిలియన్ పౌండ్లకు చేరుకోనుంది.
- డబుల్ కంట్రిబ్యూషన్స్ కన్వెన్షన్(సామాజిక భద్రత ఒప్పందం) ప్రకారం.. భారత్ ఉద్యోగాలు యూకేలో లేదా యూకే ఉద్యోగులు భారత్‌లో పనిచేస్తే నేషనల్ ఇన్సూరెన్స్ లేదా సోషల్ సెక్యూరిటీ కంట్రిబ్యూషన్స్ చెల్లించాల్సిన అవసరం ఉండదు.
- ఎఫ్‌టీఏకు ఇరుదేశాల పార్లమెంట్ ఆమోదం లభించి, సంతకాలు జరగాల్సి ఉంది. ఏడాది లోగా అమల్లోకి వచ్చే అవకాశం కనిపిస్తోంది.

ఇక్కడ ప్రవహించేవన్నీ మన జలాలే: మోదీ

న్యూఢిల్లీ: ''భారతగడ్డపై ప్రవహించే నదీజలాలన్నీ మనకే చెందుతాయి. వాటి వినియోగ హక్కులు మన దేశానివే'' అని ప్రధాని మోదీ ప్రకటించారు. సింధూ పరివాహక ప్రాంతంలోని జలాశయాల గేట్లను మూసేస్తున్న వేళ ఆయన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఏబీపీ నెట్‌వర్క్ వారి 'ఇండియా @2047' సదస్సులో భాగంగా మంగళవారం మోదీ ప్రసంగించారు. '' సరిహద్దు వెంట నదీజలాల్లో భారత్‌కు న్యాయంగా దక్కాల్సిన వాటా గతంలో దక్కలేదు. ఆ వాటా నీళ్లు దేశం దాటి ఆవలికి పోయాయి. ఇప్పుడు ఈ నదీజలాలు భారత హక్కులు, ప్రయోజనాలకు ప్రతిరూపం. అందుకే దేశ ప్రయోజనాల మేరకు ఈ జలాలను అడ్డుకుంటాం. అడ్డుకుని వీటిని జాతీయ అవసరాల కోసం వినియోగిస్తాం'' అని అన్నారు. ప్రసంగంలో ఎక్కడా పాకిస్తాన్ పేరును మోదీ ప్రస్తావించలేదు.

సరిహద్దుల్లో నేడు, రేపు వైమానిక విన్యాసాలు!

దోవల్‌తో ప్రధాని మోదీ కీలక భేటీ

న్యూఢిల్లీ/జమ్మూ: నియంత్రణ రేఖ వెంబడి భారీ ఎత్తున కీలక వైమానిక విన్యాసాలకు సైన్యం సిద్ధమవుతోంది. ఇవి బుధ, గురువారాల్లో కొనసాగుతాయని తెలుస్తోంది. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌తో ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం భేటీ అనంతరం కేంద్ర ప్రభుత్వ అత్యున్నత వర్గాలను ఉటంకిస్తూ విశ్వసనీయ వర్గాలు ఈ మేరకు పేర్కొన్నాయి. విన్యాసాలకు సంబంధించి ఎయిర్‌మెన్‌కు వైమానిక దళం ఇప్పటికే కీలక ఆదేశాలు (నోటమ్) జారీ చేసింది. ఇవి జారీ అయ్యాయంటే సంబంధిత ప్రాంతాల్లో గగనతల వాడకంపై ఆంక్షలు అమల్లోకి వస్తాయి. అక్కడ వైమానిక దళం విన్యాసాలు చేపడుతుందని అర్థం. మరోవైపు పాక్ నియంత్రణ రేఖ వెంట వరుసగా 12వ రోజు కూడా కాల్పులకు తెగబడింది.

మేం లేకుంటే మీరూ మిగలరు: పాక్ మంత్రి

ఇస్లామాబాద్: భారత్ తమపైకి దాడికి దిగితే రెండు దేశాల్లో ఎవరూ మిగలరని పాకిస్తాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ హెచ్చరించారు. తమ భద్రతకు భంగం కలిగించేందుకు ఎలాంటి ప్రయత్నం చేసినా బదులు తీవ్రంగా ఉంటుందన్నారు. యుద్ధం ఒక వేళ మొదలైతే, దాన్ని ఆపడం అసాధ్యమన్నారు. టీటీపీ (తెహ్రీక్ ఇ–తాలిబన్ పాకిస్తాన్), బీఎల్ఏ(బలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ) వెనక భారత్ హస్తం ఉందని ఆరోపించారు. ప్రధాని మోదీ ప్రమాదకరమైన రాజకీయాలు చేస్తున్నారన్నారు.

ఐరాసలో పాక్‌కు భంగపాటు

- బాధ్యతారహితంగా 'అణు' బెదిరింపులా?
- ఉద్రిక్తతల వేళ క్షిపణి ప్రయోగాలెందుకు?
- దాయాది తీరును దునుమాడిన దేశాలు

ఐరాస: తాత్కాలిక సభ్య దేశ హోదాను అడ్డుపెట్టుకుని ఐక్యరాజ్యసమితిలో భారత్‌పై నానా యాగీ చేయజూసిన దాయాదికి మర్చిపోలేని భంగపాటు ఎదురైంది. అంతర్జాతీయ వేదికపై మనల్ని ఎలాగైనా అప్రతిష్టపాలు చేసే ఉద్దేశంతో పట్టుబట్టి ఏర్పాటు చేయించిన ఐరాస భద్రతామండలి భేటీలో పాక్ నవ్వులపాలైంది. అణుబాంబులు వేస్తామంటూ బెదిరింపులకు దిగుతారా అంటూ సభ్యదేశాలన్నీ పాక్‌ను దుయ్యబట్టాయి. ఉద్రిక్తతల వేళ క్షిపణి పరీక్షలతో ఎలాంటి సందేశం ఇవ్వదలచారంటూ నిలదీశాయి. తీరు మార్చుకోవాలంటూ గట్టిగా గడ్డి పెట్టాయి. పైగా అది కోరినట్టుగా ఎలాంటి తీర్మానమూ చేసేందుకు అంగీకరించలేదు. చివరికి మిత్ర దేశం చైనా కూడా పాక్‌కు దన్నుగా నిలవలేదు. భేటీ అనంతరం ఆ దేశ ప్రతినిధితో కలిసి ప్రెస్‌మీట్‌లో పాల్గొనేందుకు కూడా నిరాకరించింది! పాక్ కోరిక మేరకు సోమవారం భద్రతా మండలి రహస్య భేటీ జరిగింది. పాక్ శాశ్వత ప్రతినిధి అసీమ్ ఇఫ్తికార్ అహ్మద్ భారత్‌పై తప్పుడు ప్రచారానికి ప్రయత్నించారు. పహల్గాం ఉగ్ర దాడి నుంచి సభ్య దేశాల దృష్టి మరల్చేందుకు కశ్మీర్ అంశాన్ని వ్యూహాత్మకంగా తెరపైకి తెచ్చారు. సైనిక మోహరింపుతో పాటు భారత్ రెచ్చగొట్టే ప్రకటనలు చేస్తోందని ఆరోపించారు. సింధూ జల ఒప్పందాన్ని నిలిపివేయడం దురాక్రమణ చర్యేనన్నారు. పహల్గాం దాడిని భారత ఫాల్స్ ఫ్లాగ్ ఆపరేషన్‌గా అభివర్ణించారు. ఆయన అభియోగాలన్నింటినీ సభ్య దేశాలు నిర్ద్వంద్వంగా తిరస్కరించాయి. పైగా పాక్‌పై ప్రశ్నల వర్షం కురిపించాయి. క్షిపణి పరీక్షలను తీవ్రంగా తప్పుబట్టాయి. అణుబాంబు బెదిరింపులపై ఆందోళన వ్యక్తం చేశాయి. పహల్గాం ఉగ్రదాడిలో ప్రత్యేకంగా ఓ మతం పర్యాటకులనే కాల్చి చంపడంపై దేశాలన్నీ అగ్రహం వ్యక్తం చేశాయి. దాడిలో లష్కరే తొయిబా ఉగ్ర సంస్థ పాత్రపై పాక్‌ను నిలదీశాయి. భారత్‌తో సమస్యలను చర్చల ద్వారా ద్వైపాక్షికంగానే పరిష్కరించుకోవాలని కుండబద్దలు కొట్టాయి.

ఓడి, నెగ్గిన మెర్జ్

బెర్లిన్: స్పష్టమైన మెజారిటీ ఉన్నాసరే ఒక్కోసారి గెలుపు తలుపు వెంటనే తెరుచుకోదనే వాదన జర్మనీ పార్లమెంట్ వేదికగా నిజమైంది. మంగళవారం రెండో ప్రయత్నంలో సీడీయూ, సీఎస్‌యూ కూటమి నేత ఫ్రెడ్రిక్ మెర్జ్ గెలిచి చాన్స్‌లర్‌గా ఎన్నికయ్యారు. జర్మనీ పార్లమెంట్(బండేస్టాగ్)లో 630 సీట్లకుగాను 328 సీట్లతో క్రిస్టియన్ డెమొక్రటిక్ యూనియన్ (సీడీయూ), క్రిస్టియన్ సోషల్ యూనియన్(సీఎస్‌యూ) కూటమికి స్పష్టమైన ఆధిక్యత ఉండటంతో ఆ కూటమి నేత ఫ్రెడ్రిక్ మెర్జ్ సునాయసంగా గెలుస్తారని తొలుత అంతా భావించారు. కానీ తొలి ప్రయత్నంలో చాన్స్‌లర్ ఎంపిక కోసం నిర్వహించిన రహస్య ఓటింగ్‌లో గెలుపునకు మెర్జ్ కేవలం ఆరు ఓట్ల దూరంలో ఆగిపోయి అందర్నీ విస్మయానికి గురిచేశారు. రెండో ప్రపంచయుద్ధం తర్వాత జర్మనీ పార్లమెంట్‌లో తొలి రౌండ్‌లో ఓడిపోయిన చాన్స్‌లర్ అభ్యర్థిగా మెర్జ్ చరిత్రలో నిలిచిపోయారు. 630 ఓట్లలో మెజారిటీ కోసం 316 ఓట్లు అవసరంకాగా మెర్జ్‌కు కేవలం 310 ఓట్లే వచ్చాయి. అయితే కొద్దిసేపటి తర్వాత మరోసారి రహస్య ఓటింగ్ చేపట్టారు. ఈసారి మెర్జ్ 325 ఓట్లు ఒడిసిపట్టి చాన్స్‌లర్ పీఠాన్ని కైవసం చేసుకున్నారు.

మోదీకి ముందే తెలుసు

పహల్గాం దాడిపై 3 రోజుల ముందే నిఘా నివేదిక
అందుకే కశ్మీర్ పర్యటన రద్దు చేసుకున్నారు: ఖర్గే

సాక్షి, న్యూఢిల్లీ/రాంచీ: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాద దాడి జరిగే అవకాశం ఉన్నట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి మూడు రోజుల ముందే తెలుసని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చెప్పారు. పర్యాటకులపై దాడి జరగబోతున్నట్లు మోదీకి ఇంటెలిజెన్స్ రిపోర్టు అందిందని అన్నారు. అందుకే ఆయన జమ్మూకశ్మీర్ పర్యటన రద్దు చేసుకున్నారని వెల్లడించారు. నిఘా వైఫల్యం వల్లే పహల్గాంలో ఉగ్రదాడి జరిగినట్లు అఖిలపక్ష సమావేశంలో కేంద్ర ప్రభుత్వం అంగీకరించిందని, మోదీ సైతం స్వయంగా ఒప్పుకున్నారని తెలిపారు. ఉగ్రవాదుల ఘాతుకం గురించి ముందే సమాచారం ఉన్నప్పటికీ పర్యాటకులకు తగిన భద్రత కల్పించలేదని మండిపడ్డారు. ఈ మారణకాండకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని తేల్చిచెప్పారు. మంగళవారం జార్ఖండ్ రాజధాని రాంచీలో 'సంవిధాన్ బచావో' ర్యాలీలో ఖర్గే ప్రసంగించారు. జమ్మూకశ్మీర్‌లో పర్యటించడం శ్రేయస్కరం కాదని ప్రధానమంత్రికి నిఘా వర్గాల నుంచి నివేదిక అందినప్పుడు అదే విషయం స్థానిక భద్రతా సిబ్బందికి, పోలీసులకు ఎందుకు చేరవేయలేదని ప్రశ్నించారు. ఉగ్రదాడి గురించి స్పష్టమైన సమాచారం ఉన్నప్పటికీ పర్యాటకుల భద్రత కోసం ఎందుకు చర్యలు చేపట్టలేదని నిలదీశారు. అదనపు బలగాలను పహల్గాంకు పంపించి ఉంటే ఈ దాడి జరిగేది కాదని అభిప్రాయపడ్డారు. సాధారణ ప్రజల ప్రాణాలంటే లెక్కలేదా? అని ఖర్గే ఆగ్రహం వ్యక్తంచేశారు. మన దేశం నేడు అతిపెద్ద సంక్షోభం ఎదుర్కొంటోందని అన్నారు. ఉగ్రవాదులపై, వారిని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్‌పై కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకున్నా తాము మద్దతు ఇస్తామని పునరుద్ఘాటించారు. పార్టీ, కులం, మతం కంటే దేశమే అత్యున్నతమని స్పష్టంచేశారు. పహల్గాం సమీపంలోని బైసారన్ లోయలో పర్యాటకులపై లష్కరే తొయిబా ఉగ్రవాదులు దాడికి దిగడం, 26 మందిని పాశవికంగా పొట్టన పెట్టుకోవడం తెలిసిందే.


కొత్త పోప్ ఎవరో!

నేటి నుంచి ఎన్నిక ప్రక్రియ షురూ

- సిస్టిన్ ఛాపెల్‌లో రహస్య ఓటింగ్‌కు సిద్ధమైన కార్డినల్స్
- ప్రచారంలో పలువురి పేర్లు
- ముందు జాగ్రత్తగా వాటికన్ అంతటా ఫోన్ సిగ్నళ్లు బంద్

ప్రపంచవ్యాప్తంగా 140 కోట్ల మంది క్యాథలిక్‌లకు అత్యున్నత మతాధికారిగా సేవలు అందించబోయే తదుపరి పోప్ ఎవరనే ఉత్కంఠ తీవ్రమైంది. దీనికి తెరదించడంలో భాగంగా కార్డినల్స్ బుధవారం వాటికన్ సిటీలో రహస్య ఓటింగ్‌కు సిద్ధమయ్యారు. అత్యధిక మెజారిటీ సాధించిన కార్డినల్‌కు పోప్ పదవి దక్కనుంది. 70 దేశాలకు చెందిన 133 మంది కార్డినళ్లు సిస్టిన్ ఛాపెల్‌లోకి వెళ్లి రహస్య ఓటింగ్‌లో పాల్గొనబోతున్నారు. మూడింట రెండొంతుల మెజారిటీ వచ్చిన వారే నూతన పోప్ అవుతారు. సిస్టిన్ ఛాపెల్‌లో ఏ కార్డినల్ ఎవరికి ఓటేశారనే విషయం పొరపాటున కూడా బయటకు పొక్కకుండా ఉండేందుకు వాటికన్ సిటీవ్యాప్తంగా అన్ని మొబైల్‌ఫోన్ల సిగ్నల్స్‌ను బుధవారం మధ్యాహ్నం మూడు గంటల నుంచే ఆపేయనున్నారు. నాలుగున్నర గంటలకు కార్డినళ్లు అందరూ ఛాపెల్‌లోకి వెళ్లనున్నారు. వీళ్ల ఫోన్లు, అన్నిరకాల ఎలక్ట్రానిక్ ఉపకరణాలను అధికారులు తీసుకుని కొత్త పోప్ ఎన్నిక తర్వాతే తిరిగి అప్పగిస్తారు. అప్పటిదాకా కార్డినళ్లను ఛాపెల్ ప్రాంగణం బయటకు కూడా అనుమతించబోరు. కొత్త పోప్ ఎన్నికల వార్త వినేందుకు ప్రజలు, మీడియా ప్రతినిధులు వేచి ఉండే 'సెయింట్ పీటర్ స్క్వేర్' వద్ద మాత్రం మొబైల్ నెట్‌వర్క్ పనిచేయనుంది. రహస్య ప్రక్రియలో ఎవరు పోప్‌గా పోటీపడుతున్నారనే అంశంపై ఊహాగానాలు ఎక్కువయ్యాయి. అయితే ప్రధానంగా ఐదారుగురి పేర్లు మాత్రమే వినవస్తున్నాయి. వాళ్ల గురించి క్లుప్తంగా...

పియట్రో పరోలిన్



70 ఏళ్ల ఇటలీ కార్డినల్ అయిన పియట్రో పరోలిన్ మిగతా వాళ్లతో పోలిస్తే పోటీలో ముందంజలో ఉన్నారు. గత పోప్ ఫ్రాన్సిస్ హయాంలో విదేశాంగ మంత్రిగా ఉన్నారు. పోప్ ఫ్రాన్సిస్‌కు ప్రధాన సలహాదారుగా ఉంటూ ఇప్పటికే ఈయన డిప్యూటీ పోప్‌గా అందరికీ చిరపరిచితులు. క్యాథలిక్‌ల పాత సిద్ధాంతాల పరిరక్షణకంటే దౌత్యం, ప్రపంచవ్యాప్తంగా పోప్ ప్రతిష్టను ఇనుమడింపజేయడం మీదనే ఈయన ప్రధానంగా దృష్టిపెడతారనే వాదన ఉంది. గత 266 మంది పోప్‌లలో 213 మంది ఇటలీ దేశస్తులే. గత 40 ఏళ్లుగా ఇటలీవ్యక్తి పోప్ పదవిని అధిరోహించలేదు. ఈ లెక్కన ఈసారి ఇటలీ వర్గం ఈయనకు అత్యధిక మద్దతిచ్చే అవకాశముంది.

లూయిస్ ఆంటోనియోగోకెమ్ ట్యాగిల్




67 ఏళ్ల ట్యాగిల్ ఫిలిప్పీన్స్ దేశస్తుడు. మిగతా వాళ్లతో పోలిస్తే ఈయన చాలా సంవత్సరాలుగా పాస్టర్‌గా కొనసాగి కార్డినల్ అయ్యారు. వాటికన్ తరఫున దౌత్యవేత్తగా, చర్చి చట్టాలను కఠినంగా అమలుచేసే కార్డినళ్లతో పోలిస్తే ఈయన భిన్నమైన వ్యక్తి. ఈయన స్వదేశం ఫిలిప్పీన్స్‌లో 80 శాతం జనాభా క్యాథలిక్‌లే. పైగా కార్డినళ్లలో ఐదుగురు ఫిలిప్పీన్ దేశస్తులున్నారు. దీంతో ఈయనకు సైతం మద్దతు పలికే లాబీ బలంగా ఉందని వార్తలొస్తున్నాయి.

రాబర్ట్ ప్రివోస్ట్




69 ఏళ్ల ప్రివోస్ట్ స్వస్థలం అమెరికాలోని షికాగో. రెండేళ్ల క్రితం తదుపరి బిషప్‌ల ఎన్నికల బాధ్యతలను ఇటీవల మార్క్ ఆలెట్‌ను పక్కనబెట్టిమరీ ప్రివోస్ట్‌కు పోప్ ఫ్రాన్సిస్ కట్టబెట్టారు. ఇలా ఫ్రాన్సిస్ నుంచి మన్ననలు పొందారు. పోప్‌గా ఎన్నికైతే ఆ పీఠాన్ని అధిరోహించిన తొలి అమెరికన్ కార్డినల్‌గా చరిత్రకెక్కుతారు.

పీటర్ కోడ్వో టర్క్‌సన్



76 ఏళ్ల టర్క్‌సన్ ఘనా దేశానికి చెందిన కార్డినల్. 22 ఏళ్ల క్రితం ఘనా నుంచి కార్డినల్ అయిన తొలి వ్యక్తిగా రికార్డ్ సృష్టించారు. గత 1,500 ఏళ్లలో ఆఫ్రికా ఖండం నుంచి ఎవరూ పోప్ బాధ్యతలు చేపట్టలేదు. ఈసారి ఈయనకు సైతం గెలుపు అవకాశాలున్నట్టు తెలుస్తోంది. స్వలింగ సంబంధాలను నేరంగా చూడకూడదని ఆయన వాదించేవారు. యూరప్‌లో ఇస్లాం మతవ్యాప్తి పెరగొచ్చని గతంలో ఆందోళన వ్యక్తం చేశారు.

ఫ్రిడోలిన్ ఆంబోంగో బెసుంగీ



65 ఏళ్ల ఫ్రిడోలిన్ ఆఫ్రికాలోని కాంగో దేశానికి చెందిన వ్యక్తి. ఆఫ్రికా నుంచి ఏటా లక్షల సంఖ్యలో క్రైస్తవ మతంలోకి మారుతున్న నేపథ్యంలో గెలుపు అవకాశాలు ఫ్రిడోలిన్‌కు సైతం మెండుగా ఉన్నట్లు సమాచారం. ఏడేళ్ల కిన్‌షారా ఆర్చ్‌బిషప్‌గా ఉన్న ఈయనను పోప్ ఫ్రాన్సిస్ కార్డినల్‌గా ఎంపికచేశారు. పాత సాంప్రదాయాలకు ఈయన పట్టంకడతారు. స్వలింగ వివాహాలకు ఈయన బద్ధ వ్యతిరేకి. '' క్రైస్తవుల్లో ప్రొటెస్టాంట్లను ప్రొటెస్టెంట్‌లుగానే ఉండనిద్దాం. ఇక ముస్లింను ముస్లింగానే బతకనిద్దాం'' అని గతంలో వ్యాఖ్యానించారు. ఈయన వ్యాఖ్యలు క్రైస్తవాన్ని బోధించే మతప్రచారకులకు ఇబ్బందికరంగా మారాయి.

మారియో గ్రెక్



68 ఏళ్ల మారియో మాల్టా దేశానికి చెందిన వ్యక్తి. క్యాథలిక్‌లలో అందరితో కలుపుకొని పోయే కార్డినల్‌కు అవకాశం ఇవ్వాలని భావిస్తే మొట్టమొదట వినిపించేది ఈయన పేరే. పోప్‌కు సలహాలు, సూచనలు ఇచ్చే సంఘమైన బిషప్ సైనోడ్‌కు ఆరేళ్ల క్రితమే ఈయన ప్రధాన కార్యదర్శిగా సేవలందించారు. అందరి సమ్మతితో నిర్ణయాలు తీసుకోవాలనేది ఈయన ఆలోచన.

పీటర్ ఎర్డో



72 ఏళ్ల ఎర్డో హంగేరీ దేశానికి చెందిన కార్డినల్. గత 21 ఏళ్లుగా కార్డినల్‌గా కొనసాగుతూ యూరప్‌లో చర్చి వర్గాల్లో అత్యంత కీలకమైన వ్యక్తిగా ఎదిగారు. 2006 నుంచి పదేళ్లపాటు యూరోపియన్ బిషప్‌ల మండలి సమావేశాలను విజయవంతంగా నిర్వహించారు. తొలుత బుడాపెస్ట్ ఆర్చ్‌బిషప్‌గా పనిచేశారు. అటు ఆఫ్రికన్ కార్డినళ్లతో, ఇటు యూరప్ కార్డినళ్లతో సత్సంబంధాలున్నాయి. పోప్ పదవికి గట్టి పోటీ ఇచ్చే వీలుంది.

- సాక్షి, నేషనల్ డెస్క్

పోప్ ఫ్రాన్సిస్, ఆయనకు ముందు పోప్‌గా ఉన్న బెనెడిక్ట్–16లను పోప్ పదవికి ఎన్నుకోవడానికి కార్డినళ్లకు కేవలం రెండు రోజుల సమయం పట్టింది. అయితే 1268 సంవత్సరంలో ఈ ప్రక్రియ ఎంతకీ తెమల్లేదు. దీంతో ఏకంగా 1,006 రోజులపాటు ఓటింగ్ జరిగి ఎట్టకేలకు 1271 సంవత్సరంలో పోప్‌ను ఎన్నుకున్నారు. చరిత్రలో అత్యంత సుదీర్ఘకాల ఎన్నిక ప్రక్రియ ఇదే.

సాక్షి హైదరాబాద్

బుధవారం ౹ 7 ౹ మే ౹ 2025



మంటల్లో పేదల గుడిసెలు

నాగోలు సాయినగర్ కాలనీ మంగళవారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దాదాపు 30 గుడిసెలు దగ్ధమయ్యాయి. -8లో



దిల్ 'మ్యాంగో' మోర్..

మామిడి సీజన్‌లో నగరవాసులు వెరైటీలు కోరుకుంటున్నారు నగరవాసులు. దీంతో రెస్టారెంట్స్, కేఫ్స్, పార్లర్స్.. మ్యాంగో మానియాతో ఊగిపోతున్నాయి. - సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
37.0/25.0

వాతావరణం

నగరంలో బుధవారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్టంగా 37, కనిష్టంగా 25 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.

హెచ్-న్యూకు అంతర్జాతీయ గుర్తింపు

- ఎక్సలెన్స్ ఇన్ యాంటీ నార్కోటిక్స్ అవార్డుకు ఎంపిక
- 15న దుబాయ్‌లో అందుకోనున్న సీపీ ఆనంద్

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో డ్రగ్స్ దందా, వినియోగానికి చెక్ చెప్పడానికి ఏర్పాటైన హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్‌కు (హెచ్-న్యూ) అంతర్జాతీయ గుర్తింపు లభించింది. వరల్డ్ పోలీసు సమ్మిట్ (డబ్ల్యూపీఎస్) 'ఎక్సలెన్స్ ఇన్ యాంటీ నార్కోటిక్స్' విభాగంలో నిర్వహించిన పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి అవార్డుకు ఎంపికైంది. ఈ నెల 13 నుంచి 15 వరకు దుబాయ్‌లో సమ్మిట్‌లో ఆఖరి రోజు నగర కొత్వాల్ సీపీ ఆనంద్ డబ్ల్యూపీఎస్ అవార్డును అందుకోనున్నారు. ఈ సమ్మిట్ సందర్భంగా 138 దేశాలకు చెందిన పోలీసు అధికారులు సమావేశం కానున్నారు. అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, జర్మనీ తదితర దేశాలకు సంబంధించిన పోలీసు ఏజెన్సీలు అనేక అంశాలను చర్చించనున్నాయి.

హైడ్రా వెబ్‌సైట్ సిద్ధం

- ఇందులో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ వివరాలు
- ఠాణాతో పాటు ఆవిష్కరించనున్న సీఎం



ఠాణా ప్రారంభోత్సవానికి రావాలంటూ మేయర్‌ను కలిసిన ఏవీ రంగనాథ్

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) అధికారిక వెబ్‌సైట్ సిద్ధమైంది. గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైడ్రా పోలీసు స్టేషన్‌తో పాటు వెబ్‌సైట్‌ను ఆవిష్కరించనున్నారు. అప్పటి నుంచే ఈ వెబ్‌సైట్ అందుబాటులోకి రానుంది. ఇందులో ఔటర్ రింగ్ రోడ్ పరిధిలో ఉన్న చెరువులు, కుంటల ఫుల్ ట్యాంక్ లెవల్, బఫర్ జోన్ తదితరాల వివరాలు ఉండనున్నాయి. భవిష్యత్తులో ప్రభుత్వ స్థలాలకు సంబంధించిన అంశాలను చేర్చనున్నారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ మంగళవారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని కలిశారు. హైడ్రా ఠాణా ప్రారంభోత్సవానికి రావాల్సిందిగా ఆహ్వానించారు. మరోపక్క సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం ప్రతి పోలీసు స్టేషన్ తాము నమోదు చేసిన కేసులకు సంబంధించిన ప్రాథమిక సమాచార నివేదికలను (ఎఫ్ఐఆర్) ఆన్‌లైన్‌లో ఉంచాలి. దీనికోసం రాష్ట్ర పోలీసు అధికారిక వెబ్‌సైట్‌లో ప్రత్యేక విభాగం ఉంది. అందులో జిల్లాల వారీగా పోలీసుస్టేషన్ల పేర్లు ఉంటాయి. గురువారం హైడ్రా ఠాణా ప్రారంభం కానున్న నేపథ్యంలో దీన్నీ ఆ ఎఫ్ఐఆర్‌ల విభాగంలో చేర్చారు. అందులో నగర కమిషనరేట్ తర్వాత హైడ్రా కనిపిస్తోంది.

కుత్బుల్లాపూర్ పరిధిలో కమిషనర్ పర్యటన



అధికారులతో మాట్లాడుతున్న ఆర్‌వీ కర్ణన్

కుత్బుల్లాపూర్: నియోజకవర్గ పరిధిలోని పలు అభివృద్ధి పనులను మంగళవారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ పరిశీలించారు. గాజుల రామారం సర్కిల్ పరిధిలోని టీఎస్ఐఐసీ కాలనీలో రూ.5 కోట్లతో చేపట్టిన మల్టీపర్పస్ బిల్డింగ్ పనులు ఎంత వరకు వచ్చాయని ఆరా తీశారు. దీనిని వెంటనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. సూరారం మల్లారెడ్డి ఆస్పత్రి వద్ద వర్షం పడిన ప్రతిసారీ నీరంతా రోడ్డుపై చేరి ట్రాఫిక్ జాం అవుతున్న విషయంపై అధికారులు కమిషనర్ దృష్టికి తీసుకు రాగా.. ఆర్కే ట్రాన్స్‌పోర్ట్ నుంచి కల్వర్టు నాలా వరకు వెంటనే పనులు ప్రారంభించాలని సూచించారు. రూ.5 కోట్లతో విడతల వారీగా నిధులు కేటాయించి చేపడుతున్న లాల్‌సాబ్ గూడ స్పోర్ట్స్ కాంప్లెక్స్ పనులపై ఆరా తీశారు. ఇలా చాలా ప్రాంతాల్లో పర్యటించిన ఆయన.. అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఆయన వెంట జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్, ఎస్ఈ చిన్నారెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కిష్టప్ప, ఉప కమిషనర్ మల్లారెడ్డి, ఇంజినీరింగ్ విభాగం అధికారులు రూపాదేవి, శిరీష తదితరులు ఉన్నారు.

సంధ్యా కన్వెన్షన్ మినీ హాల్, రెస్ట్ రూంల కూల్చివేత



హైడ్రా హడల్!

సంధ్యా కన్వెన్షన్‌లో కూల్చివేతలు

- అనుమతులకు మించి నిర్మాణాలు
- రెండు భారీ షెడ్లు నేలమట్టం
- మరిన్ని కట్టడాల వివరాల సేకరణ

గచ్చిబౌలి: సంధ్యా కన్వెన్షన్‌లో అక్రమ నిర్మాణాలపై హైడ్రా కొరడా ఝుళిపించింది. అనుమతులు లేని కట్టడాలను నేలమట్టం చేసింది. మంగళవారం ఉదయం నుంచి అధికారులు భారీ బందోబస్తు మధ్య రోజంతా కూల్చివేతలు జరిపారు. గచ్చిబౌలిలో సరనాల శ్రీధర్ రావు ఐదెకరాల విస్తీర్ణంలో 17 వేల చదరపు మీటర్ల అనుమతితో సంధ్యా కన్వెన్షన్ నిర్మాణం చేపట్టారు. దీనిని ఆనుకొని ఉన్న ఫర్టిలైజర్స్ కార్పొరేషన్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలోని కొన్ని ప్లాట్లను కొనుగోలు చేశారు. స్థలంలో కన్వెన్షన్‌ను ఆనుకొని రెండు షెడ్లను నిర్మించి కమర్షియల్‌గా వాడుకుంటున్నారు. రోడ్లను ఆక్రమించి ప్లాట్లు కనిపించకుండా నిర్మాణాలు చేపట్టారని ఫర్టిలైజర్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలోని ప్లాట్ల యజమానులు కొద్ది రోజులుగా హైడ్రాకు ఫిర్యాదు చేశారు. తమ ప్లాట్లు కనిపించడం లేదని, అనుమతులు లేకుండా విచ్చలవిడిగా శ్రీధర్ రావు నిర్మాణాలు చేపడుతున్నారని చెప్పారు. దీంతో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్.. సదరు నిర్మాణాలను కూల్చివేయాలని అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో సంధ్యా కనెవన్షన్‌కు కొనసాగింపుగా ఉన్నా బ్రైడల్ రూమ్‌లు, మినీ హాల్, రెస్ట్ రూమ్‌లను కూల్చి వేశారు.

మరో రెండు షెడ్లు సైతం..

గచ్చిబౌలి సర్వే నంబర్ 124, 125లలో దాదాపు 20 ఎకరాల విస్తీర్ణంలో ఫర్టిలైజర్స్ కార్పొరేషన్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ పేరిట లేఅవుట్ చేశారు. దాదాపు 162 ప్లాట్లను కొనుగోలు చేసిన యజమానులు కొన్నింటిని సంధ్యా కన్వెన్షన్ ఎండీ శ్రీధర్ రావుకు అమ్ముకున్నారు. మిగిలిన ప్లాట్లకు హద్దులు, రోడ్లు లేకపోవడంతో ఆ యజమానులు హైడ్రాను ఆశ్రయించారు. ఈ క్రమంలోను ఫర్టిలైజర్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లే అవుట్‌లో రెండు భారీ షెడ్లను నేలమట్టం చేశారు. సంధ్యా కన్వెన్షన్, మ్యాంగో ఫుడ్ పేరిట ఉన్న ఆర్చ్‌లను కూల్చివేశారు. కొన్ని ప్లాట్లను వేసిన సిమెంట్ రోడ్డును ధ్వంసం చేశారు. సొసైటీలోని యజమానుల నుంచి దాదాపు 100కు పైగా ప్లాట్లను సరనాల శ్రీధర్ రావు కొనుగోలు చేశారు. ప్లాట్లు కనిపించకుండా మట్టి, బండరాళ్లు వేసి, నిర్మాణాలు చేపట్టి, ఆ తర్వాత సదరు ప్లాట్లను తక్కువ ధరకు కొనుగోలు చేసినట్లు ఆయనపై ఆరోపణలు ఉన్నాయి. శ్రీధర్ రావుపై గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో కబ్జా యత్నం కేసులు నమోదై ఉన్నాయి.

మరిన్ని నిర్మాణాలపై ఆరా

నిర్మాణంలో ఉన్న రెండు షెడ్లను మాత్రమే అక్రమ నిర్మాణాలుగా తేల్చిన హైడ్రా అధికారులు మిగిలిన నిర్మాణాలు, యునాక్స్ అనే డ్రైవ్ ఇన్ వివరాలను సేకరిస్తున్నారు. సంధ్యా కన్వెన్షన్ ద్వారం వద్ద ఉన్న హోటల్, వెనక భాగంలో ఉన్న హార్ట్ కప్ అనుమతులను పరిశీలిస్తున్నట్లు హైడ్రా అధికారులు తెలిపారు. కాగా.. ఉన్నతాధికారుల నుంచి కింది స్థాయి అధికారుల వరకు శ్రీధర్ రావుకు సహకరించారనే ఆరోపణలు ఉన్నాయి. అనుమతులు లేని నిర్మాణాలకు శేరిలింగంపల్లి జీహెచ్‌ఎంసీ అధికారులు పూర్తి సహకారం అందించినట్లు విమర్శలున్నాయి.

శ్రీధర్‌రావుపై ఫిర్యాదుల వెల్లువ..

శ్రీధర్ రావుపై పలు పోలీసుస్టేషన్లలో 30 కేసులు నమోదైనట్లు సమాచారం. కాగా.. హైడ్రా కూల్చివేతల అనంతరం శ్రీధర్ రావు బాధితులు వివిధ మార్గాల్లో ఆయనపై ఫిర్యాదు చేస్తున్నట్లు హైడ్రా ప్రకటించింది. లేఅవుట్‌లోకి రాకుండా అడ్డుకున్నారని విదేశాల్లో ఉన్నవారు ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదులు చేస్తున్నారని పేర్కొంది. కొందరు బాధితులు వీడియోల రూపంతో తమ గోడు వెళ్లబోసుకుంటున్నారు. లేఅవుట్‌లో ప్లాట్ లేదని చెప్పడంతో తన భర్త ఆత్మహత్య చేసుకున్నారని ఢిల్లీ నుంచి ఓ మహిళ ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయడం గమనార్హం. ప్రభుత్వ భూములు, చెరువుల ఆక్రమణలపై పలువురు శ్రీధర్ రావుపై ఫిర్యాదులు చేస్తున్నారు.

15 ఎకరాల ప్రభుత్వ భూమికి విముక్తి

సుభాష్‌నగర్: కుత్బుల్లాపూర్ మండలం గాజుల రామారంలో కబ్జాకు గురైన 15 ఎకరాల భూమిని హైడ్రా స్వాధీనం చేసుకుంది. సర్వే నం.354లో ఉన్న ప్రభుత్వ భూమిలో ఆక్రమణల్ని మంగళవారం తొలగించింది. ఇందులో కేఎల్ యూనివర్సిటీ ఆక్రమించిన ఐదు ఎకరాల భూమి కూడా ఉంది. ఈ భూమిని 2009లో ప్రభుత్వం రాజీవ్‌స్వగృహ నిర్మాణాలకు కేటాయించింది. ఆ నిర్మాణాల కార్యరూపం దాల్చకపోవడంతో స్థానికంగా నాయకులుగా చలామణీ అవుతున్న కొందరి కన్ను ఈ భూమిపై పడింది. స్థలం చుట్టూ ప్రహరీలు నిర్మించిన వాళ్లు షెడ్లు వేసి ఆక్రమించారు. దీనిపై స్థానికుల నుంచి హైడ్రాకు ప్రజావాణి ద్వారా ఫిర్యాదులందడంతో హైడ్రా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రభుత్వ భూమిగా నిర్ధారించారు. ఈ మేరకు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు నివేదిక సమర్పించారు. ఆయన కూడా క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం ఆక్రమణలు తొలగింపునకు ఆదేశాలు జారీ చేశారు. ఆ ఆక్రమణలను మంగళవారం కూల్చేసిన అధికారులు అక్కడ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి హైడ్రా కాపాడిన ప్రభుత్వ భూమిగా బోర్డులు ఏర్పాటు చేశారు. కాటేదాన్‌లోనూ హైడ్రా మంగళవారం కూల్చివేతలు చేపట్టింది. ఇందిరా సొసైటీ కాలనీలోని రహదారులను ఆక్రమించి నిర్మించిన కట్టడాలను తొలగించింది. రహదారులను ఆక్రమించి లేఔట్లలోని ప్లాట్లను కబ్జా చేసిన వారి ప్రయత్నాలను అడ్డుకుంది.

మోడల్‌గా ఉస్మాన్‌నగర్ | జంట రిజర్వాయర్లు

స్మార్ట్ వాల్వ్ టెక్నాలజీతో వాల్వ్ నిర్వహణ

- సోలార్ పవర్‌తో లైట్లు, డ్రిప్ పద్ధతిలో గార్డెనింగ్
- త్వరలో ప్రారంభానికి సన్నాహాలు

సాక్షి, సిటీబ్యూరో: ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని గేటెడ్ కమ్యూనిటీలు, కాలనీలు, ,గ్రామాలకు తాగు నీటి సరఫరా చేసేందుకు చేపట్టిన ఓఆర్ఆర్ ప్రాజెక్టు ఫేజ్- 2 ప్యాకేజీ- 2లో భాగంగా ఉస్మాన్ నగర్‌లో నిర్మిస్తున్న 4 ఎంఎల్, 2 ఎంఎల్ సామర్థ్యం కలిగిన జంట రిజర్వాయర్ల ప్రారంభానికి జలమండలి సన్నద్ధమవుతోంది. ఇప్పటికే డిస్ట్రిబ్యూషన్ లైన్లు, రిజర్వాయర్ల నిర్మాణం, ఇన్‌లెట్, అవుట్ లెట్ నిర్మాణం పూర్తి కావడంతో ట్రయల్ రన్ నిర్వహించారు. ఇప్పటికే 22 కిలోమీటర్ల డిస్ట్రిబ్యూషన్ లైన్లను నిర్మించారు. ఎలక్ట్రికల్ పనులు, క్లోరిన్ రూం పనులు పూర్తి చేశారు. దాదాపు రూ.30 కోట్లతో నిర్మిస్తున్న ఈ రెండు జలాశయాలు అందుబాటులోకి వస్తే.. దాదాపు లక్ష జనాభాకు తాగునీరు అందుతుంది. ప్రస్తుతం 55 బహుళ అంతస్తు భవన సముదాయాలు బల్క్ కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్నాయి. మొత్తమ్మీద ఉస్మాన్‌నగర్ జంట రిజర్వాయర్లను మోడల్‌గా తీర్చిదిద్దుతున్నారు.

స్మార్ట్ వాల్వ్ టెక్నాలజీ వినియోగం

జంట రిజర్వాయర్ల పరిధిలో ప్రయోగాత్మకంగా డిస్ట్రిబ్యూషన్ పైపులైన్‌పై స్మార్ట్ వాల్వ్ టెక్నాలజీ వినియోగిస్తున్నారు. ఇంటర్‌నెట్ ఆధారిత కమ్యూనికేషన్‌తో ఆపరేట్ చేయనున్నారు. దీంతో వాల్వ్ ఆపరేషన్‌తో పాటు నీటి నాణ్యత, ప్రమాణం, క్లోరిన్ శాతం వివరాల్ని తెలుసుకోవచ్చు. ఈ స్మార్ట్ వాల్వ్ టెక్నాలజీ పూర్తిగా సోలార్ ఎనర్జీతో పని చేస్తోంది. బ్యాటరీ బ్యాకప్ సైతం ఉండటంతో.. నిర్వహణలో పవర్ సమస్యలు లేకుండా చర్యలు చేపట్టారు. ఈ విధానం ఇప్పటికే సనత్‌నగర్‌లో సమర్థంగా అమలవుతోంది. రిజర్వాయర్ నీటి మట్టం.. క్లోరిన్ శాతం తదితర వివరాల సమాచారం అందేలా ప్రధాన కార్యాలయంలోని డాష్‌బోర్డుకు అనుసంధానం చేయనున్నారు. ప్రయోగాత్మకంగా ఈ రిజర్వాయర్ల నుంచి సరఫరా చేస్తున్న ప్రతి నీటి చుక్కనూ లెక్క కట్టేలా ఫ్లోమీటర్‌ను ఏర్పాటు చేయనున్నారు.

సందర్శించిన జలమండలి ఎండీ

ఉస్మాన్‌నగర్ జంట రిజర్వాయర్లను మంగళవారం జలమండలి ఎండీ అశోక్ రెడ్డి సందర్శించారు. రిజర్వాయర్లలో పంప్ రూం, ఇన్‌లెట్, అవుట్ లెట్‌లను పరిశీలించారు. డిస్ట్రిబ్యూషన్ లైన్లను, కొత్త రిజర్వాయర్లతో లబ్ధి జరిగే ప్రాంతాల వివరాలను, కొత్త కనెక్షన్లు.. డొమెస్టిక్, బల్క్ కనెక్షన్లు తదితర అంశాలపై ఆరా తీశారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట జలమండలి పీఓ శ్రీధర్, జీఎం, డీజీఎంలు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు ఉన్నారు.



ఉస్మాన్‌నగర్ జంట రిజర్వాయర్లను పరిశీలించిన జలమండలి ఎండీ అశోక్ రెడ్డి





ఉస్మాన్‌నగర్‌లోని జంట రిజర్వాయర్లు

తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించేలా ఏర్పాట్లు

మిస్ వరల్డ్ పోటీలపై రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు



శంషాబాద్ విమానాశ్రయంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

శంషాబాద్: మిస్ వరల్డ్ పోటీలను పురస్కరించుకొని చేసే ఏర్పాట్లు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా ఉండాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనేందుకు వచ్చే అతిథులను తెలంగాణ సంప్రదాయ రీతిలో ఘనంగా ఆహ్వానించాలన్నారు. మిస్ వరల్డ్ పోటీలకు వివిధ దేశాల నుంచి వచ్చే ప్రతినిధులు, అతిథుల కోసం ఎయిర్‌పోర్టులో చేస్తున్న స్వాగత ఏర్పాట్లను మంత్రి జూపల్లి పరిశీలించారు. ఎయిర్‌పోర్టులోని ఇమిగ్రేషన్, కస్టమ్స్, సీఐఎస్ఎఫ్, జీఎంఆర్ అధికారులతో ఆయన సమీక్షించారు. ఇమిగ్రేషన్, కస్టమ్స్ క్లియరెన్స్ త్వరగా పూర్తి చేసే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. స్వాగత బృందాల సంఖ్యను పెంచాలని సూచించారు.

చారిత్రక కట్టడాలను సందర్శించండి..

తెలంగాణలోని చారిత్రక, వారసత్వ కట్టడాలను సందర్శించాలని మంత్రి జూపల్లి మిస్ ఇండియా నందిని గుప్తా, మిస్ మెక్సికో మార్లే లీల్ సర్వాంతేస్‌లకు సూచించారు. అప్పుడే వచ్చిన వారితో ఎయిర్‌పోర్టులో మంత్రి భేటీ అయ్యారు. అంతకుముందు పర్యాటక శాఖ ఆధ్వర్యంలో మిస్ ఇండియా, మిస్ మెక్సికోలకు సంప్రదాయబద్ధంగా ఘనంగా స్వాగతం పలికారు.

'బిల్డ్ నౌ'.. స్పీడ్ నౌ



హెచ్‌ఎండీఏలో 150 దరఖాస్తులు

- ఏ జాప్యం లేకుండా 'కీ' విడుదల
- క్షణాల్లోనే డాక్యుమెంట్లు, వివరాల నమోదు

ఏ పోర్టల్ ఎప్పుడు..	
డీపీఎంఎస్	2016
టీజీబీపాస్	2020
బిల్డ్ నౌ	2025

సాక్షి, సిటీబ్యూరో: భవన నిర్మాణాలు, లే అవుట్ల అనుమతుల ప్రక్రియను వేగంతం చేసేందుకు సరికొత్త సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన 'బిల్డ్ నౌ' సత్ఫలితాలనిస్తోంది. హెచ్‌ఎండీఏలో గత నెల 17న సాంకేతిక వ్యవస్థ అందుబాటులోకి వచ్చిన తర్వాత 150కి పైగా దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. దరఖాస్తుదారులకు ఎలాంటి సాంకేతిక ఇబ్బందులు తలెత్తకుండా డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేసే సదుపాయం ఈ విధానం ద్వారా ఉందన్నారు. నిర్మాణరంగ అనుమతుల కోసం వినియోగించిన టీజీబీపాస్‌కు ప్రత్యామ్నాయంగా బిల్డ్ నౌ ప్రవేశపెట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు వివిధ ప్రభుత్వ విభాగాల నుంచి సుమారు 2,013కుపైగా దరఖాస్తులు అందాయి. మొదట జీహెచ్‌ఎంసీలో దీనిని ప్రవేశపెట్టిన అనంతరం ఏప్రిల్‌లో హెచ్‌ఎండీఏకు విస్తరించారు. ప్రస్తుతం డీటీసీపీ పరిధిలోని అన్ని మున్సిపాలిటీల్లో దీన్ని అందుబాటులోకి తెచ్చారు.

ఆ ఇబ్బందులకు చెక్..

హెచ్‌ఎండీఏ పరిధిని ట్రిపుల్ ఆర్ వరకు విస్తరించిన నేపథ్యంలో బిల్డ్ నౌ మరింత ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. హైరైజ్ బిల్డింగ్‌లు, బహుళ అంతస్తుల భవనాలు, అపార్ట్‌మెంట్లు తదితర భవనాల నిర్మాణానికి అనుమతులను అందజేసే క్రమంలో నీటి పారుదల, రెవెన్యూ, అగ్నిమాపక శాఖ, మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ తదితర సంస్థల నుంచి క్లియరెన్స్ తప్పనిసరి. కానీ.. వివిధ విభాగాల మధ్య సమన్వయం కొరవడడంతో నిర్మాణరంగ సంస్థలు, బిల్డర్లు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. ప్రస్తుతం అలాంటి ఇబ్బందులు తొలగినట్లు అధికారులు చెప్పారు.

క్షణాల్లో అప్‌లోడ్..

- బహుళ అంతస్తుల డాక్యుమెంట్లు, మ్యాప్‌లు, డ్రాయింగ్‌లు వంటివి ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు టీజీబీపాస్ ద్వారా 20 రోజుల నుంచి 30 రోజుల సమయం పట్టేది. ప్రస్తుతం బిల్డ్ నౌ విధానం వల్ల కేవలం 5 నిమిషాల్లోనే దరఖాస్తు ప్రక్రియ పూర్తవుతోంది.
- ఖాజాగూడ సర్కిల్‌లోని 25 ఎకరాల స్థలంలో 12 రెసిడెన్షియల్స్ బ్లాక్స్ కోసం ఇటీవల బిల్డ్ నౌ పోర్టల్ ద్వారా కేవలం 5 నిమిషాల్లోనే స్క్రూటినీ ముగిసినట్లు అధికారులు తెలిపారు. ఇక్కడ ఒక్కొక్కటి 56 అంతస్తుల చొప్పున మొత్తం 8 లక్షల చదరపు మీటర్ల విస్తీర్ణంలో హైరైజ్ భవనాలను నిర్మించనున్నారు.
- 37 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించతలపెట్టిన మరో రెసిడెన్షియల్ బ్లాక్‌లు (ఒక్కొక్కటి 50 అంతస్తులు) స్క్రూటినీ చేసేందుకు 1.1 నిమిషాలే పట్టినట్లు హెచ్‌ఎండీఏ అధికారుల పరిశీలనలో వెల్లడైంది.
- అలాగే.. హెచ్‌ఎండీఏ అనుమతుల కోసం వచ్చిన మరో దరఖాస్తులో 1.5 కోట్ల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించనున్న 12 రెసిడెన్షియల్ భవనాలు, మరో 2 ఎమినిటీ బ్లాక్స్ కోసం 6.45 నిమిషాల సమయం పట్టింది.
- 27 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించనున్న 64 అంతస్తుల రెసిడెన్షియల్ బ్లాక్ కోసం 1.3 నిమిషాల సమయంలో స్క్రూటినీ ప్రక్రియ పూర్తి కావడం విశేషం.

కేవలం 3 రోజుల్లోనే 'కీ' పూర్తి



టీజీబీపాస్ ద్వారా 'కీ' రావడానికి నెల నుంచి 2 నెలల సమయం పట్టేది. ఇప్పుడు బిల్డ్ నౌ ద్వారా కేవలం 3 రోజుల్లో 'కీ' లభించింది. 6 నిమిషాల్లో డాక్యుమెంట్లు అప్‌లోడ్ చేయడంతో పాటు స్క్రూటినీ ముగిసింది. ఈ విధానం చాలా బాగుంది. – అంజి, ఆర్కిటెక్ట్

స్పీడ్ పెరిగింది



పోర్టల్ స్పీడ్ పెరిగింది. కేవలం 40 సెకన్లలోనే డాక్యుమెంటేషన్ పూర్తయింది. టీజీబీపాస్‌లో 'కీ' కోసం పడిగాపులు కాయాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ బాధ లేకుండాపోయింది. – కాశీరాం, స్ట్రక్చరల్ ఇంజినీర్

సిటీ బ్యూటీగా..

సర్వాంగ సుందరంగా నగరం

- మెరుస్తున్న రహదారులు
- విద్యుద్దీపాల వెలుగులు
- పాతబస్తీకి ప్రత్యేక సింగారాలు
- జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో ముస్తాబు
- మిస్ వరల్డ్ పోటీలతో ప్రత్యేక వాతావరణం

సాక్షి, సిటీబ్యూరో: మిస్ వరల్డ్ పోటీలకు నగరం కొత్త తళుకులు అద్దుకుంటోంది. దాదాపు 120 దేశాల సుందరీమణులతో పాటు ఎందరెందరో వస్తున్న తరుణంలో నగరంలో రహదారులు మెరవాలని, రాత్రుళ్లు విద్యుత్ ధగధగలతో సిటీ మెరిసిపోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించిన నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టింది. రోడ్లకు మరమ్మతులు, తుది మెరుగులతోపాటు డివైడర్లపై పేరుకుపోయిన దుమ్ము దులిపి రంగులు వేస్తున్నారు. లేన్ మార్కింగ్‌లతో పాటు కాలినడకల బాటలను రంగులతో ముస్తాబు చేస్తున్నారు. రోడ్లకిరువైపులా పచ్చదనం కనిపించేలా చర్యలు తీసుకుంటున్నారు. విమానాశ్రయం నుంచి మొదలు పెడితే, పోటీలను నిర్వహించే గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంకు వెళ్లే రహదారులను, అతిథులు బస చేసే హోటళ్ల మార్గాలను తీర్చిదిద్దుతున్నారు. ఫ్లై ఓవర్ల క్రాష్ బారియర్స్‌కు, జంక్షన్లు, రోడ్ల వెంబడి కెర్బ్‌లకు పెయింట్స్ వేస్తున్నారు. రాత్రుళ్లు ప్రత్యేకంగా కనిపించేందుకు వివిధ రకాల విద్యుల్లతలతో ఏర్పాట్లు చేస్తున్నారు. వివిధ జంక్షన్లు, పోటీదారులు సందర్శించే ప్రాంతాలకు వెళ్లే మార్గాల్లోనూ ప్రత్యేక అలంకరణలు చేస్తున్నారు.

50 మార్గాల్లో పనులు

- గ్రేటర్‌లోని దాదాపు 50 మార్గాలు ఈ పనులతో ప్రత్యేకంగా కనిపించనున్నాయి. సాధారణ రోజుల్లో జరగని పనులు ఈ సందర్భంగానైనా జరుగుతుండటంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలోనూ ఇవాంకా ట్రంప్ నగరానికి వచ్చిన సందర్భంగా పలు రోడ్లు అద్దాల్లా మారడాన్ని గుర్తు చేసుకుంటున్నారు.
- చార్మినార్, లాడ్‌బజార్, ఫలక్‌నుమా ప్యాలెస్, మదీనా, సిటీ కాలేజీ, నయాపూల్, ఆరాంఘర్, మాసాబ్‌ట్యాంక్, గన్‌పార్క్, రేతిబౌలి జంక్షన్, ఐమ్యాక్స్ సర్కిల్, నెక్లెస్ రోడ్, సెక్రటేరియట్, ట్యాంక్‌బండ్, తాజ్‌కృష్ణ, నాగార్జున సర్కిల్, కేబుల్ బ్రిడ్జి, ఓయూ కాలనీ క్రాస్‌రోడ్స్, ఐకియా జంక్షన్, టీహబ్, హైటెక్ సిటీ జంక్షన్, శిల్పారామం, బయో డైవర్సిటీ జంక్షన్, ఏఐజీ హాస్పిటల్ తదితర ప్రాంతాలు కొత్త అందాలు సంతరించుకోనున్నాయి.



నగరంలోని ఓ ప్రాంతంలో విద్యుద్దీపాలంకరణ

- స్పెషల్ డెకరేటివ్ లైటింగ్‌లో భాగంగా ఎల్‌ఈడీ పవర్ క్యాన్స్, స్ట్రిప్‌లైట్స్, సిరీస్ లైట్స్ తదితరమైనవి ఏర్పాటు చేయనున్నారు. ఆయా ప్రాంతాల్లో 300 మీటర్ల మేర ప్రత్యేక లాంతర్లతో స్ట్రీట్ లైటింగ్ ఏర్పాట్లు చేయనున్నారు. ఎంపిక చేసిన ప్రాంతాల్లో సెల్ఫీ పాయింట్ల ఆర్చ్‌లు ఏర్పాటు, ఎల్‌ఈడీలతో క్రౌన్, 'ఫెయిరీ క్వీన్' తదితరమైనవి ఏర్పాటు చేయనున్నారు.

చెత్తా చెదారం.. దోమలు లేకుండా

చెత్త కనిపించకుండా వీధులు శుభ్రం చేసే కార్యక్రమాలు పెంచుతున్నారు. దోమలు లేకుండా నిల్వ నీరు లేకుండా చూడటంతో పాటు యాంటీలార్వా ఆపరేషన్లు, ఫాగింగ్ ముమ్మరం చేశారు. రాత్రివేళ దోమలు కుట్టకుండా ప్రత్యేకంగా రెపెల్లెంట్ క్యాండిల్స్ తెప్పిస్తున్నారు. చార్మినార్– చౌమహల్లా ప్యాలెస్ మార్గంలో హెరిటేజ్ వాక్‌కు ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.

రోహింగ్యాలను వెనక్కి పంపండి

బాలాపూర్ పీఎస్ ఎదుట బీజేపీ నేతల ఆందోళన


బాలాపూర్ ఠాణా ఎదుట ఆందోళన చేపడుతున్న అందెల శ్రీరాములు యాదవ్ తదితరులు

పహాడీషరీఫ్: బాలాపూర్ మండలంలో అక్రమంగా నివాసం ఉంటున్న రోహింగ్యాలను వెంటనే వెనక్కు పంపాలని బీజేపీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన పార్టీ శ్రేణులతో కలిసి జల్‌పల్లి మున్సిపల్ పరిధి రాయల్ కాలనీలో నివాసం ఉంటున్న రోహింగ్యాల క్యాంప్‌లను పరిశీలించారు. వారు ఇక్కడికి ఎప్పుడొచ్చారు.. వారి వద్ద శరణార్థుల కార్డులున్నాయా.. అని పరిశీలించారు. అనంతరం బాలాపూర్ పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా అందెల మాట్లాడుతూ యూపీఏ సర్కార్ హయాంలో శరణార్థుల ముసుగులో వచ్చిన విదేశీయులు బాలాపూర్‌లో 20 వేల మంది వరకు ఉన్నారని, ఆధార్, ఓటర్ ఐడీలు అక్రమంగా సంపాదించి ఫోన్లు, సిమ్ కార్డులు, బైక్‌లు, కార్లు కొనుగోలు చేసి దర్జాగా ఉంటున్నారని మండిపడ్డారు. వీరికి అన్ని రకాల మౌలిక సదుపాయాలు ఎందుకు కల్పిస్తున్నారో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఉదయం 5 గంటలకే నిద్ర లేచే రోహింగ్యాలు హిందువుల బస్తీల్లో చెత్త సేకరించేవారీగా తిరుగుతూ, మన సమాచారాన్ని ఇతర దేశాలకు చేరవేస్తున్నారని ఆరోపించారు. 15 రోజుల్లో వీరిపై చర్యలు తీసుకునే ప్రయత్నం చేస్తామని మహేశ్వరం ఏసీపీ లక్ష్మీకాంతరెడ్డి హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ప్రభుత్వ భూములు కబ్జాచేస్తే చర్యలు

తహసీల్దార్ గౌతమ్‌కుమార్


ప్రభుత్వ భూమిలో వేసిన రోడ్డును తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

మొయినాబాద్: ప్రభుత్వ భూములు కబ్జాచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ గౌతమ్‌కుమార్ హెచ్చరించారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని చిలుకూరు, అజీజ్‌నగర్ రెవెన్యూలోని ప్రభుత్వ భూముల్లో నిర్మించిన అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు మంగళవారం తొలగించారు. చిలుకూరులోని సర్వే నంబర్ 457 ప్రభుత్వ శిఖం భూమిలో అక్రమంగా షెడ్ నిర్మించారు. ఓ ప్రైవేటు ఫాంహౌస్‌కు ప్రభుత్వ భూమిలో నుంచి రోడ్డు వేశారు. అదే విధంగా అజీజ్‌నగర్ రెవెన్యూలోని సర్వే నంబర్ 49 ప్రభుత్వ భూమిలో రెండు ఇళ్లు నిర్మించారు. మంగళవారం రెవెన్యూ అధికారులు అక్రమ నిర్మాణాలను జేసీబీ సహాయంతో తొలగించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. విలువైన ప్రభుత్వ భూములను అక్రమంగా కబ్జాచేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో ఎక్కడ ప్రభుత్వ భూమి కబ్జాకు గురైనా ప్రజలు రెవెన్యూ అధికారుల దృష్టికి తేవాలని సూచించారు. ప్రభుత్వ భూములను కాపాడుకోకపోతే భవిష్యత్తులో ప్రజల అవసరాలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడుతుందన్నారు. ప్రభుత్వ భూములను కబ్జాచేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐలు రోజ, రాజేశ్, సిబ్బంది బాలకృష్ణ, ఎల్లయ్య, భాస్కర్, వాటర్ వర్క్స్ సిబ్బంది రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఫేస్‘బుక్కయిన’ మహిళ!

ఫేస్‌బుక్ ఖాతా ద్వారా పరిచయమైన యువకుడు
- ఓయో రూమ్‌కు తీసుకువెళ్లి రహస్య వీడియోలు
- బెదిరింపులతో షీ–టీమ్స్‌ను ఆశ్రయించిన మహిళ
- చెక్ చెప్పిన అధికారులు, మూడు రోజుల జైలు



సాక్షి, సిటీబ్యూరో: ఫేస్‌బుక్ ద్వారా పరిచయమైన మహిళను వేధిస్తున్న యువకుడికి నగర షీ–టీమ్స్ బృందాలు చెక్ చెప్పాయి. ఇతడితో పాటు మరికొందరు పోకిరీలు, నిరాధార ఫిర్యాదులు చేస్తున్న యువతిని పట్టుకున్నట్లు డీసీపీ డాక్టర్ ఎన్‌జేపీ లావణ్య మంగళవారం తెలిపారు. నగరానికి చెందిన ఓ యువకుడు (30) ఫేస్‌బుక్ ద్వారా పరిచయమైన మహిళతో కొన్నాళ్లు స్నేహం చేశాడు. ఆపై ఇరువురూ కలిసి ఓయో రూమ్‌కు వెళ్లగా... సన్నిహితంగా ఉన్న ఫొటోలు, వీడియోలను రహస్య కెమెరాతో రికార్డు చేశాడు. ఆపై వాటిని బయటపెడతానంటూ ఆమెను బెదిరించడం మొదలుపెట్టాడు. అలా కాకుండా ఉండాలంటే తాను చెప్పినట్లు చేయాలంటూ మూడు ఆప్షన్లు ఇచ్చాడు. తాను కోరినప్పుడల్లా రావాలని, తనతో సన్నిహితంగా ఉండటానికి మరికొందరు మహిళలను ఏర్పాటు చేయాలని, రూ.లక్ష ఇవ్వాలని చెప్పిన యువకుడు వీటిలో ఏదో ఒకటి ఎంచుకోవాలని కోరారు. ఎట్టకేలకు ధైర్యం చేసిన ఆ మహిళ షీ–టీమ్స్‌ను ఆశ్రయిస్తూ తనకు ఉన్న నాలుగో ఆప్షన్ చూపింది. నిందితుడిని పట్టుకున్న బృందాలు అతడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచాయి. న్యాయమూర్తి అతగాడికి మూడు రోజుల సాధారణ జైలు శిక్ష విధించారు.

- బేగంపేటకు చెందిన ఓ యువతి తన సహోద్యోగులతో కలిసి ఓ వేడుక చేసుకున్నారు. దీన్ని వారికి తెలియకుండా పక్క ఇంట్లో ఉండే ప్లంబర్ (34) రికార్డు చేశాడు. మర్నాడు ఆ వీడియోలు చూపిస్తూ మహిళలను బెదిరించడం మొదలెట్టాడు. తనతో సన్నిహితంగా ఉండాలని లేదంటే ఆ వీడియోలు ఆన్‌లైన్‌లో పెడతానని వేధించాడు. బాధితురాలి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన షీ–టీమ్స్ నిందితుడిని పట్టుకుని కోర్టులో హాజరుపరిచాయి. న్యాయస్థానం అతడిని నాలుగు రోజుల సాధారణ జైలు శిక్ష విధించింది.

– సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలో నివసించే యువతి ఇటీవల ప్రజావాణిలో ఓ ఫిర్యాదు చేశారు. ఓ గుర్తుతెలియని వ్యక్తి తనపై లైంగికదాడి చేశారని అందులో పేర్కొన్నారు. ప్రజావాణి నుంచి ఈ ఫిర్యాదు షీ–టీమ్స్‌కు రాగా.. అధికారులు బాధితురాలిని సంప్రదించి గోపాలపురం ఠాణాకు తీసుకువెళ్లారు. కేసు నమోదు చేసిన అధికారులు లోతుగా దర్యాప్తు చేశారు. ఈ నేపథ్యంలోనే ఆమె చేస్తున్న దందా వెలుగులోకి వచ్చింది. పోలీసులనే టార్గెట్‌గా చేసుకుంటున్న ఈ యువతి వివిధ కారణాలు చెప్తూ వారి ఫోన్లు తీసుకుంటుంది. వాటి ద్వారా అశ్లీల చిత్రాలను తన నెంబర్‌కు ఫార్వర్డ్ చేసుకుంటుంది. వీటిని చూపిస్తూ ఆ పోలీసులనే బెదిరించి డబ్బు డిమాండ్ చేస్తుంది. ఈ విషయం వెలుగులోకి రావడంతో ప్రజావాణిలో తప్పుడు ఫిర్యాదు చేసిన ఆరోపణలపై పోలీసులు ఆమెపై కేసు నమోదు చేశారు.

- ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించే జీహెచ్ఎంసీ వాహనం డ్రైవర్ ఓ మహిళను వేధించారు. చెత్త వెయ్యడానికి వచ్చే ఆమెను చూస్తూ అభ్యంతరకర, అశ్లీల పనులు చేసేవాడు. దీనిపై బాధితురాలు షీ–టీమ్స్‌లో ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా డెకాయ్ ఆపరేషన్ చేసిన అధికారులు సదరు డ్రైవర్‌ను పట్టుకుని కోర్టులో హాజరుపరిచాయి. న్యాయస్థానం అతడికి నాలుగు రోజుల సాధారణ జైలు శిక్ష విధించింది.
- బాలికలను ప్రేమ పేరుతో ట్రాప్ చేసి, ఆపై బెదిరింపులకు దిగుతున్న ముగ్గురిని పట్టుకున్న షీ–టీమ్స్ వారిపై పోక్సో యాక్ట్ కింద కేసులు నమోదు చేయించాయి. ఛత్రినాక, జూబ్లీహిల్స్, మాదన్నపేటలకు చెందిన యువకులు బాలికల్ని ప్రేమ పేరుతో ట్రాప్ చేశారు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి లోబరుచుకున్నారు. ఆపై డబ్బు కోసమో, తనతో సన్నిహితంగా ఉండాలనో బ్లాక్‌మెయిల్ చేశారు. దీనిపై ఫిర్యాదులు అందుకున్న షీ–టీమ్స్ నిందితులపై సంబంధిత ఠాణాల్లో పోక్సో కేసులు నమోదు చేయించాయి. మరోపక్క బహిరంగ ప్రదేశాల్లో మహిళలు, యువతుల్ని వేధిస్తున్న 49 మంది పోకిరీలను షీ–టీమ్స్ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నాయి.

టీజీఓ నేతలను కలిసిన జలమండలి డైరెక్టర్


జలమండలి డైరెక్టర్ అబ్దుల్ ఖాదర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

సాక్షి, సిటీబ్యూరో: ఇటీవల జలమండలి డైరెక్టర్ (పర్సనల్)గా బాధ్యతలు చేపట్టిన మహమ్మద్ అబ్దుల్ ఖాదర్ మంగళవారం మర్యాదపూర్వకంగా టీజీఓ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఏలూరి శ్రీనివాస రావు, సత్యనారాయణలను కలిశారు. ఈ సందర్భంగా హైదరాబాద్ జిల్లా కార్యాలయంలో వారు ఆయనను పూలమాలలతో సత్కరించారు. ప్రభుత్వ ఉద్యోగులు, సంఘాల హక్కుల విషయంలో రాజీలేని పోరాటం చేయడాన్ని అభినందించారు.

ఇంజెక్షన్ వికటించి మహిళ మృతి

డయాగ్నోస్టిక్ సెంటర్‌లో ఘటన

కేపీహెచ్‌బీకాలనీ: స్కానింగ్ కోసం వచ్చిన మహిళకు ఎక్కువ మోతాదు ఇంజెక్షన్ ఇవ్వడంతో గుండెపోటుకు గురై మృతి చెందిన సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఖాజాగూడకు చెందిన శిష్టాల సూర్యలక్ష్మి (66) కొంతకాలంగా ముక్కుకు సంబంధించిన అనారోగ్యంతో బాధపడుతున్నారు. డాక్టర్లను సంప్రదించగా ముక్కుకు సి.టి స్కాన్ చేయించుకొని రావాల్సిందిగా సూచించారు. సూర్యలక్ష్మి కుమారుడు వెంకట అభిషేక్‌తో కలిసి మంగళవారం కేపీహెచ్‌బీకాలనీ, 4వ రోడ్డులోని మెడ్‌క్వెస్ట్ డయాగ్నొస్టిక్ సెంటర్‌కు స్కానింగ్ కోసం వచ్చారు. ఈ క్రమంలో స్కానింగ్ క్లియర్‌గా వచ్చేందుకు ఇచ్చే కాంట్రాస్ట్ ఇంజెక్షన్‌ను సూర్యలక్ష్మికి అక్కడి వైద్యులు ఇచ్చారు. దీంతో వెంటనే ఆమె గుండెపోటుకు గురై అపస్మారక స్థితిలోకి వెళ్లింది. హుటాహుటిన సమీపంలోని ఆసుపత్రికి తరలించగా ఆమె అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. దీంతో మెడ్‌క్వెస్ట్ డయాగ్నొస్టిక్ సెంటర్ సిబ్బంది అజాగ్రత్త, నిర్లక్ష్యంతోనే తన తల్లి మృతి చెందిందని ఆందోళన వ్యక్తం చేశారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మృతురాలి కుమారుడు అభిషేక్ కేపీహెచ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌ను ఢీకొన్న లారీ: కూలీ మృతి

శంషాబాద్ రూరల్: కూలి పనికి వెళ్తూ ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మండలంలోని నర్కూడ శివారులో మంగళవారం బైక్‌ను రెడీమిక్స్ లారీ ఢీకొనడంతో ఈ సంఘటన చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మొయినాబాద్ మండలం నాగిరెడ్డిగూడ వాసి గంగపాక అర్జున్ (50) ఉదయం పని కోసం బైక్‌పై శంషాబాద్ వెళ్తున్నాడు. నర్కూడ చేరుకోగానే ఎదురుగా వచ్చిన రెడీ మిక్స్ లారీ ఇతని బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో అర్జున్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమ విఫలమై..

జీడిమెట్ల: ప్రేమ విఫలమై ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్స్‌పెక్టర్ గడ్డం మల్లేష్ వివరాల ప్రకారం..కుత్బుల్లాపూర్ చెరుకుపల్లి కాలనీకి చెందిన ఇస్తార్ రాణి కుమారుడు డానియేల్ (19) ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. కాగా సోమవారం డానియేల్ తల్లి శుభకార్యం నిమిత్తం బయటకు వెళ్లి తిరిగి మంగళవారం ఉదయం 6 గంటలకు ఇంటికి వచ్చింది. తలుపులు లోపలి నుండి గడియపెట్టి ఉండటంతో డానియేల్‌ను పిలవగా ఎంతకూ తలుపులు తీయలేదు. దీంతో అనుమానం వచ్చి వెంటిలేటర్ నుండి చూడగా డానియేల్ చున్నీతో ఉరి వేసుకుని వేలాడుతూ ఉన్నాడు. చుట్టు పక్కల వారి సహాయంతో తలుపులు తెరచి చూడగా అప్పటికే డానియేల్ మృతిచెంది ఉన్నాడు. మృతుడు ఇన్‌స్టాలో పరిచయమైన అమ్మాయితో తరచూ మాట్లాడే వాడని, ప్రేమ విఫలమై చనిపోయి ఉండవచ్చని మృతుని తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని మూడేళ్ల బాలుడి మృతి


మృతి చెందిన బాలుడు అనిల్ కుమార్

నిజాంపేట్: కారు ఢీ కొని మూడేళ్ల బాలుడు మృతి చెందిన సంఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం రాజుగోపాలం గ్రామానికి చెందిన సూరి బాబు దంపతులు మూడు నెలల క్రితమే జీవనోపాధి కోసం నగరానికి వచ్చారు. ప్రశాంతి హిల్స్ రోడ్ నెంబర్ 1, మధురానగర్‌లో నివాసం ఉంటూ..వెంకట సాయి ప్లాజా అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. మంగళవారం సాయంత్రం సూరిబాబు కుమారుడు అనిల్‌కుమార్ (3) మధురానగర్ ఎక్స్ రోడ్డు వద్ద నుంచి వెళ్తుండగా ఓ కారు ఢీ కొట్టింది. వెంటనే డ్రైవర్ శ్రీనివాస్ అతన్ని ప్రసాద్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మరణించాడు. ఈ మేరకు బాచుపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అపార్ట్‌మెంట్ సమీపంలో ఉన్న పానిపూరి బండి వద్దకు వెళ్తుండగా ఈ ప్రమాదం సంభవించినట్లు సమాచారం.

‘ప్రేమ’ వేధింపులకు బాలిక బలి

- ఉరేసుకుని 14 ఏళ్ల బాలిక ఆత్మహత్య
- పోలీసులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని తండ్రి ఆరోపణ

హయత్‌నగర్: తనను ప్రేమించాలంటూ ఓ యువకుడు ఓ మైనర్ బాలికను పలు రకాలుగా వేధించాడు. చివరకు అంతు చూస్తానని బెదిరించాడు. విషయం తల్లిదండ్రులకు చెప్పినా, పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన బాలిక ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన విషాద సంఘటన మంగళవారం హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం..హయత్‌నగర్ డివిజన్‌లోని రంగనాయకుల గుట్టకు చెందిన కనిగిరి విజయ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆయనకు భార్య తిరుపతమ్మ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. రెండవ కూతురు మీనాక్షి (14) హయత్‌నగర్‌లోని జిల్లా పరిషత్ పాఠశాలలో 9వ తరగతి పూర్తి చేసింది. ఆరు నెలల క్రితం మీనాక్షి ఇంటి పక్కన ఉన్న పార్కుకు వెళ్లగా...పక్క కాలనీలో నివసించే పానుబోతు స్వామి కొడుకు రోహిత్ (18) వచ్చి తనను ప్రేమించమని మీనాక్షిని అడిగాడు. ఆమె అదేరోజు విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. మరునాడు తండ్రి, అతని సోదరుడు మొగులయ్యలు స్వామి ఇంటికి వెళ్లి రోహిత్ ప్రవర్తన గురించి చెప్పగా..స్వామి కుమారుడిని మందలించి మళ్లీ తన కుమారుడు మీ కూతురు జోలికి రాకుండా చూస్తానని హామీ ఇచ్చాడు. అనంతరం రోహిత్ తమ్ముడు నూతన్ ఇన్‌స్టాగ్రాం అకౌంట్ ద్వారా మీనాక్షికి వీడియో కాల్స్, ఎస్ఎంఎస్‌లు పంపిస్తున్నాడు. ఈ విషయాన్ని బాలిక తండ్రి విజయ్ యువకుడి తండ్రి స్వామికి ఫోన్ చేసి చెప్పాడు. తాను ఊరిలో లేనని చెప్పి ఊరుకున్నాడు. అయినా రోహిత్ తన వేధింపులు ఆపలేదు. గత ఆదివారం ‘ఐ లవ్‌యూ’ అంటూ ఎస్ఎంఎస్ పెట్టాడు. దీంతో బాలిక తండ్రి విజయ్ హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అదే రోజు సాయంత్రం బంధువు ఒకరు చనిపోయినట్లు తెలియడంతో పిల్లల్ని ఇంటి వద్దనే ఉంచి విజయ్ ఆయన భార్య మహబూబ్‌నగర్ జిల్లా మానాజీపేట్‌కు వెళ్లారు. మరునాడు విజయ్ ఇంటికి వచ్చిన రోహిత్ తనను ప్రేమించకపోతే నీ అంతు చూస్తానని మీనాక్షిని బెదిరించి వెళ్లాడు. రాత్రి సమయంలో ఇంటికి వచ్చిన తల్లిదండ్రులకు బాలిక ఈ విషయాన్ని చెప్పింది. బుధవారం మాట్లాడుదామని అందరూ నిద్రకు ఉపక్రమించారు. అదే సమయంలో మీనాక్షి ఇంట్లోని కిరాణా షాపులో పైకప్పు రాడ్డుకు చున్నీతో ఉరేసుకుని మృతి చెందింది. తెల్లవారుజామున తల్లి లేచి చూడగా కుమార్తె ఉరేసుకుని వేలాడుతూ కనిపించింది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల నిర్లక్ష్యమే నా కుమార్తె ప్రాణం తీసింది...

తాను ఈ నెల 4వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశానని, వెంటనే వారు స్పందించక పోవడం వల్లనే నిందితుడు తన ఇంటికి వచ్చి బెదిరించాడని బాలిక తండ్రి విజయ్ ఆరోపించారు. నిందితుడు గంజాయి సేవిస్తూ జులాయిగా తిరుగుతాడని, అతని కారణంగానే తన కూతురు బలైందని వాపోయాడు. కాగా నిందితుడు రోహిత్, అతని సోదరుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

మంటల్లో పేదల గుడిసెలు

నాగోలు సాయినగర్ కాలనీలో భారీ అగ్నిప్రమాదం

- విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఎగసిపడిన మంటలు
- బాధితుల కళ్ల ముందే కాలిపోయిన 30 గుడిసెలు
- సర్వం కోల్పోయిన బాధితులు


నాగోలు సాయినగర్ కాలనీలో దగ్ధమవుతున్న గుడిసెలు


పట్టా సర్టిఫికెట్లు, బ్యాంక్ పాస్‌బుక్ కాలిపోవడంతో విలపిస్తున్న మహిళ

నాగోలు: నాగోలు సాయినగర్ కాలనీ సర్వేనెంబర్ 96/1లోని ప్రభుత్వ భూమిలో పేద ప్రజలు గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్న ప్రాంతంలో మంగళవారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి వ్యాపించడంతో దాదాపు 30 గుడిసెలు దగ్ధమయ్యాయి. బాధితులు సర్వం కోల్పోవడంతో భారీగా ఆస్తి నష్టం సంభవించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇక్కడ రాకేష్, దీపిక దంపతులు ఉంటున్న గుడిసె పైనుంచి విద్యుత్ వైర్ల లైను ఉంది. మంగళవారం ఉదయం 11:15 నిమిషాల సమయంలో ఇక్కడ మొదట షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. వెంటనే గమనించిన స్థానికులు, ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులు అక్కడ నుండి ప్రాణ భయంతో బయట పడ్డారు. ఈ లోగా గుడిసెలో మంటలు పూర్తిగా వ్యాప్తి చెంది అక్కడే ఉన్న గ్యాస్ సిలిండర్ పేలడంతో మిగతా గుడిసెలకు మంటలు అంటుకున్నాయి. మంటలు అంతకంతకు పెరగడంతో స్థానికులు నాగోలు పోలీస్‌లకు, ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అయితే వారు అక్కడికి చేరుకునే లోపే చాలా గుడిసెలు దగ్ధమయ్యాయి. పలు ఇళ్లలోని సిలిండర్లు పేలి..ఎగిరిపడ్డాయి. అగ్నిమాపక సిబ్బంది, ఆర్ఆర్ఎఫ్, ఎల్‌బీనగర్ జోన్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్ల నుండి పోలీసులు తరలివచ్చి మొదట గుడిసెల్లో చిక్కుకున్న వారిని బయటకు తరలించారు. దాదాపు గంటన్నరపాటు శ్రమించి మంటలు ఆర్పేశారు. అప్పటికే ఇళ్లల్లోని సామాన్లు పూర్తిగా కాలిపోయాయి. గృహోపకరణాలతోపాటు ఇంట్లో దాచి ఉంచిన నగదు, పిల్లల సర్టిఫికెట్లు, ఇతర విలువైన పత్రాలు, బియ్యం సంచులు, ఇతర వస్తువులన్నీ కాలిబూడిదయ్యాయని బాధితులు కన్నీరుమున్నీరయ్యారు. పెళ్లి కోసం దాచుకున్న డబ్బులు, బంగారం కూడా కాలిపోయిందని ఓ మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. ఉండడానికి నీడ లేక, తినడానికి తిండిలేక రోడ్డున పడ్డామని విలపించారు. కాగా 2012లో మార్చి నెలలో కూడా సాయినగర్ గడిసెల్లో జరిగిన ప్రమాదంలో 450 గుడిసెలు పూర్తిగా కాలిపోయాయి. అప్పట్లో ఓ చిన్నారి మృతి చెందగా, మరో ముగ్గురు గాయాలతో బయట పడ్డారు. అగ్నిప్రమాదం గురించి తెలియగానే స్థానిక ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్, టీ పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ తదితరులు సంఘటన స్థలాన్ని సందర్శించి బాధితులను పరామర్శించారు. వారిని ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.


మంటలు అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది


బయటపడిన గ్యాస్ సిలిండర్లు

ఎర్రగడ్డ రైతుబజార్ కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: కిలో టమాటా రూ.13, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 35, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 35, క్యాప్సికం 45, పచ్చికాకరకాయ 35, పందిరిబీర 35, క్యాబేజీ 09, క్యారెట్ 21, దొండకాయ 28, గుండు బీన్నీస్ 85, గింజచిక్కుడు 45, గోకరకాయ 35, కీర 28, దోసకాయ 18, బీట్‌రూట్ 19, ఉల్లిగడ్డ 14, ఆలుగడ్డ 25, చామగడ్డ 35, మొరంగడ్డ 15, కందగడ్డ 75, క్యాలీఫ్లవర్ 23, సొరకాయ 07, పొట్లకాయ 18, అరటికాయ 09, మునగకాయ 4, మామిడికాయ 35, ముల్లంగి 4–5, ఉల్లిపొరక 35 ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకూ అందుబాటులో ఉంటాయి.

9న విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

బంజారాహిల్స్: విద్యుత్ సమస్యల పరిష్కారానికి కన్జ్యూమర్ గ్రీవెన్సెస్ సమావేశం ఈ నెల 9న ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 వరకు నిర్వహిస్తున్నట్లు టీజీఎస్‌పీడీసీఎల్ బంజారాహిల్స్ సబ్ డివిజన్ ఏడీఈ జి.రమేష్ తెలిపారు. సమావేశానికి సీజీఆర్ఎస్ చైర్‌పర్సన్, టెక్నికల్ సభ్యులు, ఫైనాన్స్ సభ్యులు, విద్యుత్ వినియోగదారుల సభ్యులు హాజరవుతారన్నారు. వినియోగదారులు దీర్ఘకాలికంగా ఉన్న విద్యుత్ సమస్యలతో పాటు బిల్లుల్లో హెచ్చు తగ్గుల విషయంపై కూడా ఫిర్యాదు చేసి పరిష్కారం చేసుకోవచ్చు. అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఏసీపీకి రియల్ హీరో అవార్డు



బంజారాహిల్స్: తెలంగాణ పోలీస్ రియల్ హీరో జీ అవార్డ్స్–2025లో భాగంగా సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో వెస్ట్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్‌కు సీఎం రేవంత్‌రెడ్డి రియల్ హీరో అవార్డు అందజేశారు.

మల్లేష్‌గౌడ్‌కు శ్రమశక్తి పురస్కారం



హిమాయత్‌నగర్: మేడే సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంస్థ ఐఎన్‌టీయూసీ, ఆటో విభాగంలో 20 ఏళ్లుగా సేవలు అందిస్తున్నందుకు ప్రైవేటు ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోదా మల్లేష్‌గౌడ్ శ్రమశక్తి పురస్కారం అందుకున్నారు.

కండక్టర్ కుమారుడుకి అథ్లెటిక్స్‌లో మొదటి స్థానం

అభినందించిన డిపో మేనేజర్



మూసాపేట: కూకట్‌పల్లి డిపోకు చెందిన కండక్టర్ బి. మోహన్ కుమారుడు బానోత్ అకిరానందన్ మొరాకో దేశంలో జరిగిన అంతర్జాతీయ పారా అథ్లెటిక్స్ 400 మీటర్ల పరుగు పందంలో మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం డిపో మేనేజర్ హరి అకిరానందన్‌ను సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ శ్రీలత, డిపో ఉద్యోగులు పాల్గొన్నారు.

అక్రమ వలసదారులపై చర్యలు తీసుకోవాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కూకట్‌పల్లి: వీసా గడువు ముగిసినా దేశంలో ఉన్న అక్రమ వలసదారులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ కూకట్‌పల్లి అసెంబ్లీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత ప్రభుత్వానికి, త్రివిధ దళాలకు భారత పౌరులుగా మనమంతా సహకరించాలన్నారు. అక్రమంగా దేశంలో ఉంటున్న పాకిస్థాన్, బంగ్లాదేశ్ తదితరులను దేశం విడిచి వెళ్లేలా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వినోద్‌కుమార్‌గౌడ్, పవన్, గోపి, సోమశేఖర్, భగవంత్, రవి, రమేష్, రాములు, కోటేశ్వరరావు, లహరి, సూరి, ప్రేమ్, వెంకటరమణ పాల్గొన్నారు.

పేదల కలలు సాకారమయ్యేలా..

- గురుబ్రహ్మనగర్, దుర్గాభవానీ నగర్‌లలో ఇందిరమ్మ ఇళ్లు
- ప్రతిపాదనలు రూపొందిస్తున్న అధికారులు
- బస్తీల్లో పర్యటించిన బృందాలు





జూబ్లీహిల్స్ గురుబ్రహ్మనగర్‌లో పర్యటిస్తున్న రెవెన్యూ, హౌసింగ్ అధికారులు



బంజారాహిల్స్: అగ్గిపెట్టెలాంటి ఇళ్లు, రేకుల షెడ్లలో నివాసం ఉంటున్న పేదల అవస్థలు వర్ణనాతీతం. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పేదల సొంతింటి కల సాకారమయ్యే సంకేతాలు వస్తున్నాయి. ఇందిరమ్మ ఇళ్లు నిర్మించేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చింది. ఇందుకోసం ఇందిరమ్మ మోడల్ కాలనీ నిర్మాణం కోసం షేక్‌పేట మండలం జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని రెండు బస్తీలను ఎంపిక చేశారు. జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్–52లోని నందగిరిహిల్స్‌ను ఆనుకుని ఉన్న గురుబ్రహ్మనగర్ బస్తీలో, జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్–7లోని దుర్గాభవానీనగర్ బస్తీలోనూ ఇందిరమ్మ మోడల్ కాలనీలను నిర్మించేందుకు అధికారులు ప్రతిపాదనలు రూపొందిస్తున్నారు. షేక్‌పేట మండల తహసీల్దార్ అనితారెడ్డి, హౌసింగ్ ఎస్ఈ విజయ్‌కుమార్‌తో పాటు సంబంధిత అధికారుల బృందం మంగళవారం ఈ రెండు బస్తీలను క్షేత్రస్థాయిలో పర్యటించి ఇక్కడి సౌకర్యాలపై ఆరా తీసింది.

- గురుబ్రహ్మనగర్ బస్తీ రెండు ఎకరాల పైచిలుకు విస్తీర్ణంలో వ్యాపించి ఉంది. ఇక్కడ 275 మంది పేదలు గుడిసెలు వేసుకుని మూడు దశాబ్దాల నుంచి నివాసం ఉంటున్నారు. 192 మందికి గతంలోనే పొజిషన్ సర్టిఫికెట్లు ఇచ్చారు. ప్రస్తుతం నివసిస్తున్న 275 మంది గుడిసెలవాసులకు ఇందిరమ్మ మోడల్‌కాలనీలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించేందుకు ప్రతిపాదనలు రూపొందిస్తున్నారు.
- జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్–7లోని దుర్గాభవానీ నగర్ బస్తీ ఎకరం విస్తీర్ణంలో వ్యాపించి ఉండగా ఇక్కడ మూడు దశాబ్దాలుగా 150 కుటుంబాలు గుడిసెలు వేసుకుని బతుకుతున్నాయి. వీరికి కూడా ఇందిరమ్మ మోడల్‌కాలనీలో ఇళ్లు నిర్మించాలని అధికారులు ప్రతిపాదిస్తున్నారు.
- ఇందిరమ్మ మోడల్‌కాలనీ నిర్మాణానికి బస్తీలు మాత్రమే అర్హత కలిగినవిగా గుర్తించారు. గుడిసెలు ఉండి ఎలాంటి సౌకర్యాలకు నోచుకోకుండా దశాబ్దాలుగా ఇబ్బందులు పడుతున్న బడుగులను ఈ పథకంలో చేర్చారు.
- జీ ప్లస్ 3 ఇందిరమ్మ ఇళ్లను నిర్మించనున్నారు.
- ఇవన్నీ డబుల్ బెడ్‌రూమ్ తరహాలోనే నిర్మిస్తారు.
- తాగునీరు, కరెంటు సౌకర్యం, రోడ్లు, కమ్యూనిటీ హాళ్లు, పాఠశాలలు.. ఇక్కడ ఇవేవీ లేవు. ఏళ్ల తరబడి ఇబ్బందులు పడుతున్న ఈ బస్తీలను అధికారులు ఎంపిక చేశారు.
- ఈ రెండు బస్తీల్లో ఒకదానిని గుర్తిస్తారా? అధికారులు పంపించిన ప్రపోజల్స్‌లో రెండింటినీ చేరుస్తారా? అన్నది త్వరలో తేలనుంది.
- ఈ రెండు బస్తీ ప్రజల్లో ఇందిరమ్మ మోడల్ కాలనీకి ఆసక్తిగా ఉన్నారా? లేదా? అని కూడా అడిగి తెలుసుకోగా తాము ఈ పథకానికి ఆసక్తిగా ఉన్నామని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.
- త్వరలోనే ఇందుకు సంబంధించిన డిజైన్ రూపొందించి అంచనాలు తయారు చేయాలని హౌసింగ్ అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి.
- ఇళ్ల నిర్మాణం కోసం ప్రత్యేకంగా నిధులు కూడా మంజూరు చేయనున్నారు.
- నిర్మాణం సమయంలో గుడిసెలు ఖాళీ చేసి మరో ప్రాంతానికి వెళ్లాల్సి ఉంటుందని, నిర్మాణాలు పూర్తయిన తర్వాత తిరిగి ఇళ్లలోకి రావాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు.
- ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధి కిందికి వచ్చే జూబ్లీహిల్స్ డివిజన్‌లోని ఈ రెండు బస్తీల్లోనే అధికారులు పర్యటించి ప్రతిపాదనలు రూపొందించగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసానికి దగ్గరలోనే ఈ రెండు బస్తీలు ఉండటం గమనార్హం.
- తమ బస్తీని ఇందిరమ్మ మోడల్ కాలనీకి ఎంపిక చేయడంపై గురుబ్రహ్మనగర్ బస్తీ అధ్యక్షుడు గోపాల్‌నాయక్ హర్షం వ్యక్తం చేశారు. త్వరితగతిన నిర్మాణాలు ప్రారంభించి పూర్తి చేయాలన్నారు. ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్న 275 మంది పేద ప్రజల జీవితాల్లో సంతోషం నింపిందని వెల్లడించారు. ప్రభుత్వానికి ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

స్వచ్ఛతపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలి

డీఎంసీ సమ్మయ్య



ఇందిరానగర్‌లో పర్యటిస్తున్న సర్కిల్-18 డీఎంసీ సమ్మయ్య

బంజారాహిల్స్: బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా చెత్త సేకరించే వాహనాలకు మాత్రమే చెత్త వేసేలా క్షేత్రస్థాయిలో శానిటేషన్ సిబ్బందితో పాటు మహిళా సమాఖ్యల ప్రతినిధులు, రిసోర్స్ పర్సన్లు అవగాహన కల్పించాలని జూబ్లీహిల్స్ సర్కిల్–18 డీఎంసీ సమ్మయ్య సూచించారు. సర్కిల్ పరిధిలోని ఫిలింనగర్, ఇందిరానగర్, నందినగర్ ప్రాంతాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. స్థానికంగా ఇంటింటి సర్వే చేస్తున్న రిసోర్స్ పర్సన్లు, శానిటేషన్ సిబ్బందితో మాట్లాడి పలు సూచనలు చేశారు. వారం రోజుల తర్వాత నిబంధనలకు విరుద్ధంగా చెత్త బండికి చెత్త ఇవ్వని వారితో పాటు బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసే వారికి జరిమానాలు వేయాలని సూచించారు.

అంబేడ్కర్ వర్సిటీలో ఆరోగ్య కేంద్రం ప్రారంభం



అంబేడ్కర్ యూనివర్సిటీలో ఒప్పంద పత్రాలు మార్చుకుంటూ..

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, రెనోవా హాస్పిటల్స్ సంయుక్తంగా విశ్వవిద్యాలయంలో ఆరోగ్య కేంద్రాన్ని ఉపకులపతి ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు సమగ్ర ఆరోగ్య సంరక్షణ సేవలను అందించేలా ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఆరోగ్యం, విద్య, వెల్‌నెస్ కార్యక్రమాలపై దృష్టి సారించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రెనోవా హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీధర్, విశ్వవిద్యాలయ అకాడమిక్ డైరెక్టర్ పుష్పచక్రపాణి, రిజిస్ట్రార్ ఎల్.విజయ కృష్ణారెడ్డి, అన్ని విభాగాల డైరెక్టర్లు, బోధన, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహన దొంగల అరెస్టు



పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు, నిందితులు

బంజారాహిల్స్: వేర్వేరు ఘటనల్లో ద్విచక్ర వాహనాలను చోరీ చేసిన ఐదుగురిని టాస్క్‌ఫోర్స్, బంజారాహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. ముగ్గురిని జువైనల్ కోర్టులో హాజరుపర్చారు. వారి నుంచి నాలుగు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. సింగాడికుంటకు చెందిన మొహమ్మద్ అజారుద్దీన్ మెకానిక్. ఈజీగా డబ్బులు సంపాదించేందుకు ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తుంటాడు. బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో హోండా డ్యూయో వాహనాన్ని చోరీ చేసిన ఓ మైనర్ దానిని రూ.10 వేలకు అమ్మేశాడు. వచ్చిన డబ్బులతో జల్సా చేశాడు.

- ఇదేవిధంగా బోయిన్‌పల్లికి చెందిన మొహమ్మద్ ఫిరోజ్, మహ్మద్ సమీర్‌లు ద్విచక్ర వాహనాలు చోరీ చేస్తుంటారు. బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో హోండా డ్యూయో వాహనాన్ని చోరీ చేసి విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారు.
- పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నివసించే మొహమ్మద్ షాదాబ్, రిజ్వాన్ రెండు ద్విచక్ర వాహనాలను చోరీ చేసి ముర్తుజా అనే వ్యక్తికి అమ్మేశాడు. ముర్తుజా ఇద్దరు మైనర్లకు అమ్మేశాడు. పోలీసులు అజారుద్దీన్, మొహమ్మద్ ఫిరోజ్, మొహమ్మద్ సమీర్, మొహమ్మద్ షాదాబ్, ముర్తుజాను అరెస్టు చేశారు. రిజ్వానా పరారీలో ఉన్నాడు. ముగ్గురిని జువైనల్ కోర్టులో హాజరుపర్చారు.

మద్యం తాగుతూ కారు డ్రైవింగ్

- సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన యువకుడు
- పట్టుకున్న ఫిలింనగర్ పోలీసులు

ఫిలింనగర్: మద్యం తాగుతూ కారు నడుపుతున్న వ్యక్తిని అదే రోడ్డులో వెళ్తున్న ఓ యువకుడు ఫొటోలు తీసి 'ఎక్స్'లో ఫిర్యాదు చేశాడు. దీంతో ఫిలింనగర్ పోలీసులు కారు నడుపుతున్న వ్యక్తిని గుర్తించారు. వివరాల్లోకి వెళితే.. టోలిచౌకి వంతెనపై నుంచి ఆదివారం ఉదయం ఓ వ్యక్తి మద్యం తాగుతూ కారు నడుపుతుండగా అదే దారిలో వెళ్తున్న ఓ స్కూటరిస్టు గుర్తించి ఫొటోలు తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. దీంతో ఫిలింనగర్ పోలీసులు ఈ పోస్ట్‌ను సుమోటోగా స్వీకరించి సదరు కారు నడుపుతున్న వ్యక్తిపై కేసు నమోదు చేశారు. రెండు రోజుల నుంచి కారు కోసం గాలించిన పోలీసులు మంగళవారం ట్రేస్ చేశారు. చేవెళ్లకు చెందిన మురళీకృష్ణ మెహిదీపట్నం వైపు నుంచి గచ్చిబౌలి మీదుగా చేవెళ్లకు వెళ్లే క్రమంలో మద్యం తాగుతూ కారు నడుపుతున్నట్లుగా దర్యాప్తులో తేలింది. ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెత్త సేకరించడంలో నిర్లక్ష్యం.. ఆటో డ్రైవర్‌కు జరిమానా



ఆటో డ్రైవర్‌కు జరిమానా విధిస్తున్న రిసోర్స్ పర్సన్లు

బంజారాహిల్స్: ఇంటింటికీ తిరిగి చెత్త సేకరించాల్సిన ఆటో డ్రైవర్ నిర్లక్ష్యం చేయడంతో చెప్పినా వినిపించుకోకపోవడంతో ఇందిరానగర్ రిసోర్స్ పర్సన్లు డీఎంసీ సమ్మయ్య ఆదేశాల మేరకు రూ.వెయ్యి జరిమానా విధించారు. బంజారాహిల్స్ రోడ్ నెం.2లోని ఇందిరానగర్ బస్తీలో చెత్త సేకరించే ఆటో డ్రైవర్ రాము చెత్త సేకరించే విషయంలో నివాసితులు చెప్పినా వినిపించుకోకపోవడంతో మంగళవారం జరిమానా విధించినట్లు రిసోర్స్ పర్సన్లు తెలిపారు. ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానాలు తప్పవని హెచ్చరించారు.

పారిశుద్ధ్య కార్మికులు సక్రమంగా విధులకు హాజరవ్వాలి



మాట్లాడుతున్న సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి

సనత్‌నగర్: పారిశుద్ధ్య కార్మికులు సక్రమంగా విధులకు హాజరుకావాలని సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మి పేర్కొన్నారు. సనత్‌నగర్ లేబర్ వెల్ఫేర్ గ్రౌండ్‌లోని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఖైరతాబాద్ సర్కిల్ ఏఎంఓహెచ్ చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షతన చెత్త ట్రాలీ ఆటో కార్మికులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కొన్ని కాలనీల్లో 2, 3 రోజుల వరకు చెత్తను తీయడం లేదని, అలాగే సమయ పాలన పాటించడం లేదని స్థానికుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. సెలవు రోజు మినహా మిగితా రోజుల్లో తప్పనిసరిగా విధుల్లో ఉండేలా చూడాలని ఏఎంఓహెచ్‌కు సూచించారు. డివిజన్‌లో 152 మంది పారిశుద్ధ్య కార్మికులు విధులకు 98 మంది మాత్రమే ఉన్నారని, అందులోనూ కొంతమంది వివిధ కారణాలతో సెలవులు పెడుతుండడంతో చాలాచోట్ల చెత్తను సేకరించడం లేదన్నారు. అలాంటి పరిస్థితి లేకుండా చూడాలన్నారు. అయితే కొన్ని ఆటో ట్రాలీలకు రిపేరు చేయాల్సిన ఉన్నాయని చెప్పగా, కాలనీ అసోసియేషన్లు ముందుకువచ్చి రిపేరు చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు కొలను బాల్‌రెడ్డి, నాయకులు మీర్జా ఖలీల్‌బేగ్, నోమనుద్దీన్, జమీర్, పురుషోత్తం, షమీవుల్లా, నాగరాజు, జీహెచ్ఎంసీ సూపర్‌వైజర్లు అరవింద్, వెంకటేశ్ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు లేకుండా చర్యలు

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో కొత్తగా వస్తున్న గేటెడ్ కమ్యూనిటీలు, టవర్‌లు, నివాసాలకు అనుగుణంగా విద్యుత్ సబ్‌స్టేషన్‌లను పెంచి రాబోయే రోజుల్లో సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ఇబ్రహీంబాగ్ ఏడీఈ అంబేద్కర్ అన్నారు. మంచిరేవుల రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 283లోని ఎకరం భూమిని ప్రభుత్వం విద్యుత్ సబ్‌స్టేషన్ గురించి ఇటీవల కేటాయించారు. దీంతో మంగళవారం దాన్ని సర్వే, పంచనామ నిర్వహించి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సురేష్ విద్యుత్ అధికారులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఏడీఈ మాట్లాడుతూ.. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో వస్తున్న నిర్మాణాలకు అనుగుణంగా మరో నాలుగు సబ్‌స్టేషన్‌ల ఏర్పాటు ఎంతో అవసరమన్నారు. అందుకు అనుగుణంగా పలు చోట్ల స్థలాలను కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరామన్నారు. వాటిని కేటాయిస్తే రాబోయే 20 ఏళ్ల వరకు విద్యుత్ సమస్యలు లేకుండా సబ్‌స్టేషన్‌లను నిర్మిస్తామన్నారు. మంచిరేవుల సబ్‌స్టేషన్ నిర్మాణానికి రూ.కోట్ల నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే పనులను మొదలుపెడతామన్నారు.

రోడ్డుకు ఇరువైపులా అక్రమ పార్కింగ్

- ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్న అంబులెన్స్‌లు
- వాహనదారులు, పాదచారులకు తిప్పలు
- పలు శాఖల అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం



ఫిలింనగర్ అపోలో రోడ్డులో ట్రాఫిక్‌లో ఇరుక్కున్న అంబులెన్స్

బంజారాహిల్స్: ఫిలింనగర్‌లోని అపోలో ఆస్పత్రి వైపు వెళ్లే రోడ్డులో స్మార్ట్ బజార్, ఐసీఐసీఐ బ్యాంక్, మురళీమోహన్ పాత ఇంటి రోడ్డుకు ఇరువైపులా అక్రమ పార్కింగ్‌లతో నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఇక్కడ రోడ్డుకు రెండు వైపులా వాణిజ్య సముదాయాలకు పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో పాటు స్మార్ట్ బజార్, వైన్‌షాపునకు, ఐసీఐసీఐ బ్యాంక్‌కు కూడా సరైన పార్కింగ్ సదుపాయం లేకపోవడంతో వాహనాలన్నీ రోడ్ల పక్కనే పార్కింగ్ చేస్తున్నారు. ఇదే రోడ్డులో రెండు మెడికల్ షాపులు కూడా ఉండగా వీటికి కూడా పార్కింగ్ సౌకర్యం లేదు. దీనికి తోడు అపోలో రోగుల కోసం అక్రమంగా నిర్మించిన అంతస్తుల్లో గెస్ట్‌హౌస్ ఏర్పాటు చేశారు. ఇవన్నీ పార్కింగ్ సదుపాయం లేకుండానే దర్జాగా కొనసాగుతున్నాయి. దీంతో అసలే ఇరుకుగా ఉన్న ఈ రోడ్డు అక్రమ పార్కింగ్‌లతో మరింత ఇబ్బందికరంగా మారింది. ట్రాఫిక్‌లో అంబులెన్స్‌లు ఇరుక్కుపోయి రోగులు అవస్థలు పడుతున్నారు. ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు వాహనదారులు, పాదచారులకు తిప్పలు తప్పడం లేదు. ఈ రోడ్డులో ఫుట్‌పాత్ కూడా నిర్మించలేదు. రోడ్డు అస్తవ్యస్తంగా మారింది. ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్ఎంసీ స్పందించి ఈ రోడ్డులో అక్రమ పార్కింగ్‌లకు చెక్ పెట్టాలని వాహనదారులు, పాదచారులు కోరుతున్నారు.

కార్మికుల సమ్మె నోటీసులు

మణికొండ: కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలనే లక్ష్యంతో ఈనెల 20న నుంచి మున్సిపల్, వైద్య తదితర రంగాల కార్మికులు సమ్మెకు వెళ్తున్నారని, అందుకు అనుగుణంగా ఆయా శాఖల అధికారులకు నోటీసులు అందించామని సీఐటీయూ గండిపేట మండల కన్వీనర్ డి. ప్రవీణ్ అన్నారు. ఆయన ఆధ్వర్యంలో కార్మికులు మంగళవారం నార్సింగి మున్సిపల్ మేనేజర్, మండల వైద్యాధికారులకు నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దశాబ్దాల కాలాల పాటు పోరాటాలు చేసి కార్మికులు సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్స్‌గా తీసుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. అవి అమలు జరిగితే రాబోయే రోజుల్లో కార్మిక సంఘాలు ఏర్పాటు చేసే అవకాశం ఉండదని, కార్మిక శాఖ నిర్వీర్యం అవుతుందన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రత, ఉపాధి లేకుండా పోతుందన్నారు. లేబర్ కోడ్స్‌ను అమలు చేయొద్దని, కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలని, ఆశ వర్కర్లను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు.

గాలివాన బీభత్సం



తాళ్లగడ్డలో ఆటో, ఆటో ట్రాలీపై కూలిన చెట్టు

గోల్కొండ: సోమవారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. తాళ్లగడ్డ, గుడిమల్కాపూర్ తదితర ప్రాంతాల్లో భారీ చెట్లు నెలకూలాయి. తాళ్లగడ్డ దాదావాడి జైయిన్ మందిర్ వద్ద ఓ పెద్ద చెట్టు ఓ ఆటోపై కూలింది. దీంతో ఆటో పూర్తిగా ధ్వంసమైంది. గుడిమల్కాపూర్ కబడ్డీ స్టేడియం వద్ద రెండు చెట్లు కూలాయి. ఈ విధంగా కూలిన చెట్ల కింద ఓ ఆటో ట్రాలీ, ఒక ఆటో పూర్తిగా ధ్వంసమయ్యాయి. కాగా చెట్లు కూలడంతో బీజేపీ నాయకుడు జొన్నకుంటి మధుసుధన్, సునీల్‌యాదవ్ డీఆర్ఎఫ్ సిబ్బందికి ఫోన్ చేశారు. అర్ధరాత్రి వరకు డీఆర్ఎఫ్ సిబ్బంది శ్రమించి రోడ్డుకు అడ్డంగా కూలిన చెట్లను తొలగించారు.

నేడు బాగ్ అంబర్‌పేటలో కన్యకాపరమేశ్వరి జయంతి

నల్లకుంట: ఆర్యవైశ్య సంఘం నల్లకుంట ఆధ్వర్యంలో బుధవారం(నేడు) బాగ్ అంబర్‌పేటలోని శ్రీ షిరిడీ సాయిబాబా మందిరంలో శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారి జన్మదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని సంఘం ప్రధాన కార్యదర్శి గజవాడ అంజన్‌కుమార్ గుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. బాబా మందిరం మొదటి అంతస్తులో ఉదయం 9గంటలకు పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయని అన్నారు. ఈ పూజలో పాల్గొనే ఆర్యవైశ్య మహిళలు పసుపు/ఎరుపు రంగు చీరలు, పురుషులు తెల్లని దుస్తులు ధరించి రావాలని కోరారు.

ఈసారి ఆరు డివిజన్లు కాంగ్రెస్ పార్టీవే..

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాజుయాదవ్



మాట్లాడుతున్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బి.రాజుయాదవ్

పంజగుట్ట: ఖైరతాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేసేందుకు పార్టీ అధినాయకుల ఆదేశాల మేరకు అన్ని డివిజన్ల సమావేశాలు నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బి.రాజుయాదవ్ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ హిమాయత్‌నగర్ డివిజన్ కార్యకర్తల సమావేశం బుధవారం ఎర్రమంజిల్‌లోని మెర్క్యూరీ హోటల్‌లో ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికలకు పార్టీ కార్యకర్తలను సిద్ధం చేసేందుకు, డివిజన్‌లో ఉన్న సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు ఈ సమావేశం ఉపయోగపడుతుందని చెప్పారు. కార్యక్రమానికి పార్టీ సికింద్రాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి వేణుగోపాల్ హాజరవుతారని అన్నారు. 2009లో ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఆరు డివిజన్లలో ఐదు డివిజన్లను కాంగ్రెస్ పార్టీ గెలుపొందిందని, కానీ గత రెండు పర్యాయాలు ఒక్కసీటు కూడా రాలేదని, ఈసారి ఆరు డివిజన్లు తప్పకుండా కాంగ్రెస్ పార్టీ గెలిచేలా ఈ సమావేశాలు సాగుతాయని తెలిపారు.

చెత్తకుప్పల్లో.. మీ సేవ

- వందలాది మందికి నిత్యం ప్రత్యక్ష నరకం
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న దరఖాస్తుదారులు
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు



బంజారాహిల్స్ రోడ్డు నంబర్-7లోని మీ సేవ కార్యాలయం వద్ద చెత్త కుప్పలు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నంబర్–7లోని మీ సేవ కార్యాలయానికి వివిధ పనుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు వందలాది మంది వస్తుంటారు. వారికి చెత్తకుప్పలు, మట్టి దిబ్బలు స్వాగతం పలుకుతున్నాయి. దుర్వాసనతో పాటు ఈగలు, దోమల స్వైరవిహారం చేస్తుండటంతో మీ సేవ కార్యాలయానికి వచ్చేవారు ప్రత్యక్ష నరకం అనుభవిస్తున్నారు. ఇటీవలే కోట్లాది రూపాయలు వెచ్చించి మీ సేవ ప్రధాన కార్యాలయంలోని అధికారుల ఆఫీసులను ఆధునికీకరించారు. అయితే సాధారణ ప్రజలు వచ్చే మీ సేవ కార్యాలయాన్ని మాత్రం పట్టించుకోకుండా గాలికొదిలేశారు. కనీసం కేంద్రం పరిసరాలను శుభ్రంగా ఉంచాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇదే ప్రాంతంలో వెంకటేశ్వర కాలనీ డివిజన్ వార్డు కార్యాలయం, ఇంజినీరింగ్ విభాగం కూడా ఉంది. జీహెచ్ఎంసీ అధికారులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. మీ సేవ కార్యాలయ అధికారులు కూడా ఇక్కడే ఉంటారు. అయినా ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. మీ సేవ కార్యాలయం నిర్వాహకులు కూడా తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

నారమ్స్, ఎ-ఐడీఈఏ ఇంపాక్ట్ హబ్ ఒప్పందం



ఏజీ వర్సిటీ: జాతీయ వ్యవసాయ పరిశోధన నిర్వహణ సంస్థ(నారమ్స్) హైదరాబాద్‌లోని ఏ-ఐడీఈఏ ఇంపాక్ట్ హబ్ మధ్య మంగళవారం అవగాహన ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందంలో భాగంగా వ్యవసాయ ఆవిష్కరణలను వేగవంతం చేయడం, వివిధ వ్యవసాయ, పర్యావరణ వ్యవస్థలతో స్థిరమైన అభివృద్ధిని సాధించడానికి ఈ రెండు సంస్థలు పనిచేయనున్నాయి. దీంతోపాటు మెరుగైన వ్యాపారం చేయడానికి అవగాహన కల్పించడం వంటి వాటిని చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ ఒప్పందంపై నారమ్స్ డైరెక్టర్ డాక్టర్ గోపాల్‌లాల్, హైదరాబాద్ ఇంపాక్ట్ హబ్ సహ వ్యవస్థాపకుడు డాక్టర్ ఎన్.సల్లగుండాల సంతకం చేశారు.

'సబ్ రిజిస్ట్రార్‌పై దాడి హేయం'

సాక్షి, సిటీబ్యూరో: విధుల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగిపై దాడికి పాల్పడటం హేయమైన చర్య అని, ఇలాంటివి భవిష్యత్తులో పునరావృతం కాకుండా చూడాలని టీఎస్జీఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింహారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పెద్దఅంబర్‌పేట్ సబ్‌రిజిస్ట్రార్ రవీందర్‌పై దాడికి పాల్పడిన శ్రీనివాస్‌ను శిక్షించాలని డిమాండ్ చేశారు. అధికారుల పనితీరుపై ఏవైనా అభ్యంతరాలుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కార మార్గాలు అన్వేషించాలే తప్ప భౌతికదాడులకు దిగడం సరికాదని పేర్కొన్నారు.

నగరంలో ఉగ్రదాడి మూలాలు: లక్ష్మణ్



సాక్షి, సిటీబ్యూరో: దేశంలో ఎక్కడ ఉగ్రదాడి జరిగినా దాని మూలాలు హైదరాబాద్‌లో కనిపిస్తున్నాయని ఎంపీ లక్ష్మణ్ అన్నారు. తెలంగాణలో ఉన్న పాకిస్థానీలను వెంటనే వెనక్కి పంపించాలని మంగళవారం గవర్నర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 370 ఆర్టికల్ రద్దు తరువాత ప్రశాంతమైన వాతావరణంలో జమ్ము, కశ్మీర్‌లో ఎన్నికలు జరిగాయని, ప్రజలు పెద్ద ఎత్తున ఓటు హక్కు వినియోగించుకున్నారని అన్నారు. అందమైన ఆ ప్రదేశానికి పూర్వవైభవం తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని, పర్యాటకులు పెరిగారని, స్థానిక యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెరుగయ్యాయని పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా శాంతియుత వాతావరణాన్ని కల్పించడానికి అందరూ సహకరిస్తున్నారని అన్నారు. పహల్గామ్ ఘటన నేపథ్యంలో ప్రపంచం ఆశ్చర్యపడే రీతిలో పాకిస్థాన్‌కు బుద్ధి చెబుతామని లక్ష్మణ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నగరంలో నేడు

- గోషామహల్‌లోని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్(టీఎస్ఆర్‌టీసీ)లో ఉదయం 9.30 గంటలకు పిల్లలకు ఉచిత సమ్మర్ క్యాంపు జరుగుతుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో సెవెన్ విజన్స్ పేరిట చిత్ర ప్రదర్శన ఉదయం 10.30 నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- శ్రీనగర్ కాలనీలోని శ్రీసత్యసాయి నిగమాగమంలో ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు నేషనల్ సిల్క్ ఎక్స్‌పో అందుబాటులో ఉంటుంది. ఈ ప్రదర్శనలో డైరెక్ట్ వీవర్స్ 50 శాతం రాయితీపై అమ్మకాలు నిర్వహించనున్నారు.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళాశక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు ఉంటుంది.
- కేపీహెచ్‌బీ కాలనీలో లులు మాల్‌లో లులు బిగ్ చాకో డేస్ ఫెస్టివల్ ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు కోకో మిలన్ యాక్టివిటీస్, చిన్నారులకు పెయింటింగ్, డ్రాయింగ్, త్రీడీ యానిమేషన్ చిత్రాలు, వీడియోలతో ఇంగ్లిష్ పద్యాలు, పాటలపై శిక్షణ ఉంటుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో వేసవి సెలవుల సందర్భంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సమ్మర్ ఆర్ట్ క్యాంప్ జరుగుతుంది.
- మైలార్‌దేవ్‌పల్లి గణేష్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉదయం 8 నుంచి ఉదయం 11 గంటల వరకు ఉచిత వేసవి శిక్షణ శిబిరం జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

ఈ మంటలేంటి.. ఆ మతలబేంటి?

- జీహెచ్ఎంసీ సర్కిల్ 9 టౌన్ ప్లానింగ్‌లో తగలబడుతున్న డాక్యుమెంట్లు
- వరుసగా మూడేళ్లుగా సెలవురోజుల్లో అనుమానాస్పద ప్రమాదాలు
- అంతుచిక్కని మంటలు.. పట్టించుకోని అధికార యంత్రాంగం
- తాజాగా సోమవారం అర్ధరాత్రి అగ్నికి ఆహుతైన డాక్యుమెంట్లు





కాలి బూడిదైన డాక్యుమెంట్లు



ముఖరంజా ట్రస్టు ఫిర్యాదు చేసినట్లు దరఖాస్తు

చార్మినార్: మూడేళ్లుగా అనుమానాస్పదస్థితిలో మంటలు... కాలి బూడిద అవుతున్న విలువైన డాక్యుమెంట్లు... చోద్యం చూస్తున్న అధికారులు.. పట్టించుకోని ప్రజాప్రతినిధులు.. ఇదీ జీహెచ్ఎంసీ చార్మినార్ సర్కిల్-9 టౌన్ ప్లానింగ్ విభాగంలోని పరిస్థితి. తాజాగా ఓవారం రాత్రి మొఘల్‌పురాలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని రెండో అంతస్తులో టౌన్‌ప్లానింగ్ విభాగంలో మంటలు చెలరేగాయి. దాదాపు పదేళ్లకుపైగా ఉన్న విలువైన డాక్యుమెంట్లు ఈ అగ్నిప్రమాదంలో కాలి బూడిదయ్యాయి. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పలువురి నుంచి అందే ఫిర్యాదులతోపాటు భవన నిర్మాణ అనుమతులు.. ఇలా ఎన్నో డాక్యుమెంట్లు కాలిపోతున్నాయి. సంబంధిత అధికారులుగానీ, కార్పొరేటర్, ఎమ్మెల్యేలుగానీ ఈ మంటలపై స్పందించడం లేదు. ముందు జాగ్రత్త చర్యలు, నివారణ చర్యలు తీసుకునే దిశలో అధికార యంత్రాంగం లేకపోవడం గమనార్హం.

మూడేళ్ల నుంచి ఇదే తంతు..

2023లో చార్మినార్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా సూర్యకుమార్, సర్కిల్ టౌన్ ప్లానింగ్ ఏసీపీగా పని చేసిన ఫయీం పీరియడ్‌లో అగ్నిప్రమాదం జరిగింది. ఉద్దేశపూర్వకంగా గుర్తుతెలియని వ్యక్తులు ఈ మంటలు పెట్టినట్లు ఆరోపణలు వచ్చాయి. అయితే ఆకతాయిలు చేసిన పనిగా అప్పట్లో సంబంధిత అధికారులు ఈ సంఘటనను కొట్టిపారేశారు. విలువైన డాక్యుమెంట్లన్నీ నామరూపాలు లేకుండా కాలిపోయాయి. 2024 జనవరి 14న సంక్రాంతి సెలవురోజున టౌన్ ప్లానింగ్ రికార్డు సెక్షన్‌లో మంటలు చెలరేగాయి. అప్పుడు టౌన్ ప్లానింగ్ ఏసీపీగా ఖాదర్, డీసీగా ఇప్పుడున్న సరిత విధినిర్వహణలో ఉన్నారు. అయితే ఆ మంటలకు కారణాలను మాత్రం ఎవరూ కనుక్కోలేకపోయారు. సెలవురోజుల్లో మాత్రమే ఈ అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయి. ఎప్పటిలాగే ఇది ఆకతాయిల పని అని సంబంధిత అధికారులు మిన్నకుండిపోయారు.

సిబ్బంది ప్రమేయంతోనే..



మూడేళ్లుగా టౌన్ ప్లానింగ్ రికార్డు సెక్షన్‌లో మంటలు అంటుకోవడం దారుణం. ఏ కార్యాలయంలోనూ ప్రమాదాలు జరగడం లేదు. కేవలం విలువైన డాక్యుమెంట్లు ఉండే రికార్డు సెక్షన్ మాత్రమే కాలిపోతోంది. కావాలని ఇక్కడి సిబ్బందే ఉద్దేశపూర్వకంగా మంట పెడుతున్నట్లు అనుమానాలు కలుగుతున్నాయి. నిందితులను కఠినంగా శిక్షించి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలి.

– మహ్మద్ అహ్మద్, ఖాజీపురా

పాత డాక్యుమెంట్లే...



అగ్ని ప్రమాదానికి గురైన టౌన్ ప్లానింగ్ రికార్డు సెక్షన్‌లోని డాక్యుమెంట్లన్నీ పాతవే. తరచూ అగ్ని ప్రమాదాలు సంభవిస్తున్న మాట వాస్తవమే. ఈ సంఘటనపై విచారణ జరిపి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీసులకు ఫిర్యాదు చేశాం. స్పోర్ట్స్ కాంప్లెక్స్ కావడంతో ఎవరెవరో వస్తుంటారు. అయినప్పటికీ మా జాగ్రత్తల్లో మేమున్నాం. పునరావృతం జరగకుండా చర్యలు తీసుకుంటాం.

– సరిత, డిప్యూటీ కమిషనర్, చార్మినార్ సర్కిల్–9

కాల్పుల విరమణ పాటించి చర్చలకు రావాలి

కేంద్ర ప్రభుత్వానికి పీస్ డైలాగ్ కమిటీ విజ్ఞప్తి

హిమాయత్‌నగర్: మావోయిస్టు పార్టీపై కాల్పుల విరమణ పాటించి శాంతి చర్చలకు రావాలని కేంద్ర ప్రభుత్వానికి పీస్ డైలాగ్ కమిటీ విజ్ఞప్తి చేసింది. మంగళవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో పీస్ డైలాగ్ కమిటీ అధ్యక్షుడు జస్టిస్ చంద్ర కుమార్ అధ్యక్షతన సమావేశమైంది. చర్చలకు కేంద్రాన్ని ఒప్పించేందుకు దేశవ్యాప్తంగా ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, అన్ని రాజకీయ పార్టీలు, దళిత, ఆదివాసీ, విద్యార్థి, మత మైనార్టీ, వివిధ ప్రజా సమూహాలు ప్రజాస్వామిక పద్ధతిలో శాంతియుత నిరసనలతో ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చింది. కమిటీ సభ్యులు కందిమళ్ల ప్రతాప్‌రెడ్డి, ప్రొఫెసర్ పి.ఎల్.విశ్వేశ్వర్ రావు, సీహెచ్ బాలకిషన్‌రావు, ఆత్రం భుజంగరావు, రహనుమా ఎడిటర్, ప్రొఫెసర్ అన్వర్ ఖాన్, సోమ రామమూర్తి, అజయ్ బాల్నే, హరిప్రీత్, అడ్వొకేట్ వెంకన్న(ఐఏపీఎల్), బండి దుర్గాప్రసాద్ హాజరైన ఈ సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. మావోయిస్ట్ పార్టీ శాంతిచర్చలకు సిద్ధమని, అందుకు అనువైన వాతావరణం ఏర్పాటు చేయాలని ఆ పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ పత్రికా ముఖంగా ప్రకటించినా కేంద్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తూ కర్రెగుట్ట ఆపరేషన్‌ను వేలాది బలగాలతో కొనసాగించడం ప్రజాస్వామ్య విధానం కాదని కమిటీ అభిప్రాయపడింది. కేంద్ర ప్రభుత్వం-మావోయిస్టు పార్టీ ఎలాంటి షరతులు లేకుండా చర్చలకు రావాలని కమిటీ పిలుపు ఇచ్చింది. అనంతరం కమిటీ అధ్యక్షులుగా చైర్మన్ జస్టిస్ చంద్రకుమార్, ఉపాధ్యక్షులుగా కందిమళ్ళ ప్రతాప్ రెడ్డి, కో-ఆర్డినేటర్‌గా బండి దుర్గాప్రసాద్, ముఖ్య సలహాదారులుగా ప్రొఫెసర్ హరగోపాల్‌ను కమిటీ ఎన్నుకుంది. రాష్ట్రంలో శాంతి సభలు, ర్యాలీలు చేయాలని తీర్మానం చేసింది.



ఎన్నికైన పీస్ డైలాగ్ కమిటీ నూతన కార్యవర్గం

ఆస్థమాపై ప్రజల్లో అవగాహన కల్పించాలి

రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి

హిమాయత్‌నగర్: ఆస్తమాపై ప్రజలకు అవగాహన కల్పించాలని రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ప్రపంచ ఆస్తమా దినోత్సవం సందర్భంగా మంగళవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఆస్తమా వ్యాధిగ్రస్తులకు అవగాహన కల్పించి, పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ద్వారకానాథ్ రెడ్డి నూతన టెక్నాలజీతో తెచ్చిన ఇన్‌హేలర్స్‌ను శ్రీనివాస్‌రెడ్డి ఆవిష్కరించి మాట్లాడారు. అత్యాధునిక శాస్త్రీయ వైద్యం అందుబాటులోకి వస్తున్నప్పటికీ జబ్బులు కూడా అదే రీతిలో విజృంభిస్తున్నాయని అన్నారు. శ్వాస ఆసుపత్రుల చైర్మన్ డాక్టర్ విష్ణు రావు మాట్లాడుతూ ఉచ్ఛ్వాస, నిచ్ఛ్వాస సజావుగా సాగితేనే మనిషి మనుగడ సాధ్యమని పేర్కొన్నారు. మనుషుల జీవనశైలి, వాతావరణ కాలుష్యం 'ఆస్తమా'ను పెంచి పోషిస్తున్నాయని అన్నారు. మొదటి దశలో వైద్యులను సంప్రదిస్తే సరైన జాగ్రత్తలతో వ్యాధిని నియంత్రించొచ్చని పేర్కొన్నారు. ఈ సంవత్సరం ఇన్‌హేలర్స్ అందరికీ అందుబాటులో ఉండాలన్న నినాదంతో ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కల్లూరి సత్యనారాయణ రెడ్డి, శ్వాస ఆసుపత్రి వైద్యులు తదితరులు పాల్గొన్నారు.



ఇన్‌హేలర్స్‌ను ఆవిష్కరిస్తున్న కె.శ్రీనివాస్ రెడ్డి, ద్వారకానాథ్ రెడ్డి, డాక్టర్ విష్ణురావు

ఆకట్టుకున్న 'అన్నమయ్య సంకీర్తనల నృత్యమాల'

గన్‌ఫౌండ్రీ: శ్రీ మయూరి నృత్యాలయ సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో అన్నమయ్య జయంత్యుత్సవాలను మంగళవారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నమయ్య సంకీర్తనల నృత్యమాల ఆహుతులను ఆకట్టుకుంది. కేంద్ర సంగీత నాటక అకాడమీ సభ్యురాలు డాక్టర్ ఎస్.పి.భారతి మాట్లాడుతూ..చిన్నారులను శాస్త్రీ సంగీత కళల్లో ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు సూచించారు. అంతకు ముందు వివిధ అంశాలపై చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

ఈ కార్యక్రమంలో సినీనటులు ఘర్షణ శ్రీనివాస్, కరాటే కల్యాణి, ఎంఈఓ సీహెచ్.వెంకటమ్మ, సీఎస్సీ కోర్టు సీనియర్ సూపరింటెండెంట్ అంజనికుమారి, తెలుగు విశ్వవిద్యాలయం విశ్రాంత రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.సుదర్శన్, నిర్వాహకులు ఆర్ఎస్ఎస్ రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



చిన్నారి నందితను సన్మానిస్తున్న ఎస్‌పి.భారతి తదితరులు

ప్రజావాణిలో 252 దరఖాస్తులు

దరఖాస్తులు స్వీకరించిన చిన్నారెడ్డి



లక్డీకాపూల్: మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 252 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 56, విద్యుత్ 32, రెవెన్యూ 50, ప్రవాసి ప్రజావాణికి 01, ఇందిరమ్మ ఇండ్ల కోసం 44 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 69 దరఖాస్తులు అందినట్లు ప్రజావాణి కో ఆర్డినేటర్ రాకేష్ రెడ్డి తెలిపారు. సీఎం ప్రజావాణి ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేందుకు కృషి చేశారు.

జీహెచ్ఎంసీ సెక్షన్ అధికారి, చైన్‌మెన్లపై కేసు

అబిడ్స్: జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ సెక్షన్ అధికారి, చైన్‌మెన్‌లపై అబిడ్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 3వ తేదీన జాంబాగ్ బీజేపీ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్, అబిడ్స్ జీహెచ్ఎంసీ-14వ సర్కిల్ సెక్షన్ అధికారి నరేష్, చైన్‌మెన్ ఆరీఫ్‌ల మధ్య రగడ నెలకొన్న విషయం విదితమే. జీహెచ్ఎంసీ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాకేష్ జైస్వాల్‌పై అబిడ్స్ పోలీసులు ఈ నెల 4వ తేదీన కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో రాకేష్ జైస్వాల్‌తో కలిసి ఓ వ్యక్తిపై ఫిర్యాదు చేసేందుకు జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ కార్యాలయానికి వెళ్లగా సెక్షన్ అధికారి నరేష్, చైన్‌మెన్ ఆరీఫ్‌లు తనపై దాడి చేశారని కట్టెలమండి నివాసి రాజ్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు మంగళవారం సెక్షన్ అధికారి నరేష్, చైన్‌మెన్ ఆరీఫ్‌లపై కేసులు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ ఇమ్మాన్యుయేల్ తెలిపారు. స్థానిక ఉద్యోగులు, ఇతరులను విచారించి ఇరువురిపై చర్యలు తీసుకుంటామన్నారు.

ట్రాఫిక్ పోలీసులకు కొత్త టోపీలు

– సమ్మర్ కిట్లు సైతం పంపిణీ చేసిన సీపీ



సాక్షి, సిటీబ్యూరో: వేసవి కాలం నేపథ్యంలో ట్రాఫిక్ విభాగంలో పనిచేస్తున్న అధికారులకు కొత్త టోపీలు జారీ అయ్యాయి. క్షేత్రస్థాయిలో పనిచేసే అధికారులకు ఎండ తగలకుండా ఉండేందుకు వీటిని ఎంపిక చేశారు. సాధారణ టోపీలకు బదులు హ్యాట్లు, వాటర్ బాటిల్, గ్లూకోజ్, చలువ కళ్లద్దాలతో కూడిన కిట్ బ్యాగ్‌లు మంజూరయ్యాయి. వీటిని నగర కొత్వాల్ సీపీ ఆనంద్ మంగళవారం ట్రాఫిక్ సిబ్బందికి అందించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ చీఫ్ జోయల్ డెవిస్ తదితరులు పాల్గొన్నారు.

పాస్‌పోర్ట్ విచారణకు వెళ్లిన కానిస్టేబుల్‌పై దాడి

- కేసు నమోదు.. నలుగురి అరెస్ట్



కానిస్టేబుల్‌పై దాడి చేసిన వ్యక్తులు

మలక్‌పేట: పాస్‌పోర్ట్ విచారణ కోసం వెళ్లిన కానిస్టేబుల్‌పై దాడిచేసిన సంఘటన మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ పిడమర్తి నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మూసారంబాగ్‌లో నివాసం ఉంటున్న టి.సర్వేశం స్పెషల్ బ్రాంచ్ సౌత్‌ఈస్ట్‌జోన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. సోమవారం సాయంత్రం గోగు అర్షిత అనే దరఖాస్తుదారుకు పాస్‌పోర్ట్ విచారణ కోసం ఫోన్ చేశాడు. అర్షిత తల్లి సునీత ఫోన్ తీసుకుని తన చిరునామా తెలియజేసింది. కానిస్టేబుల్ 5 గంటలకు సలీంనగర్ వెస్ట్‌ప్రశాంత్ నగర్ గీతాంజలి అడ్మైర్ అపార్ట్‌మెంట్‌లోని జీ-1కు వెళ్లాడు. అర్షిత ఇంట్లో లేకపోవడంతో ఆమె తల్లి, సోదరుడితో పత్రాలను పరిశీలించి ధృవీకరించాడు. అదే అపార్ట్‌మెంట్‌లో నివసించే వ్యక్తిని సాక్షిగా పిలవమని చెప్పాడు. కొంత సేపటికి పట్నంశెట్టి శ్రవణ్‌కుమార్ భార్య అనిత అక్కడకు వచ్చింది. విచారణకు సహకరించడానికి బదులుగా వాదించి అభ్యంతరకరంగా ప్రవర్తించి గొడవకు దిగింది. భర్త శ్రవణ్‌కుమార్, తమ్ముడు అగ్గనూర్ నరేష్‌కుమార్, నరేష్‌కుమార్ స్నేహితుడు ఎర్రవల్లి శివకుమార్‌లను పిలిపించింది. వెంటనే అక్కడకు చేరుకున్న వారు కానిస్టేబుల్‌ని అకారణంగా..విషయం తెలుసుకోకుండా దూషించి కొట్టారు. దుస్తులు చించేశారు. తాను పోలీస్ కానిస్టేబుల్ అని చెప్పినప్పటికీ వారు పట్టించుకోకుండా బూతులు తిడుతూ దాడిని కొనసాగించారు. తనపై దాడి చేసిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ కానిస్టేబుల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ సురేష్ కేసు నమోదు చేశారు. మూసారంబాగ్‌కు చెందిన అగ్గనూర్ నరేష్‌కుమార్, వెస్ట్ ప్రశాంత్‌నగర్ నివాసి పట్నంశెట్టి శ్రవణ్‌కుమార్, పట్నంశెట్టి అనిత, షాద్‌నగర్ రాఘవేంద్రకాలనీ వాసి ఎర్రావల్లి శివకుమార్‌లను అరెస్ట్ చేసి జ్యుడీషియల్ కస్టడీకి తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. కాగా ఎవరైనా పోలీసు అధికారులకు, ప్రభుత్వ ఉద్యోగులకు విధి నిర్వహణలో ఆటంకం కలిగిస్తే చట్టపరంగా తీవ్రమైన చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ పిడమర్తి నరేష్ హెచ్చరించారు. కొత్త చట్టం భారతీయ నాగరిక సురక్షా సంహిత ప్రకారం ఎవరైనా పోలీసు అధికారి విధులకు ఆటంకం కలిస్తే సెక్షన్ 35 (ఐ)(ఎఫ్) బీఎన్ఎస్ఎస్) ప్రకారం వెంటనే అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపవచ్చన్నారు.

'సే నో టు డ్రగ్స్' ప్రచారానికి శ్రీకారం



రాయదుర్గం: 'సే నో టు డ్రగ్స్'అనే ప్రచార కార్యక్రమానికి మంగళవారం శ్రీకారం చుట్టారు. 'డ్రగ్ ఫ్రీ ఇండియా'ధ్యేయమని ప్రకటించారు. ఈ మేరకు రాయదుర్గంలోని ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్-హైదరాబాద్ క్యాంపస్‌లో విద్యార్థులు, ఫ్యాకల్టీ నినాదాలు చేశారు. జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న 'నషా ముక్త్ భారత్ అభియాన్'లో భాగంగా మంగళవారం ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని ఎఫ్‌డీడీఐ-హెచ్ ఫ్యాకల్టీ డాక్టర్ ముప్పిడి రాంబాబు, ఎఫ్‌డీడీఐ సోషల్, ఎన్విరాన్‌మెంటల్ క్లబ్, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు సించన, అనిరుధ్ పర్యవేక్షించారు. కార్యక్రమాన్ని ఎఫ్‌డీడీఐ-హెచ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.తేజ్‌లోహిత్ రెడ్డి ప్రారంభించారు. ఆ తర్వాత 'సే నో టు డ్రగ్స్'పేరిట విద్యార్థులు, ఫ్యాకల్టీతో ఆయన ప్రతిజ్ఞ చేయించారు. తేజ్ లోహిత్‌రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యకరమైన, మాదకద్రవ్య రహిత భారతదేశానికి దోహదపడటానికి ఎఫ్‌డీడీఐ కట్టుబడి ఉందన్నారు. విద్యార్థులు తలచుకుంటే ఏదైనా సాధ్యమేనని, అందుకే ఈ 'సే నో టు డ్రగ్స్'కార్యక్రమానికి రాయబారులుగా విద్యార్థులే ఉండాలని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ఎఫ్‌డీడీఐ-హెచ్ ఫ్యాకల్టీ, అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి సత్తా చూపించాలి..

సన్నబియ్యం లబ్ధిదారు ఇంట్లో మంత్రి సీతక్క భోజనం



సనత్‌నగర్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి తన సత్తా చూపించాలని మంత్రి సీతక్క అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అనవసర వ్యాఖ్యలు చేస్తూ అసహనాన్ని ప్రదర్శిస్తూ కేటీఆర్ డ్రామాలు చేస్తున్నారని మండిపడ్డారు. సన్నబియ్యం పంపిణీలో భాగంగా బేగంపేట పాటిగడ్డకు చెందిన లబ్ధిదారు షాలేహా బేగం ఇంటికి మంగళవారం వచ్చిన ఆమె వారితో కలిసి సన్నబియ్యం భోజనం చేశారు. భోజనం చేస్తూనే ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఎలా ఉన్నాయంటూ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ సంపన్న వర్గాలు మాత్రమే తినే సన్న బియ్యాన్ని ఉచితంగా పేదలకు అందజేస్తున్నట్లు తెలిపారు. సన్న బియ్యం పథకం తమ గ్యారెంటీల్లో లేకున్నా అమలుచేస్తున్నామని అన్నారు.

కేసీఆర్ హామీలు ఇచ్చి నెరవేర్చలేదు...

పది సంవత్సరాల్లో అనేక హామీలు ఇచ్చి నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశారని మంత్రి సీతక్క విమర్శించారు. గత ప్రభుత్వం కొన్ని వర్గాలకు కొమ్ముకాసి రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని తెలిపారు. వాస్తవ పరిస్థితులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలకు వివరించేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పుల మూలంగా ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నా ఎక్కడా సంక్షేమానికి ఢోకా లేకుండా చూస్తున్నామని తెలిపారు. కేసీఆర్ చేసిన అప్పులకు ప్రతినెలా తాము 6,000 కోట్ల రూపాయలు చెల్లిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోట నీలిమ, సీనియర్ నేతలు విశాల సూదం బబ్లూ, చిరంజీవి, మనీ ఫ్ఖాన్, కృష్ణ, మనోజ్, అడ్డూ, తస్లీమ్, మాధవి, అల్తమాష్, జగదీష్, పర్వేజ్ తదితరులు పాల్గొన్నారు.

బిహార్‌లోనూ సీఎం ప్రజావాణి అమలు



ప్రజావాణి కార్యక్రమాన్ని సందర్శించిన బిహార్ అధికార బృందం

లక్డీకాపూల్: తెలంగాణలో అమలవుతున్న సీఎం ప్రజావాణి కార్యక్రమాన్ని బిహార్‌లో కూడా అమలు చేస్తామని అక్కడి గ్రూప్ వన్ అధికారులు పేర్కొన్నారు. మహాత్మ జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో మంగళవారం జరిగిన సీఎం ప్రజావాణి కార్యక్రమాన్ని బిహార్ అధికారుల బృందం సందర్శించింది. ఈ సందర్భంగా సీఎం ప్రజావాణి తీరుతెన్నులను బృందం అధ్యయనం చేసింది. సీఎం ప్రజావాణి గురించి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ వారికి వివరించారు. సీఎం ప్రజావాణి పనితీరు తెలుసుకున్న బిహార్ అధికారులు సంతోషం వ్యక్తం చేశారు. బిహార్‌లోనూ ఇదే పద్ధతిలో ప్రజావాణిని అమలు చేస్తామని వారు పేర్కొన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరగాలి: కలెక్టర్

సాక్షి,సిటీబ్యూరో: ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసూతి సేవలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వడంతోపాటు ఇతర చికిత్సలపై రోగులకు మెరుగైన సేవలు అందించాలని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆసుపత్రుల పనితీరు, సాధారణ ప్రసవాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్లు సమర్థవంతంగా వారి విధులను నిర్వహించాలని, తమ కార్యకలాపాలను ఎప్పటికప్పుడు వాట్సాప్ గ్రూప్ ద్వారా అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఏరియా ఆసుపత్రిలో సూపరింటెండెంట్లు, కమ్యూనిటీ సెంటర్ల వైద్యాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రేవంత్ వల్లే మాదిగలకు న్యాయం : పిడమర్తి రవి



హిమాయత్‌నగర్: ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ విషయంలో మాదిగలకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి వల్ల న్యాయం, ఆంధ్రాలో అక్కడి సీఎం చంద్రబాబు నాయుడు వల్ల అన్యాయం జరిగిందని మాదిగ జేఏసీ చైర్మన్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. వర్గీకరణ ఉద్యమం వల్ల ఆంధ్రాలోని మాలలకే లాభం జరిగిందన్నారు. ఎస్సీ వర్గీకరణపై హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ మీసాల మల్లేష్ ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్ వద్ద స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం పిడమర్తి మాట్లాడుతూ తెలంగాణలోని మాది గలకు 7 శాతం అడిగితే రేవంత్ రెడ్డి 9 శాతం రిజర్వేషన్ ఇచ్చి, రోస్టర్‌లో 9.75 శాతం కల్పించారని అన్నారు. మే నెలలో పరేడ్ గ్రౌండ్‌లో విజయోత్సవ సభ జరపాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. బీఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ బొర్రెల్లి సురేష్, బొమ్మరాజు స్టాలిన్, జేరిపోతుల సాయి, నక్క మహేష్, కోటి, గణేష్, శేఖర్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్ జ్యువెలరీ పెర్ల్, జెమ్ ఫెయిర్‌కు

సర్వం సిద్ధం

- 9 నుంచి 11వ తేదీ వరకూ జరగనున్న ఫెయిర్..
- 220 మందికిపైగా ప్రదర్శనకారులకు ఆతిథ్యం ఇవ్వనున్న వేదిక

సాక్షి, సిటీబ్యూరో: నగర వేదికగా ప్రతిష్టాత్మక హైదరాబాద్ జ్యువెలరీ పెర్ల్, జెమ్ ఫెయిర్‌కు సర్వం సన్నద్ధమవుతోంది. నగరంలోని హైటెక్స్ వేదికగా ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకూ ప్రతిష్టాత్మక 'హైదరాబాద్ జ్యువెలరీ పెర్ల్ అండ్ జెమ్ ఫెయిర్' నిర్వహించనున్నారు. భారతదేశపు ప్రీమియర్ బీ 2 బీ జ్యువెలరీ ఎగ్జిబిషన్‌గా నిర్వహిస్తున్న ఈ ఫెయిర్‌లో 8 వేలకు పైగా వాణిజ్య సందర్శకులను ఆకర్షిస్తోందని, 220పైగా ప్రదర్శనకారులకు ఆతిథ్యం ఇస్తుందని అంచనా. ఈ వేదికగా తాజా ఆభరణాల ట్రెండ్స్, ప్రత్యేక బ్రాండ్ సేకరణలు, అత్యాధునిక డిజైన్లను ఆవిష్కరిస్తుంది. ఈ ఫెయిర్ భారతదేశ వార్షిక ఆభరణాల అమ్మకాల్లో 60 శాతం వరకు ప్రభావితం చేయనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. మూడు రోజుల ఈవెంట్లో ట్రెండ్ సెట్టింగ్ డిజైన్లు, బ్రాండ్ లాంచ్లు, ఆభరణాల సమావేశాలు, ప్రతిష్టాత్మక అవార్డుల వేడుక, పవర్ ఆఫ్ యంగ్, లెజెండ్స్ ఆఫ్ సౌత్, జ్యువెలరీ పర్చేజ్ మేనేజర్స్ కనెక్ట్, కాఫీ విత్ డాక్టర్ చేతన్, బిజినెస్ మ్యాచ్ మేకింగ్ వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. దీనికోసం దక్షిణాదిలోని హైదరాబాద్ సహా ముంబై, జైపూర్, కేరళ, బెంగళూరు, కోయంబత్తూర్, చెన్నై వంటి నగరాలకు చెందిన ప్రముఖ జ్యువెలరీ బ్రాండ్లు నగరానికి విచ్చేయనున్నాయి.



వాహనచోదకుల కోసం

కూల్ షెడ్స్

సాక్షి, సిటీబ్యూరో: ట్రాఫిక్ సిగ్నల్స్ దగ్గర ఎండ వేడిలో మలమల మాడుతూ వేచి ఉండే వాహనదారులకు కాసింత ఉపశమనం అందించేలా ప్రముఖ కంపెనీ ఇమామి లిమిటెడ్ హౌస్‌కు చెందిన డెర్మీకూల్ ఓ స్వచ్ఛంద సేవ అందిస్తోంది. నగరంలోని ట్రాఫిక్ సిగ్నల్స్ దగ్గర ఎండ వేడిని నిరోధించేలా ప్రత్యేక మెటీరియల్‌తో తయారైన ఓవర్ హెడ్ షెడ్స్ ఏర్పాటు చేస్తున్నట్లు సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో భాగంగా నగరంలోని మాదాపూర్, పర్వతనగర్‌లో రెండు చోట్ల వీటిని ఏర్పాటు చేశామని వివరించింది. మొత్తం 35 చోట్ల వీటిని ఏర్పాటు చేయనున్నామని తెలియజేసింది.

7 విజన్స్ చిత్ర ప్రదర్శన

ఆర్ట్ గ్యాలరీలో ఆకట్టుకుంటున్న వినూత్న చిత్రాలు


ఈ నెల 11వ తేదీ వరకూ కొనసాగింపు







మాదాపూర్ : కళాకారులు వేసిన చిత్రాలు సందేశాత్మకంగా ఉన్నాయని కళాకారుడు ఆనంద్‌గడప తెలిపారు. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ అర్ట్‌గ్యాలరీలో ఏడుగురు కళాకారులు వేసిన చిత్రాలను 7 విజన్స్ పేరిట మంగళవారం చిత్రప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈనెల 11వ తేదీ వరకూ నిర్వహించనున్న ఎగ్జిబిషన్‌లో 38 చిత్రాలను అందుబాటులో ఉంచారు. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 7గంటల వరకు సందర్శకులకు ప్రదర్శన అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.



విదేశీ ట్రెండు నుంచి సీజనల్‌గా వచ్చే పండు దాకా కాదేదీ మిక్సింగ్‌కు అనర్హం అంటున్నారు నగర నలభీములు. అసలే మామిడి సీజన్ అందులోనూ వెరైటీలు కోరుకునే నగరవాసులు.. ఇంకేం ఉంది.. నగరంలోని రెస్టారెంట్స్, కేఫ్స్, పార్లర్స్.. మ్యాంగో మానియాతో ఊగిపోతున్నాయి. పోటా పోటీగా మామిడిని రకరకాల వంటకాలకు జతచేస్తూ మెనూలను రూపొందిస్తున్నాయి. ఆ విశేషాలు ఇవిగో..

- సాక్షి, సిటీబ్యూరో



దిల్ మ్యాంగో మోర్..

నగరంలో మామిడి పండ్ల ఆధారిత రుచుల సందడి

- రెస్టారెంట్స్, కేఫ్స్‌లో మ్యాంగో డిష్‌లకు ఆదరణ
- కేఫ్స్, బేకరీలు, ఐస్‌క్రీమ్ పార్లర్స్‌లోనూ మ్యాంగోదే హవా
- ప్రత్యేక స్టార్టర్లు, మెయిన్ కోర్సులతో మెనూ

జూబ్లీ హిల్స్‌లోని లిల్లీస్ – ది బోహో కేఫ్ మామిడి ఆధారిత డెజర్ట్స్‌ను అందిస్తోంది. అలాగే కొబ్బరి పాలు, తాజా మామిడి ముక్కలు, హోమ్‌మేడ్ గ్రానోలాతో మామిడి చియా పుడ్డింగ్‌ను వడ్డిస్తోంది. బ్రియోష్ బ్రెడ్, మామిడి కంపోట్, కొబ్బరి క్రీమ్‌తో మామిడి ఫ్రెంచ్ టోస్ట్‌తో నోరూరిస్తోంది. అరటి, ఖర్జూరాలతో తయారు చేసిన మామిడి స్మూతీ బౌల్, మామిడి ఫ్రాప్పే, మామిడి ప్యాషన్, ఫ్రూట్ కూలర్ వంటి పానీయాలు కూడా అందుబాటులోకి తెచ్చింది.

పదుల సంఖ్యలో..

బంజారా హిల్స్‌లోని ఖండానీ రాజధాని 'ఆమ్లీ షియస్' పేరిట అందిస్తున్న ఫుడ్ ఫెస్టివల్‌లో పదుల సంఖ్యలో మామిడి వంటకాలు కొలువుదీరాయి. కైరీ చనా దాల్ ధోక్లా, మామిడి కోఫ్తా పులావ్, మలబారి మామిడి కఢీ, మామిడి పచ్చడి, మామిడి రైతాలతో పాటుగా మామిడి జిలేబి, మామిడి బాసుందీ వంటి డెజర్ట్స్ కూడా ఇందులో భాగమే.

నాన్‌వెజ్ స్టార్టర్స్‌లో..

గచ్చిబౌలిలోని 3.63 డిగ్రీస్ సమర్పిస్తున్న 'మామిడి మానియా' ఫెస్టివల్‌లో మామిడి చికెన్ వింగ్స్, మామిడి ల్యాంబ్ చాప్స్, మామిడి క్రిస్పీ ఫిష్ వంటి స్టార్టర్లు. మామిడి దాల్, మామిడి అనాస పులావ్, మామిడి చికెన్ కర్రీ వంటి వాటితో మెయిన్ కోర్సులు, ఆమ్రస్ ఫొంటెన్తో కూడిన డెజర్ట్స్ అందిస్తోంది.

డెజర్ట్స్, మెయిన్ కోర్సులు..

జూబ్లీహిల్స్‌లోని ప్యూర్ వెజిటేరియన్ ఫైన్ డైనింగ్ రెస్టారెంట్ తత్వాలో.. ఆమ్రఖండ్, మామిడి మిలే ఫ్యూయిల్, మామిడి కుల్ఫీ, మామిడి టార్ట్ వంటి తీపి రుచులను అందిస్తున్నారు.

మాధాపూర్‌లోని వెస్టిన్ హోటల్ అందిస్తున్న 'మామిడి బ్రంచ్'లో మామిడి గిలాఫీ, మాహీ అండ్ కచ్చే, మామిడి సుషీ, మామిడి చికెన్ సౌవ్లాకీ వంటి స్టార్టర్లు. మామిడి క్రేప్స్, దసేరి ఆమ్, ముర్గ్ కే పసందే, మామిడి చికెన్ సౌవ్లాకీ వంటి మెయిన్ కోర్సులు ఉన్నాయి. అలాగే మామిడి స్ట్రుడెల్, మామిడి గటో, మామిడి శ్రీఖండ్, మామిడి పాయసం వంటి డెజర్ట్స్..ను సర్వ్ చేస్తోంది.









ఇవి కాకుండా..

జూబ్లీహిల్స్‌లోని ట్రూ బ్లాక్ స్పెషాలిటీ కాఫీకి వెళితే మామిడి ఫ్రెంచ్ టోస్ట్ రుచి చూడొచ్చు. స్పైసీ వెన్యూలో మంగమ్మ మామిడి పుడ్డింగ్ రెడీగా ఉంది. బంజారాహిల్స్‌లోని రోస్టరీ కాఫీ హౌస్ మామిడి ఫెటా సలాడ్‌తో ఆహ్వానిస్తోంది. రామ్ నగర్ కాలనీలోని ట్రియోలా పాటిస్సరీ మామిడి టబ్ కేక్ రెడీ అంటోంది. మలక్‌పేట్‌లోని కెప్టెన్ కునాఫా తన ఇంటిపేరునే మార్చేసుకుని మ్యాంగో కునాఫా సిద్ధం చేసింది. సైనిక్‌పురిలోని డో రైజింగ్ ఇంక్ మ్యాంగో పాట్ కేక్ తదితర వెరైటీలు అందిస్తోంది. హైటెక్ సిటీ సమీపంలోని బర్మా బర్మా రెస్టారెంట్ బర్మీస్ పాక సంప్రదాయాలను ప్రదర్శిస్తూ మామిడి సలాడ్ వంటి వంటకాలను అందిస్తుంది. బంజారా హిల్స్‌లోని హాబిటాట్ కేఫ్ మామిడి ఫ్రెంచ్ టోస్ట్, మామిడి పనకోట, మామిడి ట్రెస్లెచెస్‌తో సహా మామిడి–నేపథ్య ప్రత్యేకతలకు ప్రసిద్ధి చెందింది. హిమాయత్‌నగర్‌లోని రాజ్‌తాలి రెస్టారెంట్ అల్ఫోన్సో మామిడి పండ్లతో ఆమ్రాస్ థాలీని అందిస్తుంది.

డియరెస్ట్.. డెజర్ట్స్..

మెయిన్ కోర్సు పూర్తయ్యాక డెజర్ట్స్ తినడం అలవాటుగా మారింది. మామిడిని మేళవిస్తూ అనేక డెజర్ట్స్ ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి. చార్మినార్ ప్రాంతంలోని మిలన్ జ్యూస్ సెంటర్‌లో రుచికరమైన మ్యాంగో మలాయ్, కోఠిలోని జోకొలెట్ కొత్తగా పరిచయం చేసిన మ్యాంగో డెజర్ట్, జూబ్లీహిల్స్‌లోని టారో రెస్టారెంట్‌లో శాఫ్రోన్ మ్యాంగో స్టిక్కీ రైస్, జూబ్లీహిల్స్‌లోని స్పైసీ వెన్యూ అందిస్తున్న మంగమ్మ మామిడి పుడ్డింగ్, టైగర్ లిల్లీ కేఫ్ బిస్త్రో అందిస్తున్న మామిడి రసమలై ఫ్రెంచ్ టోస్ట్, బంజారాహిల్స్‌లోని ఫెరానోజ్‌లో మామిడి క్రోసెంట్ ఫ్రెంచ్ టోస్ట్.. ఇలా నగరం నలుమూలలా మామిడి తియ్యదనం పరుచుకుని దిల్ మ్యాంగో మోర్ అనిపిస్తోంది. ఏ సీజన్‌లో దొరికే పండ్లను ఆ సీజన్‌లో అంతో ఇంతో వంటకాలకు కలపడం సాధారణమే కానీ.. మ్యాంగో సీజన్‌లో భోజన ప్రియుల అభిరుచికి అనుగుణంగా మామిడి ఆధారిత వంటకాలను కలిగి ఉన్న ప్రత్యేక మెనూలను సిటీ వంటశాలలు తయారు చేస్తున్నాయి. స్టార్టర్స్‌తో మొదలుపెట్టి మెయిన్ కోర్స్, డిజర్ట్స్ దాకా.. ఆఖరికి సలాడ్‌లు కూడా వైవిధ్యభరిత వంటకాలెన్నో సిటీ రెస్టారెంట్స్‌లో సందడి చేయడం ఈ సారి విశేషంగా చెప్పొచ్చు.

నగర వేదికగా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మిస్ వరల్డ్ పోటీల గురించి విధితమే. అయితే ప్రతి అంశానికి, కార్యక్రమానికి విధిగా నియమావళి ఉన్నట్లే మిస్ వరల్డ్ పోటీలకు సైతం నియమాలు, అర్హతలు, తదితర అంతర్జాతీయ అంశాలు ఉంటాయి. ప్రస్తుతం జరుగుతున్న మిస్ వరల్డ్ పోటీల నేపథ్యంలో ఈ పోటీలకు సంబంధించిన నియమాలు, పోటీల్లో పాల్గొనే వారి అర్హతలు తదితర అంశాల గురించి ఆరా తీస్తున్నారు. వీటికి సంబంధించిన వివరాల కోసం గూగుల్‌ను సైతం ఆశ్రయిస్తున్నారు. ఈ సందర్భంగా మిస్ వరల్డ్ పోటీలకు సంబంధించిన నియమావళి.

- సాక్షి, సిటీబ్యూరో





- మిస్ వరల్డ్ పోటీలకు అర్హత వయసు 18 నుంచి 26 ఏళ్లు
- వ్యక్తిత్వం, సామాజిక బాధ్యత కూడా ప్రాధాన్యం
- ఈ అంశాల గురించి ఆరా తీస్తున్న ఫ్యాషన్ ఔత్సాహికులు

బ్యూటీ విత్ పర్పస్..



అందాల పోటీలకూ నియమ నిబంధనలు ఉంటాయి

ప్రపంచ వ్యాప్తంగా ప్రతిష్టాత్మక అందగత్తెల పోటీగా మిస్ వరల్డ్ పరిచయమైంది. మిస్ వరల్డ్ పోటీ అనేది కేవలం అందాన్ని ఆరాధించడమే కాక, వ్యక్తిత్వం, సామాజిక బాధ్యతలు, సామాజిక చైతన్యాన్ని కూడా ప్రోత్సహించే గొప్ప వేదిక. ఇది ప్రతి మహిళకూ తన ప్రతిభను ప్రపంచానికి చూపించేందుకు ఒక గొప్ప అవకాశం కల్పిస్తుంది. 1951లో ప్రారంభమైన ఈ పోటీ ద్వారా.. ప్రతి యేటా వివిధ దేశాల మహిళలు తమ అందం, ప్రతిభ, సామాజిక బాధ్యత, వ్యక్తిత్వం ఆధారంగా ప్రపంచానికి పరిచయమవుతారు. మిస్ వరల్డ్ పోటీని నిర్వహించే ప్రతిపాదనలు, నియమాలు, అర్హతలు, అంతర్జాతీయ అంశాలు విస్తృతంగా ఉంటాయి.

నియమాలు, నిబంధనలు..

మిస్ వరల్డ్ పోటీలో పాల్గొనడానికి కొన్ని ముఖ్యమైన నియమాలు ఉంటాయి. మొత్తం 140కు పైగా దేశాలు ఈ పోటీలో ప్రతినిధులను పంపిస్తాయి. ఇందులో ప్రతి దేశం తమ దేశంలో ఎంపిక ప్రక్రియను నిర్వహిస్తుంది, విజేతలు ఎంట్రీ పాసులు పొందుతారు. పోటీలో పాల్గొనడానికి మహిళలు వారి వయసు కనీసం 18 సంవత్సరాలు పూర్తయ్యి ఉండాలి. గరిష్ట వయస్సు 26 సంవత్సరాలు, అంటే 27వ సంవత్సరంలోకి ప్రవేశించే వారు పోటీలో పాల్గొనలేరు.

ఇవే అర్హతలు..

జాతీయత : ప్రతి దేశం తన తరపున ఒక్క మహిళను పంపిస్తుంది. ఆ మహిళ ఆ దేశం సిటిజన్‌గా ఉండాలి.

భాష : అభ్యర్థులు ఆంగ్ల భాషలో మాట్లాడగలిగితే అది వారి పోటీ కోసం అనుకూలంగా ఉంటాయి.

విద్య, సామాజిక బాధ్యత : మహిళలకు సాధారణంగా మంచి విద్య ఉండాలి. అలాగే వారి సామాజిక బాధ్యతలు, సామాజిక సేవా కార్యక్రమాలు కూడా ముఖ్యం.





అంతర్జాతీయ అంశాలు..

మిస్ వరల్డ్ పోటీ కేవలం అందం మాత్రమే కాక, సామాజిక, సాంస్కృతిక, శక్తివంతమైన అంశాలపై దృష్టి సారిస్తుంది. ప్రతి ఏడాది పోటీ 'బ్యూటీ విత్ పర్పస్' అనే థీమ్ ఆధారంగా నిర్వహించబడుతుంది. ఇందులో అభ్యర్థులు ప్రపంచవ్యాప్తంగా తమ కమ్యూనిటీలకు సహాయం చేసే విధంగా వనరులను ఉపయోగిస్తారు. వాటిలో విద్య, ఆరోగ్యం, మహిళల హక్కులు, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలు ముఖ్యంగా ఉంటాయి.

ప్రత్యేక అంశాలు..

మిస్ వరల్డ్ పోటీలో పాల్గొనడం స్నేహపూర్వక పోటీ మాత్రమే కాదు. ఇది ప్రపంచ వ్యాప్తంగా పరిచయమవ్వడానికి కూడా ఒక మార్గం. అభ్యర్థులు వివిధ ప్రదర్శనల్లో పాల్గొని, ప్రపంచంలోని వివిధ సాంస్కృతిక నేపథ్యాలను అంగీకరిస్తారు. ఇదే కాకుండా, వారు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొని, సాంకేతికంగా కూడా సమాజానికి అవసరమైన మార్పు తీసుకురావడంలో శక్తిమంతంగా వ్యవహరిస్తారు.

18న రేఖా భరద్వాజ్ షో



సాక్షి, సిటీబ్యూరో : బాలీవుడ్ గాయకురాలు సూఫీ గజల్ సంగీతానికి పేరొందిన రేఖా భరద్వాజ్ నగరంలో తన సంగీత ప్రదర్శన ఏర్పాటు చేయనున్నారు. మాదాపూర్‌లోని శిల్పకళ వేదికలో ఆమె కార్యక్రమం ఉంటుంది. ఈ నెల 18వ తేదీన రాత్రి 7.30గంటల నుంచి 2.30 గంటల పాటు కొనసాగుతుంది. ఎంట్రీలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయి.

విద్యార్థుల కోసం.. 'సాల్వ్ ఫర్ టుమారో'

సాక్షి, సిటీబ్యూరో: ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకుని సమాజంలోని ముఖ్యమైన సవాళ్లకు వినూత్న పరిష్కారాలను ఆవిష్కరించే దిశగా నగర విద్యార్థులను ప్రేరేపించడానికి ప్రముఖ ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ శామ్‌సంగ్ ఇండియా 'సాల్వ్ ఫర్ టుమారో' పోటీని ప్రారంభించింది. ఈ విషయాన్ని సంస్థ సీఈఓ జేబీ పార్క్ తెలిపారు. కనీసం 14 నుంచి 22 సంవత్సరాల వయసు గల విద్యార్థులు పాల్గొనవచ్చని, దరఖాస్తులు జూన్ 30 వరకూ అందించవచ్చన్నారు. ఈ పోటీలో తొలి 4 విజేత జట్లకు ఇంక్యుబేషన్ ప్రోగ్రామ్, రూ.1 కోటి గ్రాంట్ అందిస్తామని, అదనంగా, టాప్ 20 జట్లకు రూ.20 లక్షలు, టాప్ 40 జట్లకు రూ.8 లక్షలు అందజేస్తామని వివరించారు. అదనపు వివరాల కోసం తమ వెబ్‌సైట్ https:// csr. samsung. com/ en& in/ localMain. do ను సందర్శించాలని కోరారు.

పెట్స్ కోసం.. క్రాన్‌వెట్..

సాక్షి, సిటీబ్యూరో: పెంపుడు జంతువులకు సంబంధించిన సౌందర్య పోషణ సహా పలు రకాల సేవలు అందించే ప్రముఖ బ్రాండ్ క్రాన్‌వెట్ నగరంలో తమ క్లినిక్ ఏర్పాటు చేసింది. మాదాపూర్‌లోని జయభేరి ఎన్‌క్లేవ్‌లోని మాపుల్ సెలెస్టియాలో ఉన్న 1,400 చదరపు అడుగులలో క్లినిక్‌ని ప్రారంభిస్తున్నట్లు క్రాన్‌వెట్ సంస్థ ప్రతినిధులు మంగళవారం ఏర్పాటు చేసినట్లు ఓ సమావేశంలో తెలిపారు. డిజిటల్ ఎక్స్–రే, అల్ట్రాసౌండ్, తదితర అధునాతన శస్త్రచికిత్స, రోగనిర్ధారణ సామర్థ్యాలతో సహా అత్యుత్తమ వైద్య మౌలిక సదుపాయాలను శునకాలు, మార్జాలాలకు అందిస్తామన్నారు.

క్లుప్తంగా...

ప్రభుత్వాన్ని రద్దు చేసి రేవంత్ ప్రజాతీర్పు కోరాలి

బీజేఎల్పీ నేత ఏలేటి డిమాండ్



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పాలనా సామర్థ్యం లేకపోతే వెంటనే ప్రభుత్వాన్ని రద్దు చేసి ప్రజాతీర్పు కోరాలని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు, సర్పంచులకు ఇవ్వాల్సిన బకాయిలపై ప్రభుత్వం వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. రాష్ట్రం దివాలా తీసిందని సీఎం పదే పదే చెప్పడం వెనుక ఉద్దేశం ఏమిటని ప్రశ్నించారు. 'అధికారం కోసం అనేక హామీలిచ్చి ఇప్పుడు రాష్ట్రం ఆర్థికంగా దివాలా తీసింది.. సంక్షేమ పథకాలను ఇవ్వలేమన్నట్లుగా రేవంత్ మాట్లాడటం వెనుక కుట్ర ఉంది'అని ఆయన వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హామీ మేరకు సంక్షేమ కార్యక్రమాలన్నీ నెరవేర్చే వరకు బీజేపీ ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమం చేపట్టి రేవంత్ సర్కార్ మెడలు వంచుతామని ఏలేటి హెచ్చరించారు.

రేపటికి రేపు కేటీఆర్ సీఎం కుర్చీలో కూర్చోలేడు

ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: రేపటికి రేపు సీఎం కుర్చీలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూర్చోలేడని భువనగిరి కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కేటీఆర్ పగటి కలలు నెరవేరవని ఎద్దేవా చేశారు. మంగళవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో చామల విలేకరులతో మాట్లాడారు. సమ్మె చేయొద్దు, రాష్ట్రాన్ని బాగు చేసుకుందామని సీఎం రేవంత్‌రెడ్డి ఆర్టీసీ కార్మికులకు సూచిస్తే.. దానిపై ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. గతంలో ఆర్టీసీ కార్మికులు 52 రోజుల పాటు సమ్మె చేస్తే కేటీఆర్ ఎందుకు మాట్లాడలేదు? కేసీఆర్ ఒక్కరోజు ఎందుకు బయటికి రాలేదు? అని ప్రశ్నించారు.

నువ్వు రేవంత్‌ను అంటే మేం మోదీని అంటాం

ఎంపీ రఘునందన్‌రావుపై జగ్గారెడ్డి మండిపాటు



సాక్షి, హైదరాబాద్: సీఎంను ఉద్దేశించి బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు చేసిన వ్యాఖ్యలపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి ఫైర్ అయ్యారు. మంగళవారం సీఎల్పీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 'నువ్వు రేవంత్‌ను అంటే మేం మోదీని అంటాం. రూ.15 లక్షల చొప్పున పేదల అకౌంట్లలో వేస్తానని చెప్పి మోదీ వేశాడా? ఏటా 2 కోట్ల ఉద్యోగాల చొప్పున పదకొండేళ్లలో 22 కోట్ల ఉద్యోగాలివ్వాలి. ఎందుకు ఇవ్వలేదంటే మోదీ జవాబు చెప్తాడా? అలా అని మోదీని చవట అంటే మీకు ఎలా ఉంటుంది? భరించగలరా? మోదీ అంటే మాకు గౌరవం ఉంది. అయినా రఘునందన్ మాట్లాడిన మాటలకు మోదీని మోసగాళ్లకు మోసగాడు అనాల్సి వస్తోంది'అని జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు.

అకాలానికి.. 'ముందే' సరైన మందు!



ప్రత్యేక రకం వరి విత్తనాలతో తక్కువ సమయంలోనే పంట రెడీ

ఏప్రిల్, మే నెలల్లో వచ్చే వర్షాలకు ముందే కోతలు పూర్తి చేసుకునే అవకాశం

నల్లగొండ, కరీంనగర్ తదితర జిల్లాల్లో ఈ తరహా వంగడాలు సాగు చేసిన రైతులు

జేజీఎల్ 24423, కేఎన్‌ఎం-118 వంటి వంగడాలతో అధిక దిగుబడి సైతం పొందిన వైనం

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: రాష్ట్రంలో ఇటీవల కురిసిన వడగండ్ల వానతో దాదాపు అన్ని జిల్లాల్లో రైతులు భారీగా నష్టపోయారు. ఇలా ఏటా ఏప్రిల్, మే నెలల్లో కురిసే అకాల వర్షాలు కన్నీళ్లే మిగిలిస్తున్నాయి. ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకునే ప్రభుత్వం.. త్వరగా పంట చేతికొచ్చే వరి వంగడాలను అందుబాటులోకి తెచ్చింది. 140 -150 రోజులకు బదులు 115 - 130 రోజుల్లోనే పంట చేతికొచ్చే వంగడాలను సాగు చేస్తే.. అకాల వర్షాలు, వడగండ్ల వానల కంటే ముందే పంట కోతకు వస్తుందని, రైతులు నష్టాల బారి నుంచి తప్పించుకునేందుకు అవకాశం ఎక్కువగా ఉంటుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. దీంతో ఈ తరహా వంగడాలను సాగు చేసిన నల్లగొండ, కరీంనగర్ తదితర జిల్లాల్లోని రైతులుముందే కోతలు ముగించి, అధిక దిగుబడులు సైతం సాధించారు.

సాగు ఆలస్యంతోనే సమస్య : జూన్‌లో తొలకరి వర్షాలకే రైతులు అప్పుడే నారుమళ్లు పెట్టుకుంటారు. అయితే వర్షాలు ఆలస్యంగా జూలై, ఆగస్టు నెలల్లో పడుతున్నాయి. దీంతో వానాకాలం వరి సాగు ఆలస్యం అవుతోంది. దీంతో అక్టోబర్ నాటికే పూర్తి కావాల్సిన వరి కోతలు డిసెంబర్ వరకు కొనసాగుతున్నాయి. ఆ ప్రభావం యాసంగిపైనా పడుతోంది. డిసెంబర్‌లోనే పూర్తి కావాల్సిన యాసంగి నాట్లు ఫిబ్రవరి వరకు కొనసాగుతున్నాయి. అలా కాకుండా డిసెంబర్ 15 నాటికల్లా నాట్లు పూర్తయితే మార్చి నెలాఖరుకల్లా కోతలు పూర్తయ్యేవి. కానీ ఫిబ్రవరి 15 వరకు కొనసాగుతుండటంతో ఏప్రిల్, మే నెలల్లో కోతలకు వస్తున్నాయి. అప్పుడు పడే అకాల వర్షాలు రైతులకు నష్టం చేకూరుస్తున్నాయి. దీంతో తక్కువరోజుల్లో చేతికొచ్చే వరి వంగడాలు సాగు చేయాలని శాస్త్రవేత్తలు చెబుతున్నారు . ఆర్‌ఎన్‌ఆర్ -21278 అనే వరి వంగడం సాగుతో 115 - 118 రోజులకే పంట చేతికొచ్చే అవకాశం ఉండగా, కేపీఎస్-6251 అనే వంగడంతో 115-120 రోజుల్లోనే వరి కోతకు సిద్ధం అవుతుందన్నారు. నారుమళ్లు కాకుండా వెదజల్లే పద్ధతిని అవలంబించడం ద్వారా కూడా 25 రోజుల సమయాన్ని ఆదా చేసుకోవచ్చన్నారు.

వివిధ రకాల వరి వంగడాల పంట కాలం ఇలా..

- బీపీటీ-5204: 145 -150 రోజులు,
- డబ్ల్యూజీఎల్-44: 140 - 145 రోజులు,
- ఆర్‌ఎన్‌ఆర్ - 11718: 135 - 140 రోజులు,
- కేపీఎస్ - 2874: 135 - 140 రోజులు,
- కేపీఎస్ - 10642: 130 - 135 రోజులు,
- జేజీఎల్ - 27356: 130 - 135 రోజులు,
- జేజీఎల్ - 18047: 120 -130 రోజులు,
- కేఎన్‌ఎం-1638: 125 - 130 రోజులు,
- జేజీఎల్ - 24423 : 120-125 రోజులు,
- ఆర్‌ఎన్‌ఆర్ - 29325: 120 - 125 రోజులు,
- కేపీఎస్ - 10329: 120 - 125 రోజులు,
- కేపీఎస్ - 10631: 120 - 125 రోజులు,
- కేపీఎస్-6251: 115-120 రోజులు,
- ఆర్‌ఎన్‌ఆర్ - 21278: 115 - 118 రోజులు,
- కేఎన్‌ఎం -118: 120 - 125 రోజులు.

వెదజల్లే పద్ధతితో మరింత మేలు



రైతులు తక్కువ రోజుల్లో పంట చేతికి వచ్చే వంగడాలను సాగుచేయాలి. అప్పుడు అకాల వర్షాలకు ముందే కోతలు పూర్తయ్యే అవకాశం ఉంటుంది. అలాగే 25 రోజుల నారుమడి అవసరం లేకుండా వెదజల్లే పద్ధతి అవలంబించాలి. తద్వారా పంట కాలాన్ని తగ్గించుకోవచ్చు. నాటేసే లేబర్ చార్జీ కూడా తగ్గుతుంది. నల్లగొండ జిల్లాలో లక్ష ఎకరాల్లో ఇలా సాగుచేస్తున్నారు. అన్ని జిల్లాల్లో ఆ దిశగా రైతుల్లో మార్పు రావాల్సి ఉంది.

– శ్రావణ్‌కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి, నల్లగొండ

జేజీఎల్ 24423 రకం సాగుచేశా



ఈ వేసవిలో ఆరెకరాల్లో జేజీఎల్ 24423 దొడ్డు రకం సాగుచేశా. డిసెంబర్‌లో నారు పోసి జనవరి 12 నాటికి నాట్లు పూర్తిచేశా. ఏప్రిల్ 14వ తేదీ నాటికే పంట నూర్పిడి పూర్తయింది. ఎకరానికి 42 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. తక్కువ ఎత్తు పెరగడం వల్ల ఈలోగా గాలి దుమారాలు వచ్చినా పైరు పడిపోలేదు. గింజలు కూడా రాలలేదు.

– బచ్చలకూరి శ్రీనివాస్, త్రిపురారం, నల్లగొండ

కేఎన్‌ఎంతో 15 రోజుల ముందే కోతకు



ప్రస్తుత యాసంగిలో నాలుగు ఎకరాలలో కేఎన్‌ఎం-118 వరి రకం సాగు చేశా. సాధారణ రకం కంటే 15 రోజుల ముందే పంట కోతకు వచ్చింది. గింజలు గట్టిగా ఉన్నాయి. ఇటీవల వీచిన ఈదురుగాలులు, వర్షానికి చాలా వరకు గింజలు నేల రాలాయి. అయినప్పటికీ ఎకరానికి 28 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది.

– పిట్ట మహేందర్‌రెడ్డి, వెల్లంకి, రామన్నపేట, యాదాద్రి భువనగిరి

ఫాల్కన్ సీఈఓ యోగేంద్రసింగ్ అరెస్టు

- మచ్చబొల్లారంలో అదుపులోకి తీసుకున్న సీఐడీ

సాక్షి, హైదరాబాద్: అధిక వడ్డీరేట్ల ఆశ చూపి 7,056 మంది డిపాజిటర్ల నుంచి సుమారు రూ.4,215 కోట్లు సేకరించి భారీ మోసానికి పాల్పడిన ఫాల్కన్ కేసులో తెలంగాణ సీఐడీ అధికారులు కీలక పురోగతి సాధించారు. ఫాల్కన్ ఇన్వాయిస్ డిస్కౌంటింగ్ అప్లికేషన్ స్కామ్‌లో ప్రధాన నిందితుడు, కంపెనీ సీఈఓ యోగేంద్ర సింగ్‌ను అరెస్టు చేశారు. ఫిబ్రవరి నుంచి పరారీలో ఉన్న యోగేంద్రసింగ్‌ను మచ్చబొల్లారంలో సీఐడీ బృందం అరెస్టు చేసింది. నిందితుడిని న్యాయస్థానంలో హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్టు సీఐడీ డీజీ శిఖాగోయల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పథకం ప్రకారం మోసం

నిందితులు www.falconsgroup.com వెబ్‌సైట్ ద్వారా, ఫాల్కన్ అప్లికేషన్‌ను అభివృద్ధి చేసి, అధిక వడ్డీలు ఇస్తామంటూ వివిధ సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలు, టెలికాలర్ల ద్వారా ప్రచారం చేశారు. తమకు ప్రముఖ ఎంఎన్‌సీలతో సంబంధం ఉన్నట్టు నకిలీ ఒప్పంద పత్రాలు సృష్టించారు. ఇలా 7,056 మంది నుంచి సుమారు రూ.4,215 కోట్లు సేకరించారు. దాదాపు 4,065 మంది డిపాజిటర్లు రూ.792 కోట్ల మేరకు మోసపోయారు. బాధితుల ఫిర్యాదుతో ఫిబ్రవరిలో సైబరాబాద్ ఈఓడబ్ల్యూ పోలీస్‌స్టేషన్‌లో మూడు కేసులు నమోదు చేశారు. అనంతరం సీఐడీకి కేసును బదిలీ చేశారు. ఈ కేసులో మరో ప్రధాన నిందితుడు, కంపెనీ ఎండీ అమర్‌దీప్ కుమార్‌ను సీఐడీ ఇటీవలే అరెస్టు చేసింది. ఈ కేసులో మిగిలిన వారిని పట్టుకునేందుకు దర్యాప్తు కొనసాగుతోంది. సీఐడీ డీజీ ఆదేశాల మేరకు డీఎస్పీ ఎస్ అశోక్‌కుమార్ బృందం ఎస్పీ వెంకటలక్ష్మి పర్యవేక్షణలో కేసు దర్యాప్తు చేస్తోంది.

చేతకాకపోతే తప్పుకో..

ఉద్యోగులపై చేసిన వ్యాఖ్యలతో సీఎంకు దక్షత, సమర్థత లేవని తేలిపోయింది

- ఉద్యమంలో కదం తొక్కిన ఉద్యోగులను అవమానిస్తున్నాడు
- సర్కారు నడిపేందుకు చందాలు ఇవ్వమని అడుగుతాడేమో
- కేసీఆర్‌ను దూషిస్తే నాలుక చీరేస్తాం..
- రేవంత్ విమాన ప్రయాణాల బండారం బయటపెడతాం
- సీఎంపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజం



మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో ప్రశాంత్‌రెడ్డి, మధుసూదనాచారి, కమలాకర్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: 'దొంగను దొంగలా కాకుండా మరెలా చూస్తారు. నోట్ల కట్టలతో దొరికి విశ్వసనీయత లేని ఓటుకు నోటు దొంగను కాంగ్రెస్ పార్టీ.. సీఎం చేసినందునే ఎవరూ నమ్మడం లేదు. ఆ పార్టీ దొంగ చేతికి తాళాలు ఇస్తే.. ఆయన ప్రజల చేతికి చిప్ప ఇచ్చాడు. పాలన చేతకాకపోతే తప్పుకొని సీఎం పదవికి రాజీనామా చేయి'అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. 'ఇన్నాళ్లూ బీఆర్‌ఎస్ పార్టీని, మమ్మల్ని ఎన్ని తిట్టినా భరించాం. ఇక నుంచి మా అధినేత కేసీఆర్‌ను వ్యక్తిగతంగా దూషిస్తే నాలుక చీరేసే రోజు వస్తుందని గుర్తుపెట్టుకో. ఎవరూ వందలు, వేల ఏళ్లు భూమిపై ఉండేందుకు రాలేదు. ముమ్మాటికీ తిరిగి బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తుంది. కాంగ్రెస్ పాలనలో అతలాకుతలమైన రాష్ట్రాన్ని తిరిగి గాడినపెట్టే సత్తా ఉన్న ఏకైక నాయకుడు కేసీఆర్'అని సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి అన్నారు. 'రేవంత్ కథ తెలిసినందునే ఆయనకు రాహుల్‌గాంధీ అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదు. రేవంత్ ప్రైవేట్ విమానాలు, బిజినెస్ తరగతిలో చేసిన విమాన ప్రయాణాల బండారం బయటపెడతాం. చెప్పులు ఎత్తుకుపోవడం ఏంటో అర్థం కావడం లేదు. చెప్పులు మోసే పార్టీ వేరే ఉంది. సీఎం ప్రవర్తన చూస్తే తిరిగి 2014కు ముందు ఉన్న కాంగ్రెస్ పాలన తెచ్చేలా ఉన్నాడు. నేడో రేపో సీఎం ప్రెస్‌మీట్ పెట్టి ఉద్యోగులకు ఇవ్వాల్సిన పెండింగ్ డీఏలు, రిటైర్‌మెంట్ బెనిఫిట్లు, పీఆర్‌సీలు మాఫీ అంటాడు. కేసీఆర్ పదేళ్ల పాలనలో ఉద్యోగులకు ఇచ్చిన 73 శాతం పీఆర్‌సీని రికవరీ యాక్ట్ కింద వెనక్కి తీసుకుంటాడు. వృద్ధులు, వితంతువులు, బీడీ కార్మికులకు ఇచ్చిన రూ.2వేల పింఛన్‌ను తిరిగి రూ.200కు తీసుకెళతాడు. ఆఖరికి తలా కొంత చందా ఇస్తే ప్రభుత్వం నడుపుతా అంటాడు'అని సీఎం రేవంత్ పనితీరును కేటీఆర్ ఎద్దేవా చేశారు.

తెలంగాణ ప్రతిష్టను దెబ్బతీస్తే సహించం

'తెలంగాణ ప్రతిష్టను దెబ్బతీసేలా మాట్లాడితే సహించేది లేదు. పాలన చేతకాక రేవంత్ కాడి కింద పడేసి పారిపోయేందుకు మార్గాలు వెతుక్కుంటున్నాడు. ఉద్యోగుల విషయంలో రేవంత్ చేసిన వ్యాఖ్యలతో ఆయనకు సమర్థత, దక్షత లేదని తేలిపోయింది. తెలంగాణ ఉద్యమంలో కదం తొక్కిన ఉద్యోగులను రేవంత్‌రెడ్డి అవమానిస్తున్నాడు. ఉద్యోగులు, ప్రజల నడుమ చిచ్చు పెట్టేలా రేవంత్ వైఖరి ఉంది. కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిన అంశాలనే ప్రస్తుతం ఉద్యోగులు ప్రస్తావిస్తున్నారు. పాలన అంటే లేకి మాటలతో పైశాచిక ఆనందం పొందడం కాదు. బజారు భాష మాట్లాడినంత ఈజీ కాదు. ఓ వైపు అప్పులు పుట్టడం లేదంటూనే, మూసీ సుందరీకరణ కోసం రూ.లక్షన్నర కోట్లు ఖర్చు చేస్తామనడం విడ్డూరం. కేసీఆర్ పాలనలో దేశానికి దిక్సూచిగా ఉన్న తెలంగాణ నేడు దివాలా తీసింది. ఏడాదిన్నర పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం రూపాయి అదనపు ఆదాయం కూడా పెంచలేకపోయింది. రేవంత్ నడిపేది సర్కారా లేక సర్కసా. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతినెలా వడ్డీ, అసలు కలుపుకొని రూ. 2వేల కోట్లు మాత్రమే చెల్లిస్తోంది. రేవంత్ అనాలోచిత నిర్ణయాల వల్లే రూ.71 వేల కోట్ల ఆదాయం తగ్గింది. రూ.170 కోట్ల లంచం ఇచ్చి అప్పులు తెచ్చుకునే దుస్థితి ఉంది.'అని కేటీఆర్ మండిపడ్డారు.

షేరింగ్ ఆటోల్లా వాడుతున్నారు

'ఏడాదిన్నరలోనే రేవంత్, ఆయన కుటుంబసభ్యుల ఆదాయం పెరుగుతోంది. ఆయన వియ్యంకుడి అప్పులు మాఫీ అయ్యాయి. ఫ్యూచర్ సిటీ సమీపంలో రెండు వేల ఎకరాలు కొన్నాడు. దుబారా అరికడుతున్నామని సీఎం చెబుతుంటే ఆయన మంత్రులు షేరింగ్ ఆటోల్లా హెలికాప్టర్లను వాడుతున్నారు. ప్రజలకు పనికి వచ్చే ఒక్క మంచి పనిచేయకుండా రాష్ట్రం దివాలా తీసిందని దివానా మాటలు మాట్లాడుతున్నాడు. పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, పనులే గీటురాయి. రేవంత్ 17 నెలల పాలనపై శ్వేతపత్రం విడుదల చేయాలి. సీఎం దుర్మార్గపు ఆలోచన విధానాన్ని ఉద్యోగ సంఘాలు అర్థం చేసుకోవాలి. ఎన్నికల హామీలను ఎగవేసేందుకు దొంగ మార్గాలను వెతుక్కుంటున్న సీఎంను వదిలిపెట్టం' అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, వేముల ప్రశాంత్‌రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ముఠా గోపాల్, కేపీ వివేకానంద, మాధవరం కృష్ణారావు, మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, మహమూద్‌అలీ, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి

నిజాలు చెబితే నిష్టూరమా?

- బీఆర్‌ఎస్ పాలనలో అప్పులు, అవినీతి నిజం కాదా?
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రశ్న

కూసుమంచి: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రాన్ని అభివృద్ధిపరంగా ముందుకు తీసుకెళ్లాలని తపిస్తుంటే.. గత ప్రభుత్వం చేసిన అప్పులతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. అయినప్పటికీ ఇక్కట్లు అధిగమించేలా ప్రణాళికాయుతంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలో పలు అభివృద్ధి పనులకు మంగళవారం శంకుస్థాపన చేసిన మంత్రి.. ఆ తర్వాత కూసుమంచిలో నిర్వహించిన కాంగ్రెస్ పాలేరు నియోజకవర్గ సంస్థాగత సన్నాహక సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రం అప్పుల్లో ఉందని సీఎంతో పాటు తాము ప్రజలకు వివరించడం తప్పా అని ప్రశ్నించారు. ప్రజలకు పరిస్థితిని వివరించేందుకు వాస్తవాలు చెబుతున్నామే తప్ప అబద్ధాలు చెప్పాల్సిన అవసరం లేదన్నారు. గత ప్రభుత్వం అందినకాడికి అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి రాష్ట్రాన్ని అధోగతిపాలు చేస్తే తాము అధికారంలోకి వచ్చాక గాడిన పెడుతున్నామని మంత్రి తెలిపారు. రూ.లక్షల కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టును ప్రపంచంలో ఎనిమిదో వింతగా చూపించారని.. ఆ ప్రాజెక్టులో అవినీతి, కుంగిన బ్యారేజ్‌లను ప్రపంచానికి చెప్పడంలో తప్పేంటని మంత్రి ప్రశ్నించారు. నిజాలు చెపితే బీఆర్‌ఎస్ నేతలు ఉలికిపడుతున్నారని ఎద్దేవా చేశారు. ఇటీవల ఎల్కతుర్తిలో నిర్వహించిన సభలో మాజీ సీఎం కేసీఆర్ మాట్లాడుతూ రాష్ట్రాన్ని చూస్తే బాధగా ఉందన్నారని, వారు అధికారంలో ఉన్నప్పుడు ప్రజలు గుర్తుకురాలేదా అని మంత్రి పొంగులేటి ప్రశ్నించారు. కాగా, సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలను బీఆర్‌ఎస్ సోషల్ మీడియా వక్రీకరించి విష ప్రచారం చేస్తోందని.. దీన్ని కాంగ్రెస్ కార్యకర్తలు తిప్పికొట్టాలని పొంగులేటి పిలుపునిచ్చారు. సమావేశంలో హన్మకొండ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడతాం.. రాష్ట్రాన్ని గాడిలో పెడతాం

- ఎన్ని ఇబ్బందులెదురైనా వెనక్కి తగ్గం
- మీడియాతో ఇష్టాగోష్టిలో మంత్రి శ్రీధర్‌బాబు
- కొంత ఆలస్యంగానైనా ప్రజలకిచ్చిన అన్ని హామీలు నెరవేరుస్తాం
- ప్రభుత్వ ఉద్యోగులు మా కుటుంబ సభ్యుల్లాంటి వారు



సాక్షి, హైదరాబాద్: ఎన్ని ఇబ్బందులు వచ్చినా, ప్రతిపక్షాలు ఎన్ని ఇబ్బందులు సృష్టించినా తాము వెనక్కు వెళ్లేది లేదని, కష్టపడి పనిచేసి రాష్ట్రాన్ని గాడిలో పెడతామని, అభివృద్ధి, సంక్షేమం దిశలో ప్రభుత్వాన్ని నడిపిస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వ్యాఖ్యానించారు. ఇందుకు అందరూ సహకరించాలని, కొంత ఆలస్యంగానైనా రాష్ట్ర ప్రజలకిచ్చిన హామీలను నెరవేరుస్తామని భరోసా ఇచ్చారు. మంగళవారం సీఎల్పీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు.

సీఎం ఆవేదనను అర్థం చేసుకోవాలి

'గత ప్రభుత్వం మిగులు రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చి దివాళా దిశగా నడిపింది. మేము ఆ పరిస్థితి నుంచి బయటపడేయాలని ప్రయత్నం చేస్తున్నాం. అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర కాలంలోనే ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చాం. ప్రజలకు వాస్తవాలు చెప్పాలనే ఆలోచనతో, వారి సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ గురించి సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. గత ప్రభుత్వ ఆర్థిక తప్పిదాల ద్వారా జరిగిన విధ్వంసాన్ని వివరించే ప్రయత్నం చేశారు. ఆయన ఉన్నది ఉన్నట్టుగా మాట్లాడడం కొందరికి ఇబ్బందిగా ఉండొచ్చు. కానీ వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలి. ఆయన ఏం మాట్లాడారన్నది ముఖ్యం కాదు. ఆ మాటల వెనుక ఆవేదనను అర్థం చేసుకోవాలి. మా ప్రభుత్వం ఉద్యోగులకు అనుకూలంగా ఉంది. ప్రతి నెలా మొదటి తేదీన ఉద్యోగులకు వేతనాలిస్తున్నాం. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఒక డీఏ ఇచ్చాం. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు మా కుటుంబ సభ్యుల్లాంటి వారు..'అని శ్రీధర్‌బాబు చెప్పారు.

చేతకాకపోతే కేంద్రంలో బీజేపీనే దిగిపోవాలి

'ప్రపంచ వ్యాప్తంగా, దేశంలోనూ ఆర్థిక పరిస్థితులు బాగా లేవు. అయినా నిధులు తెచ్చేందుకు కృషి చేస్తున్నాం. తమకిచ్చిన హామీలను నెరవేర్చాలని ప్రజలు అడుగుతుంటారు. అన్ని హామీలను తొందర్లోనే నెరవేరుస్తాం. అసెంబ్లీని మేమెందుకు రద్దు చేస్తాం? మాకు ప్రభుత్వాన్ని నడిపే సత్తా ఉందో లేదో ప్రజలే తేలుస్తారు. అందుకు ఐదేళ్లకోసారి ఎన్నికలు వస్తాయి. కేంద్రంలో పాలన చేతకాకపోతే బీజేపీనే దిగిపోవాలి. పహల్గాం దాడి ఘటన, ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తం, నిరుద్యోగం విషయంలో దేశ ప్రజలకు బీజేపీ ఏం సమాధానం చెపుతుంది? మేమైనా పని చేస్తున్నాం. కానీ బీజేపీ ప్రజలకిచ్చిన ఏ వాగ్దానాన్ని నిలబెట్టుకుందో చెప్పాలి..'అని మంత్రి డిమాండ్ చేశారు.

అందాల పోటీలను ఆ కోణంలో చూడొద్దు

'దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా శాస్త్రీయ పద్ధతిలో కులగణన జరిపాం. ఇది తెలంగాణ ప్రభుత్వ విజయం. ఎస్సీల వర్గీకరణను కూడా పూర్తి చేశాం. కాంగ్రెస్ హయాంలోనే సామాజిక న్యాయం జరిగింది. గత ప్రభుత్వ అక్రమాలకు సంబంధించిన నివేదికలు త్వరలోనే వస్తాయని ఆశిస్తున్నాం. ఏది చేసినా చట్టం, నిబంధనల ప్రకారమే చేస్తాం. అందాల పోటీలను కేవలం భౌతిక అందం కోణంలోనే చూడవద్దు. వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే పోటీలుగా, జీవన ప్రమాణాలను మార్చే పోటీలుగా చూడాలి. ఇవి ఏదో హైదరాబాద్‌లోనే జరుగుతున్నవి కాదు..ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్నాయి. మావోయిస్టుల విషయంలో మా కుటుంబానికి జరిగిన అన్యాయం ఏ కుటుంబానికీ జరగకూడదు. వారు జనజీవన స్రవంతిలోకి రావాలి. మా ప్రభుత్వ హయాంలోనే మావోయిస్టులతో శాంతి చర్చలు జరిగాయి. ఈ విషయంలో మమ్మల్నెవరూ విమర్శించాల్సిన పని లేదు. ప్రస్తుతం మంత్రులు ఉపయోగిస్తున్న హెలికాప్టర్ మేము అద్దెకు తీసుకోలేదు. గత ప్రభుత్వమే తీసుకుంది. ప్రతి విదేశీ పర్యటన నుంచి పెట్టుబడులు, పరిశ్రమలు ఆశించడం సరికాదు..' అని శ్రీధర్‌బాబు వ్యాఖ్యానించారు.

కాంగ్రెస్ ఖేల్ ఖతం.. దుకాణం బంద్

- ఇందుకు సీఎం వ్యాఖ్యలే నిదర్శనం
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్



ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): రాష్ట్రంలో హామీలు నిలబెట్టుకోని కాంగ్రెస్ పార్టీ దుకాణం బంద్ అవుతుందని, ఇక ఆ పార్టీ ఖేల్ ఖతమేనని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ వ్యాఖ్యానించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదు.. అప్పు పుట్టడం లేదు.. ఢిల్లీలో ఎవరూ అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడం లేదు'అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. సంవిధాన్ పుస్తకం చేతుల్లో పట్టుకొని తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తానని గతంలో హామీ ఇచ్చిన రాహుల్‌గాంధీ ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. సీఎం వ్యాఖ్యలతో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలకు భయం పట్టుకుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలను ఎక్కడికక్కడ నిలదీస్తామని సంజయ్ అన్నారు. వృద్ధులకు రూ.4 వేల పింఛన్, మహిళలకు రూ.2,500, పేదింటి ఆడబిడ్డ పెళ్లికి తులం బంగారం ఒట్టిమాటగానే తేలిందని విమర్శించారు. రాజీవ్ రహదారిపై కాంగ్రెస్‌వన్నీ ఝూటా మాటలేనని, కమీషన్లకు కక్కుర్తిపడి వంకరటింకరగా నిర్మించిందని సంజయ్ మండిపడ్డారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, మండల అధ్యక్షుడు రేపాక రామచంద్రారెడ్డి, మండల నాయకులు పాల్గొన్నారు.

సీఎం నాలుక చీరేస్తా అంటావా?

కేటీఆర్‌పై ఎంపీ మల్లు రవి ఫైర్



సాక్షి, హైదరాబాద్: సీఎం నాలుక చీరేస్తా అంటావా? అని ఎంపీ మల్లు రవి.. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ధ్వజమెత్తారు. మంగళవారం ఆయన మల్‌రెడ్డి రంగారెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే ఇక్కడ ఎవరూ చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు సరికావని హితవుపలికారు. రూ.8 లక్షల కోట్లు అప్పుచేసి ఎక్కడ ఖర్చుపెట్టారో ప్రజలకు చెప్పలేదన్నారు. 'ఇష్టం వచ్చినట్టు రాష్ట్రాన్ని మీ పాలనలో దోచుకున్నారు. ఆర్థిక క్రమశిక్షణ లేకుండా వ్యవహరించారు. ఇదే విషయాన్ని సీఎం చెప్పారు. జవాబుదారీతనంతో పనిచేస్తున్న ప్రభుత్వం మాది. అలాంటి సీఎంకు పరిపాలన చేతగాదు అంటావా?'అని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఉద్యోగ సంఘాలకు రాష్ట్ర పరిస్థితిని అర్థం అయ్యేలా చెప్పారని, ప్రభుత్వ ఆదాయంలో మీ అప్పులకే సగం చెల్లించాల్సి వస్తోందని రవి తెలిపారు. ఉద్యోగులతో చర్చలకు సీఎం సిద్ధమని, ఐఏఎస్‌లతో కమిటీ వేశారని చెప్పారు. కేటీఆర్ సీఎంపై తలాతోక లేకుండా మాట్లాడుతున్నారని మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. కేటీఆర్.. నువ్వు, నీ అయ్య చేసిన అప్పు ఎంత? కట్టిన ప్రాజెక్టుల విలువ ఎంత? చెప్పాలని డిమాండ్ చేశారు.



'అద్భుతాలు కేవలం అనుకుంటే జరగవు.
పరిస్థితులే వాటిని సృష్టిస్తాయి'
అని చెప్పడానికి బలమైన ఉదాహరణ...
మిస్ వరల్డ్ పోటీలు.
బికినీల పోటీ కాస్తా 'మిస్ వరల్డ్' పోటీ అయింది.
'అనూహ్యమైన స్పందన ఒకవైపు-వివాదాలు
ఒకవైపు'...
ఈ ధోరణి ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది...

మిస్ వరల్డ్ 2025



నాటి బికినీల పోటీ .. నేటి మిస్ వరల్డ్!

రెండవ ప్రపంచ యుద్ధం తరువాత యూరప్ మెల్లగా కోలుకొని పుంజుకోవడం మొదలైంది. బ్రిటన్‌లో ప్రజలు సాధారణ స్థితికి చేరుకుంటున్నారు. 1851 నాటి గ్రేట్ ఎగ్జిబిషన్ శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి ప్రణాళిక తయారైంది.



తొలి మిస్ వరల్డ్ పోటీల నిర్వాహకుడు ఎరిక్ మోర్లే

1951లో...

'ఫెస్టివల్ ఆఫ్ బ్రిటన్' ఉత్సవాల్లో భాగంగా బ్రిటిష్ టెలివిజన్ ప్రెజెంటర్ ఎరిక్ మోర్లే 'బికినీ కంటెస్ట్' నిర్వహణ బాధ్యతను తలకెత్తుకున్నాడు. సైన్యంలో పనిచేసిన మోర్లే ఆ తరువాత ఎంటర్‌టైన్‌మెంట్ ఇండస్ట్రీలోకి వచ్చాడు. పోటీకోసం డజన్ దేశాలకు ఆహ్వానం పంపాడు. ఉత్తరాలు రాశాడు. ఫోన్ కాల్స్ చేశాడు. అయితే అయిదు దేశాల నుంచి మాత్రమే మోర్లేకు 'ఓకే' అంటూ జవాబు వచ్చింది.

అప్పటికే సమయం మించిపోయింది. మోర్లే ఎదుర్కొన్న ప్రధాన అభ్యంతరాలలో ఒకటి బికినీలు ధరించడం గురించి. పోటీలో పాల్గొనడానికి రిజిస్ట్రేషన్ ఫీజులు లేవు. బరిలోకి దిగే వారు అవివాహితులు కావచ్చు. వివాహితులు కావచ్చు. విడాకులు తీసుకొని ఉండవచ్చు. పిల్లలు ఉన్నా లేకపోయినా ఫర్వాలేదు!

కుదరదంతే...

పోటీలో పాల్గొన్నప్పటికీ తమ భర్తల అభ్యంతరం కారణంగా పర పురుషుల ముందు బికినీలలో కనిపించడానికి ముగ్గురు మహిళలు నిరాకరించారు. వీరి నిరాకరణ మాట ఎలా ఉన్నా... లండన్‌లోని లైసియం బాల్‌రూమ్‌లో జరిగిన ఫైనల్ క్వాలిఫికేషన్ కోసం జడ్జీల ముందు 27 మంది మహిళలు బికినీలతో పోటీలో పాల్గొన్నారు.

పేరు మారిందోచ్!

బికినీల పోటీ బ్రిటిష్ మీడియా దృష్టిని విపరీతంగా ఆకట్టుకుంది. ఈ పోటీ అధికారిక పేరు 'ఫెస్టివల్ బికినీ కంటెస్ట్' అయినప్పటికీ మీడియా ఈ పోటీకి 'మిస్ వరల్డ్' అని నామకరణం చేసింది. 'ఫెస్టివల్ బికినీ కంటెస్ట్' కాస్తా 'మిస్ వరల్డ్'గా రీబ్రాండింగ్ అయింది.

మిస్ వరల్డ్ వేదిక... ఉత్తుత్తి బాంబుల మోత!

1970లో జరిగిన 'మిస్ వరల్డ్' పోటీ సంచలనాత్మకంగా మారింది. పోటీ ఫైనల్‌లో ఫెమినిస్ట్ కార్యకర్తల నిరసనలతో ఉద్రిక్త పరిస్థితి చోటుచేసుకుంది. లండన్ రాయల్ ఆల్బర్ట్‌లో జరిగిన లైవ్ ఈవెంట్‌లో ప్రేక్షకుల గ్యాలరీ నుంచి కుళ్లిపోయిన పండ్లు, కూరగాయలే కాదు ఫ్లోర్ బాంబులు వచ్చిపడ్డాయి. 'మాకు కోపంగా ఉంది' అని అరిచి, రకరకాల నినాదాలు ఇచ్చారు ఫెమినిస్ట్ కార్యకర్తలు.



1970 మిస్ వరల్డ్ పోటీలో ఫెమినిస్ట్ కార్యకర్తల నిరసన



తొలి మిస్ వరల్డ్ కిరీటాన్ని గెలుచుకున్న హకాన్‌సన్

ఫస్ట్ మిస్ వరల్డ్... హకాన్‌సన్

ఫస్ట్ మిస్ వరల్డ్ 'కికి' హకాన్‌సన్ గత సంవత్సరం కాలిఫోర్నియాలో మరణించింది. అప్పటికి ఆమె వయసు 94 సంవత్సరాలు. స్వీడన్‌లో పుట్టిన హకాన్‌సన్ 1951లో 'మిస్ వరల్డ్' కిరీటాన్ని గెలుచుకోవడం ద్వారా చరిత్ర సృష్టించింది. హకాన్‌సన్ బికినీ ధరించడాన్ని పోప్ ఖండించారు. యూరప్‌లో మోడలింగ్ వృత్తిని కొనసాగించిన హకాన్‌సన్ ఎన్నో అందాల పోటీలకు జడ్జీగా వ్యవహరించింది. అమెరికన్ శిల్పి డల్లాస్ అండర్సన్‌ను పెళ్లి చేసుకుంది. కోపెన్ హాగన్‌లో తొమ్మిది సంవత్సరాలు ఉన్న తరువాత వారు యూనైటెడ్ స్టేట్స్‌కు వెళ్లారు. మిస్ వరల్డ్‌కు ముందు 'ది ప్రెటియెస్ట్ గర్ల్ ఇన్ స్వీడన్' టైటిల్ గెలుచుకుంది.

అప్పట్లో బికినీని అమానవీయంగా భావించేవారు. 'ఇలాంటి పోటీలు ఏంటీ!' అని విమర్శలు వెల్లువెత్తాయి. విమర్శల సంగతి ఎలా ఉన్నా... ఈ పోటీలో స్వీడన్‌కు చెందిన 'కికి' కెర్‌స్టిన్ హకాన్‌సన్ విజేతగా నిలిచింది. ఆమె మొదటి మిస్ వరల్డ్.

అలా మొదలైంది...

ఈ పోటీని మొదట వన్-టైమ్ ఈవెంట్‌గా అనుకున్నప్పటికీ అనూహ్యమైన స్పందన చూసిన తరువాత దీనిని వార్షిక పోటీగా చేయాలని నిర్ణయించుకున్నారు.

కొద్దికాలం తరువాత మిస్ వరల్డ్ ట్రేడ్ మార్క్ అయింది.

'బికినీ రౌండ్' కారణంగా కొన్ని దేశాలు ఈ పోటీలో పాల్గొనడానికి నిరాకరించాయి. ఒక వైపు ఈ పోటీకి ప్రపంచ వ్యాప్తంగా ఆదరణ పెరిగింది. మరోవైపు వివాదాలు అదే స్థాయిలో పెరిగాయి. వివాదాలు లేకుండా ఈ పోటీ జరగడం అనేది అసాధ్యం అయింది.

స్ఫూర్తి

ఇరవైలలో సివిల్స్‌కు శ్రీకారం చుట్టడం సాధారణ విషయం.
కేరళకు చెందిన నిశా ఉన్నిరాజన్ మాత్రం 35వ యేట ప్రిపరేషన్ మొదలు పెట్టింది.
వినికిడి సమస్య ఉన్న నిశా 7వ ప్రయత్నంలో, 40 సంవత్సరాల వయసులో సివిల్స్‌లో విజయం సాధించింది.

అపూర్వ విజయం

తిరువనంతపురంలోని ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ కార్యాలయంలో అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్‌గా పనిచేసేది నిశా ఉన్నిరాజన్. నందన (11), తన్వీ(7) ఆమె కుమార్తెలు. భర్త అరుణ్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. 35 ఏళ్ల వయసులో సివిల్స్‌కు సిద్ధం అవుతున్నప్పుడు...

'ఈ వయసులో కష్టం' 'ఉద్యోగం, కుటుంబ బాధ్యతలు చూసుకుంటూ సివిల్స్‌లో సక్సెస్ కావడం కష్టం'... ఇలా రకరకాల అభిప్రాయాలు వినిపించాయి. భర్త అరుణ్ మాత్రం ప్రోత్సహించాడు.

వినికిడి సమస్య వల్ల సివిల్స్ ప్రిపరేషన్‌లో నిశాకు సమస్యలు ఎదురయ్యేవి. సబ్జెక్ట్‌కు సంబంధించిన ఆడియోలు వినడం కష్టం అయ్యేది. ఒక వైపు ఇంటి పనులు చేస్తూనే మరోవైపు ప్రిపరేషన్ కోసం టైమ్ కేటాయించుకునేది. 'వినికిడి సమస్య ఉన్న నువ్వు సివిల్స్‌కు ఎలా ప్రిపేరవుతావు!'లాంటి ఎగతాళి మాటలు వినాల్సి వచ్చేది.

ఆమె కష్టం వృథా పోలేదు. నలభై ఏళ్ల వయసులో యూపీఎస్సీ–2024 పరీక్షలో 1000వ ర్యాంక్ సాధించింది. 40 శాతం వినికిడి లోపం ఉన్న నిశా తన వైకల్యాన్ని ఎదుర్కొంటూ, కుటుంబ బాధ్యతలు నిర్వహిస్తూనే విజయం సాధించింది.

కొట్టాయం డిప్యూటీ కలెక్టర్ రంజిత్ నుంచి నిశా స్ఫూర్తి పొందింది. వినికిడి సమస్య ఉన్న రంజిత్ ఎన్నో సవాళ్లను ఎదుర్కొని సివిల్స్‌లో విజయం సాధించాడు. 'మీలో పట్టుదల ఉంటే ఏదైనా సాధ్యమే అని నా కుమార్తెలకు నిరూపించి చూపాలనుకున్నాను. మనకు ఉన్నది ఒకే జీవితం. ఎన్ని ప్రతికూల పరిస్థితులు ఎదురైనా మన లక్ష్యాన్ని వదులుకోవద్దు' అంటుంది నిశా.



నిశా ఉన్నిరాజన్

పరిమితులతోనే...

యూపీఎస్సీలో విజయం సాధించడం అనేది కేవలం జ్ఞానానికి సంబంధించినది మాత్రమే కాదు, ఇదొక మానసిక క్రీడ అని నేను నమ్ముతాను. ప్రతి రెండోరోజు...'ఈ కష్టం నేను భరించలేను' అనిపిస్తుంది. ఆ సమయంలో పట్టుదల లేకపోతే... అంతే. పరీక్షల తేదీ దగ్గర వుతున్న కొద్దీ ఒత్తిడి తీవ్రంగా ఉంటుంది. అలసటగా ఉంటుంది. దాని నుంచి బయట పడినప్పుడే విజయానికి దారి కనిపిస్తుంది. విజయం సాధించడానికి అన్నీ అనుకూలమైన పరిస్థితులు, సంపూర్ణశక్తి ఉండనక్కర్లేదు. మనకు ఉన్న పరిమితులతోనే, శక్తి సామర్థ్యాలతోనే విజయం సాధించవచ్చు.

– నిశా ఉన్నిరాజన్

లీగల్

వారిపై మీరు క్రిమినల్ కేసు వేయచ్చు

కొన్ని సంవత్సరాల క్రితం నగర శివార్లలో కొత్తగా ఏర్పడనున్న కాలనీలో ఒక భూమి కొని రిజిస్టర్ చేసుకున్నాను. కాలనీలో చాలామంది ఇళ్లు కూడా కట్టుకున్నారు. మేము ఇల్లు కడుతుంటే కొందరు స్థానికులు వచ్చి మా స్థలాన్ని వాళ్లకు అమ్మేయమని బలవంతపెట్టారు. ఇదేమిటని ప్రశ్నిస్తే ''మీరు దళితులని తెలియక భూమిని అమ్మాము. మీవల్ల పక్క ప్లాట్లకు ధర తగ్గుతుంది. కాలనీలో మీరు ఒక్కరే దళితులు. ప్రస్తుత మార్కెట్ ధర ఇస్తాము వెళ్లిపొండి'' అన్నారు. మేము వినలేదని, కక్ష సాధింపుగా మాది అక్రమ కట్టడం అంటూ అధికారులకు ఫిర్యాదు చేసి ఇబ్బంది పెడుతున్నారు. మున్సిపల్ అధికారులు కూడా వారితో కుమ్మక్కయ్యారు. మాకు అర్థంలేని నోటీసులు జారీ చేస్తూ ఇబ్బంది పెడుతున్నారు. మాకు తగిన సలహా ఇవ్వగలరు.

– వీరన్న స్వామి, హైద్రాబాద్

78 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో కూడా కుల వివక్ష చూడటం, అందులోనూ హైదరాబాద్ వంటి మహా నగరాలలో కూడా వివక్ష ఇంకా ఉండటం బాధాకరం. ఇటీవలే మీ లాంటి ఒక కేసు చూశాను. మీరు ముందుగా పోలీసులని ఆశ్రయించి సదరు వ్యక్తులపై ఎస్.సి. ఎస్.టి. అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయండి. అట్రాసిటీ చట్టంలోని సెక్షన్ 3 (f)&(g) ప్రకారం ఎస్.సీ – ఎస్.టి.ల ఆస్తిని గానీ, వారికి కేటాయించిన భూములను గానీ, నివాసముంటున్న స్థానాన్ని గానీ అక్రమంగా స్వాధీనం చేసుకోవడం, లేదా అక్రమంగా వారి పేరు తొలగించడం – అలాగే వారి సంపదలో, నీటి సరఫరాలో, వ్యవసాయ దిగుబడి మొదలగు అంశాలలో జోక్యం చేసుకోవడం, వారి ఆస్తులకు భంగం కలిగించడం వంటి చర్యలకు కఠిన శిక్షలు ఉన్నాయి. ఈ శిక్షలు అధికార దుర్వినియోగం చేసే ప్రభుత్వ అధికారులకు కూడా వర్తిస్తాయి. అవసరమైతే, మీ హక్కులకు భంగం కలిగించే విధంగా మునిసిపల్ అధికారుల పాత్ర ఉంటే సదరు అధికారులపై కూడా క్రిమినల్ కేసులు నమోదు చేయవచ్చు. ఎస్.సి. – ఎస్.టి. చట్టం చాలా పటిష్టమైనది. ఎన్నో తప్పులు – అందుకు తగ్గ కఠిన శిక్షలు ఉన్నాయి. కానీ పోలీసులు మాత్రం కేసు ఏదైనా, కేవలం ''కులం పేరుతో దుర్భాషలాడారు'' అని మాత్రమే కేసులు పెట్టడం సర్వసాధారణం ఐపోయింది. అది తప్పు. ఈ చట్టం ప్రకారం మీరు ఒక న్యాయ సలహాదారు/సామాజిక కార్యకర్తను మీ వెంట పోలీసు స్టేషన్‌కు తీసుకుని వెళ్లవచ్చు. అది మీ హక్కు. సరైన రీతిలో కేసు నమోదు చేస్తే మీకు ఖచ్చితమైన న్యాయం దొరుకుతుంది.

క్రిమినల్ కేసులు మాత్రమే కాకుండా మునిసిపల్ అధికారులు ఇబ్బంది పెడుతున్నారు అని చెప్పారు కాబట్టి వారిపై హైకోర్టులో రిట్ పిటిషన్ వేయండి. మీ కేసుకు సంబంధించిన పత్రాలను పరిశీలించిన తర్వాత లాయర్ సలహా మేరకు సివిల్ కోర్టును ఆశ్రయించాలా వద్దా అనేది నిర్ణయించుకోవచ్చు.



– శ్రీకాంత్ చింతల
హైకోర్టు న్యాయవాది

మీకున్న న్యాయపరమైన సమస్యలు, సందేహాలకోసం sakshifamily3@gmail.comకు మెయిల్ చేయవచ్చు.

వేసవి కాలక్షేపం

అలెక్స్ హేలీ రాసిన 'ఏడు తరాలు' చాలా ప్రసిద్ధం.
ఇప్పటి పిల్లలు కనీసం మూడు తరాలు
తెలుసుకుని ఉన్నారో లేదో. దాయాదుల సంగతి తర్వాత.
మేనత్తలు, మేనమామలు, పిన్ని, బాబాయి...
ఈ రక్తానుబంధం పిల్లలకు తెలియచేయాలి.
తల్లి తరఫు తాత, తండ్రి తరఫు తాత
అక్కడి నుంచి సాగిన కొమ్మలు రెమ్మలు
ఈ వంశ వృక్షం తెలియాలి.
మూలాలు తెలిసిన ప్రయాణం అర్థవంతమైనది.
ఈ వేసవిలో పిల్లల చేత ఫ్యామిలీ ట్రీ తయారు చేయించండి.
వారితో మీరు తయారు చేయించే చార్టు నిధి పటానికి
తక్కువ కాదు.

ఫ్యామిలీ ట్రీ తయారు చేద్దామా?

పిల్లలకు ఊహ తెలిశాక 'అమ్మా... నేను ఎక్కడి నుంచి వచ్చాను?' అనే ప్రశ్న అడుగుతారు. పిల్లలకు తమ జన్మ మూలాలే కాదు జన్మకు కారణమైన వారి మూలాల పట్ల కూడా ఆసక్తి ఉంటుంది. ముప్పై నలభై ఏళ్ల క్రితం వరకూ ప్రతి ఇంట్లో పెద్దవాళ్ల ఫొటోలు గోడలకు వేలాడుతుండేవి. పిల్లలు ఎదుగుతూ ఆ ఫొటోల్లో ఉన్నది తమ పెద్దవారని తెలుసుకునేవారు. జేజి నాన్న, నానమ్మ, అమ్మమ్మ, తాతయ్య... వీళ్లను ఫొటోల్లో చూసి తెలుసుకునేవారు. రాను రాను 'ఇంటీరియర్స్'లో భాగంగా ఈ ఫోటోలకు పెద్దగా చోటు లేకుండా పోయింది.

ఒకప్పుడు ప్రతి ఇంట్లో 'ఫ్యామిలీ ఆల్బమ్స్' ఉండేవి. అవి తెరిచి వాటిని చూస్తూ ఉంటే రక్త సంబంధీకులందరూ తెలిసేవారు. డిజిటల్ యుగం వచ్చాక ఆల్బమ్‌లు కూడా పోయాయి. ఉమ్మడి కుటుంబాలుంటే ఒకరు చెప్పకపోయినా మరొకరైనా పెద్ద వాళ్ల గొప్పతనాలు, ఘనతలు, పడిన కష్టాలు పిల్లలకు తెలియచేసేవారు. ముత్తాత, తాతలు అంత కష్టపడి, అన్ని గొప్ప పనులు చేశారు... నేను వారి పేరు నిలబెట్టాలి అని పిల్లలకు తెలిసి వచ్చేది. కాని ఇప్పుడు ఉమ్మడి కుటుంబాలూ లేవు.

వాస్తవం చెప్పాలంటే నేడు చాలా ఇళ్లల్లో పిల్లలకు అమ్మమ్మలు, నానమ్మలు అతి కష్టం మీద తెలుస్తున్నారు. మనిషికి ఒంటరితనం అనుమతి లేదు. ప్రకృతి అలా అంగీకరించదు కనుకే కుటుంబాన్ని ఇచ్చింది. బంధు పరివారాన్ని ఇచ్చింది. నూరేళ్లు జీవించాలంటే ఎన్ని సందర్భాలలోనో ఎందరి తోడో అవసరం. మన కంటూ నిలబడేది మనవారే అనే భావన పిల్లలకు రావాలంటే వారికి 'వంశ వృక్షం' తెలియాలి.

పెద్దవాళ్లూ... గమనించండి... నేడు పిల్లలకు లోకేశ్ కనకరాజ్ యూనివర్స్, ప్రశాంత్ వర్మ యూనివర్స్ తెలుస్తున్నాయిగాని... సొంత ఫ్యామిలీ యూనివర్స్ తెలియడం లేదు. అందుకని ఈ సమ్మర్‌లో ఒక ప్రాజెక్ట్ వర్క్‌లాగా వారి చేత ఫ్యామిలీ ట్రీని గీయించండి.

చార్టులూ, నోట్‌బుక్కులూ:

ఫ్యామిలీ ట్రీని చార్టు మీద తయారు చేయడం ఆనవాయితీ. అంత పని వారు చేయలేకపోయినా ఒక నోట్ బుక్ ఇచ్చి పేజీకి ఒక ఫ్యామిలీ రాయించి కూడా వారికి ఫ్యామిలీ ట్రీని తెలియచేయనివ్వ వచ్చు. వారి చేత ఇలా ఫ్యామిలీ ట్రీ తయారు చేయించండి.

1. మొదట సొంత ఇంటి చెట్టు గీయించండి. నేనూ, తమ్ముడు, అమ్మా, నాన్నా. అమ్మా నాన్నలు చెట్టు కాండమైతే కొమ్మలు పిల్లలు.

2. మరోరోజు ఇంకొంచెం పెద్ద చెట్టు గీయించండి. ఈ చెట్టులో నాన్న తల్లిదండ్రులు, అమ్మ తల్లిదండ్రులు వస్తారు.

3. మూడోరోజు మరికాస్త పెద్ద చెట్టు గీయించి ముత్తాతల వరకూ పేర్లు రాయించాలి. దీంతో ప్రాథమిక వంశ వృక్షం పూర్తయినట్టే.


ఇక్కడి నుంచి పిల్లల అవగాహనను బట్టి శాఖలు విస్తరించుకుంటూ వెళ్లాలి.

పెద తాత, చిన తాత

తాతల అన్నదమ్ములు, అక్కచెల్లెళ్లు ఉంటారని వారూ వారి పిల్లలు మనకు దగ్గరి బంధువులు అవుతారని చెప్పాలి. అలాగే నానమ్మ, అమ్మమ్మల అన్నదమ్ములు, అక్కచెల్లెళ్లు ఉంటారని చెప్పాలి. వాళ్లల్లో ఇప్పుడు అందరూ పిల్లలకు పరిచయంలో లేకపోవచ్చు. కాని కొందరు ఉంటారు. వారు ఫ్యామిలీట్రీలో ఎక్కడ చేరుతారో గీయించాలి.

తక్షణ తరం

పిల్లలకు తక్షణమే అనుబంధంలో ఉండాల్సిన వారు పెదనాన్న, చిన్నాన్న, మేనత్తలు వారి పిల్లలు. ఈ ట్రీని ఒకటి తయారు చేయించాలి.



అలాగే పెదమ్మ, పిన్ని, మావయ్య... వీరూ వీరి పిల్లలు. ఈ ట్రీ కూడా తెలియాలి. వీరందరి పిల్లల గ్రూప్‌ను ఒకటిగా చెట్టు మీద చిటారు కొమ్మల్లో రాయించవచ్చు.

సాయాలూ, ప్రేమలూ:

ఫ్యామిలీ ట్రీలో వరుసలు తెలిస్తే సరిపోదు. ఆ రక్త సంబంధీకులంతా ఒకరి కోసం ఒకరు ఎలా నిలబడ్డారో ఏ సమయంలో ఎవరు సాయం చేశారో, ఎవరు ఎలాంటి ప్రేమను ప్రదర్శించారో పిల్లలకు చెప్పాలి. తెగిన బంధాల గురించి వాటిపై ఉన్న కోపాల గురించి పిల్లలకు చెప్పకపోవడమే మంచిది. 'రేపు మీరు బాగా చదువుకుని పెద్ద ఉద్యోగాలు చేసినా ఎక్కడ ఉన్నా మీ వాళ్లు ఎవరో వారు ఎలా ఉన్నారో తెలుసుకుంటూ ఉండాలి. మంచి చెడుల్లో పాల్గొనాలి. కమ్యూనికేషన్‌లో ఉండాలి' అని గట్టిగా చెప్పాలి.

రోజులు, ప్రపంచం టఫ్‌గా మారుతున్నప్పుడు పిల్లలకు బలగం ఉందన్న భరోసా ఫ్యామిలీ ట్రీ ఇస్తుంది. ఆ చెట్టు పచ్చగా ఉండేలా చూడండి.

– కె.

ఫస్ట్–ఉమన్

దుఃఖాన్ని జయించి...



ప్రతిష్ఠాత్మకమైన 'మిచెలిన్ స్టార్' అవార్డు గెలుచుకున్న ఫస్ట్ ఫిమేల్ 'సుషీ చెఫ్'గా పారిస్‌కు చెందిన 54 ఏళ్ల చిజుకో కిమురా రికార్డ్ సృష్టించింది. నిజానికి ఆమె అనుకోని పరిస్థితుల్లో చెఫ్‌గా మారాల్సివచ్చింది. కిమురా భర్త షునై చెఫ్. మూడు సంవత్సరాల క్రితం రెస్టారెంట్ ప్రారంభించి తన చిరకాల స్వప్నాన్ని నిజం చేసుకున్నాడు. ఆ రెస్టారెంట్ విజయవంతం అయింది. అయితే ఆ సంతోషం ఎంతోకాలం నిలవ లేదు.

భర్తకు క్యాన్సర్ అని నిర్ధారణ కావడంతో చిజుకో కిమురాకు పాలుపోలేదు. ఆ విషాదం నుంచి తేరుకోనక ముందే భర్త చనిపోయాడు. ఏడుస్తూ కూర్చోవడం కంటే భర్త కలను నెరవేర్చడమే ముఖ్యం అనుకుంది.

ఒకప్పుడు టూర్ గైడ్‌గా పనిచేసిన కిమురాకు రెస్టారెంట్ వ్యవహారాలు, వంటల గురించి బొత్తిగా తెలియదు. ఒక్కటొక్కటిగా భర్త నుంచి నేర్చుకుంది. భర్త లేకపోయినా ఆయన నేర్పిన విద్య తనకు తోడుగా ఉంది. ఆ విద్య తనను తిరుగులేని చెఫ్‌ని చేసింది. ప్రతిష్ఠాత్మక అవార్డుకు ఎంపికయ్యేలా చేసింది.

✻ నేడు ప్రపంచ అథ్లెటిక్స్ దినోత్సవం

'హర్డిల్స్' దాటి...

దబ్బు ఉంటేనే పెద్ద పెద్ద కలలను సాధించవచ్చు
అనుకునే నేటి తరానికి అది సరికాదని, కృషి, పట్టుదల ఉంటే
అన్ని హర్డిల్స్‌ను దాటవచ్చునని నిరూపిస్తోంది
విశాఖపట్టణవాసి జ్యోతి యర్రాజీ.
తండ్రి సూర్యనారాయణ సెక్యూరిటీ గార్డుగా చేస్తుంటే
తల్లి కుమారి కుటుంబ పోషణకు ఇళ్లలో పనులు చేసేది.
తన తలరాతను తనే మార్చుకుంటానని తెలియని వయసులోనే
స్కూల్లో గ్రౌండ్‌లో పరుగులు మొదలు పెట్టింది జ్యోతి.
సీనియర్ అథ్లెట్ల పరుగులు గమనిస్తూ,
తన మార్గాన్ని తనే వేసుకుంది.
ఆ పరుగులు జాతీయ స్థాయికే కాదు ఒలింపిక్స్ వరకు వెళ్లేలా...
ఫోర్బ్స్ జాబితాలో చేరేలా చేశాయి.



జ్యోతి యర్రాజీ

దక్షిణ కొరియాలో ఈనెల 27 నుంచి జరగబోయే ఆసియన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌కి పోటీ పడటానికి సిద్ధపడుతోంది జ్యోతి. అందుకు ముంబయ్‌లోని రిలయెన్స్ అథ్లెటిక్స్ హై పెర్‌ఫార్మెన్స్ సెంటర్‌లో శిక్షణ పొందుతోంది. 'పతకాన్ని సాధించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నా'ను అని తెలిపింది.

తన రికార్డుల్ని తానే తిరగరాస్తూ...

స్కూల్ వయసులో గ్రౌండ్‌లో తోటి పిల్లలతో పరుగులు తీసేది. పాఠశాలకు చేరువలోనే విశాఖ పోర్ట్ స్టేడియం ఉండటం, అక్కడ సీనియర్ అథ్లెట్ల ప్రాక్టీస్‌ను పరిశీలించడం దినచర్యగా ఉండేది. తొలుత సబ్ జూనియర్ స్థాయిలో అంతర పాఠశాలల అథ్లెటిక్స్ మీట్‌లో పతకం సాధించింది. అలా ప్రారంభమైన జ్యోతి ఎర్రాజీ ట్రాక్ ఒలింపిక్స్‌లో పాల్గొన్న తొలి భారతీయ ఉమెన్ హర్డిలర్‌గా ఖ్యాతి దక్కించుకుంది. ట్రాక్‌లో గాయపడటం, జాతీయ రికార్డు నమోదును గుర్తించకపోవడం లాంటి సమస్యలనూ అధిగమించింది. పసిడి పతకాలతో జాతీయ రికార్డును తిరగరాయడమే కాదు 100 మీటర్ల హర్డిల్స్‌లో అర్ధశతాబ్దపు భారత్ కలను నెరవేర్చింది.

మరెవ్వరూ పోటీపడలేనంతగా తన రికార్డులను తనే తిరగరాసుకుంది. కిందటేడాది ఫిబ్రవరిలో ప్రముఖ పత్రిక ఫోర్బ్స్ 30 అండర్ 30 జాబితాలో జ్యోతి ఎర్రాజి పేరు చేరింది. కలను లక్ష్యంగా మలుచుకొని, ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తోంది జ్యోతి.

– డా. సూర్యప్రకాష్ మాడిమి, సాక్షి స్పోర్ట్స్, విశాఖపట్నం



అగ్రస్థానంలో జ్యోతి సురేఖ బృందం


ప్రపంచకప్ ఆర్చరీ స్టేజ్-2 టోర్నమెంట్ క్వాలిఫయింగ్ రౌండ్‌లో భారత కాంపౌండ్ ఆర్చర్లు రాణించారు. చైనాలోని షాంఘై నగరంలో మంగళవారం ఈ టోర్నీ మొదలైంది. వెన్నం జ్యోతి సురేఖ (ఆంధ్రప్రదేశ్), చికిత తనిపర్తి (తెలంగాణ), మధుర, అదితి స్వామి (మహారాష్ట్ర)లతో కూడిన భారత మహిళల కాంపౌండ్ జట్టు 2114 పాయింట్లు స్కోరు చేసి టాప్ ర్యాంక్‌లో నిలిచింది. ఈ ప్రదర్శనతో భారత జట్టు నేడు జరిగే మెడల్ రౌండ్‌లో నేరుగా క్వార్టర్ ఫైనల్ ఆడనుంది. క్వాలిఫయింగ్‌లో మధుర 708 పాయింట్లు (3వ స్థానం), జ్యోతి సురేఖ 705 పాయింట్లు (6వ స్థానం), చికిత 701 పాయింట్లు (11వ స్థానం), అదితి 699 పాయింట్లు (13వ స్థానం) సాధించారు. అభిషేక్ వర్మ, రిషభ్ యాదవ్, ఓజస్ ప్రవీణ్ దేవ్‌తలే, ఉదయ్ కంబోజ్‌లతో కూడిన భారత పురుషుల కాంపౌండ్ జట్టు కూడా క్వాలిఫయింగ్‌లో నంబర్‌వన్ ర్యాంక్‌లో నిలిచింది. భారత జట్టు మొత్తం 2134 పాయింట్లు స్కోరు చేసి నేరుగా క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించింది. క్వాలిఫయింగ్‌లో అభిషేక్ 714 పాయింట్లు (3వ స్థానం), రిషభ్ 713 పాయింట్లు (4వ స్థానం), ఓజస్ 707 పాయింట్లు (10వ స్థానం), ఉదయ్ 699 పాయింట్లు (29వ స్థానం) సాధించారు.

ముంబై జోరుకు బ్రేక్

- ఉత్కంఠ పోరులో ఓటమి
- 3 వికెట్లతో గుజరాత్ టైటాన్స్ గెలుపు

ముంబై: ఐపీఎల్-2025లో ముంబై ఇండియన్స్ జైత్రయాత్రకు కాస్త విరామం... వరుసగా ఆరు విజయాలతో కొనసాగించిన జోరుకు గుజరాత్ టైటాన్స్ బ్రేక్ వేసింది. మంగళవారం వాంఖెడే మైదానంలో జరిగిన పోరులో గుజరాత్ 3 వికెట్ల తేడాతో (డక్‌వర్త్ లూయిస్ ప్రకారం) ముంబైపై విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ముంబై 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 155 పరుగులు చేసింది. విల్ జాక్స్ (35 బంతుల్లో 53; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీ సాధించగా, సూర్యకుమార్ యాదవ్ (24 బంతుల్లో 35; 5 ఫోర్లు) రాణించాడు. వీరిద్దరు మూడో వికెట్‌కు 43 బంతుల్లో 71 పరుగులు జోడించారు. చక్కటి బౌలింగ్‌తో ముంబైని తక్కువ స్కోరుకు కట్టడి చేయడంలో టైటాన్స్ సఫలమైంది. అనంతరం గుజరాత్ 19 ఓవర్లలో 7 వికెట్లకు 147 పరుగులు చేసి గెలిచింది. శుబ్‌మన్ గిల్ (46 బంతుల్లో 43; 3 ఫోర్లు, 1 సిక్స్), జోస్ బట్లర్ (27 బంతుల్లో 30; 3 ఫోర్లు, 1 సిక్స్), రూథర్‌ఫర్డ్ (15 బంతుల్లో 28; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. ఛేదనలో 14 ఓవర్ల తర్వాత 107/2తో గుజరాత్ మెరుగైన స్థితిలో నిలిచింది. చేతిలో 8 వికెట్లు ఉన్న జట్టు మరో 36 బంతుల్లో 49 పరుగులే చేయాలి. గుజరాత్ విజయం లాంఛనమే అనిపించింది. ఈ దశలో వానతో చాలా సేపు ఆట ఆగిపోయింది. అంతా చక్కబడి మ్యాచ్ మొదలైన తర్వాత ఒక్కసారిగా పరిస్థితి మారిపోయింది. బుమ్రా, బౌల్ట్ చెలరేగిపోవడంతో గుజరాత్ బ్యాటింగ్ తడబాటుకు లోనైంది. తర్వాతి 4 ఓవర్లలో 25 పరుగులు చేసిన జట్టు 16 బంతుల వ్యవధిలో 4 వికెట్లు కోల్పోయింది. 2 ఓవర్లలో 24 పరుగులు చేయాల్సిన ఉన్న సమయంలో మళ్లీ భారీ వర్షంతో ఆట ఆగిపోయింది. దాంతో ఆటను ఒక ఓవర్ కుదించి డక్‌వర్త్-లూయిస్ ప్రకారం గుజరాత్ లక్ష్యాన్ని 19 ఓవర్లలో 147గా నిర్దేశించారు. దాంతో చివరి ఓవర్లో విజయానికి 15 పరుగులు అవసరమయ్యాయి. చహర్ వేసిన ఈ ఓవర్లో టైటాన్స్ 15 పరుగులు చేసి విజయాన్నందుకుంది.





నిరాశలో హార్దిక్

స్కోరు వివరాలు:

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: రికెల్టన్ (సి) సుదర్శన్ (బి) సిరాజ్ 2; రోహిత్ (సి) ప్రసిధ్ (బి) అర్షద్ 7; జాక్స్ (సి) సుదర్శన్ (బి) రషీద్ 53; సూర్యకుమార్ (సి) షారుఖ్ (బి) సాయికిషోర్ 35; తిలక్ (సి) గిల్ (బి) కొయెట్జీ 7; పాండ్యా (సి) గిల్ (బి) సాయికిషోర్ 1; నమన్ (సి) గిల్ (బి) ప్రసిధ్ 7; బాష్ (రనౌట్) 27; చహర్ (నాటౌట్) 8; కరణ్ శర్మ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 155. వికెట్ల పతనం:** 1-2, 2-26, 3-97, 4-103, 5-106, 6-113, 7-123, 8-150. **బౌలింగ్:** సిరాజ్ 3-0-29-1, అర్షద్ 3-0-18-1, ప్రసిధ్ 4-0-37-1, సాయికిషోర్ 4-0-34-2, రషీద్ ఖాన్ 4-0-21-1, కొయెట్జీ 2-0-10-1.

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: సాయి సుదర్శన్ (సి) రికెల్టన్ (బి) బౌల్ట్ 5; గిల్ (బి) బుమ్రా 43; బట్లర్ (సి) రికెల్టన్ (బి) అశ్వని 30; రూథర్‌ఫర్డ్ (ఎల్బీ) (బి) బౌల్ట్ 28; షారుఖ్ (బి) బుమ్రా 6; తెవాటియా (నాటౌట్) 11; రషీద్ ఖాన్ (ఎల్బీ) (బి) అశ్వని 2; కొయెట్జీ (సి) నమన్ (బి) చహర్ 12; అర్షద్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (19 ఓవర్లలో 7 వికెట్లకు) 147. వికెట్ల పతనం:** 1-6, 2-78, 3-113, 4-115, 5-123, 6-126, 7-146. **బౌలింగ్:** దీపక్ చహర్ 3-0-32-1, బౌల్ట్ 4-0-22-2, బుమ్రా 4-0-19-2, హార్దిక్ పాండ్యా 1-0-18-0, కరణ్ శర్మ 2-0-13-0, అశ్వని కుమార్ 4-0-28-2, జాక్స్ 1-0-15-0.

ఐపీఎల్-2025 పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	ర.రే
గుజరాత్	11	8	3	0	16	0.793
బెంగళూరు	11	8	3	0	16	0.482
పంజాబ్	11	7	3	1	15	0.376
ముంబై	12	7	5	0	14	1.156
ఢిల్లీ	11	6	4	1	13	0.362
కోల్‌కతా	11	5	5	1	11	0.249
లక్నో	11	5	6	0	10	-0.469
హైదరాబాద్	11	3	7	1	7	-1.192
రాజస్తాన్	12	3	9	0	6	-0.718
చెన్నై	11	2	9	0	4	-1.117

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ఫ.తే- ఫలితం తేలనివి, పా-పాయింట్లు, ర.రే- రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

కోల్‌కతా × చెన్నై
వేదిక: కోల్‌కతా
రాత్రి 7: 30 గంటల నుంచి
స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

పాక్‌తో ఐసీసీ టోర్నీల్లోనూ ఆడవద్దు!

- భారత ప్రభుత్వానిదే తుది నిర్ణయం
- హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ వ్యాఖ్య

న్యూఢిల్లీ: సరిహద్దు వివాదాల నేపథ్యంలో భారత్, పాకిస్తాన్ మధ్య పుష్కర కాలంగా ద్వైపాక్షిక క్రికెట్ సిరీస్‌లు జరగడం లేదు. అయితే ఐసీసీ టోర్నీల్లో మాత్రం ఇరు జట్లూ తలపడుతున్నాయి. ఇప్పుడు దీనికి కూడా ఫుల్‌స్టాప్ పెట్టాల్సిన అవసరం ఉందని భారత టీమ్ హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ అభిప్రాయపడ్డాడు. భారత్, పాక్ సరిహద్దుల్లో తీవ్రవాదం ముగిసేవరకు ఇరు జట్ల మధ్య ఆటలకు ప్రాధాన్యత లేదని అతను అన్నాడు. ఈ విషయంలో బీసీసీఐ మాత్రమే కాదు, భారత ప్రభుత్వమే తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని గంభీర్ వ్యాఖ్యానించాడు. 'నా అభిప్రాయం ప్రకారం ఇరు దేశాల మధ్య పరిస్థితులు మెరుగుపడే వరకు అసలు ఎలాంటి ఆటలు అవసరం లేదు. గతంలోనూ ఈ అభిప్రాయాన్ని వెల్లడించాను. నా దృష్టిలో క్రికెట్ మ్యాచ్, బాలీవుడ్ సినిమాలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలేవీ భారత సైనికులు లేదా భారత పౌరుల ప్రాణాలకంటే ముఖ్యం కాదు. మ్యాచ్‌లు జరుగుతుంటాయి. సినిమాలు వస్తూ పోతూ ఉంటాయి. గాయకులు వేదికలపై పాడుతూనే ఉంటారు. కానీ మీ ఆత్మీయులను కోల్పోయిన బాధను ఏదీ తగ్గించలేదు. ఈ ఏడాది జరిగే ఆసియా కప్ గురించి నేను ఏమీ చెప్పలేను. అది పూర్తిగా ప్రభుత్వ నిర్ణయం. వారు ఏం చెబితే దానిని పాటిస్తాం' అని గంభీర్ స్పష్టం చేశాడు.



భారత క్రికెట్ వారి ఆస్తి కాదు!

సుదీర్ఘ కాలంగా తనపై విమర్శలు చేసే ఇద్దరు భారత మాజీ కెప్టెన్ల వ్యాఖ్యలపై ఈసారి గంభీర్ ఘాటుగా స్పందించాడు. ప్రస్తుతం కామెంటేటర్లుగా ఉన్న సునీల్ గావస్కర్, రవిశాస్త్రి తనపై పదే పదే విమర్శలు చేసిన విషయాన్ని పరోక్షంగా గంభీర్ గుర్తు చేశాడు. 2011లో ఇంగ్లండ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లో గంభీర్ తలకు తగిలిన గాయం 'అంత పెద్దదేమీ కాదు' అని రవిశాస్త్రి అప్పట్లో విమర్శించగా... తాజాగా చాంపియన్స్ ట్రోఫీ గెలిచాక బీసీసీఐ ప్రకటించిన ప్రైజ్‌మనీలో సహచర కోచింగ్ సిబ్బందికంటే గంభీర్ ఎక్కువ మొత్తం తీసుకోవడాన్ని గావస్కర్ ప్రశ్నించాడు. ఇప్పుడు వీరిద్దరికి కలిపి గంభీర్ సమాధానమిచ్చాడు. 'నేను కోచ్‌గా వచ్చి ఎనిమిది నెలలే అయింది. ఫలితాలు రాకపోతే విమర్శించే హక్కు అభిమానులకు ఉంది. కానీ 25 ఏళ్లుగా కామెంటరీ బాక్స్‌లో కూర్చున్నవారు భారత క్రికెట్‌కు తమ ఆస్తిగా భావిస్తున్నట్లున్నారు. వారు నా కోచింగ్‌ను, నా గాయాన్ని, చాంపియన్స్ ట్రోఫీ ప్రైజ్‌మనీని కూడా ప్రశ్నించారు. నేను నిజానికి ఎవరికీ వివరణ ఇవ్వాల్సిన అవసరం లేదు. వేరేవాళ్లకు డబ్బులు ఇచ్చానా లేదా అనేది వారికి అనవసరం. గాజు గృహాల్లో ఉండేవారు వేరేవాళ్ల మీద రాళ్లు విసరవద్దు' అని గంభీర్ స్పష్టం చేశాడు.

ఒత్తిడి భరించలేకే...



- అందుకే కెప్టెన్సీ నుంచి తప్పుకున్నా
- విరాట్ కోహ్లి వ్యాఖ్య

బెంగళూరు: భారత జట్టుతో పాటు దాదాపు దశాబ్దకాలం పాటు రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టుకు నాయకత్వం వహించడం తనపై తీవ్ర ఒత్తిడిని పెంచిందని, అందుకే కాస్త ప్రశాంతత కోరుకుంటూ స్వచ్ఛందంగా తప్పుకున్నానని విరాట్ కోహ్లి వెల్లడించాడు. కెప్టెన్సీ వదిలేశాక తన దైన ప్రపంచంలో హాయిగా అనిపించిందని అతను గుర్తు చేసుకున్నాడు. అటు సారథ్యం వహించడంతో పాటు ఇటు తన బ్యాటింగ్‌పై కూడా సూక్ష్మ సమీక్షలు జరగడం బాగా ఇబ్బంది పెట్టిందని అతను అన్నాడు. 2021 టి20 వరల్డ్ కప్ తర్వాత భారత పరిమిత ఓవర్ల కెప్టెన్సీకి రాజీనామా చేసిన కోహ్లి... కొద్ది రోజులకే ఆర్‌సీబీ, భారత టెస్టు జట్టు సారథ్యం కూడా వదిలేశాడు. 'ఒకదశలో పరిస్థితి మరీ ఇబ్బందికరంగా మారిపోయింది. నా కెరీర్‌లో ఆ సమయంలో ఎన్నో ఘటనలు జరిగాయి. భారత జట్టుకు కెప్టెన్సీ చేసినప్పుడు, ఆర్‌సీబీకి సారథిగా ఉన్నప్పుడు నా బ్యాటింగ్‌ను కూడా కలిపి చూడటంతో నాపై అంచనాలు అతిగా పెరిగిపోయాయి. అందరి దృష్టిలో పడకుండా తప్పించుకునే అవకాశం ఏమాత్రం లేదు. 24 గంటలు నన్ను వెంటాడినట్లుగా అనిపించింది. చివరకు భరించలేనంత స్థితికి వచ్చేశాను. దాంతో కెప్టెన్సీకి గుడ్‌బై చెప్పడమే సరైన నిర్ణయమనిపించింది' అని విరాట్ వివరించాడు. వ్యక్తిగతంగా కూడా తాను మానసిక ప్రశాంతత కోరుకున్నానని, అందుకే 2022లో నెల రోజుల పాటు ఆట నుంచి విరామం తీసుకున్న సమయంలో కనీసం బ్యాట్ కూడా ముట్టుకోలేదని అతను వెల్లడించాడు. 'నాపై అందరి దృష్టి పడకుండా, ఎక్కువగా నా గురించి చర్చించకుండా సంతోషంగా ఉండాలని భావించా. నా బ్యాటింగ్ నేను చేసుకొని వెళ్లిపోతే చాలనుకున్నాను. వైఫల్యాల గురించి పట్టించుకోకుండా హాయిగా ఉండాలని భావించా' అని విరాట్ చెప్పాడు. అండర్-19 ప్రపంచ కప్ గెలిచినంత మాత్రాన సీనియర్ టీమ్‌లో చోటు గ్యారంటీ లేదని తనకు అర్థమైందని... తాను పట్టుదలగా ఆడటంతో పాటు కెప్టెన్ ధోని, కోచ్ కిర్‌స్టెన్ అండగా నిలవడంతో మూడో స్థానం తనకు ఖాయమైందని ఈ దిగ్గజ బ్యాటర్ వ్యాఖ్యానించాడు. 'నా సామర్థ్యం గురించి నాకు బాగా తెలుసు. చాలా మంది దిగ్గజాల్లాంటి ఆట నా వద్ద లేదు కాబట్టి ఎలాగైనా సాధించాలనే నా పట్టుదల, పోరాటతత్వంతోనే అవకాశాలు దక్కించుకోవాలని అనుకున్నా. ఇదే కారణంతో ధోని, కిర్‌స్టెన్ నన్ను ప్రోత్సహించారు. నా సహజశైలిలోనే ఆడమని, అలాంటి దూకుడైన తత్వమే కావాలని వారు నాకు చెప్పారు. ఇదే నన్ను ముందుకు నడిపించింది. ఎక్కడా వెనక్కి తగ్గని, ఓటమిని అంగీకరించని స్వభావంతోనే నిలబడిగలిగాను' అని కోహ్లి తన ఆత్మవిశ్వాసాన్ని ప్రదర్శించాడు.

సాక్షి సినిమా

ఏ మాయ చేసావె రోజులు గుర్తొచ్చాయి!



"ఈ మధ్య ప్రేక్షకులను థియేటర్స్‌కు తీసుకురావడం చాలా కష్టమైపోయింది. అయితే స్టార్ హీరో చేసిన సినిమాలు చూసేందుకు ప్రేక్షకులు థియేటర్స్‌కు ఎలాగైతే వస్తున్నారో... అలా ఓ మంచి కంటెంట్ ఉన్న సినిమాను చూసేందుకూ వస్తారని నమ్ముతాను. 'శుభం' సినిమా ప్రేక్షకులను థియేటర్స్‌కు రప్పిస్తుందని ఈ సినిమా నిర్మాతగా నమ్ముతున్నాను" అని హీరోయిన్ సమంత అన్నారు. హర్షిత్ రెడ్డి, గవిరెడ్డి శ్రీనివాస్, చరణ్ పేరి, శ్రియా కొంతం, శ్రావణి లక్ష్మీ, వంశీధర్ గౌడ్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'శుభం'. ప్రవీణ్ కంద్రేగుల దర్శకత్వంలో ట్రా లా లా మూవీంగ్ పిక్చర్స్ పతాకంపై సమంత నిర్మించిన ఈ తొలి చిత్రం ఈ నెల 9న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో సమంత చెప్పిన విశేషాలు...

- సమంత

- నేను హీరోయిన్‌గానే కొనసాగాలని సినిమాలు చేసుకుంటూ వస్తున్న సమయంలో హఠాత్తుగా నాకు నటనలో లాంగ్ బ్రేక్ వచ్చింది. అనారోగ్యాన్ని అధిగమించడానికి ఇంట్లోనే ఉండాల్సి వచ్చింది. నటించలేకపోతున్నాను.... ప్రొడక్షన్ చేద్దామని అనుకున్నాను. అలా 'శుభం' సినిమాను మొదలుపెట్టాం. ఎనిమిది నెలల్లోనే షూటింగ్ పూర్తి చేశాం. దాదాపు వంది మంది 'శుభం' సినిమా చూసి, పాజిటివ్ ఫీడ్ బ్యాక్ ఇచ్చారు. సినిమా విజయంపై నమ్మకం ఉంది.
- 'శుభం' సినిమా ఓ టీవీ సీరియల్ నేపథ్యంలో సాగుతుంది. ఈ సీరియల్ 'శుభం' కార్డు కోసం అందరూ ఎదురుచూస్తుంటారు. న్యూ ఏజ్ హారర్ కామెడీ ఫిల్మ్ ఇది. సోషల్ సెటైర్‌లా ఉంటుంది. ఈ సినిమాకు కాస్త బడ్జెట్ ఎక్కువైంది. ప్రొడ్యూసర్‌గా నాకు భవిష్యత్ ఉందా? లేదా అనేది 'శుభం' రిలీజ్ తర్వాత తెలుస్తుంది. నేను తెలివైన నిర్మాతను కాకపోవచ్చు, తెలివైన బిజినెస్ ఉమెన్‌ని కాకపోవచ్చు. అయితే నా మనసు ఏం చెబుతుందో ఆ నిర్ణయాలనే తీసుకుంటా. ఫైనాన్షియల్ వ్యవహారాలను మా బిజినెస్ పార్ట్‌నర్ హిమాంక్ చూసుకుంటుంటారు. 'శుభం' సినిమాకు ఎంత ఖర్చు పెట్టాం అనేది తర్వాత చెబుతాను. ప్రస్తుతానికి నా దగ్గర కొంచెం డబ్బులైతే ఉన్నాయి (నవ్వుతూ..)
- 2010లో దర్శకులు గౌతమ్ మీనన్‌గారు పిలిస్తే ఏ హీరోయిన్ అయినా ఆయన సినిమాకి ఓకే చెప్పేవారు. కానీ ఆయన రిస్క్ తీసుకుని, నాకు నటిగా తొలి (ఏ మాయ చేసావె) చాన్స్ ఇచ్చారు. పదిహేనేళ్లుగా ఇండస్ట్రీలో కొనసాగుతున్నాను. ఇప్పుడు నిర్మాతగా కొత్త కథలు చెప్పాల్సిన బాధ్యత నా మీద ఉందనిపించింది. కొత్తవారితో పని చేయాలి. అందుకే నిర్మాతగా నా తొలి సినిమాలో నేను మెయిన్ లీడ్ రోల్ చేయలేదు. ఈ సినిమాలో అతిథి పాత్ర ఉంది. నాకు ఫేవర్స్ అడగటం ఇష్టం లేదు. అందుకే ఈ రోల్‌ను నేనే చేశాను.
- 'శుభం'లో నూతన నటీనటులు నటించారు. కెరీర్ కోసం వాళ్లు చాలా త్యాగాలు చేశారు. వాళ్ల స్టోరీస్ వింటుంటే నిర్మాతగా గర్వంగా అనిపించింది. అలాగే నా తొలి సినిమా 'ఏ మాయ చేసావె' రోజులు గుర్తొచ్చాయి. ఇప్పటివరకు నేను ప్రొడ్యూసర్స్ యాక్ట్రస్ అనుకున్నాను. కానీ... నేను ఇంకా ప్రొడ్యూసర్స్ ఫ్రెండ్లీ యాక్ట్రస్‌గా ఉండాలని నాకనిపించింది.
- ఈక్వల్ స్కిల్... ఈక్వల్ ఎక్స్‌పీరియన్స్... ఈక్వల్ పే ఉండాలని నా డ్రీమ్. మా ప్రొడక్షన్ హౌస్‌లో సాధ్యమైనంత వరకు ప్రయత్నిస్తాను. కథలు వినేటప్పుడే ఇందులో ఈక్వెల్ పే సాధ్యమౌతుందా? అని ఆలోచించి నిర్ణయించుకుంటాను. నా ప్రొడక్షన్‌లో నెక్స్ట్ మూవీ 'మా ఇంటి బంగారం'. జూన్‌లో మళ్లీ షూటింగ్ స్టార్ట్ చేస్తాం. నా నుంచి సినిమా వచ్చి రెండేళ్లవుతోంది. కొన్ని పనులు జరుగుతున్నాయి. ఆ విషయాలు త్వరలో చెబుతాను.
- అమెరికాలో విదేశీ సినిమాలపై వందశాతం సుంకం విధించారనేది ఇంకా అమలులోకి రాలేదని అనుకుంటున్నాను. అయినా ప్రతివారం మార్పులు చోటు చేసుకుంటూనే ఉంటాయి కదా.
- నా ఫ్యాన్ ఒకరు నా కోసం గుడి కట్టారని విన్నాను. ఆ అభిమాని ప్రేమను అర్థం చేసుకోగలను. ఆ ప్రేమను అగౌరవపరచలేను. కానీ ఈ విధానాన్ని (గుడి కట్టడం, పూజలు చేయడం వంటివి) ప్రోత్సహించను.
- **జీవితం పట్ల మీ దృష్టికోణం చాలా మారిపోయినట్లుగా కనిపిస్తోంది. వృత్తి, వ్యక్తిగత జీవితాల విషయంలో ఎలాంటి కొత్త నిర్ణయాలు తీసుకోబోతున్నారు? అన్న ప్రశ్నకు... "మళ్లీ నా వ్యక్తిగత జీవితం గురించి నా లైఫ్‌లో బహిరంగంగా మాట్లాడను (నవ్వుతూ). ఆ ఒక్కటి మాత్రం బాగా అర్థమైంది" అన్నారు సమంత.**

ఒక తార పుట్టింది!

''ఒక స్టార్ (తార) పుట్టింది.... కుమారి'' అంటూ రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా భాగ్యశ్రీ బోర్సే కొత్త లుక్‌ని విడుదల చేసింది. 1950 మద్రాస్ నేపథ్యంలో రూపొందిన 'కాంత' చిత్రంలో భాగ్యశ్రీ పోషించిన పాత్ర పేరు కుమారి. మంగళవారం (మే 6) ఆమె పుట్టిన రోజు సందర్భంగా ఈ చిత్రంలోని కొత్త ఫొటోను విడుదల చేసింది యూనిట్. ప్రశాంత్ పొట్లూరి, జోమ్ వర్గీస్‌తో కలిసి రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా - దుల్కర్ సల్మాన్ వేఫేరర్ ఫిల్మ్స్ పతాకంపై దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే జంటగా రూపొందిన చిత్రం 'కాంత'. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వంలో ఈ బహు భాషా చిత్రం రూపొందింది. ఇటీవలే ఈ చిత్రం షూటింగ్ పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ''అద్భుతమైన కథ, గొప్ప నటీనటులు, ప్రతిభ గల సాంకేతిక నిపుణులతో రూపొందించిన ఈ చిత్రం ప్రేక్షకులకు ఒక అద్భుతమైన అనుభూతిని చ్చేలా ఉంటుంది. త్వరలో ఈ చిత్రం రిలీజ్ డేట్ ప్రకటిస్తాం'' అని చిత్రబృందం పేర్కొంది.




భాగ్యశ్రీ బోర్సే

చాలా భయపడ్డాను!

- షారుక్ ఖాన్

- 'మెట్ గాలా'లో పాల్గొన్న తొలి భారతీయ నటుడిగా షారుక్ ఖాన్





కియారా

సెలబ్రిటీల ఫ్యాషన్ షో 'మెట్ గాలా' వేడుక వైభవంగా ప్రారంభమైంది. న్యూయార్క్‌లోని మెట్రోపాలిటన్ మ్యూజియం ఆఫ్ ఆర్ట్స్ వేదికగా ఈ ఫ్యాషన్ సెలబ్రేషన్స్ జరుగుతున్నాయి. ఈ ఏడాది 'మెట్ గాలా' డ్రెస్‌కోడ్ 'టైలర్డ్ ఫర్ యు' కాగా, 'సూపర్‌ఫైన్: టైలరింగ్ బ్లాక్‌స్టైల్'ను థీమ్‌గా నిర్ణయించారు నిర్వాహకులు. ఈ థీమ్‌కు తగ్గట్లుగా ఈ వేడుకలో నలుపు రంగు దుస్తుల్లో పాల్గొన్నారు ప్రముఖులు. ఇక ఈ వేడుకలకు హాజరైన తొలి భారతీయ నటుడిగా షారుక్ ఖాన్ చరిత్ర సృష్టించారు. సబ్యసాచి డిజైన్ చేసిన దుస్తుల్లో అల్ట్రా స్టైలిష్‌గా కనపడి, ఈ వేడుకలో సెంటరాఫ్ ఎట్రాక్షన్‌గా నిలిచారు షారుక్ ఖాన్. ''ఈ ఏడాది మెట్ గాలాకి ఆహ్వానం అందగానే నా కుమారుడు ఆర్యన్, కుమార్తె సుహానా ఎంతగానో సంతోషించారు. ఈ వేడుకలో నేను పాల్గొంటే అది చరిత్ర అవుతుందని కూడా నాకు తెలియదు. నేను ఇప్పటివరకు రెడ్ కార్పెట్‌పై నడవలేదు. నాకు ఫ్యాషన్‌పై ఆసక్తి కూడా తక్కువ. దీంతో ఈ వేడుకకు రావడానికి నేను చాలా భయపడ్డాను. కాస్త బిడియంగా అనిపించింది. ఓ దశలో పారిపోవాలనిపించింది'' అని పేర్కొన్నారు షారుక్ ఖాన్. ఇంకా ఈ వేడుకలో నటి-నిర్మాత ప్రియాంకా చోప్రా, ఆమె భర్త-నటుడు నిక్ జోనస్, హీరోయిన్ కియారా అద్వానీ, సింగర్-నటుడు-నిర్మాత దిల్జీత్ సింగ్ తదితర ప్రముఖులు పాల్గొని సందడి చేశారు. ఇక త్వరలో తల్లి కాబోతున్న కియారా అద్వానీ ఈ వేడుకలో 'బేబీ బంప్'తో మెరిశారు.

ఆ డ్రామాలు నాకు నచ్చవు

- కేతికా శర్మ

''కెరీర్ పరంగా హ్యాపీగా ఉన్నాను. హిట్, ఫ్లాప్స్ మన చేతిలో ఉండవు. ఓ నటిగా పని చేయడం మాత్రమే నా చేతిలో ఉంటుంది. ఇండస్ట్రీలో కొనసాగడం లక్‌గా భావిస్తున్నా'' అన్నారు కేతికా శర్మ. శ్రీవిష్ణు హీరోగా రూపొందిన చిత్రం 'సింగిల్'. ఈ చిత్రంలో కేతికా శర్మ, ఇవానా హీరోయిన్లుగా నటించారు. అల్లు అరవింద్ సమర్పణలో విద్యా కొప్పినీడి, భాను ప్రతాప, రియాజ్ చౌదరి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 9న విడుదల కానుంది. ఈ సందర్భంగా కేతికా శర్మ మాట్లాడుతూ- ''సింగిల్' సినిమాలో ఆడీ కంపెనీలో పని చేసే పూర్వ అనే అమ్మాయి పాత్ర చేశాను. పూర్వ స్వతంత్ర భావాలున్న అమ్మాయి. ఈ మూవీలోని లవ్‌స్టోరీ వినోదాత్మకంగా, ఆసక్తికరంగా ఉంటుంది. అల్లు అరవింద్‌గారి సమర్పణలో గీతా ఆర్ట్స్‌లో ఓ మూవీ చేయాలని ఎప్పట్నుంచో అనుకుంటున్నాను. ఇప్పుడు కుదిరినందుకు హ్యాపీగా ఉంది. కామెడీ చేయడం చాలా కష్టం. అందుకే ఈ సినిమా ఇంట్రావెల్ సీక్వెన్స్ చాలా సవాల్‌గా అనిపించింది. ఇక 'రాబిన్ హుడ్' సినిమాలో నేను చేసిన 'అదిదా సర్‌ప్రైజ్'లాంటి డ్యాన్స్ మూమెంట్స్ ఈ మూవీలో లేవు. సెట్స్‌లో దర్శకులు ఏదీ చెబితే అది చేస్తాను. అలా 'అదిదా సర్‌ప్రైజ్' సాంగ్ చేశాను. ఈ సాంగ్‌లోని కొన్ని డ్యాన్స్ మూమెంట్స్‌పై భిన్నా భిప్రాయాలు వ్యక్తమయ్యాయి. భవిష్యత్‌లో అలాంటి మూమెంట్స్‌పై జాగ్రత్తలు తీసుకుంటా. ప్రస్తుతం తెలుగు, తమిళ భాషల్లో ఓ సినిమా చేస్తున్నాను'' అన్నారు. మీరు లైఫ్‌లో సింగిల్‌గా ఉన్నారా? అన్న ప్రశ్నకు... ''ప్రస్తుతం సింగిల్‌గా ఉన్నాను. రిలేషన్‌షిప్ అంటూ లేనిపోని డ్రామాలు నాకు నచ్చవు. నిజాయితీగా ఉండాలి. రైట్ పర్సన్ దొరికితే... ప్రేమిస్తాను'' అని చెప్పారు కేతికా శర్మ.



కమింగ్ సూన్



లావణ్య, వరుణ్ తేజ్

వరుణ్ తేజ్, లావణ్యా త్రిపాఠి దంపతులు శుభవార్త చెప్పారు. తాము తల్లిదండ్రులు కాబోతున్న విషయాన్ని ఈ ఇద్దరూ సోషల్ మీడియా వేదికగా అధికారికంగా వెల్లడించి, సంతోషం వ్యక్తం చేశారు. ''జీవితంలో అత్యంత అందమైన రోల్ రాబోతోంది. కమింగ్ సూన్'' అంటూ ఇన్‌స్టా వేదికగా ఓ బ్యూటిఫుల్ ఫొటోను షేర్ చేశారు వరుణ్ తేజ్-లావణ్యా త్రిపాఠి. 2023 నవంబరు 1న ఇటలీలో వరుణ్ - లావణ్య వివాహం చేసుకున్న సంగతి తెలిసిందే. ఇక వీరిద్దరి సినిమాల విషయానికి వస్తే... వరుణ్ తేజ్ హీరోగా మేర్లపాక గాంధీ దర్శకత్వంలో ఓ మూవీ తెరకెక్కుతోంది. అలాగే లావణ్యా త్రిపాఠి 'సతీ లీలావతి' అనే చిత్రంలో నటిస్తున్నారు.

నెలాఖరున షష్టిపూర్తి



అర్చన, ఆకాంక్షా సింగ్, రాజేంద్రప్రసాద్, రూపేష్

రూపేష్, ఆకాంక్షా సింగ్ హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'షష్టిపూర్తి'. 'లేడీస్ టైలర్' విడుదలైన 38 ఏళ్ల తర్వాత రాజేంద్ర ప్రసాద్, అర్చన మళ్లీ స్క్రీన్ షేర్ చేసుకున్న చిత్రం ఇది. పవన్ ప్రభను దర్శకునిగా పరిచయం చేస్తూ మా ఆయి ప్రొడక్షన్స్ పతాకం పై రూపేష్ నిర్మించిన చిత్రం ఇది. ఈ నెల 30న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నామని మంగళవారం యూనిట్ ప్రకటించింది. ఈ సందర్భంగా పవన్ ప్రభ, రూపేష్ మాట్లాడుతూ - ''న్యూ ఏజ్ ఫ్యామిలీ డ్రామాగా ఈ చిత్రాన్ని రూపొందించాం. ఈ చిత్రానికి ఇళయరాజాగారు స్వరాలందించడం ఓ హైలైట్. ఇప్పటికే విడుదల చేసిన రెండు పాటలకు, టీజర్‌కి మంచి స్పందన లభించింది. ఇక చాలా గ్యాప్ తర్వాత రాజేంద్రప్రసాద్, అర్చనగార్లు ఈ సినిమాలో నటించడం ఓ ఎస్సెట్. మిగిలిన 3 పాటలను, ట్రైలర్‌ను త్వరలోనే విడుదల చేస్తాం'' అన్నారు.

సాక్షి బిజినెస్

బుధవారం
7-5-2025

స్టాక్ మార్కెట్లు

(తొలి రెండు రాత్రి 11:30 ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
156	82
80,641	24,380

విదేశీ సూచీలు

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	17,687	▽	179
డోజోన్స్	40,816	▽	403
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,597	△	1
డాక్స్	23,250	▽	95
షాంఘై	3,316	△	37
నికాయ్ (శుక్రవారం ముగింపు)	36,831	▽	378

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	భామసుళ	84.42	86.01
£	బ్రిటన్ పౌండ్	భామసుళ	109.67	114.60
€	యూరో	భామసుళ	93.30	97.93
¥	జపాన్ యెన్ (100)	భామసుళ	69.00	47.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	భామసుళ	52.17	57.06
S$	సింగపూర్ డాలర్	భామసుళ	63.04	67.77
SAR	సౌదీ రియాల్	భామసుళ	21.57	23.08
UAE D	యూఏఈ దిర్హామ్	భామసుళ	22.05	23.83
¥	చైనా యువాన్	భామసుళ	10.71	12.53

పసిడి.. మళ్లీ లక్షకు చేరువలో

- రూ.2,400 పెరుగుదల
- భౌగోళిక ఉద్రిక్తతలు, టారిఫ్ షాక్‌లు



న్యూఢిల్లీ: పసిడి మరోసారి ర్యాలీ చేసింది. ఢిల్లీ మార్కెట్లో మంగళవారం 10 గ్రాములకు (99.9 శాతం స్వచ్ఛత) రూ.2,400 లాభపడి రూ.99,750 వద్ద ముగిసింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తాజా టారిఫ్‌లపై చేసిన ప్రకటన, భౌగోళిక ఉద్రిక్తతలతో బంగారానికి డిమాండ్ ఏర్పడింది. జ్యుయలర్ల నుంచి కొనుగోళ్లు పెరిగినట్టు ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ తెలిపింది. 99.5 శాతం స్వచ్ఛత బంగారం సైతం రూ.2,400 పెరిగి రూ.99,300 వద్ద స్థిరపడింది. ''ట్రంప్ ఫార్మాస్యూటికల్స్‌పై, అమెరికా వెలుపల నిర్మించే సినిమాలపై 100 శాతం టారిఫ్‌లను ప్రతిపాదించారు. దీంతో వాణిజ్య ఉద్రిక్తతలు పెరిగి, అంతర్జాతీయ వృద్ధిపై ప్రభావం పడుతుందన్న ఆందోళనలు నెలకొన్నాయి. ఈ పరిణామాలతో సురక్షిత సాధనమైన బంగారానికి తిరిగి డిమాండ్ ఏర్పడింది'' అని అబాన్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సీఈవో చింతన్ మెహతా తెలిపారు. బుధవారం యూఎస్ ఫెడ్ పాలసీ సమీక్ష వివరాల కోసం మార్కెట్ భాగస్వాములు ఎదురుచూస్తున్నట్టు నిపుణులు చెబుతున్నారు. ఇక ఢిల్లీలో వెండి ధర కిలోకి రూ.1,800 పెరిగి రూ.98,500కు చేరుకుంది.

అంతర్జాతీయ మార్కెట్లో 3,400 డాలర్లపైకి

అంతర్జాతీయ మార్కెట్లోనూ బంగారం ర్యాలీ కొనసాగుతోంది. ఔన్స్‌కు 100 డాలర్ల వరకు పెరిగి 3,422 డాలర్ల స్థాయికి చేరింది. అమెరికా డాలర్ బలహీనత సైతం బంగారం ధరల పెరుగుదలకు దారితీసినట్టు హెచ్‌డీఎఫ్‌సీ కమోడిటీస్ సీనియర్ అనలిస్ట్ సామిల్ గాంధీ తెలిపారు.

ఐపీవోకు 5 కంపెనీలు రెడీ

సెబీ తాజాగా గ్రీన్‌సిగ్నల్

- జాబితాలో లక్ష్మి ఇండియా ఫైనాన్స్
- జజూ రష్మి రిఫ్రాక్టరీస్, అజయ్ పాలీ
- రెగాల్ రిసోర్సెస్, వెరిటాస్ ఫైనాన్స్



న్యూఢిల్లీ: కొద్ది రోజులుగా పుంజుకున్న ప్రైమరీ మార్కెట్ ప్రభావంతో పలు కంపెనీలు మరోసారి లిస్టింగ్ బాటలో సాగుతున్నాయి. తాజాగా ఐదు కంపెనీల ప్రాస్పెక్టస్‌లకు క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ఆమోదముద్ర వేసింది. జాబితాలో వెరిటాస్ ఫైనాన్స్, లక్ష్మి ఇండియా ఫైనాన్స్, అజయ్ పాలీ, జజూ రష్మి రిఫ్రాక్టరీస్, రెగాల్ రిసోర్సెస్ చేరాయి. ఈ 5 కంపెనీలు 2024 డిసెంబర్, 2025 జనవరిలో సెబీకి ముసాయిదా పత్రాలు దాఖలు చేశాయి. అయితే మరోపక్క ఈ ఏడాది జనవరి 6న లిస్టింగ్‌కు వీలుగా సెబీకి ప్రాథమిక పత్రాలను దాఖలు చేసిన ఎర్నెడ్ సర్వీసెస్ ఇటీవల ఐపీవో డాక్యుమెంట్లను వెనక్కి తీసుకుంది.

రూ. 2,800 కోట్లు: నాన్‌డిపాజిట్ ఎన్‌బీఎఫ్‌సీ వెరిటాస్ ఫైనాన్స్ ఐపీవో ద్వారా రూ. 2,800 కోట్లు సమీకరించే యోచనలో ఉంది. ఇందుకు అనుగుణంగా రూ. 600 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో రూ. 2,200 కోట్ల షేర్లను ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. రిటైల్ విభాగంపై అధిక దృష్టిపెట్టిన కంపెనీ ఈక్విటీ జారీ నిధులను రుణ విడుదలకు సహకరించే మూలధన పటిష్టతకు వినియోగించనుంది.

ఎన్‌బీఎఫ్‌సీ..: ఎన్‌బీఎఫ్‌సీ.. లక్ష్మి ఇండియా ఫైనాన్స్ ఐపీవోలో భాగంగా 1.04 కోట్ల ఈక్విటీ షేర్లను తాజాగా జారీ చేయనుంది. అంతేకాకుండా మరో 56.38 లక్షల షేర్లను ప్రమోటర్లు ఆఫర్ చేయనున్నారు. ఈక్విటీ జారీ నిధులను భవిష్యత్ అవసరాలకు సహకరించే మూలధన పటిష్టత, కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది.

రిఫ్రిజిరేషన్ సీలింగ్: రిఫ్రిజిరేషన్ సీలింగ్ సొల్యూషన్లు అందించే అజయ్ పాలీ ఐపీవోలో భాగంగా రూ. 238 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 93 లక్షల షేర్లను ప్రమోటర్లు విక్రయానికి ఉంచనున్నారు. ఈక్విటీ జారీ నిధులను రుణ చెల్లింపులతోపాటు ప్లాంట్, మెషినరీ తదితర పెట్టుబడి వ్యయాలకు వెచ్చించనుంది.

రూ. 190 కోట్లు సహా..: రెగాల్ రిసోర్సెస్ ఐపీవోలో భాగంగా రూ. 190 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను తాజాగా జారీ చేయనుంది. వీటితోపాటు ప్రమోటర్ 90 లక్షల షేర్ల వరకూ ఆఫర్ చేయనున్నట్లు ప్రాస్పెక్టస్‌లో కంపెనీ పేర్కొంది.

రూ. 150 కోట్లు మాత్రమే: ప్రాస్పెక్టస్ ప్రకారం జజూ రష్మి రిఫ్రాక్టరీస్ ఐపీవోలో భాగంగా రూ. 150 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను కొత్తగా జారీ చేయనుంది. నిధులను జార్ఖండ్‌లోని బొకారో ఫెర్రో అల్లాయ్స్ విస్తరణకు వీలుగా కొత్త తయారీ సౌకర్యాలపై వెచ్చించనుంది. నిధులలో కొంతమేర వర్కింగ్ క్యాపిటల్ అవసరాలకు సైతం వినియోగించనుంది.

మెప్పించని ఏథర్ ఎనర్జీ ఎంట్రీ



ముంబై: ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ ఏథర్ ఎనర్జీ షేరు లిస్టింగ్ రోజే నష్టాలు చవిచూసింది. ఇష్యూ ధర(రూ.321)తో పోలిస్తే బీఎస్‌ఈలో 1.57% స్వల్ప ప్రీమియంతో రూ.326 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్ ప్రారంభంలో 4% లాభపడి రూ.333 వద్ద గరిష్టాన్ని తాకింది. అయితే మార్కెట్లో నెలకొన్న అనిశ్చితి పరిస్థితుల దృష్ట్యా షేరు అమ్మకాల ఒత్తిడికి లోనై ఆరంభ లాభాలు కోల్పోయింది. ఒకానొక దశలో 6.50% క్షీణించి రూ.300 వద్ద కనిష్టాన్ని తాకింది. చివరికి 6% నష్టంతో రూ. 302.50 వద్ద స్థిరపడింది. కంపెనీ మార్కెట్ వాల్యుయేషన్ రూ.11,267 కోట్లుగా నమోదైంది. ''ఏథర్ ఎనర్జీ షేరు నామమాత్రపు ధరతో లిస్టింగ్ అవ్వడం, ఇంట్రాడేలో 6.50% పతనం పరిణామాలను పరిశీలిస్తే ఇన్వెస్టర్లు అధిక వాల్యుయేషన్ల పట్ల అప్రమత్తంగా ఉన్నట్లు తెలుస్తుంది'' అని లెమాన్ మార్కెట్స్ డెస్క్ విశ్లేషకుడు గౌరవ్ గార్గ్ తెలిపారు.

బీవోబీ లాభం ఫ్లాట్

- క్యూ4లో రూ. 5,415 కోట్లు
- షేరుకి రూ. 8.35 డివిడెండ్



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ దిగ్గజం బ్యాంక్ ఆఫ్ బరోడా(బీవోబీ) గతేడాది(2024-25) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. జనవరి-మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం దాదాపు 6 శాతం వృద్ధితో రూ. 5,415 కోట్లను తాకింది. అయితే స్టాండెలోన్ లాభం 3 శాతమే పుంజుకుని రూ. 5,048 కోట్లకు చేరింది. అంతక్రితం ఏడాది(2023-24) ఇదే కాలంలో రూ. 4,886 కోట్లు ఆర్జించింది. వాటాదారులకు బ్యాంక్ బోర్డు షేరుకి రూ. 8.35 చొప్పున డివిడెండ్ ప్రకటించింది. మొత్తం ఆదాయం రూ. 33,775 కోట్ల నుంచి రూ. 33,852 కోట్లకు నామమాత్రంగా పుంజుకుంది. నికర వడ్డీ ఆదాయం(ఎన్ఐఐ) రూ. 11,793 కోట్ల నుంచి రూ. 11,020 కోట్లకు నీరసించింది. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 2.92 శాతం నుంచి 2.26%కి, నికర ఎన్‌పీఏలు 0.68% నుంచి 0.58%కి తగ్గాయి. కనీస మూలధన నిష్పత్తి 17.19 శాతంగా నమోదైంది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం 10% ఎగసి రూ. 19,581 కోట్లను తాకింది. మొత్తం ఆదాయం రూ. 1,27,101 కోట్ల నుంచి రూ. 1,38,089 కోట్లకు బలపడింది.

ఫలితాల నేపథ్యంలో బీవోబీ షేరు బీఎస్‌ఈలో 10%పైగా పతనమై రూ. 224 వద్ద ముగిసింది.

జెన్సోల్‌పై కేంద్రం దర్యాప్తు

కార్పొరేట్ వ్యవహారాల శాఖ ఆదేశాలు

GENSOL

న్యూఢిల్లీ: కంపెనీల చట్ట నిబంధనలు ఉల్లంఘించిన ఆరోపణల నేపథ్యంలో తాజాగా జెన్సోల్ ఇంజనీరింగ్, బ్లూస్మార్ట్ మొబిలిటీలపై కార్పొరేట్ వ్యవహారాల శాఖ దర్యాప్తునకు ఆదేశించింది. నిధుల అక్రమ మళ్లింపు, కార్పొరేట్ పాలనలో అవకతవకల ఆరోపణలపై దర్యాప్తు చేపట్టిన క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ఏప్రిల్‌లో చర్యలకు తెరతీసిన సంగతి తెలిసిందే. కంపెనీ ప్రమోటర్లు అన్మోల్ సింగ్ జగ్గీ, పునీత్ సింగ్ జగ్గీలను సెక్యూరిటీ మార్కెట్ల నుంచి నిషేధించింది. బుకింగ్ ద్వారా క్యాబ్(రైడ్ హెయిలింగ్) సర్వీసునందించే బ్లూస్మార్ట్ మొబిలిటీని సైతం అన్మోల్ ప్రమోట్ చేయడం గమనార్హం!

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

ఎన్‌బీఎఫ్‌సీ బంగారం రుణాలకు కష్టాలు	సేవల రంగం .. స్వల్పంగా మెరుగు

నష్టాల్లోనే పేటీఎమ్

క్యూ4లో రూ. 545 కోట్లు

Paytm

న్యూఢిల్లీ: పేటీఎమ్ బ్రాండ్ ఫిన్‌టెక్ దిగ్గజం వన్97 కమ్యూనికేషన్స్ గతేడాది(2024-25) చివరి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. జనవరి-మార్చి(క్యూ4)లో నికర నష్టం నామమాత్రంగా తగ్గి రూ. 545 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది(2023-24) ఇదే కాలంలో రూ. 551 కోట్ల నష్టం నమోదైంది. పేమెంట్ ప్రాసెసింగ్ చార్జీల తగ్గింపు, ఉద్యోగుల లబ్ధి ప్రభావం చూపాయి. మొత్తం ఆదాయం 16 శాతం క్షీణించి రూ. 1,912 కోట్లకు చేరింది. అంతక్రితం క్యూ4లో రూ. 2,267 కోట్ల టర్నోవర్ సాధించింది. ఇసాప్ కారణంగా క్యూ4లో రూ. 522 కోట్ల అనుకోని వ్యయాలు నమోదైనట్లు కంపెనీ పేర్కొంది. వీటిని మినహాయిస్తే రూ. 23 కోట్ల నష్టం నమోదైనట్లు తెలియజేసింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర నష్టం సగానికి తగ్గి రూ. 645 కోట్లకు పరిమితమైంది.

ఫలితాల నేపథ్యంలో పేటీఎమ్ షేరు బీఎస్‌ఈలో 6 శాతం పతనమై రూ. 815 వద్ద ముగిసింది.

స్కైప్ సేవలకు ముగింపు

రెండు దశాబ్దాల సర్వీస్‌లకు తెర



న్యూయార్క్: ఆడియో, వీడియో కాల్స్‌తో ఇంటర్నెట్ కమ్యూనికేషన్‌లో ఒకప్పుడు సంచలనంగా వెలుగొందిన స్కైప్.. రెండు దశాబ్దాల సర్వీసులకు తెరపడింది. ఆ తరహా సేవలకు ఉపయోగపడే తమ 'టీమ్స్' ప్లాట్‌ఫాంపై మరింతగా దృష్టి పెట్టేందుకు మే 5తో స్కైప్ సేవలు నిలిపివేస్తున్నట్లు ఫిబ్రవరి 28నే మైక్రోసాఫ్ట్ ప్రకటించిన సంగతి తెలిసిందే. దీనితో ఉచిత, పెయిడ్ యూజర్లపై ప్రభావం పడనుండగా, స్కైప్ ఫర్ బిజినెస్ సేవలు తాత్కాలికంగా కొనసాగుతాయి. యూజర్లు తమ డేటాను డౌన్‌లోడ్ చేసుకునేందుకు లేదా టీమ్స్‌కు మైగ్రేట్ చేసుకునేందుకు 2026 జనవరి వరకు సమయం ఉంటుంది. జూమ్, ఫేస్‌టైమ్ లాంటివి రావడానికి చాన్నాళ్ల ముందే అలాంటి సర్వీసులతో 2003లో స్కైప్ విప్లవాత్మక సాధనంగా దూసుకొచ్చింది. ఒక దశలో 30 కోట్ల మంది పైగా నెలవారీ యూజర్లతో అగ్రగామిగా నిల్చింది. 2011లో 8.5 బిలియన్ డాలర్లకు స్కైప్‌ను మైక్రోసాఫ్ట్ కొనుగోలు చేయడం విశేషం!

లాభాల్లోంచి నష్టాల్లోకి..

సెన్సెక్స్ 156 పాయింట్లు డౌన్..

ముంబై: భారత్ - పాకిస్తాన్‌ల మధ్య నెలకొన్న యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తత వహిస్తూ లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. ఫలితంగా మంగళవారం సెన్సెక్స్ 156 పాయింట్లు నష్టపోయి 80,641 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 82 పాయింట్లు పతనమై 24,380 వద్ద నిలిచింది. ఉదయం సూచీలు సానుకూలంగా మొదలయ్యాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ పాలసీ నిర్ణయాలు, యూఎస్-చైనా వాణిజ్య చర్చల నేపథ్యంలో పరిమిత శ్రేణిలో ట్రేడయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్ 316 పాయింట్లు క్షీణించి 80,481 వద్ద, నిఫ్టీ 130 పాయింట్లు పతనమై 24,331 వద్ద కనిష్టాన్ని తాకాయి. ఫెడ్ వడ్డీరేట్ల కోత ఉండకపోవచ్చనే అంచనాలతో అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు స్వల్ప నష్టాల్లో ట్రేడవుతున్నాయి.



- ఆటో, టెక్ మినహా అన్ని రంగాల షేర్లలో అమ్మకాలు తలెత్తాయి. బీఎస్‌ఈలో రంగాల వారీగా సూచీల్లో రియల్టీ 3.5%, విద్యుత్, సర్వీసెస్ 2.5%, యుటిలిటీ, ఇండస్ట్రియల్, క్యాపిటల్ గూడ్స్ 2%, కన్జూమర్ డ్యూరబుల్స్ ఒకటిన్నర శాతం నష్టపోయాయి. మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు 2%కి పైగా క్షీణించాయి.

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య



ఐవోసీఎల్‌లో 1770 అప్రెంటిస్‌లు

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్(ఐవోసీఎల్) రిఫైనరీ డివిజన్‌లో టెక్నికల్/నాన్ టెక్నికల్ గ్రేడుల్లో ట్రేడ్, టెక్నికల్ అప్రెంటిస్‌ల శిక్షణకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 1770.
» **ట్రేడులు:** కెమికల్ ప్లాంట్, కెమికల్, ఫిట్టర్, మెకానికల్, బాయిలర్, ఎలక్ట్రికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్.
» **అర్హత:** పదో తరగతితో పాటు ఐటీఐ(ఫిట్టర్ ట్రేడ్), 12వ తరగతి స్కిల్ సర్టిఫికేట్ ఉండాలి. సంబంధిత విభాగాల్లో మూడేళ్ల డిప్లొమా, బీఎస్సీ, బీఏ/బీకాం ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 18 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** విద్యార్హతల మార్కులు, సర్టిఫికేట్‌ల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 02.06.2025.
» **వెబ్‌సైట్:** https://iocl.com

పీజీఐఎంఈఆర్, చండీగఢ్‌లో 160 పోస్టులు

చండీగఢ్(పంజాబ్)లోని పోస్టు గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(పీజీఐఎంఈఆర్).. ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 160.
» **పోస్టుల వివరాలు:** సీనియర్ రెసిడెంట్-143, జూనియర్/సీనియర్ డిమాన్‌స్ట్రేటర్స్-14, సీనియర్ మెడికల్ ఆఫీసర్-03.
» **విభాగాలు:** అనెస్తీషియా, అనాటమీ, జనరల్ సర్జరీ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, ఇంటర్నల్ మెడిసిన్, నెఫ్రాలజీ, సీనియర్ మెడికల్ ఆఫీసర్, రేడియోథెరపీ, ఓరల్ సర్జరీ, పీడియాట్రిక్స్, వైరాలజీ, న్యూట్రిషియన్, హెల్త్ మేనేజ్‌మెంట్, బయోటెక్నాలజీ తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంబీబీఎస్, ఎండీ, ఎంఎస్, ఎండీఎస్, ఎంఏ/ఎంఎస్సీ/పీజీ/పీహెచ్‌డీ, ఎంవీఎస్సీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 18.05.2025 నాటికి 45 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** కంప్యూటర్ ఆధారిత రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 18.05.2025
» **హాల్‌టికెట్ల డౌన్‌లోడ్ తేది:** 22.05.2025.
» **సీబీటీ పరీక్ష తేది:** 26.05.2025.
» **పరీక్ష కేంద్రాలు:** బెంగళూరు, చండీగఢ్, ఢిల్లీ, కోల్‌కతా.
» **వెబ్‌సైట్:** https://pgimer.edu.in


ఎన్ఐపీహెచ్‌ఎం, హైదరాబాద్‌లో వివిధ ఉద్యోగాలు

హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్ (ఎన్ఐపీహెచ్ఎం).. వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 08.
» **పోస్టుల వివరాలు:** జాయింట్ డైరెక్టర్(కెమిస్ట్రీ)-01, జాయింట్ డైరెక్టర్(పీహెచ్‌ఎం డివిజన్)-01, రిజిస్ట్రార్-01, ల్యాబ్ అటెండెంట్(కేటగిరి-1,2,3)-03, ఎంటీఎస్(కేటగిరి-2)-02.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పదో తరగతి, డిగ్రీ, పీజీ, ఎంఫిల్/పీహెచ్‌డీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 18 నుంచి 56 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు ఎంటీఎస్, ల్యాబ్ అటెండెంట్‌కు రూ.18,000 నుంచి రూ.56,900, మిగతా పోస్టులకు రూ.78,800 నుంచి రూ.2,09,200.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
దరఖాస్తును నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్(ఎన్ఐపీహెచ్ఎం), రాజేంద్రనగర్, హైదరాబాద్, తెలంగాణ-500030 చిరునామాకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 02.06.2025.
» **వెబ్‌సైట్:** https://niphm.gov.in

ప్లాస్టిక్ ఇంజనీరింగ్.. కెరీర్ షైనింగ్!

» డిప్లొమా, పీజీ డిప్లొమా కోర్సులకు సిపెట్ నోటిఫికేషన్
» ప్రవేశానికి సిపెట్ అడ్మిషన్ టెస్ట్ నిర్వహణ
» మ్యానుఫ్యాక్చరింగ్, డిజైన్ రంగాల్లో కొలువులు



ప్లాస్టిక్ రంగం.. వినూత్న కెరీర్ అవకాశాలు కల్పిస్తోంది. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటైన సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (సిపెట్).. ప్లాస్టిక్ రంగానికి అవసరమైన నిపుణులను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తోంది. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా 30 ప్రాంతాల్లో సిపెట్ క్యాంపస్‌లు ఉన్నాయి. వీటిలో ప్లాస్టిక్ ఇంజనీరింగ్‌లో పీజీ, పీహెచ్‌డీ, బీటెక్, ఎంటెక్, డిప్లొమా, పీజీ డిప్లొమా తదితర కోర్సులను అందిస్తున్నారు. తాజాగా సిపెట్-2025 నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నేపథ్యంలో.. సిపెట్ ద్వారా అందించే కోర్సులు, ప్రవేశ ప్రక్రియ, కెరీర్ అవకాశాలు తదితర వివరాలు...

కోర్సులు ఇవే

సిపెట్ తాజా నోటిఫికేషన్ ద్వారా దేశ వ్యాప్తంగా 30 క్యాంపస్‌ల ద్వారా పలు కోర్సులను అందిస్తోంది. అవి.. డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ మౌల్డింగ్ టెక్నాలజీ (డీపీఎంటీ), డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ టెక్నాలజీ(డీపీటీ), పోస్ట్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ మౌల్డ్ డిజైన్ విత్ క్యాడ్/క్యామ్(పీడీ-పీఎండీ క్యాడ్/క్యామ్), పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ ప్రాసెసింగ్ అండ్ టెస్టింగ్(పీజీడీ-పీపీటీ).

అర్హతలు

ఆయా కోర్సును అనుసరించి పదో తరగతి, డిప్లొమా, బీఎస్సీ(ఎంపీసీ) ఉత్తీర్ణత ఉండాలి. కోర్సు చివరి సంవత్సరం పరీక్షలకు హాజరవుతున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అడ్మిషన్ టెస్ట్ ముగిసిన ఎనిమిది వారాల్లోగా సర్టిఫికెట్లు చూపించాల్సి ఉంటుంది.

సిపెట్ అడ్మిషన్ టెస్ట్

డిప్లొమా, పోస్ట్ డిప్లొమా, పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి సంబంధించి సిపెట్ అడ్మిషన్ టెస్ట్‌ను నిర్వహిస్తారు. అందులో ప్రతిభ ఆధారంగా సీట్లు కేటాయిస్తారు.

పరీక్ష విధానం.. వేర్వేరుగా

- సిపెట్ నిర్వహించే సిపెట్ అడ్మిషన్ టెస్ట్ సదరు కోర్సును అనుసరించి వేర్వేరు విధానాల్లో ఉంటుంది.
- డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ టెక్నాలజీ, డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ మౌల్డింగ్ టెక్నాలజీ కోర్సుల ప్రవేశ పరీక్షను మూడు విభాగాల్లో(జనరల్ నాలెడ్జ్ 25 ప్రశ్నలు-25 మార్కులు), (సైన్స్ 20 ప్రశ్నలు-20 మార్కులు), (ఇంగ్లిష్ 5 ప్రశ్నలు-5 మార్కులు) నిర్వహిస్తారు. మొత్తం 50 ప్రశ్నలతో 50 మార్కులకు పరీక్ష ఉంటుంది.
- పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ ప్రాసెసింగ్ అండ్ టెస్టింగ్ కోర్సు ప్రవేశ పరీక్షను నాలుగు విభాగాల్లో 50 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో జనరల్ నాలెడ్జ్ (20 ప్రశ్నలు-20 మార్కులు), సైన్స్(10 ప్రశ్నలు-10 మార్కులు), ఇంగ్లిష్ (10 ప్రశ్నలు-10 మార్కులు), కెమిస్ట్రీ, బయాలజీ, మ్యాథ్స్, ఫిజిక్స్ (10 ప్రశ్నలు-10 మార్కులు) సబ్జెక్ట్‌ల నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- పోస్ట్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ మౌల్డింగ్ టెక్నాలజీ కోర్సు ప్రవేశ పరీక్షను.. జనరల్ నాలెడ్జ్(20 ప్రశ్నలు-20 మార్కులు), సైన్స్(10ప్రశ్నలు-10 మార్కులు), ఇంగ్లిష్ (10 ప్రశ్నలు-10 మార్కులు), ప్లాస్టిక్స్/పాలిమర్స్, టూల్స్ రూమ్, ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్(10 ప్రశ్నలు-10 మార్కులు) విభాగాల్లో 50 మార్కులకు నిర్వహిస్తారు.
- అన్ని కోర్సుల ప్రవేశ పరీక్షకు గరిష్టంగా 50 మార్కులు కేటాయించారు. పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. పరీక్షకు లభించే సమయం ఒక గంట.

రాత పరీక్షలో రాణించేలా

- **మ్యాథమెటిక్స్:** డిస్క్రీట్ మ్యాథమెటిక్స్, థియరీ ఆఫ్ ఈక్వేషన్స్, వెక్టార్ అల్జీబ్రా, ప్రాబబిలిటీ డిస్ట్రిబ్యూషన్, డిఫరెన్షియల్ ఈక్వేషన్స్, ఇంటిగ్రల్ కాలిక్యులస్, డిఫరెన్షియల్ కాలిక్యులస్,అనలిటికల్ జామెట్రీపై పట్టు సాధించాలి.
- **ఫిజిక్స్:** ఆసిలేషన్స్, థర్మల్ అండ్ కెమికల్ ఎఫెక్ట్స్ ఆఫ్ కరెంట్స్, సాలిడ్స్ అండ్ సెమీ కండక్టర్ డివైజెస్, వర్క్-ఎనర్జీ-పవర్, రే ఆప్టిక్స్, ఆప్టికల్ ఇన్‌స్ట్రుమెంట్స్, మ్యాగ్నటిక్ ఎఫెక్ట్స్ ఆఫ్ కరెంట్.
- **కెమిస్ట్రీ:** సొల్యూషన్స్, ట్రాన్సిషన్ ఎలిమెంట్స్, ఎలక్ట్రో కెమిస్ట్రీ, సాలిడ్ స్టేట్, ఆల్కేన్స్ అండ్ ఆల్కైన్స్ తయారీ ధర్మాలు, సర్ఫేస్ కెమిస్ట్రీ, కెమికల్ కైనెటిక్స్, అమినో యాసిడ్స్ అండ్ పెప్టైడ్స్, కెమికల్ ఈక్విలిబ్రియమ్, అటామిక్ స్ట్రక్చర్ అండ్ కెమికల్ బాండింగ్.
- **ఇంగ్లిష్:** బేసిక్ గ్రామర్ అంశాలు, కాంప్రహెన్షన్, యాంటానిమ్స్, సినానిమ్స్, యూసేజ్ ఆఫ్ వర్డ్స్, డైరెక్ట్-ఇన్ డైరెక్ట్ స్పీచ్‌లపై పట్టు సాధించాలి.
- **జనరల్ నాలెడ్జ్:** ఈ విభాగం కోసం హిస్టరీ, పాలిటీ, కరెంట్ అఫైర్స్, కంప్యూటర్ సైన్స్, క్రీడలు, అవార్డులు-విజేతలు తదితర అంశాలపై దృష్టి పెట్టాలి.
- పోస్ట్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ మౌల్డింగ్ అండ్ డిజైన్ కోర్సుకు మాత్రమే ఉండే కోర్ సబ్జెక్ట్ ప్రశ్నలకు సంబంధించి అభ్యర్థులు డిప్లొమా స్థాయిలో తాము చదివిన సబ్జెక్ట్‌లపై అవగాహన పెంచుకోవాలి.
- జీకే, సైన్స్, ఇంగ్లిష్ విభాగాలు అన్ని కోర్సుల ప్రవేశ పరీక్షలోనూ ఉంటాయి. కోర్సు స్థాయిని అనుసరించి ప్రశ్నల క్లిష్టత స్థాయి ఉంటుంది.

ఆసక్తి ప్రధానం

ప్లాస్టిక్ ఇంజనీరింగ్‌లో రాణించాలంటే.. ఆసక్తి ప్రధానమని నిపుణులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా సృజనాత్మకత, కొత్త అంశాలను పసిగట్టే నేర్పు ఎంతో అవసరం. అంతర్జాతీయ మార్కెట్‌లో ప్రవేశించే కొత్త వస్తువులు, వాటి డిజైన్ వెనుక ఇమిడి ఉన్న సాంకేతికతను పరిశీలించే నైపుణ్యం, మన సామాజిక పరిస్థితులకు అనుగుణంగా ఉత్పత్తులను డిజైన్ చేసే సామర్థ్యం ఉండాలి. ఎప్పటికప్పుడు కొత్త స్కిల్స్ పెంచుకునేలా కృషి చేయాల్సి ఉంటుంది.

సిపెట్ కేంద్రాలు

దేశంలో ప్రస్తుతం అహ్మదాబాద్, అమృత్‌సర్, ఔరంగాబాద్, బడ్డి, బాలాసోర్, భోపాల్, భువనేశ్వర్, చంద్రాపూర్, డెహ్రాడూన్, గువహటి, హాజీపూర్, హాల్దియా, హైదరాబాద్, ఇంఫాల్, జైపూర్, కొచి, లక్నో, మధురై, ముర్తాల్, మైసూర్, రాయ్‌పూర్, కోర్బా, విజయవాడ, అగర్తల, గ్వాలియర్, వారణాసి, భగల్పూర్, అయోధ్యలో సిపెట్ క్యాంపస్‌లు ఉన్నాయి.

క్యాంపస్ రిక్రూట్‌మెంట్స్

సిపెట్ క్యాంపస్‌లలో కోర్సులు పూర్తి చేసిన వారికి ఉద్యోగాలకు ఢోకా లేదు. ఇక్కడ పలు కార్పొరేట్ సంస్థలు క్యాంపస్ రిక్రూట్‌మెంట్స్ డ్రైవ్స్ నిర్వహించి నియామకాలు చేపడుతున్నాయి. గత మూడేళ్ల గణాంకాలను పరిశీలిస్తే.. సిపెట్ క్యాంపస్‌లలో దాదాపు 90 శాతం మందికి ఆఫర్లు లభించాయి.

విస్తృత అవకాశాలు

ప్లాస్టిక్ ఇంజనీరింగ్ కోర్సులు పూర్తి చేసుకున్న వారికి విస్తృత అవకాశాలు స్వాగతం పలుకుతున్నాయి. ప్లాస్టిక్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అంచనా ప్రకారం-ఈ ఏడాది చివరికి దాదాపు 2 లక్షల మంది నిపుణుల అవసరం ఏర్పడనుంది. ఈ అంచనాలు, ప్రస్తుతం ఈ రంగంలో శిక్షణ పొందిన విద్యార్థులను బేరీజు వేస్తే భారీ సంఖ్యలో మానవ వనరులకు డిమాండ్ నెలకొంది.

ఉపాధి వేదికలు

ప్లాస్టిక్ ఇంజనీరింగ్ నిపుణులకు ఆటోమొబైల్ సంస్థలు, పెట్రోలియం ఉత్పత్తుల సంస్థలు, ఆర్ అండ్ డీ విభాగాలు ఉపాధి వేదికలుగా నిలుస్తున్నాయి. ప్లాస్టిక్ ఇంజనీరింగ్ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులకు ప్రభుత్వ రంగంలో పెట్రోలియం మంత్రిత్వ శాఖ, ఓఎన్‌జీసీ, ఆయిల్ ఇండియా కార్పొరేషన్ తదితర సంస్థల్లో అవకాశాలు లభిస్తాయి. ఇక ప్రైవేటు రంగంలో ప్రతి ఉత్పత్తి పరిశ్రమలోనూ ప్లాస్టిక్ ఇంజనీర్ల అవసరం ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 2025, మే 29
- **ఆన్‌లైన్ పరీక్ష తేదీ:** 2025, జూన్ 8
- **ఫలితాల వెల్లడి:** 2025, జూన్ 13
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://cipet25.onlineregistrationform.org/CIPET

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-ఇండియన్ పాలిటీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం-బయాలజీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-జనరల్ స్టడీస్-ఎకానమీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం-ఇంగ్లిష్

వారంలోగా కొత్త 'విద్యుత్' డైరెక్టర్లు!

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర విద్యుత్ సంస్థలకు కొత్త డైరెక్టర్లను మరో వారం రోజుల్లోగా రాష్ట్ర ప్రభుత్వం నియమించనుంది. టీజీఎస్పీడీసీఎల్/టీజీఎస్పీడీసీఎల్‌లతో పాటు విద్యుదుత్పత్తి సంస్థ (జెన్‌కో), విద్యుత్ సరఫరా సంస్థ (ట్రాన్స్‌కో)లో డైరెక్టర్ల నియామకానికి గత నెలలో ఆయా సంస్థల యాజమాన్యాలు ఇంటర్వ్యూలు నిర్వహించాయి. ఒక్కో డైరెక్టర్ పోస్టుకు ముగ్గురి పేర్లతో షార్ట్‌లిస్ట్‌ను రూపొందించి ప్రభుత్వానికి సిఫారసు చేశాయి. షార్ట్‌లిస్టు నుంచి ప్రభుత్వం ఒకరిని ఎంపిక చేసి డైరెక్టర్‌గా నియమించనుంది. కాగా, తెలంగాణ ట్రాన్స్‌కో డైరెక్టర్(ట్రాన్స్‌మిషన్) టి.జగత్‌రెడ్డి సోమవారం తన పదవికి రాజీనామా చేశారు.

దివ్యాంగ ఆర్టిజన్లకు అదనంగా 10% రవాణా భత్యం

సాక్షి, హైదరాబాద్: విద్యుత్ ఆర్టిజన్లుగా పని చేస్తున్న దివ్యాంగులకు రూ.3 వేలకి మించకుండా మూలవేతనంపై అదనంగా 10 శాతాన్ని రవాణా భత్యంగా చెల్లించాలని ఆదేశిస్తూ తెలంగాణ ట్రాన్స్‌కో సీఎండీ డి.కృష్ణభాస్కర్ ఉత్తర్వులు జారీచేశారు. గతేడాది డిసెంబర్ 28 నుంచి ఇది వర్తిస్తుందని పేర్కొన్నారు.



భారత్‌లో హాలీవుడ్ ఫ్లాప్..

- అయిదేళ్లలో 41% క్షీణించిన ఆదాయం
- థియేటర్లలో 61% తగ్గిన ప్రేక్షకుల రాక
- రెండేళ్లుగా రూ.200 కోట్ల క్లబ్‌కు దూరం
- 2019తో పోలిస్తే సగానికి తగ్గిన వాటా
- దూకుడు మీదున్న మాలీవుడ్, టాలీవుడ్
- ఆదాయంలో రెండో స్థానంలో టాలీవుడ్

సాక్షి, స్పెషల్ డెస్క్: ఒకప్పుడు హాలీవుడ్ సినిమాలంటే... మన దేశంలో రూ.వేలకోట్ల కలెక్షన్లు కురిపించేవి. టైటానిక్, అవతార్ వంటివి భారతీయులనూ ఉర్రూతలూగించాయి. కానీ, ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. ఆర్మాక్స్ బాక్సాఫీస్ రిపోర్టు 2024 ప్రకారం.. హాలీవుడ్ సినిమాల ద్వారా బాక్సాఫీస్‌కు సమకూరిన ఆదాయం అయిదేళ్లలో ఏకంగా 41% తగ్గింది. మన ప్రాంతీయ భాషల సినిమాలతో పెరుగుతున్న పోటీ, మారుతున్న వీక్షకుల ఆసక్తులు, సూపర్‌హీరోల చిత్రాలు ప్రేక్షకుల అంచనాలను అందుకోలేకపోవడం, ఓటీటీల దూకుడు.. వెరసి బాక్సాఫీస్ వద్ద హాలీవుడ్ సినిమాలకు ఆదరణ తగ్గుతోందని పరిశ్రమ చెబుతోంది.

→ దేశంలో బాక్సాఫీస్ ఆదాయం 2024లో రూ.11,833 కోట్లకు చేరింది. బాక్సాఫీస్‌లో హాలీవుడ్ వాటా భారత్‌లో 2019లో 15%. 2024 నాటికి దాదాపు సగం తగ్గి ఏకంగా 8 శాతానికి పడిపోయింది. గత అయిదేళ్లుగా వాటా క్రమంగా తగ్గుతోంది. హాలీవుడ్ సినిమాల ద్వారా సమకూరిన ఆదాయం 2019లో రూ.1,595 కోట్ల నుంచి 2024లో రూ.941 కోట్లకు వచ్చి చేరింది.

హాలీవుడ్ మూవీస్‌ను చూసేందుకు థియేటర్లకు వచ్చిన ప్రేక్షకుల సంఖ్య 2019లో 9.8 కోట్లు. గత ఏడాది ఈ సంఖ్య కేవలం 3.8 కోట్లకు పరిమితమైంది. కరోనా కాలాన్ని మినహాయిస్తే 12 ఏళ్లలో ఇదే తక్కువ. గత రెండేళ్లలో రూ.200 కోట్ల క్లబ్‌లో ఒక్క సినిమా కూడా చేరకపోవడం గమనార్హం. మూడు సినిమాలే రూ.100 కోట్లకుపైగా ఆదాయాన్ని సమకూర్చాయి. వీటిలో ముఫాసా: ద లయన్ కింగ్ రూ.178 కోట్లు, డెడ్‌పూల్ అండ్ వుల్వరీన్‌రూ.160 కోట్లు, గాడ్జిల్లా వర్సెస్ కాంగ్: ద న్యూ ఎంపైర్ రూ.133 కోట్లు సంపాదించాయి. బాక్సా ఫీస్ వద్ద హాలీవుడ్ సినిమాల ఆదాయంలో సూపర్‌హీరోస్ మూవీస్ వాటా ఒకప్పుడు 50% ఉండేది. 2024లో ఇది 27 శాతానికి పడిపోయింది.



200 కోట్ల క్లబ్ లోనూ లేవు..

దక్షిణాది సినిమాలే..


→ భారత బాక్సాఫీస్ వద్ద 2024లో పుష్ప–2 టాప్‌లో నిలిచి రూ.1,403 కోట్ల గ్రాస్ కలెక్షన్‌తో చరిత్ర సృష్టించింది. కల్కి 2898 ఏడీ రూ.776 కోట్లు, స్త్రీ–2 రూ.698 కోట్లతో తర్వాతి స్థానాల్లో నిలిచాయి. గత ఏడాది హిందీ సినిమా మొత్తం రూ.4,679 కోట్ల కలెక్షన్లతో ముందంజలో ఉంది. హిందీ సినిమాల కలెక్షన్లలో దక్షిణ భారత చిత్రాల డబ్బింగ్ వెర్షన్ల నుండి 31% సమకూరడం విశేషం. ఇక టాలీవుడ్ పరిశ్రమ 2022 నుంచి ఏటా రూ.2,000 కోట్లకుపైగా ఆర్జిస్తోంది. రెవెన్యూ పరంగా అయిదేళ్లలో మలయాళ పరిశ్రమ 93%, తెలుగు చిత్రసీమ 67%, తమిళ పరిశ్రమ 25% వృద్ధి సాధించాయి. హిందీ, కన్నడల్లో మాత్రం తగ్గుదల నమోదైంది. ఇక గత ఏడాది దేశ వ్యాప్తంగా 88.3 కోట్ల మంది థియేటర్లకు వచ్చి సినిమాలను ఆస్వాదించారు.

ట్రంప్ స్క్రిప్ట్‌తో తెర

→ హాలీవుడ్‌కి మనదేశంలో క్రేజ్ తగ్గి.. మన సినిమాలకు ప్రపంచ వ్యాప్తంగా క్రేజ్ పెరుగుతోంది అని సంతోషించేలోపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పిడుగులాంటి వార్త చెప్పారు. జాతీయ భద్రత, ఆర్థిక సమస్యలను పేర్కొంటూ అమెరికాలోకి వచ్చే అన్ని విదేశీ చిత్రాలపై 100% సుంకాన్ని ప్రకటించారు. యూఎస్ బాక్సాఫీస్ వద్ద భారతీయ చిత్రాలు ఏటా సుమారు రూ.850 కోట్లు ఆర్జిస్తున్నాయి. ట్రంప్ నిర్ణయం కారణంగా యూఎస్‌లో విడుదలయ్యే సినిమాల సంఖ్య తగ్గుతుందని పరిశ్రమ భావిస్తోంది. టారిఫ్ అమలులోకి వస్తే ఎగ్జిబిటర్లు టికెట్ ధరలను పెంచాల్సి వస్తుందని, ఫలితంగా ఖరీదు ఎక్కువై ప్రేక్షకుల రాక తగ్గుతుందని విశ్లేషకులు అంటున్నారు.

హాలీవుడ్ క్రేజ్ తగ్గడానికి అనేక కారణాలు..

- ఓటీటీల దూకుడు.. వెబ్ సిరీస్‌లకు పెరుగుతున్న ఆదరణ
- ప్రాంతీయ భాషా చిత్రాలు, వాటి డబ్బింగ్ వెర్షన్ల ప్రభావం..
- కొరియన్, ఇతర భాషా చిత్రాల ప్రభావం.. మారుతున్న ప్రేక్షకుల అభిరుచులు



సకల వసతులతో ప్రభుత్వ ఆసుపత్రుల బ్రాండింగ్

మెరుగైన మౌలిక వసతులు కల్పించాలి

మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశం



సాక్షి, హైదరాబాద్: ప్రజల్లో నమ్మకం, విశ్వాసం పెరిగేలా మెరుగైన సేవలు అందించే లక్ష్యంతో ప్రభుత్వ ఆసుపత్రుల బ్రాండింగ్ చేపట్టాలని అధికారులను వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. రాష్ట్రంలోని 202 ప్రభుత్వ ఆసుపత్రులలో (31 జీజీహెచ్‌లు, హైదరాబాద్‌లోని 9 స్పెషాలిటీ ఆసుపత్రులు, వరంగల్ లోని 4 ఆసుపత్రులు), తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలోని 100 పడకల పైన ఉన్న 40 ఆసుపత్రులను దశలవారీగా బ్రాండింగ్ చేయాలని సూచించారు. ఆసుపత్రులలో ఓపీ, ఐపీ, సర్జరీలను పెంచడం, సామాన్యులకు ప్రభుత్వ ఆసుపత్రులలో నాణ్యమైన సేవలకు భరోసా కల్పించడమే ఈ బ్రాండింగ్ కార్యక్రమాన్ని లక్ష్యమని పేర్కొన్నారు. మంగళవారం రాజీవ్ ఆరోగ్య శ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ కార్యాలయంలో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాజనర్సింహ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రులలో ఎన్ఎంసీ నిబంధనలకు అనుగుణంగా ఫైర్‌సేఫ్టీ, ఎలక్ట్రికల్ సేఫ్టీ, డ్యూటీ రూమ్, సీసీటీవీల పర్యవేక్షణ ఏర్పాటు చేయాలని సూచించారు.

పోతిరెడ్డిపాడుపై టెలిమెట్రీ కేంద్రం

- మరో 8 కీలక ప్రాజెక్టులపై సైతం..
- రెండో దశ కింద టెండర్లు ఆహ్వానించనున్న కృష్ణా బోర్డు
- ఇప్పటికే రూ.7 కోట్లు విడుదల చేసిన తెలంగాణ ప్రభుత్వం



సాక్షి, హైదరాబాద్: శ్రీశైలం జలాశయం నుంచి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ద్వారా శ్రీశైలం కుడి ప్రధాన కాల్వ (ఎస్ఆర్ఎంసీ)కి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరలిస్తున్న కృష్ణా జలాలను కచ్చితంగా లెక్కించడానికి అక్కడ టెలిమెట్రీ కేంద్రం ఏర్పాటు చేసేందుకు కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) చర్యలు ప్రారంభించింది. రెండో దశ కింద రూ.7.01 కోట్ల అంచనా వ్యయంతో మొత్తం 9 కీలక ప్రాజెక్టుల వద్ద టెలిమెట్రీ కేంద్రాల ఏర్పాటుకు టెండర్లు ఆహ్వానించేందుకు కసరత్తు చేస్తోంది. ఎస్ఆర్ఎంసీ (కర్నూలు జిల్లా)తో పాటు నాగార్జునసాగర్ కుడి గట్టు కాల్వ (గుంటూరు), ఎడమగట్టు కాల్వ (నల్లగొండ), నాగార్జునసాగర్ ఎడమగట్టు కాల్వ నుంచి పాలేరు రిజర్వాయర్‌లోకి నీళ్లు కలిసే ఇన్‌టేక్ పాయింట్ (ఖమ్మం), ఏపీ, తెలంగాణ రాష్ట్రాల సరిహద్దుల వద్ద నాగార్జునసాగర్ ఎడమగట్టు కాల్వ (కృష్ణా జిల్లా), కృష్ణా నదిలో పోలవరం కాల్వ కలిసే ప్రాంతం (కృష్ణా జిల్లా), ప్రకాశం బరాజ్ పశ్చిమ ప్రధాన కాల్వ (కృష్ణా జిల్లా), ప్రకాశం బరాజ్ తూర్పు ప్రధాన కాల్వ(కృష్ణా జిల్లా), కర్నూలు–కడప కాల్వ (కర్నూలు జిల్లా)పై టెలిమెట్రీ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల కృష్ణా జలాల వినియోగానికి సంబంధించిన లెక్కలను కచ్చితంగా నిర్ధారించడానికి ఈ టెలిమెట్రీ కేంద్రాలు కీలకంగా మారనున్నాయి. ఇప్పటికే తొలి విడత కింద పలు ప్రాజెక్టుల వద్ద టెలిమెట్రీ కేంద్రాలను కృష్ణా బోర్డు ఏర్పాటు చేసింది. తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తితో రెండో దశ కింద 9 కీలక ప్రాజెక్టుల వద్ద వీటి ఏర్పాటుకి చర్యలు తీసుకుంటోంది. రెండో దశ టెలిమెట్రీ కేంద్రాల ఏర్పాటు కోసం నిధులిచ్చేందుకు ఏపీ ప్రభుత్వం ముందుకు రాకపోవడంతో, ఆ రాష్ట్రం వాటాను సైతం తామే ముందుగా చెల్లించడానికి సిద్ధమని గతంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించారు. చెప్పినట్టుగానే కృష్ణా బోర్డుకు ప్రభుత్వం హామీ ఇస్తూ లేఖ రాయడంతో పాటు ఇటీవల రూ.7 కోట్లు విడుదల చేసింది.

పక్కాగా తేలనున్న లెక్కలు..

ప్రస్తుత నీటి సంవత్సరం (2024–25)లో ఏపీ, తెలంగాణ మొత్తం 990.38 టీఎంసీల కృష్ణా జలాలను వినియోగించుకున్నాయి. అందులో ఏకంగా 72.2 శాతం నీటిని (715.03 టీఎంసీలు) ఏపీ వాడుకుంది. తెలంగాణ 275.35 టీఎంసీల (27.8 శాతం)ను మాత్రమే వినియోగించుకోగలిగింది. తాత్కాలిక సర్దుబాటు ప్రకారం ఏపీ, తెలంగాణ మధ్య 66:34 నిష్పత్తిలో నీటి పంపకాలు జరుగుతుండగా, 50:50 నిష్పత్తిలో పంపకాలు జరపాలని తెలంగాణ డిమాండ్ చేస్తోంది. ఏపీ మాత్రం 72.2 శాతానికి పైగా నీళ్లను వాడుకోవడం గమనార్హం. శ్రీశైలం జలాశయం నుంచి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ద్వారానే ఏపీ 208.64 టీఎంసీలు తరలించింది. మల్యాల లిఫ్టు ద్వారా 28.36 టీఎంసీలు, మల్యాల నుంచి కేసీ కాల్వకు 1.19 టీఎంసీలు, ముచ్చుమర్రి లిఫ్టు ద్వారా 3.49 టీఎంసీలు, చెన్నైకి నీటి సరఫరాకు 1.88 టీఎంసీలు కలిపి ఏపీ మొత్తం 243.58 టీఎంసీలను వాడుకుంది. ఇక నాగార్జునసాగర్ నుంచి ఎడమ కాల్వ ద్వారా 29.45 టీఎంసీలు, కుడి కాల్వ ద్వారా 188.16 టీఎంసీలు కలిపి మరో 217.62 టీఎంసీలను ఏపీ వాడుకుంది. ఇలా ఈ సంవత్సరంలో ఏపీ మొత్తం 715.03 టీఎంసీల కృష్ణా జలాలను వాడుకున్నట్టు గత నెలలో కృష్ణా బోర్డు లెక్క గట్టింది. టెలిమెట్రీ కేంద్రాలు ఏర్పాటుతో రిమోట్ టెక్నాలజీ ద్వారా నీటి వినియోగం లెక్కలు ఎప్పటికప్పుడు తెలిసిపోతాయి. రెండు రాష్ట్రాల మధ్య నీటి వివాదాల పరిష్కారానికి ఈ గణాంకాలు ఉపయోగపడనున్నాయి.

సికింద్రాబాద్, గోల్కొండ, కంచన్‌బాగ్, నాచారం

హైదరాబాద్‌లోని ఈ ప్రాంతాల్లో నేడు అరగంట పాటు మాక్‌డ్రిల్

సాయంత్రం 4 గంటలకు మోగనున్న సైరన్

సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్త మాక్‌డ్రిల్ 'ఆపరేషన్ అభ్యాస్'ను బుధవారం సాయంత్రం 4 గంటల నుంచి 4–30 గంటల వరకు రాష్ట్ర రాజధానిలోని సికింద్రాబాద్, గోల్కొండ కంటోన్మెంట్, కంచన్‌బాగ్, నాచారంలలో నిర్వహించనున్నారు. వైమానిక దాడులు వంటి అత్యవసర సమయాల్లో పౌరులు ఎలా స్పందించాలనే దానిపై అవగాహన కల్పించి, వారిని సమాయత్తం చేసేందుకు వీలుగా చేపడుతున్న ఈ కార్యక్రమానికి రాష్ట్ర అగ్నిమాపక శాఖ డీజీ నాగిరెడ్డి ఇన్‌చార్జిగా వ్యవహరించనున్నారు. మాక్‌డ్రిల్ జరిగే నాలుగు ప్రాంతాలతో పాటు ఔటర్ రింగ్‌రోడ్డు పరిధిలోని అన్ని ప్రాంతాల్లోనూ సాయంత్రం 4 గంటలకు సైరన్లు మోగించనున్నారు. మాక్ డ్రిల్‌కు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను అగ్నిమాపక శాఖ మంగళవారం విడుదల చేసింది. పారిశ్రామిక ప్రాంతాలు, జంక్షన్లలోని పోలీస్ మైక్‌లు, పెట్రోలింగ్ వాహనాలు, ఫైర్ వాహనాలు, ఆసుపత్రులు.. ఇలా అన్ని ప్రాంతాల్లో ఉండే సైరన్లను సాయంత్రం 4 గంటల నుంచి 2 నిమిషాల పాటు మోగించాలని ఈ యాక్షన్ ప్లాన్‌లో సూచించారు. మాక్‌డ్రిల్ ప్రారంభం నుంచి ముగిసే వరకు ఎవరెవరు ఏం చేయాలన్నది అందులో వివరించారు.

సున్నిత ప్రాంతాల్లో హై అలర్ట్

మాక్‌డ్రిల్‌కు రాష్ట్ర పోలీసు విభాగం ఏర్పాట్లు పూర్తి చేసింది. సెక్యూరిటీ రిహార్సల్స్‌లో భద్రత బలగాలతో పాటు పోలీసు విభాగం నుంచి ఏసీపీ ర్యాంకు అధికారి, ఆక్టోపస్ కమాండోలు పాల్గొనున్నారు. హైదరాబాద్‌లో రక్షణ రంగానికి సంబంధించి అనేక సంస్థలు ఉన్నాయి. డీఆర్‌డీఓ, డీఎంఆర్ఎల్, ఆర్సీఐ, ఎన్ఎఫ్‌సీ తదితర కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని వాటితో పాటు ప్రైవేట్ భాగస్వామ్యంతో నడుస్తున్నవీ కొన్ని ఉన్నాయి. వీటి వద్ద భద్రత, నిఘాను కట్టుదిట్టం చేశారు. స్థానిక పోలీసులతో పాటు ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు, సీఐఎస్ఎఫ్ బలగాలు సమన్వయంగా పనిచేస్తున్నాయి. ఆయా సంస్థలు, కార్యాలయాలకు చుట్టుపక్కల కనిష్ఠంగా 3కిలోమీటర్ల పరిధిలో డేగ కన్ను నిఘా ఉంచుతున్నారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

నిర్మించి ఐదేళ్లు.. నిలిచిపోయి రెండేళ్లు..

ఎన్‌డీఎస్‌ఏ నివేదికతో ఎల్లంపల్లి ఎత్తిపోతలు ఇప్పట్లో లేనట్లే

జలాలను పొదుపుగా వినియోగిస్తున్న వైనం

పర్యాటకంగా మారిన పార్వతీ పంపుహౌస్

భూనిర్వాసితుల్లో వ్యక్తమవుతున్న ఆవేదన

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా ఎల్లంపల్లి సమీపంలో గోలివాడ (పార్వతీ) పంపుహౌస్ నిర్మించారు. 2017 డిసెంబర్ 16న అప్పటి రామగుండం ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ పనులు ప్రారంభించారు. 18 నెలల్లో పంప్‌హౌస్ నిర్మాణం పూర్తిచేశారు. దీనికోసం 380.36 ఎకరాలు సేకరించారు. రూ.1,700 కోట్లు వెచ్చించారు. నీటి ఎత్తిపోతల కోసం పార్వతీ పంపుహౌస్‌లో 9 భారీ విద్యుత్ మోటార్లు బిగించారు. ఒక్కోదాని సామర్థ్యం 40 మెగావాట్లు. 24 గంటల్లో ఒక్కోటి 2,600 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తాయి. తొలి విద్యుత్ మోటారుకు 2019 జూలై 31న రాత్రి వెట్‌రన్ నిర్వహించారు. దశలవారీగా అన్ని మోటార్లను వినియోగంలోకి తీసుకొచ్చారు. 2023లో మేడిగడ్డ వద్ద నిర్మించిన లక్ష్మీబరాజ్ కుంగడంతో ఆ వెంటనే బరాజ్‌ల్లో (రివర్స్ పంపింగ్) ఎత్తిపోతలు నిలిపివేశారు.

– రామగుండం


ఎల్లంపల్లిలోకి నిలిచిపోయిన ఎత్తిపోతలు


నిరుపయోగంగా మారిన పార్వతీ పంపుహౌస్ మోటార్లు

ఎన్‌డీఎస్‌ఏ నివేదికతో ఎత్తిపోతలు లేనట్లే..

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లపై కాంగ్రెస్ ప్రభుత్వం నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ(ఎన్‌డీఎస్ఏ) నిపుణులతో విచారణ చేపట్టింది. ప్రాజెక్టు నిర్మాణంలో లోపాలు వెలుగు చూశాయి. బరాజ్‌ల్లో నీటి నిల్వలు ఉంచడం సరికాదని ఎన్‌డీఎస్‌ఏ చెప్పింది. దీంతో గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. ఈ నేపథ్యంలో 2023-24 సంవత్సరంలో బరాజ్‌ల్లోని కొద్దిపాటి నీటి నిల్వలను పాక్షికంగా పంపింగ్ చేసినా.. ఆ తర్వాత నిలిపివేశారు.

177.12 టీఎంసీల ఎత్తిపోత

జూన్ ఒకటి నుంచి మే 31వ తేదీ మధ్య కాలాన్ని ఇరిగేషన్ ఇయర్‌గా నీటిపారుదల శాఖ అధికారులు పేర్కొంటారు. మరోవైపు.. పార్వతీ బరాజ్ ప్రారంభించిన మూడేళ్లలో 177.12 టీఎంసీల నీటిని ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి ఎత్తిపోశారు. రెండేళ్లుగా ఎత్తిపోతలు నిలిచిపోయాయి.

పార్వతీ బరాజ్ నుంచి ఎల్లంపల్లికి ఎత్తిపోసిన నీరు(టీఎంసీలలో)

ఇరిగేషన్ ఇయర్	ఎత్తిపోసిన నీరు
2020-21	48.73
2021-22	38.26
2022-23	28.83
2023-24	7.72

మూడెకరాలు కోల్పోయా



మా ఊరిలో వ్యవసాయ భూములు సారవంతమైనవి. చాలా విలువైనవి. పార్వతీ (గోలివాడ) పంపుహౌస్ కోసం ఎంతోవిలువైన నాకున్న మూడెకరాలు కోల్పోయిన. నిర్మించిన రెండేళ్లకే పంపుహౌస్ మూతపడింది. విలువైన భూములు వృథాగా పోయినయి. నేను ఉపాధి అవకాశాలు కోల్పోయిన. కాంగ్రెస్ ప్రభుత్వం నాలాంటి నిర్వాసితులకు న్యాయం చేయాలి.

– పానుగంటి సత్యనారాయణ
నిర్వాసితుడు, గోలివాడ

అటు మబ్బు.. ఇటు వెలుగు


తెలంగాణ తల్లి విగ్రహం వెనుక భాగాన కమ్మేసిన మబ్బులు

ఖమ్మం జిల్లా కేంద్రంలో మంగళవారం సాయంత్రం వరకు ప్రశాంతంగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈ సమయంలో తెలంగాణ తల్లి విగ్రహం వద్ద భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. విగ్రహం వెనుక ప్రాంతంలో ఆకాశంలో మబ్బులు పూర్తిగా కమ్మేయడంతో రాత్రిని తలపించింది. ఇదే విగ్రహం ఎదురు భాగంలో మాత్రం ఆకాశం కాంతివంతంగా కనిపించగా.. వాహనదారులు ఈ దృశ్యాలను తమ కెమెరాల్లో బంధించారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఖమ్మం


విగ్రహం ముందుభాగాన కాంతివంతంగా ఉన్న ఆకాశం

బీజేపీ బీఆర్‌ఎస్ దిష్టిబొమ్మలాంటివి

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీలయిన బీఆర్‌ఎస్, బీజేపీలు దిష్టిబొమ్మల్లాంటివని, అపశకునాలు పెట్టడం మినహా ఆ పార్టీలకు వేరే పని లేదని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ వ్యాఖ్యానించారు. అసలు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఎన్ని హామీలిచ్చిందనే అవగాహన కూడా లేకుండా ఆ పార్టీల నేతలు పిచ్చికుక్కల్లా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. మంగళవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడిన మాటల గురించి రెండు పార్టీల నేతలు అవాకులు చెవాకులు పేలుతున్నారని విమర్శించారు. నిజంగా కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు దమ్ముంటే కేంద్రం నుంచి ఎన్ని నిధులు రాష్ట్రానికి తెచ్చారో చర్చించేందుకు సిద్ధమా అని సవాల్ చేశారు. రాష్ట్ర పరిస్థితులను నిజాయితీగా సీఎం రేవంత్ చెబితే మహంకాళి గుడి దగ్గర చెప్పులు మోసిన బండి సంజయ్ స్పందించారని ఎద్దేవా చేశారు. రాష్ట్రాన్ని కేసీఆర్ అప్పులపాలు చేసినప్పుడు, కాళేశ్వరం పేరుతో దోచుకున్నప్పుడు బీజేపీ నేతలు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని అడ్డుకునే క్రమంలో ప్రతి అంశంలోనూ కేటీఆర్ కుట్రలు కనిపిస్తున్నాయని, ఆయన కాలుకి దెబ్బతగిలినా గుణం మారలేదని వ్యాఖ్యానించారు. ఉద్యోగ సంఘాల నేతలు కూడా ఆలోచించాలని, ప్రతిపక్షాల పంచన చేరితే ఆగమవుతారని అద్దంకి విజ్ఞప్తి చేశారు.

రాష్ట్ర పురోగతికి మీ అపార అనుభవం అవసరం

సీఎస్ రామకృష్ణారావుకు మంత్రి సురేఖ అభినందనలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర పురోగతికి సీఎస్ రామకృష్ణారావు అపార అనుభవం అవసరమని మంత్రి కొండా సురేఖ తెలిపారు. సీఎస్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా మంత్రి సురేఖను మంగళవారం సచివాలయంలోని ఆమె చాంబర్ లో రామకృష్ణారావు కలిశారు. ఈ సందర్భంగా శాలువా కప్పి ఆయన్ను మంత్రి సన్మానించారు. అనంతరం మంత్రి సురేఖ మాట్లాడుతూ రాష్ట్ర పరిపాలన విభాగంలో, తెలంగాణ ఆర్థిక కార్యకలాపాల్లో సీఎస్ రామకృష్ణారావుకు ఉన్న అనుభవం రాష్ట్ర అభివృద్ధికి ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సీనియర్ ఐఏఎస్ నేతృత్వంలో పరిపాలన సంబంధిత అంశాల్లో రాష్ట్రంలోని అన్ని విభాగాల్లో ముందుకు వెళుతుందన్నారు.


మంగళవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన స్విట్జర్లాండ్ రాయబారి మయా తిస్సాఫీ

ఆకు రాల్చుతూ.. చిగురిస్తూ.. పూలు పూస్తూ..


పూలు విరబూసి

ఒకవైపు ఆకు రాల్చుతూ.. మరోవైపు చిగురిస్తూ.. ఇంకోవైపు పూలుపూస్తూ చెట్లు ప్రకృతి ప్రేమికులను అమితంగా ఆకట్టుకుంటున్నాయి. ఎండలు మండే మే, జూన్ మాసాల్లో వచ్చే గ్రీష్మరుతువులో ఇలాంటి ప్రకృతి అందం ఆవిష్కరించడం సహజమని ప్రకృతి ప్రేమికులు పేర్కొంటున్నారు. పెద్దపల్లి పట్టణ శివారులో ఆకులన్నీ రాలి.. మోడువారి, చిగురిస్తూ, పూలుపూస్తూ ప్రకృతి ఒడిలోని చెట్లు 'సాక్షి' కెమెరాకు అందంగా కనిపించాయి

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి


కొత్త చిగురు చిగురిస్తూ


ఆకురాల్చి అందంగా

ఏఐ పవర్డ్ తెలంగాణ

ఏఐ టెక్నాలజీ వినియోగంలో అగ్రగామిగా రాష్ట్రం

- 'ఎక్స్'లో స్పెషల్ సీఎస్ జయేశ్ రంజన్ వెల్లడి



సాక్షి, హైదరాబాద్: 'ఏఐ పవర్డ్ తెలంగాణ'నినాదంతో రాష్ట్రంలో వ్యవసాయం, ఆరోగ్యం, ట్రాఫిక్ నియంత్రణ, విద్యారంగాల్లో కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికత వినియోగాన్ని ప్రోత్సహించి విప్లవాత్మక మార్పులు తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. ఈ విషయాన్ని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ మంగళవారం 'ఎక్స్'లో వెల్లడించారు. ఏఐ టెక్నాలజీ వినియోగంలో దేశంలోనే అగ్రగామిగా రాష్ట్రం ఉందన్నారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు రాష్ట్రం ఈ రంగంలో కుదుర్చుకున్న ఒప్పందాల వివరాలను ఆయన వెల్లడించారు.

– దేశంలో తొలి 'గూగుల్ 4 స్టార్టప్ సెంటర్'రాష్ట్రంలో ఏర్పాటైంది. ఇది ఏఐ ఆధారిత స్టార్టప్‌లకు దిశానిర్దేశం, నిధుల సాయం చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వంతో ఎంఓయూ ద్వారా వ్యవసాయం, రవాణా, మానవవనరులకు శిక్షణ రంగాల్లో పైలట్ ప్రాజెక్టులకు సహకరిస్తుంది.

- ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ), సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సిడాక్), డేటా సెంటర్ ఆపరేటర్ యోట్టా, వరల్డ్ ట్రేడ్ సెంటర్ (డబ్ల్యూటీసీ)తో ఏఐ ఇన్నోవేషన్ హబ్‌ల ఏర్పాటుకు రాష్ట్రం ఒప్పందాలు కుదుర్చుకుంది.
- హైదరాబాద్ సమీపంలోని ఫ్యూచర్ సిటీలో 250 ఎకరాల విస్తీర్ణంలో ఏఐ సిటీ నిర్మాణాన్ని ప్రభుత్వం చేపట్టింది. స్మార్ట్ సిటీల సమస్యలను పరిష్కరించే వేదికగా దీన్ని మార్చాలని భావిస్తోంది.
- గూగుల్ గ్రీన్‌లైట్ ప్రాజెక్ట్‌లో భాగమైన 'రోడ్ మేనేజ్‌మెంట్ సొల్యూషన్స్'ను రియల్–టైమ్ డేటా ఆధారంగా సిగ్నల్ టైమింగ్‌ను మెరుగుపరిచి ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు హైదరాబాద్‌లో పైలట్ ప్రాజెక్టును అమలు చేస్తున్నారు.
- దేశంలోనే తొలి సమగ్ర వ్యవసాయ డేటా ప్లాట్‌ఫాం ఎడెక్స్ రాష్ట్రంలో ఏర్పాటు కానుంది. పంటలు, నేల, వాతావరణ సమాచారాన్ని సేకరించి.. దిగుబడి అంచనా, కీటకాల నివారణ, వనరుల సద్వినియోగం కోసం ఏఐ మోడళ్లను అభివృద్ధి చేస్తుంది. హెచ్‌డీఎఫ్‌సీ వంటి ప్రముఖ బ్యాంకులు ఈ సమాచారాన్ని ఉపయోగించి వేగవంతమైన రుణాలను అందిస్తాయి.
- ఐఐఐటీ, ఐఐటీ–హైదరాబాద్, బిట్స్ పిలానీ–హైదరాబాద్, నల్సార్, ఐఎస్‌బీ వంటి సంస్థలు కలిసి సొంత ఏఐ డయాగ్నొస్టిక్ ప్లాట్‌ఫామ్‌ను అభివృద్ధి చేస్తున్నాయి. ఫార్మా దిగ్గజాలు, ఏఐజీ ఆస్పత్రి, ఆస్ట్రాజెనెకా భాగస్వామ్యంతో ఔషధాల ఆవిష్కరణలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఏఐ–ఆధారిత రోగుల సంరక్షణ చర్యలు చేపట్టనున్నాయి.
- విశ్వం సెంటర్ ద్వారా కళాశాల విద్యార్థులకు ఇండస్ట్రీ ఎక్స్‌పర్ట్స్ ఆధ్వర్యంలో లక్ష మందికి ఏఐలో ఇంటర్న్‌షిప్ కల్పించనున్నారు.
- 2025 విద్యాసంవత్సరం నుంచి ఏఐను పాఠశాల పాఠ్యాంశాల్లో చేర్చనున్నారు. మైక్రోసాఫ్ట్‌తో ఒప్పందం ద్వారా తెలంగాణలోని 500 పాఠశాలలకు ఏఐ–ఆధారిత బోధన, అభ్యాస సాధనాలను అందిస్తారు.
- రాష్ట్రంలో కొత్తగా ప్రవేశపెట్టిన మిత్ర–టీజీ మొబైల్ యాప్ విద్యార్థుల్లో మాదకద్రవ్యాలను వినియోగించే ప్రమాదం ఉంటే దాన్ని ముందుగానే ఏఐ అల్గారిథమ్‌ల ద్వారా గుర్తించి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను హెచ్చరిస్తుంది. ఈ ప్లాట్‌ఫాం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు పిల్లల ప్రవర్తనను పర్యవేక్షించడానికి, ప్రమాదంలో ఉన్న వారిని కౌన్సెలర్లతో అనుసంధానించడానికి నేరుగా హెల్ప్‌లైన్‌ను అందిస్తుంది.

పండ్ల మార్కెట్లలో అధికారుల దాడులు

రసాయనాల వినియోగంపై మార్కెటింగ్ శాఖ తనిఖీలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని పండ్ల మార్కెట్లలో మామిడి, ఇతర పంటలు పక్వానికి వచ్చేందుకు వినియోగిస్తున్న రసాయనాలను నిరోధించేందుకు వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాల మేరకు వరంగల్‌లో ఐదు చోట్ల, గడ్డిఅన్నారం (బాట సింగారం)లో ఏడు మార్కెట్లలో, జగిత్యాలతో 10 చోట్ల, హైదరాబాద్ జాంబాగ్ మార్కెట్లలో తనిఖీలు జరిపారు. ఈ తనిఖీల్లో పచ్చి మామిడి కాయలను పక్వానికి వచ్చేలా ఎథిలిన్ సాచెట్లను మోతాదుకు మించి ఉపయోగిస్తున్నట్లు గుర్తించారు. కార్బైడ్ వంటి రసాయనాలు వినియోగించకపోయినప్పటికీ, ఎథిలిన్ సాచెట్లను నేరుగా మామిడి కాయలకు తగిలేలా చేసి, వేగంగా పక్వానికి వచ్చేలా చేసినట్లు గుర్తించారు. అలాంటి పండ్లను సీజ్ చేసి, పరీక్షల కోసం ఐపీఎంకు పంపించారు.

తనిఖీలు నిరంతరం కొనసాగుతాయి: మంత్రి తుమ్మల

సహజ సిద్ధంగా పక్వానికి వచ్చిన పండ్లనే విక్రయించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాపారులకు స్పష్టం చేశారు. ఫలాల పక్వానికి కార్బైడ్ వంటివి ఉపయోగిస్తే ప్రజలకు అనారోగ్యమని, ఎలాంటి నిబంధనల ఉల్లంఘననైనా ప్రభుత్వం సీరియస్‌గా పరిగణిస్తుందని ఒక ప్రకటనలో తెలిపారు. భవిష్యత్తులో పండ్ల విషయంలో కల్తీ, రసాయనాల వినియోగం లేకుండా నిరంతర తనిఖీలు కొనసాగుతాయని పేర్కొన్నారు. రసాయనాలతో పక్వానికి వచ్చేలా చేసిన కాయలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. సీజ్ చేసిన పండ్లను పరీక్షల కోసం ఐపీఎంకు పంపామని, రసాయనాలు వినియోగించినట్లు నివేదిక వస్తే, తదనుగుణంగా చర్యలు తీసుకుంటామన్నారు.

క్లుప్తంగా...

పర్యాటక రంగంలో 20 శాతం వృద్ధి లక్ష్యం
మంత్రి కందుల దుర్గేశ్



సాక్షి, అమరావతి: రాష్ట్ర పర్యాటక రంగంలో 20 శాతం వృద్ధి సాధించేందుకు కృషి చేస్తున్నట్టు మంత్రి కందుల దుర్గేశ్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. టూరిజం ఫెస్టివల్ కేలండర్, నైట్ సఫారీ, డాల్ఫిన్ షో, 150 అరకు కాఫీ స్టాల్స్, ఎక్స్‌పీరియన్స్ సెంటర్స్ ఏర్పాటు వంటి ప్రణాళికలు చేస్తామన్నారు. భవానీ ద్వీపం, హోప్ ఐల్యాండ్ సహా రాష్ట్రంలోని ద్వీపాలను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు పేర్కొన్నారు. అరకు, గండికోట సహా 6 ప్రాంతాల్లో టెంట్ సిటీస్ ఏర్పాటు చేస్తామని, రాజమండ్రి, విజయవాడ, బెరంపార్క్, సూర్యలంకలో హౌస్ బోట్స్‌ను అందుబాటులోకి తీసుకొస్తున్నామని తెలిపారు.

గ్రామ, వార్డు సచివాలయాల శాఖలో ముగ్గురు కన్సల్టెంట్లు

సాక్షి, అమరావతి: గ్రామ, వార్డు సచివాలయాల శాఖలో అంతర్గత ఆడిట్ నిర్వహణకు ఆ శాఖ డైరెక్టర్ కార్యాలయంలో ముగ్గురు కన్సల్టెంట్ల నియామకానికి ప్రభుత్వం అనుమతించింది. నెలకు రూ.1.5లక్షల వేతనంతో ఒక సీనియర్ చార్టెడ్ అకౌంటెంట్, రూ.లక్ష చొప్పున వేతనాలతో ఇద్దరు జూనియర్ చార్టెడ్ అకౌంటెంట్లను ఓపెన్ టెండర్ విధానంలో నియామకానికి అనుమతిస్తూ గ్రామ, వార్డు సచివాలయాల శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

72 మంది జేఎల్స్‌కు పదోన్నతి

సాక్షి, అమరావతి: ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న పలువురు జూనియర్ లెక్చరర్లకు ఇంటర్మీడియట్ విద్యామండలి పదోన్నతి కల్పించింది. జోన్–2 మినహా మిగిలిన మూడుజోన్లలో మొత్తం 72 మంది జేఎల్స్‌కి ప్రిన్సిపల్స్‌గా పదోన్నతి కల్పిస్తూ మంగళవారం ఇంటర్మీడియట్ బోర్డు డైరెక్టర్ కృతికా శుక్లా ఉత్తర్వులిచ్చారు. జోన్–2 సీనియారిటీ అంశంపై కోర్టు కేసు నడుస్తున్నందున ఈ పరిధిలో లెక్చరర్లకు పదోన్నతులు కల్పించలేదని తెలిసింది. ప్రిన్సిపల్స్‌గా పదోన్నతి పొందిన వారికి బుధవారం పోస్టింగ్స్ ఇవ్వనున్నారు.

15 నుంచి బదిలీలు

ఇంటర్ విద్యామండలిలో ఈనెల 15 నుంచి 30వ తేదీ వరకు అధికారులు, ప్రిన్సిపల్స్, లెక్చరర్ల బదిలీలు చేపట్టేందుకు బోర్డు అధికారులు షెడ్యూల్ ఇచ్చారు. ఈనేపథ్యంలో బదిలీల అనంతరం పదోన్నతులు పొందినవారికి పోస్టింగ్స్ ఇవ్వాల్సిందిగా ప్రస్తుతం ప్రిన్సిపల్స్‌గా ఉన్నవారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

జర్నలిస్టులపై కేసులు పెడితే సహించేది లేదు
ఏపీయూడబ్ల్యూజె రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు

గుంటూరు మెడికల్: జర్నలిస్టులపై కేసులు పెడితే సహించేది లేదని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఏపీయూడబ్ల్యూజె) రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు హెచ్చరించారు. జర్నలిస్టులను కించపరిచే విధంగా వ్యవహరించకుండా, ప్రభుత్వ తీరును మార్చుకోవాలని హితవు పలికారు. సోమవారం గుంటూరు ఎల్‌వీఆర్ క్లబ్‌లో యూనియన్ గుంటూరు జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సుబ్బారావు మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం జర్నలిస్టులు ఐక్యంగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు.

పేదల ఇళ్లను దౌర్జన్యంగా కూల్చడాన్ని తక్షణం విరమించాలి
సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

భీమవరం: పశ్చిమ గోదావరి జిల్లా ఉండి నియోజకవర్గంలో పేదల ఇళ్ళు దౌర్జన్యంగా కూల్చడాన్ని తక్షణం విరమించుకోకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు హెచ్చరించారు. మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో భీమవరంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ భూములు ఆక్రమించుకున్న భూస్వాములు, సంపన్నులను వదిలి పేదలపై పగబట్టడం దారుణమన్నారు.

రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రాగా తయారు చేస్తున్నారు
సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

తాడేపల్లి రూరల్: అమరావతి పునః నిర్మాణ శంకుస్థాపన కోసం రాష్ట్ర ప్రభుత్వం వందల కోట్లు ఖర్చుచేసిందని, ప్రధాని వస్తున్నారని ఆర్భాటంగా జనాలను తరలించారని, చివరకు ఒక చాక్లెట్ ఇచ్చి నోరు తీపి చేసుకోండి అంటూ వెళ్లిపోయారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. మంగళవారం తాడేపల్లిలోని ఈదురుగాలులు, వర్షానికి దెబ్బతిన్న అరటి తోటలు, పంటలను పరిశీలించారు. అమరావతి నిర్మాణం అయితే చేస్తారు కానీ ఆంధ్రప్రదేశ్‌ను అప్పుల ఆంధ్రాగా తీర్చిదిద్దుతారని మండిపడ్డారు. ప్రభుత్వం మరో 40 వేల ఎకరాలు భూ సేకరణకు సన్నాహాలు చేస్తున్నట్లు చెబుతున్నారని, అదే జరిగితే ఉద్యమం తప్పదని, తీసుకున్న భూములను త్వరితగతిన అభివృద్ధి చేసి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఎన్నో ఏళ్లుగా హోమ్‌నీడ్స్ వ్యాపారం చేస్తున్నాను. ఏటా సమ్మర్ సీజన్‌లో 150 వరకు ఏసీ యూనిట్లు అమ్మేవాళ్లం. ఈ ఏడాది సరిగా అమ్మకాలు జరగడం లేదు. అప్పుడే రెండు నెలలు గడిచిపోయినా ఇంకా 25 యూనిట్లు కూడా అమ్మలేదు. ఫ్రిజ్‌లు, కూలర్ల సేల్స్ కూడా పడిపోయాయి. గతంలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి చూడలేదు. ఇదీ భీమవరానికి చెందిన ఓ వ్యాపారి ఆవేదన.

సీజనిల్ సేల్స్

సమ్మర్ మార్కెట్ డల్

- పడిపోయిన ఏసీలు, కూలర్లు, ఫ్రిజ్‌ల అమ్మకాలు
- గతంలో వేసవి ప్రారంభానికి ముందు నుంచే సమ్మర్ సేల్స్ జోరు
- ఏటా సమ్మర్‌లో పశ్చిమ గోదావరి జిల్లాలో రూ.100 కోట్లకు పైగా అమ్మకాలు
- గత రెండు నెలల్లో 50 శాతం కూడా అమ్మకాలు లేవంటున్న వ్యాపారులు
- ఎండలు మండుతున్నా.. సంక్షేమం జాడలేక జనం జేబులు ఖాళీ





సాక్షి, భీమవరం: వేసవి వస్తుందంటే వినియోగదారులతో కిటకిటలాడుతూ కనిపించే ఏసీ, ఫ్రిజ్, కూలర్లు తదితర హోమ్‌నీడ్స్ షాపులు ఈ సమ్మర్ సీజన్‌లో వెలవెలబోతున్నాయి. సమ్మర్ సేల్‌లో రెండు నెలలు గడిచిపోగా 50 శాతం కూడా అమ్మకాలు జరగలేదని వ్యాపార వర్గాలంటున్నాయి. జనం దగ్గర డబ్బులు లేకపోవడం, విద్యుత్ చార్జీలు పెరిగిపోవడం సేల్స్ పడిపోవడానికి కారణమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

జిల్లాలో 60 వరకు షాపులు : పశ్చిమ గోదావరి జిల్లాలోని భీమవరం, పాలకొల్లు, నరసాపురం, తణుకు, తాడేపల్లిగూడెం పట్టణాలతో పాటు మండల కేంద్రాల్లో స్థానిక వ్యాపారులకు చెందిన ఎలక్ట్రికల్ హోమ్‌నీడ్స్ దుకాణాలు 60 వరకు ఉన్నాయి. సోనోవిజన్, బజాజ్ ఎలక్ట్రానిక్స్, రిలయన్స్ తదితర ప్రముఖ కంపెనీలకు చెందిన బ్రాంచీలు, కార్పొరేట్ షోరూమ్‌లు 25 వరకు ఉంటాయి. ఆయా సంస్థలు, ఈ–కామర్స్‌లో సమ్మర్ సేల్స్ రూ.100 కోట్లకు పైగా ఉంటుందని అంచనా.

మార్చి నుంచే మొదలు

ఎండల తీవ్రత పెరగడం వలన ఏసీలు, ఫ్రిజ్‌లు, కూలర్లు, ఇన్వెర్టర్ల సమ్మర్ సేల్స్ మార్చి నుంచే మొదలవుతాయి. మున్ముందు మరింత పెరిగే ఉష్ణోగ్రతల నుంచి ఉపశమనం కోసం ఆయా గృహోపకరణాల కొనుగోలుకు ఆసక్తి చూపిస్తారు. కొత్తగా కొనేవారు కొందరైతే, ఎక్స్ఛేంజీ ఆఫర్‌లో పాత వాటిని ఇచ్చేసి కొత్త వస్తువులను తీసుకునే వారు మరి కొందరు. ఆన్‌లైన్‌తో పాటు షాపుల్లోనూ ఈఎంఐల పద్ధతిలో ఫైనాన్స్ సదుపాయం ఉండటంతో పేద, మధ్య తరగతి వర్గాల వారు నెలనెలా వాయిదాలు కట్టుకోవచ్చన్న భావనలో ఏసీలు, ఫ్రిజ్‌ల కొనుగోలుకు ప్రాధాన్యమిస్తున్నారు. సమ్మర్ సీజన్‌లో జిల్లావ్యాప్తంగా నెలకు 8,000 నుంచి 10,000 ఏసీలు, 3,000 వరకు ఫ్రిజ్‌లు, 5,000 వరకు కూలర్లు, 4,000 వరకు ఇన్వెర్టర్లు అమ్ముడవుతుంటాయని వ్యాపార వర్గాలు అంటున్నాయి. ఎన్నికల ప్రభావం వలన గతేడాది అనుకున్నదాని కంటే దాదాపు రెట్టింపు అమ్మకాలు జరిగినట్టు తణుకుకు చెందిన ఓ వ్యాపారి తెలిపారు. సమ్మర్ సీజన్ కోసం మార్చికి ముందే వ్యాపారులు స్టాకులు పెట్టుకున్నారు.

చుక్కలు చూపిస్తున్న విద్యుత్ చార్జీలు

కూటమి పాలనలో విద్యుత్ చార్జీలు సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నాయి. సాధారణ వినియోగమే అయినా గతంతో పోలిస్తే రెట్టింపు బిల్లులు వస్తున్నాయని వినియోగదారులు వాపోతున్నారు. అప్పు చేసి ఏసీ కొందామన్న విద్యుత్ చార్జీలు మరింత పెరిగిపోతాయని, వీటిని సాకుగా చూపించి ప్రభుత్వం భవిష్యత్‌లో తమకు సంక్షేమ పథకాలు రాకుండా చేస్తుందన్న భయంతో పేద, మధ్యతరగతి వర్గాలు వెనుకడుగేస్తున్నాయి. దీంతో వినియోగదారులు లేక షాపులు వెలవెలబోతున్నాయి. మార్చి, ఏప్రిల్ నెలల్లో సగం అమ్మకాలు కూడా జరగలేదని వ్యాపారులు అంటున్నారు. కస్టమర్లను ఆకర్షించేందుకు ఆఫర్లు ప్రకటిస్తున్నా అమ్మకాలు అంతంతమాత్రంగానే ఉంటున్నాయని, గతంలో ఎప్పుడూ ఇటువంటి పరిస్థితి చూడలేదని చెబుతున్నారు.

షాపులు వెలవెల


కొద్దినెలలుగా మార్కెట్ డల్ అయిపోవడం సమ్మర్ సేల్స్ పైనా పడింది. గత ప్రభుత్వంలో ప్రతి నెలా పథకాలు పేదవర్గాల తలుపు తట్టేవి. కూటమి పాలనలో సంక్షేమం జాడ లేకుండా పోయింది. పనులు కూడా సరిగా లేకపోవడం, నిత్యావసరాల ధరలకు రెక్కలు రావడం పేద, మధ్యతరగతి వర్గాల జీవన ప్రమాణాలను దుర్భరంగా మార్చేశాయి.



తణుకులోని ఓ షాపు వద్ద ఏసీలు, గృహోపకరణ సామగ్రి

రెండు నెలలుగా జీతాలు లేక విలవిల

ట్రిపుల్ ఐటీల్లోని కాంట్రాక్టు బోధనా సిబ్బంది దుస్థితి



నూజివీడు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రతి నెలా ఒకటో తేదీనే జీతాలు ఇస్తాం.. ఇదీ ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబు చెప్పిన మాటలు. కానీ పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. 2 నెలలుగా జీతాలు లేక 4 ట్రిపుల్ ఐటీల్లోని కాంట్రాక్టు ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రంలోని రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) పరిధిలోని నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో పనిచేస్తున్న 750 మంది కాంట్రాక్టు బోధనా సిబ్బందికి 2 నెలలుగా వేతనాలు లేవు. మార్చి నెలకు చెందిన వేతనాలు, ఏప్రిల్‌కు సంబంధించిన వేతనాలు మే ఆరో తేదీ గడిచినప్పటికీ రాకపోవడంతో సిబ్బంది ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. దీంతో కుటుంబ ఖర్చులకు, ఇతర అవసరాలకు అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొంది. మరోపక్క ఆ అప్పులపై వడ్డీల భారం అదనమని వారు వాపోతున్నారు. సకాలంలో జీతాలు ఇస్తే ఈ తలనొప్పి ఉండదని ఉద్యోగులు పేర్కొంటున్నారు. నాలుగు ట్రిపుల్‌ఐటీల్లో కాంట్రాక్టు పద్ధతిలో మెంటార్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, గెస్ట్ ఫ్యాకల్టీలు, ల్యాబ్ అసిస్టెంట్‌లు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఐటీ మెంటార్లు పనిచేస్తున్నారు. పర్మినెంట్ ఫ్యాకల్టీకి జీతాలు రాగా, అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి మాత్రం గత నెల, ఈ నెలలో ఇప్పటివరకు జీతాలు ఇవ్వకపోవడంపై ఆవేదన చెందుతున్నారు. సకాలంలో జీతాలు ఇవ్వకపోవడం వల్ల ఆసుపత్రి ఖర్చులు, పిల్లల ఫీజుల చెల్లింపు, నెలవారీ మందుల ఖర్చులు, పాల బిల్లులు, సరకుల బిల్లులు, నెలవారీ రుణ ఇన్‌స్టాల్‌మెంట్లు ఇలా అనేకాలకు చెల్లింపులు చేయలేక ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసుల్లో ముందస్తు బెయిల్

పిటిషన్లపై సందిగ్ధత

- విచారణ మొదలుపెట్టిన జస్టిస్ సురేశ్‌రెడ్డి ధర్మాసనం
- తదుపరి విచారణ నేటికి వాయిదా

సాక్షి, అమరావతి: ఎస్సీ, ఎస్టీ కేసుల్లో నిందితులు నేరుగా హైకోర్టు ముందుస్తు బెయిల్ పిటిషన్లు దాఖలు చేయవచ్చా? లేక హైకోర్టు కన్నా ముందు ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టునే ఆశ్రయించాలా? అన్న విషయంపై ఇద్దరు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం విచారణ మొదలుపెట్టింది. కొద్దిసేపు పిటిషనర్ల తరపు సీనియర్ న్యాయవాది ఓ.మనోహర్‌రెడ్డి, న్యాయవాదులు ఎమ్మార్కే చక్రవర్తి, శెట్టిపల్లి దుష్యంత్‌రెడ్డి తదితరుల వాదనలు విన్న ధర్మాసనం పూర్తిస్థాయి వాదనల నిమిత్తం విచారణను బుధవారానికి వాయిదా వేసింది.

ముందస్తు బెయిల్ కోసం కాకాణి, రజిని తదితరుల పిటిషన్లు

అక్రమ మైనింగ్ వ్యవహారంలో నెల్లూరు జిల్లా, పొదలకూరు పోలీసులు నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ నేత కాకాణి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ దాఖలు చేసిన తరువాత ఆయనపై ఎస్సీ, ఎస్టీ కేసును కూడా నమోదు చేశారు. అదే రీతిలో చిలకలూరిపేట టీడీపీ సోషల్ మీడియా ఇన్‌చార్జి పిల్లి కోటి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నేత విడదల రజినిపై చిలకలూరిపేట పట్టణ పోలీసులు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఆమె ముందస్తు బెయిల్ కోసం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

ధర్మాసనానికి నివేదించిన సింగిల్ జడ్జి

ఈ వ్యాజ్యాలన్నింటిపై ఇటీవల వాదనలు విన్న సింగిల్ జడ్జి జస్టిస్ మల్లికార్జునరావు, ఎస్సీ, ఎస్టీ కేసుల్లో ముందస్తు బెయిల్ పిటిషన్ల విచారణార్హత తేల్చాలంటూ ఈ వ్యవహారాన్ని ధర్మాసనానికి నివేదిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తగిన ధర్మాసనం ముందుంచేందుకు గాను ఈ వ్యాజ్యాలన్నింటినీ ప్రధాన న్యాయమూర్తి (సీజే) ముందుంచాలని రిజిస్ట్రీని ఆదేశించారు. ఈ ఆదేశాల మేరకు ఈ వ్యవహారాన్ని రిజిస్ట్రీ సీజే ముందుంచింది. దీంతో ఆయన ఈ బాధ్యతను జస్టిస్ సురేశ్ రెడ్డి నేతృత్వంలోని ధర్మాసనానికి అప్పగిస్తూ పరిపాలన నిర్ణయం తీసుకున్నారు.



పై కప్పులు నింపేయండి..!

- పీఎం సూర్యఘర్ పథకంపై టార్గెట్స్ విధింపు
- కేంద్రం ఆదేశాలతో ఈపీడీసీఎల్ ఉరుకులు పరుగులు
- తలనొప్పిగా మారిందంటున్న విద్యుత్ శాఖ అధికారులు
- ప్యానెల్స్ పెట్టుకోవాలంటూ వినియోగదారులపై ఒత్తిళ్లు
- ఇప్పటికే డిస్కమ్ పరిధిలో 10 వేల రూఫ్‌టాప్ సోలార్
- విశాఖ జిల్లాలో 1501, అనకాపల్లిలో 756, అల్లూరిలో 6 ప్లాంట్స్ ఏర్పాటు

'వంద అడుగులు ఉన్న ప్రతి ఇంటిపైనా పీఎం సూర్యఘర్ పథకం ద్వారా సోలార్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోండి. బిల్లు ఎక్కువగా వస్తున్న ఇళ్లను టార్గెట్‌గా పెట్టుకోండి. ప్రతి అధికారీ తమ పరిధిలో వీలైనన్ని ఎక్కువ సోలార్ రూఫ్‌టాప్స్‌తో నింపాల్సిందే.' ఏపీఈపీడీసీఎల్ అధికారులు, సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలు. పీఎం సూర్యఘర్ పథకాన్ని వినియోగదారులపై బలవంతంగా రుద్దాలంటూ కూటమి సర్కారు డిస్కమ్‌లపై ఒత్తిడి తీసుకొస్తోంది. దీంతో ఈపీడీసీఎల్ సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు.



సాక్షి, విశాఖపట్నం: మన ఇంట్లోనే సూర్యరశ్మి ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసుకునేలా కేంద్ర ప్రభుత్వం 'పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన'ను ప్రవేశపెట్టింది. ఈ పథకంలో చేరాలంటే ముందుగా 'సూర్యఘర్' యాప్‌ని మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాలి. అందులో వివరాలు నమోదు చేయాలి. ఆరు నెలల కరెంటు బిల్లు కాపీని జతపరచాలి. తరువాత రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. విద్యుత్ వాడకం 300 యూనిట్లలోపు మాత్రమే ఉండాలన్న నిబంధన ఉంది. తదుపరి ట్రాన్స్‌కో అనుమతులు పొందాక వెండర్లను ఎంపిక చేసుకోవాలి. ఇందులో కిలో వాట్‌కు నిర్ణయించిన దాని ప్రకారం రాయితీని అందిస్తారు. మిగిలిన మొత్తానికి బ్యాంకు రుణ సదుపాయం కల్పించనున్నారు. చివరగా ఇంటి రూఫ్‌పై 100 చదరపు అడుగుల స్థలంలో సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేస్తారు. ప్రస్తుతం వాడే మీటరు స్థానంలో 'నెట్ మీటర్' ఏర్పాటు చేస్తారు. దీని ద్వారా సోలార్ ఉత్పత్తి.. వినియోగదారుడు వాడుతున్న విద్యుత్‌ని గణిస్తారు. దేశ వ్యాప్తంగా కోటి ఇళ్లపైన సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఈ పథకం మంచిదే అయినా వినియోగదారుల్ని బలవంతంగా ఒప్పించే ప్రయత్నం చేస్తోంది కూటమి ప్రభుత్వం.

రాయితీలందించినా గుదిబండే.!

రాయితీ ద్వారా ప్రాజెక్టు పెట్టుకోవచ్చంటూ ప్రచారం చేస్తున్నా వినియోగదారుడికి భారం తప్పదు. ఉదాహరణకు 3 కిలోవాట్ల రూఫ్‌టాప్ పెట్టుకోవాలంటే రూ.78 వేల వరకూ గరిష్టంగా సబ్సిడీ అందిస్తామని చెబుతున్నారు. అయితే ఈ రాయితీ మనం వినియోగించుకునే సోలార్ పలకలకు అనుగుణంగా ఉంటుంది. అంటే రూ.78 వేల కంటే తక్కువ సబ్సిడీ వస్తుంది. కానీ.. వినియోగదారుడు మాత్రం రూ.1.8 లక్షల వరకూ భరించాల్సి ఉంటుంది. గతంలో దరఖాస్తుకు, నెట్ మీటర్‌కు కూడా చార్జీలు వసూలు చేసేవారు. ఇప్పుడు ప్రజల దగ్గర నుంచి స్పందన అంతంతమాత్రంగా ఉండటంతో ఈ చార్జీల నుంచి ఉపశమనం కల్పించారు.

కరెంట్ అమ్ముకోండంటూ ప్రచారం!



కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామంటూ ప్రగల్భాలు పలికిన చంద్రబాబు.. ఇప్పుడు ఎఫ్‌పీపీసీఏ చార్జీలంటూ బిల్లు చూస్తే గుండె గుభేల్‌మనిపించేలా చేస్తున్నారు. సంపద సృష్టించడం తనకు తెలుసన్న చంద్రబాబు ఓవైపు విద్యుత్ బిల్లుల్ని అమాంతం పెంచేసి.. మరోవైపు సూర్యఘర్ ప్రాజెక్టు పేరుతో వినియోగదారుల నడ్డి విరిచేందుకు యత్నిస్తున్నారు. సోలార్ రూఫ్‌టాప్ పెట్టుకుంటే బిల్లు కట్టకపోవడంతో పాటు కరెంటు మీరే అమ్ముకొని లాభాల్ని పొందొచ్చంటూ ప్రజల్ని మభ్యపెడుతున్నారు. అయినా ప్రజలు స్పందించకపోవడంతో అధికారులపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. ఈపీడీసీఎల్ పరిధిలో సర్కిళ్లలోని జోన్లవారీగా టార్గెట్స్ విధించారు. నిర్దేశించిన సమయంలోగా టార్గెట్ పూర్తి చేయాలని ఆదేశిస్తుండటంతో పీఎం సూర్యఘర్ అధికారుల మెడపై కత్తిగా మారింది.

గెజిటెడ్ సంతకం లేదని పరీక్షకు అనుమతి నిరాకరణ

మధురవాడ(విశాఖ): మధురవాడ గాయత్రీ విద్యాపరిషత్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద ఈసెట్ పరీక్ష రాసేందుకు వచ్చిన అభ్యర్థికి తప్పుడు సమాచారం ఇవ్వడంతో ఓ విద్యార్థి పరీక్ష రాయలేకపోయాడు. వివరాలు ఇలా ఉన్నాయి. సింహాచలంకి చెందిన తాతపూడి ఆదిత్య డిప్లమా చదువుకున్నాడు. ఈసెట్ పరీక్ష కోసం గాయత్రీ విద్యాపరిషత్ ఇంజనీరింగ్ కళాశాల పరీక్ష కేంద్రానికి మంగళవారం ఉదయం చేరుకున్నాడు. హాల్ టికెట్ మీద గెజిటెడ్ సంతకం లేదని పరీక్షా కేంద్రంలోకి అనుమతించలేదు. దీంతో సంతకం చేయించుకొని వచ్చేసరికి టైం అయిపోయిందని లోపలకు పంపించలేదని విద్యార్థి తల్లి సంధ్య వాపోయారు. విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే తాము గెజిటెడ్ సంతకం ఉండాలని ఎవరికీ చెప్పలేదని, సకాలంలో వచ్చిన వారిని పరీక్షా కేంద్రంలోకి అనుమతించామని నిర్వాహకులు చెబుతున్నారు.



శ్రీవారి దర్శనానికి 6 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 6 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 65,095 మంది స్వామివారిని దర్శించుకోగా 26,912 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. హుండీలో రూ. 3.78 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే, దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 6 గంటల్లో, ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలలో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయాన్ని కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలో అనుమతించరని స్పష్టం చేసింది.

మద్దిలో పూజలు

జంగారెడ్డిగూడెం: ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం గుర్వాయిగూడెం మద్ది క్షేత్రంలో మంగళవారం ఆంజనేయ స్వామికి ఆలయ అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ప్రభాత సేవ, నిత్యార్చన పూజలు చేశారు. స్వామివారికి ప్రీతికరమైన మంగళవారం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు బారులుదీరి స్వామివారిని దర్శించుకొని, మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల హనుమద్ నామస్మరణతో ఆలయం మార్మోగింది. దేవస్థానానికి మధ్యాహ్నం వరకు వివిధ సేవలు, విరాళాల ద్వారా రూ.1,94,262 ఆదాయం వచ్చినట్టు ఈవో ఆర్‌వీ చందన తెలిపారు..

ఘనంగా ప్రారంభమైన తిరు కల్యాణోత్సవాలు

కాళ్ల: పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల మండలం కాళ్లకూరు గ్రామంలో వేంచేసియున్న స్వయంభు శ్రీ వెంకటేశ్వర స్వామి వారి వార్షిక తిరు కల్యాణోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా సాయంత్రం ఆరు గంటలకు విష్వక్సేన ఆరాధన, భగవత్ పుణ్యాహవాచనం నిర్వహించారు. శ్రీ స్వామి అమ్మవార్లకు అష్టోత్తర శత (కమల), ధ్వజారోహణ, దీక్ష ధారణ, నీరాజన మంత్రపుష్ప తీర్థ ప్రసాద వినియోగం జరిపారు.

తిరుపతి జాతర మొదలైందహో




తిరుపతి కల్చరల్: తిరుపతిలో జాతర సందడి నెలకొంది. గ్రామదేవత తిరుపతి గంగమ్మ ఆలయం వద్ద కోలాహలం ఏర్పడింది. భేరివీధిలో తొలి చాటింపు పూజ నిర్వహించారు. అనంతరం నాటి నగర శివారు ప్రాంతాలైన నాలుగు కాళ్ల మండపం, హెడ్ పోస్టాఫీస్, కృష్ణాపురం ఠాణా, పాత మెటర్నటీ ఆస్పత్రి సర్కిల్ ప్రాంతాల్లో మంగళవారం అర్ధరాత్రి దప్పు కొట్టి అష్టదిగ్బంధన చేసి చాటింపు చేశారు. ఆ చాటింపుతో తిరుపతి శ్రీతాతయ్యగుంట చిన్నగంగమ్మ (తిరుపతి గ్రామదేవత) జాతర అత్యంత వేడుకగా ఆరంభమైంది.


సాగుబడి

భరణి కార్తె: మే 10 వరకు
కృత్తిక కార్తె: 11 నుంచి

కలప రాజు టేకు!

మన దేశంలో టిష్యూకల్చర్ టేకు తోటలు 55 ఏళ్లుగా సాగువుతున్నాయి. అయినప్పటికీ, రైతులు అనుసరించదగిన ఈ తోటలకు సంబంధించి ఉత్తమ సాగు పద్ధతులను ఇప్పటికీ గుర్తించలేక పోవటం ఆశ్చర్యకరమైన నిజం. అలాగని అసలే అధ్యయనాలు జరగలేదని కాదు.. 25 సంవత్సరాలకు పైగా కొనసాగిన తులనాత్మక అధ్యయనాలు లోపించాయి. అందుకే, ఈ సాంకేతికతకున్న సామర్థ్యాన్ని పూర్తిగా ఉపయోగించుకోలేక పోతున్నామని నిపుణులు విశ్లేషిస్తున్నారు.





ప్రపంచంలోని టేకు చెట్లలో 95 శాతానికి పైగా ఆసియా దేశాల్లోనే ఉన్నాయి. ఇతర ఖండాల్లో నాటిన టేకు అడవులు ఉన్నప్పటికీ, సహజమైన టేకు అడవులతో పాటు నాటిన టేకు అడవులు కూడా ఉన్నది ఆసియాలోనే. ఐక్యరాజ్య సమితికి చెందిన ఆహార-వ్యవసాయ సంస్థ (యు.ఎన్.ఎఫ్.ఎ.ఓ.) ప్రచురించిన 'ప్రపంచ టేకు వనరులు: మార్కెట్ అంచనా 2022' నివేదిక ఈ విషయంపై చర్చించింది. ప్రకృతి సిద్ధమైన స్థానిక టేకు అడవుల విస్తీర్ణం మధ్యప్రదేశ్, మహారాష్ట్రలలో అత్యధికంగా ఉంది. సగటు వార్షిక పెరుగుదల చాలా ప్రాంతాల్లో సంవత్సరానికి హెక్టారుకు 12 క్యూబిక్ మీటర్ల కంటే తక్కువగానే ఉంది. అనుకూల పరిస్థితుల్లో హెక్టారుకు సంవత్సరానికి 10-12 క్యూబిక్ మీటర్ల మేరకు టేకు తోట పెరుగుతుంది. అటవీ సంరక్షణ చట్టం- 1980, జాతీయ అటవీ విధానం- 1988 ప్రకారం ప్రభుత్వ యాజమాన్యంలోని అడవుల్లో పెరిగే పచ్చని కలప చెట్లను నరకటం నిషిద్ధం. అందువల్ల, విలువైన టేకు కలపకు పెరుగుతున్న దేశీయ, అంతర్జాతీయ డిమాండ్‌ను తీర్చడానికి ప్రైవేట్ తోటలపై ఆధారపడాల్సి వస్తోంది. అయితే, టిష్యూకల్చర్ టేకు తోటల ఉత్పాదకత అంతంతమాత్రంగానే ఉండటం అటవీ వ్యవసాయ రంగాన్ని కుంగదీస్తోందని నిపుణులు చెబుతున్నారు.

మన్నికైన, బలమైన కలప ఏది? అని వెతికితే అటువంటి జాతుల జాబితాలో టేకు అగ్రస్థానంలో ఉంటుంది. అందుకే టేకును 'కలప రాజం' అని అభివర్ణిస్తుంటారు. ప్రపంచంలోని అత్యంత విలువైన ఉష్ణమండల గట్టి కలప జాతుల్లో ఒకటి టేకు. టెక్టోనా గ్రాండిస్ దీని శాస్త్రీయ నామం. నౌకానిర్మాణం నుంచి భవన నిర్మాణం, ఖరీదైన ఫర్నిచర్ వరకు టేకు కలప వినియోగం ఎంతో ప్రాధాన్యాన్ని సంతరించుకుంది.

టిష్యూకల్చర్ మేలు

మన దేశంలో టేకు తోటల్లో ఉత్పాదకత సమస్యలపై ఎఫ్ఎఓ నివేదిక చర్చించింది. సహజంగా ఉండే టేకు చెట్లు చాలా వరకు విత్తనాలు రాలి మొలిచినవే. టేకు చెట్లకు కాయల సంఖ్యే తక్కువగా ఉండటం, విత్తనాల మొలక శాతం తక్కువగా ఉండటం వంటి సమస్యలు ఉన్నాయని కోయంబత్తూరులోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారెస్ట్ జెనెటిక్స్ అండ్ ట్రీ బ్రీడింగ్ (ఐఎఫ్‌జిటిబి)కు చెందిన పరిశోధకులు అంటున్నారు. అంటుకట్టడం వంటి సాంప్రదాయ పద్ధతులకు కూడా వాటికి ఉండే పరిమితులు వాటికి ఉన్నాయి. ఈ సమస్యల దృష్ట్యా పరిశోధకులు, ప్రైవేట్ సంస్థలు టిష్యూకల్చర్ టేకు మొక్కలు నాటడాన్ని ప్రోత్సహిస్తున్నారు. ఈ మొక్కలు ఎనిమిది నుంచి 12 సంవత్సరాల్లో లాభదాయకంగా పెరుగుతాయని చెబుతున్నారు. అంతేకాకుండా, జన్యుపరంగా ఉన్నతమైనవిగా ఉండటం, చీడపీడల బెడద లేని మొక్కలను సృష్టించడానికి కూడా టిష్యూకల్చర్ పద్ధతి సహాయపడుతోంది.

పాతికేళ్లు పైబడిన అధ్యయనాలేవీ..?

ప్రస్తుతం మన దేశంలో 200కి పైగా టిష్యూ కల్చర్ ప్రయోగశాలలు టేకు మొక్కలను ఉత్పత్తి చేస్తున్నాయి. కానీ, టిష్యూ కల్చర్ మొక్కలు నాటితే నిజంగా వేగవంతమైన పెరుగుదల నమ్మకంగా జరుగుతుందా? అధిక ఉత్పాదకతకు హామీ ఉందా? అన్న ప్రశ్నలు ఎదురవుతున్నాయి. ఈ ప్రశ్నలకు సరైన సమాధానాలు కావాలంటే దీర్ఘకాలిక క్షేత్ర స్థాయి అధ్యయనాలు జరగాలి. అవి జరగనప్పుడు ఈ ప్రశ్నలకు సమాధానం ఇవ్వలేం. విస్తృతమైన అటవీ పరిశోధనలు జరిగినప్పటికీ... టిష్యూకల్చర్ మొక్కల టేకు చెట్ల పెరుగుదల, నాణ్యత, ఆర్థిక రాబడిపై 25 సంవత్సరాలకు పైగా కొనసాగిన తులనాత్మక అధ్యయనం మన దేశంలో జరగలేదు.

విజయగాథలను జనరలైజ్ చెయ్యలేం!

అందుబాటులో ఉన్న అధ్యయనాల ద్వారా కొన్ని విషయాలు స్పష్టమవుతున్నాయి. వీటి గురించి మాట్లాడుకునేటప్పుడు మనం మొదట గుర్తించాల్సిందేమిటంటే.. టిష్యూకల్చర్ టేకు సాగుపై విజయగాథలు ఆయా రైతుల ప్రత్యేక పరిస్థితుల్లో వచ్చిన ఫలితాలని మరచిపోకూడదు. అందువల్ల ఈ విజయగాథలు అందరికీ, అన్ని ప్రాంతాలకూ వర్తిస్థాయని జనరలైజ్ చెయ్యటం తగదు. ఎన్‌సిఎల్‌కు చెందిన ఒక పరిశోధకుడు 2011లో రాసిన ఒక పత్రంలో ఒక విజయగాథను పేర్కొన్నారు.

మహారాష్ట్రలోని సాంగ్లి సమీపంలోని ఒక రైతు పొలంలో టిష్యూకల్చర్ చేసిన టేకు చెట్లు అద్భుతంగా పెరిగాయని తెలిపారు. కేవలం ఎనిమిది సంవత్సరాల్లో చెట్లు 8-10 మీటర్ల ఎత్తు, 60-70 సెం.మీ.ల చుట్టుకొలతతో దాదాపు అన్ని చెట్లూ ఇదే స్థాయిలో పెరిగాయని పేర్కొన్నారు. అయితే, ఆ పక్కనే మరొక పొలంలో ఒక ప్రైవేట్ కంపెనీ నుంచి కొని నాటిన టిష్యూకల్చర్ టేకు చెట్లను చూస్తే వాటి పెరుగుదల చాలా తక్కువగా ఉంది. చనిపోయిన చెట్ల సంఖ్య కూడా ఎక్కువగానే కనిపించిందని వివరించారు.

అధిక సాంద్రత ముఖ్యం కాదు

రెండో విషయం ఏమిటంటే.. టిష్యూకల్చర్ టేకు చెట్లు నాటిన పద్ధతిని బట్టి కూడా వాటి పెరుగుదల ఆధారపడి ఉంటుంది. ఇండియన్ జర్నల్ ఆఫ్ ఆగ్రోఫారెస్ట్రీలో 2021లో ప్రచురితమైన ఒక అధ్యయనంలో కర్ణాటకలోని మూడు వేర్వేరు టేకు తోటల తీరుతెన్నులను విశ్లేషించింది. సాంద్ర యాజమాన్య పద్ధతిలో 4×4 మీటర్ల దూరంలో నాటటం, పొలం చుట్టూతా 4 మీటర్ల దూరంలో నాటటం, 2×2 మీటర్ల దూరంలో నాటి నిర్వహణ చేపట్టకుండా వదిలేయటం వంటి పద్ధతుల్లో టిష్యూ కల్చర్ టేకు చెట్ల పెరుగుదలను విశ్లేషించారు.

సాంద్ర యాజమాన్య పద్ధతుల్లో పెంచిన తోటలకు జాగ్రత్తగా నీరు, ఎరువులు అందాయి. సరిహద్దులో, లైనుగా వేసిన తోటలకు కనీస నిర్వహణ లభించింది. నిర్వహణ లేని తోటలు గాలికి పెరిగాయి. నాటిన 24-25 సంవత్సరాల తర్వాత చెట్టుకు ఉపయోగపడే కలప ఎంత వచ్చిందో పరిశీలించారు. నిర్వహణ ఖర్చులేని తోటల్లో చెట్టుకు 0.22 క్యూబిక్ మీటర్లు, అన్నీ జాగ్రత్తగా సమకూర్చి సాంద్ర పద్ధతిలో పెంచిన టిష్యూకల్చర్ టేకు తోటలో చెట్టుకు 0.85 క్యూబిక్ మీటర్ల కలప దిగుబడి, సరిహద్దు/లైన్‌గా నాటిన చెట్ల నుంచి చెట్టుకు 0.54 క్యూబిక్ మీటర్లు వచ్చింది.

తక్కువ ఖర్చుల కారణంగా నిర్వహణ అంతగా లేని తోటల్లో అత్యధికంగా రూపాయికి రూ. 3.73లు ఆదాయం వచ్చింది. అన్నీ సమకూర్చి సాంద్ర పద్ధతిలో పెంచిన తోటలో బెనిఫిట్ టు కాస్ట్ నిష్పత్తి 2.56 రాగా.. సరిహద్దు/లైన్ తోటల్లో 1.59 వచ్చింది. కానీ, నికర ప్రస్తుత విలువ (8 శాతం తగ్గింపు రేటుతో) సాంద్ర పద్ధతిలో నిర్వహించిన తోటలకు రూ. 9.38 లక్షలతో అత్యధికంగా ఉంది. నిర్వహణ లేని తోటలకు రూ. 5.5 లక్షలు, సరిహద్దు / లైన్ ప్లాంటేషన్లకు రూ. 1.71 లక్షలు ఉందని నిపుణులు లెక్కగట్టారు. దీని అర్థం ఏమిటంటే.. టిష్యూకల్చర్ టేకు మొక్కలను తగినంత దూరంలో నాటి, శ్రద్ధగా నిర్వహించే తోటల ద్వారానే ఎక్కువ ఆదాయం వచ్చింది. అధిక సాంద్రతలో వత్తుగా నాటి.. ఆనక పెద్దగా పట్టించుకోని తోటల్లో ఆదాయం అంతంతమాత్రమే.

నిజం ఎంత?

20 సంవత్సరాలు పైబడిన టిష్యూకల్చర్ టేకు తోటలను నీరు, ఎరువులు క్రమం తప్పకుండా ఇస్తూ సాంద్ర పద్ధతిలో పెంచినప్పటికీ ఉపయోగపడే నికర టేకు కలప దిగుబడి సంవత్సరానికి హెక్టారుకు 5-10 క్యూబిక్ మీటర్లేనని ఈ అధ్యయనంలో తేలింది. తక్కువ కాలంలోనే టిష్యూకల్చర్ టేకు అధిక దిగుబడినిస్తుందని తరచూ వినిపించే అంచనాలపై ఈ అధ్యయనం ప్రశ్నలను లేవనెత్తుతోంది.

ఉదాహరణకు, కర్ణాటకలో ఒక సంస్థ హెక్టారుకు 440 చెట్లను నాటితే 8 ఏళ్లలో 0.7 క్యూబిక్ మీటర్లు, 12 ఏళ్లలో 2.12 క్యూబిక్ మీటర్లు, 18 ఏళ్లలో 4.24 క్యూబిక్ మీటర్లు కలపను ఉత్పత్తి చేస్తుందని చెబుతోంది. మరొక సంస్థ ఎకరానికి (0.4 హెక్టార్లు) 600 చెట్లను నాటిన ఎనిమిది సంవత్సరాల లోపు ప్రతి చెట్టు 0.76 క్యూబిక్ మీటర్ల కలపను ఉత్పత్తి చేయగలదని చెబుతోంది. ఈ వాదనల్లో నిజం ఎంత అని ధృవీకరించుకోవటం అవసరం. ఎందుకంటే దేశంలోని ఏ అటవీ పరిశోధనా సంస్థ కూడా టేకును 10 లేదా 15 సంవత్సరాల కాలాన్ని సిఫార్సు చేయలేదు. ఏతావాతా పలువురు అటవీ వ్యవసాయ నిపుణులు చెబుతున్నదేమిటంటే.. టిష్యూకల్చర్ టేకు సాగు ఆశాజనకంగా ఉన్నప్పటికీ, విభిన్న క్షేత్ర పరిస్థితుల్లో దాని దీర్ఘకాలిక పెరుగుదలను శాస్త్రీయంగా అంచనా వేయడానికి మరిన్ని పరిశోధనలు అవసరం!



మన దేశంలో టేకులో టిష్యూకల్చర్ పరిశోధన 1970వ దశకంలో ప్రారంభమైంది. ఆ తర్వాత 1980-90లలో పూణేలోని నేషనల్ కెమికల్ లాబొరేటరీ (ఎన్‌సిఎల్) ఈ దిశగా విస్తృత కృషి చేసింది. దీనికి సంబంధించి అనేక ప్రోటోకాల్‌లు అమలులో ఉన్నాయి. 2005లో హైదరాబాద్‌లోని ఐసిఎఆర్-కేంద్రీయ మెట్ట పంటల పరిశోధనా సంస్థ (క్రీడా) శాస్త్రవేత్తలు ముదురు టేకు చెట్ల లేత రెమ్మల నుంచి నోడల్ ఎక్స్‌ప్లాంట్స్ (కణజాలాల)ను సేకరించి టిష్యూకల్చర్ మొక్కలు ఉత్పత్తి చేసే ఒక పద్ధతిని అభివృద్ధి చేశారు.

గుడ్ ఫార్మర్ స్టాన్లీ!

అమెరికా తొలి గుడ్ ఫార్మర్ అవార్డుకు మహిళా సేంద్రియ రైతు క్లారెండా 'ఫార్మర్ సీ' స్టాన్లీ ఎంపికయ్యారు. ధరిత్రీ దినోత్సవం సందర్భంగా ప్రసిద్ధ రోడేల్ ఇన్‌స్టిట్యూట్, డావైన్స్ గ్రూప్ సంయుక్తంగా ఈ పురస్కార ప్రదానానికి శ్రీకారం చుట్టటం విశేషం. పదేళ్లకు మించకుండా పునరుజ్జీవన సేంద్రియ వ్యవసాయం (రీజనరేటివ్ ఆర్గానిక్ అగ్రికల్చర్)ను ఆచరిస్తూ, పర్యావరణానికి, సమాజానికి ఉత్తమ సేవలు అందించిన ఆదర్శ కృషీవలురికి ఈ పురస్కారం ఇవ్వటం ఈ ఏడాది ప్రారంభించామని అమెరికాలో 1947 నుంచి సేంద్రియ వ్యవసాయ పరిశోధనలకు పట్టుకొమ్మ అయిన రోడేల్ ఇన్‌స్టిట్యూట్ ముఖ్య కార్యనిర్వహణాధికారి జెఫ్ ట్రాక్ అన్నారు. 'స్టాన్లీ తన గ్రీన్ హెవ్ఫ ఫామ్స్‌లో చేస్తున్న పని తన వ్యవసాయ క్షేత్రాన్ని సుసంపన్నం చేయటంతో పాటు కొత్త తరం రైతులకు ప్రేరణగా నిలుస్తోంది. తొట్ట తొలి ద గుడ్ ఫార్మర్ అవార్డ్ యుఎస్ పురస్కారాన్ని ప్రదానం ఆమెకు ప్రదానం చేయటం గర్వంగా ఉంది' అన్నారాయన.



నార్త్ కరోలినలో గ్రీన్ హెవ్ఫ ఫామ్స్‌ను నిర్వహిస్తున్న స్టాన్లీ సేంద్రియ విలువల పట్ల నిబద్ధతతో వ్యవసాయం చేస్తున్న హెర్బలిస్టు. రీజనరేటివ్ ఆర్గానిక్ ఫార్మింగ్ ద్వారా ఆర్థిక ప్రగతితో పాటు, సమానత్వం, విద్య, పర్యావరణ పరిరక్షణకు చేస్తున్న విశేష కృషికి గాను ఆమెను పురస్కారం వరించింది. 20 రాష్ట్రాల నుంచి సుమారు వంద దరఖాస్తులు రాగా స్టాన్లీని జ్యూరీ ఎంపికచేసింది. ఈ పురస్కారం కింద పది వేల డాలర్ల నగదును, జ్ఞాపికను అందజేస్తారు.



స్టాన్లీ విలువైన ఔషధ మొక్కలను, తేయాకును పూర్తిగా సేంద్రియంగా పండిస్తున్నారు. కొత్తగా సేద్యవృత్తిని చేపట్టిన వారికి ఆమె శిక్షణ ఇస్తున్నారు. చారిత్రకంగా అణగారిన వర్గాల బడుగు వారికి ఆమె ప్రాధాన్యం ఇస్తారు. నేలను సేంద్రియ పద్ధతుల్లో పునరుజ్జీవింపజేసుకుంటూనే పంటలు పండిస్తూ ఈ వ్యవసాయం ఆర్థికంగానూ, పర్యావరణ పరంగా, ఆహార భద్రతాపరంగానూ గిట్టుబాటు వ్యవహారమే అని స్టాన్లీ నిరూపించుకున్నారు.

'గ్రీన్ హెవ్ఫ ఫామ్స్‌లో మేం అనుసరిస్తున్న సాగు పద్ధతికి ఈ పురస్కారం వెన్నుతట్టింది. ఈ క్షేత్రంలో మేం పంటలను మాత్రమే పండించటం లేదు, పరివర్తనను పెంపొందిస్తున్నాం' అన్నారు స్టాన్లీ సంతోషంగా.

డావైన్స్ గ్రూప్ ఐదేళ్ల క్రితం ఇటలీలోని పర్మలోయూరోపియన్ రీజెనరేటివ్ ఆర్గానిక్ సెంటర్‌ను రోడేల్ ఇన్‌స్టిట్యూట్ తోడ్పాటుతో నెలకొల్పింది. అక్కడ జరిగే సభలో స్టాన్లీకి పురస్కార ప్రదానం జరుగుతుంది. ఆమె రాకపోకల ఖర్చులన్నీ డావైన్స్ గ్రూప్ భరిస్తుంది. ఆమె తమ దేశానికి రావటం వల్ల రీజనరేటివ్ ఆర్గానిక్ వ్యవసాయ స్ఫూర్తి తమ ప్రాంత రైతులకు ప్రేరణ కలిగిస్తుందని భావిస్తున్నామని డావైన్స్ గ్రూప్ సంతోషిస్తోంది. పునరుజ్జీవన సేంద్రియ వ్యవసాయం చేయటంతో పాటు.. పండించిన ఆహారాన్ని తినిపించి వ్యాధులు నయం చేసే ఆసుపత్రిని పొలంలోనే నిర్వహించే కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తున్న స్టాన్లీ సింగిల్ వుమన్ ఫార్మర్ కావటం మరో విశేషం.

మెగా గుమ్మడి!

దక్షిణాఫ్రికాలోని కల్లినన్ ప్రాంత రైతు సంఘం ప్రతి ఏటా గుమ్మడికాయల పోటీ పెడుతుంటుంది. కార్నెలి బెస్టర్ అనే రైతు ఈ ఏడాది 445 కిలోల గుమ్మడి ఫస్ట్ ప్రైజ్ గెల్చుకున్నారు. ఈ అవార్డు ఆయనకు కొత్త కాదు. గత ఏడాది ఏకంగా 730 కిలోల గుమ్మడితో ఆయనే ఫస్ట్ ప్రైజ్ గెల్చుకోవటం విశేషం. ఏడాదిలో అతిపెద్ద గుమ్మడి సైజు అంత ఎందుకు తగ్గిందో తెలీదు. బహుశా భూతాపోన్నతి కావచ్చు. అదలా ఉంచితే, 2023లో ఇంకా బరువైన గుమ్మడి కాయను పండించిన వైకస్ లాంప్రెచ్ట్ విజేతగా నిలిచారు. ఆయన గుమ్మడి కాయ బరువెంతో తెలిస్తే మరింత ఆశ్చర్యం కలుగుతుంది.. 890 కిలోలు!



వ్యవసాయం పట్ల మక్కువను పెంపొందించే లక్ష్యంతో పాటు నిధుల సమీకరణ కోసం కల్లినన్ రైతు సంఘం ఈ వార్షిక పోటీలు పెడుతుంటుంది. అట్లాంటిక్ జెయింట్ గుమ్మడితో సంకపరచిన వంగడంతో సాగు చేసిన కాయలనే ఇక్కడ పోటీలో ఉంచుతారు. పోటీ ముగిసిన తర్వాత ప్రిటోరియా నగరంలో పేదలకు ఈ గుమ్మడి కాయలను పంచుతారు!

ఎన్‌బీఎఫ్‌సీ బంగారం రుణాలకు కష్టాలు

- ఆర్‌బీఐ నిబంధనలతో వృద్ధి నిదానించొచ్చు
- క్రిసిల్ రేటింగ్స్ నివేదిక అంచనా



ముంబై: ఆర్‌బీఐ ప్రతిపాదించిన నూతన ముసాయిదా నిబంధనలు ఎన్‌బీఎఫ్‌సీ (బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు) బంగారం రుణ ఆస్తులు నిదానించేలా చేస్తాయని క్రిసిల్ రేటింగ్స్ అంచనా వేసింది. లోన్ టు వ్యాల్యూ (బంగారం విలువలో ఇచ్చే రుణం), రుణాల పునరుద్ధరణ, టాపప్ బుల్లెట్ రుణాలపై ఈ ముసాయిదా దృష్టి పెట్టిందని.. ఈ నిబంధనలు ఎన్‌బీఎఫ్‌సీ రుణ ఆస్తుల వృద్ధిపై ప్రభావం చూపిస్తాయని తెలిపింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో ముసాయిదా నిబంధనలు విడుదల చేసిన ఆర్‌బీఐ, భాగస్వాముల అభిప్రాయాలను ఆహ్వానించింది. బంగారం రుణాల విషయంలో బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీల మధ్య వ్యత్యాసాలు తగ్గించి, ఏకరూపత తీసుకురావడం ముసాయిదా నిబంధనల లక్ష్యంగా ఉంది. బంగారం రుణాల విషయంలో అసాధారణ ప్రక్రియలను ఎన్‌బీఎఫ్‌సీలు పాటిస్తుండడం, బంగారం విలువపై అధిక నిష్పత్తిలో రుణాలు జారీ చేస్తుండడంపై ఆర్‌బీఐ గతేడాది సెప్టెంబర్‌లో కాస్తంత హెచ్చరించే ధోరణిని వ్యక్తం చేయడాన్ని నివేదిక ప్రస్తావించింది. 2024–25లో వ్యవస్థ వ్యాప్తంగా బంగారం రుణాలు 50 శాతానికి పైనే పెరిగాయని, బ్యాంక్‌ల బంగారం రుణ ఆస్తుల విలువ రెట్టింపైనట్టు పేర్కొంది.

ఆభరణాలపై తక్కువ రుణాలు..

ఎల్‌టీవీపై ఆర్‌బీఐ కొత్త నిబంధనల కింద ఎన్‌బీఎఫ్‌సీలు బంగారం రుణాల మంజూరు విలువను క్రమబద్ధీకరించుకోవాల్సి వస్తుందని తెలిపింది. బుల్లెట్ రుణాలకు సంబంధించిన ఎల్‌టీవీ ప్రస్తుతమున్న 65–68 శాతం నుంచి 55–60 శాతానికి దిగొస్తుందని అంచనా వేసింది. దీంతో అంతే విలువ కలిగిన బంగారం ఆభరణాలపై మంజూరు చేసే రుణం తగ్గుతుందని తెలిపింది. కస్టమర్ల వద్ద నుంచి నిర్ణీత రోజులకు ఒకసారి (నెల) బంగారం రుణంపై వడ్డీని ఎన్‌బీఎఫ్‌సీలు వసూలు చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొంది. అలాగే, ఈ సంస్థలు ఈఎంఐ ఆధారిత బంగారం రుణాలపై దృష్టి పెట్టొచ్చని తెలిపింది. ఎల్‌టీవీ పరిమితి మించితే అదనపు నిధుల కేటాయింపులు చేయాలన్న నిబంధన ఎన్‌బీఎఫ్‌సీలపై పెద్ద ప్రభావం చూపించకపోవచ్చని అభిప్రాయపడింది. ఆర్‌బీఐ ప్రతిపాదిత నిబంధనలు కొంత కాలానికి ఈ రంగం సామర్థ్యాలను బలోపేతం చేస్తాయని క్రిసిల్ రేటింగ్స్ నివేదిక తెలిపింది.

సేవల రంగం .. స్వల్పంగా మెరుగు

ఏప్రిల్‌లో 58.7గా పీఎంఐ ఇండెక్స్



న్యూఢిల్లీ: కొత్త ఆర్డర్ల రాకతో దేశీ సర్వీసుల రంగం ఏప్రిల్‌లో స్వల్పంగా మెరుగుపడింది. దీంతో సేవల రంగం పనితీరుకు ప్రామాణికంగా పరిగణించే హెచ్‌ఎస్‌బీసీ ఇండియా సర్వీసెస్ పీఎంఐ బిజినెస్ యాక్టివిటీ సూచీ గత నెలలో 58.7కి చేరింది. మార్చిలో ఇది 58.5గా నమోదైంది. పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) పరిభాషలో సూచీ 50కి ఎగువన ఉంటే వృద్ధిని, దిగువన ఉంటే క్షీణతను సూచిస్తుంది. తాజా గణాంకాలు, దీర్ఘకాలిక సగటు అయిన 54.2 స్థాయికన్నా అధికంగానే ఉన్నట్లు హెచ్‌ఎస్‌బీసీ చీఫ్ ఇండియా ఎకానమిస్ట్ ప్రాంజల్ భండారీ తెలిపారు. మార్చిలో కాస్త నెమ్మదించిన ఎగుమతి ఆర్డర్లు ఏప్రిల్‌లో తిరిగి పుంజుకున్నట్లు వివరించారు. ఆసియా, యూరప్, మధ్యప్రాచ్యం, అమెరికావ్యాప్తంగా భారతీయ కంపెనీల సేవలకు డిమాండ్ నెలకొన్నట్లు పేర్కొన్నారు. సగటు విక్రయ ధరలను పెంచడం ద్వారా సర్వీసుల కంపెనీలు తమ అధిక వ్యయాల భారాన్ని క్లయింట్లకు బదలాయించినట్లు పీఎంఐ సర్వేలో వెల్లడైంది. వ్యయాలపరంగా ఒత్తిళ్లు తగ్గి, రేట్లను పెంచడంతో మార్జిన్లు మెరుగుపడ్డాయి. కార్యకలాపాలు పుంజుకోవడంపై సర్వీస్ ప్రొవైడర్లు ఆశావహంగా ఉన్నప్పటికీ అంచనాలు మాత్రం తగ్గాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

7-5-2025	
విశాఖ	500–00
చిత్తూరు	553–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	495–00
విజయవాడ	500–00
రిటైల్ ధర (డజను)	66.00
హైదరాబాద్	480–00
వరంగల్	482–00
రిటైల్ ధర	5.40

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
HEROMOTOCO	3,861.00	2.48
BHARTIARTL	1,896.00	1.61
HINDUNILVR	2,381.60	1.41
TATASTEEL	144.03	1.37
M&M	3,058.40	1.22

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ADANIENT	2,350.00	-4.3
JIOFIN	251	-3.68
ETERNAL	232.7	-3
TRENT	5,220.00	-2.8
SBILIFE	1,725.10	-2.53

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	5,831
ఎన్ఎస్ఈ	90,454
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,44,238
ఎఫ్ఐఐ	+ 3,794
డీఐఐ	- 1,398

ముడిచమురు... (బ్యారల్)

	రాత్రి 11.30కు		క్రితం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	59.62	$	57.13
బ్రెంట్	62.64	$	60.23

జీడీపీ వృద్ధి 6.3 శాతమే

- 2025లో నమోదు కావొచ్చన్న మూడీస్
- 2026 సంవత్సరానికి 6.5 శాతం కొనసాగింపు
- వాణిజ్య ఉద్రిక్తతలు, అనిశ్చితుల వల్లే



న్యూఢిల్లీ: భారత జీడీపీ 2025లో 6.3 శాతం వృద్ధిని నమోదు చేస్తుందని మూడీస్ రేటింగ్స్ తాజా అంచనాలు ప్రకటించింది. 6.5 శాతం వృద్ధి సాధిస్తుందంటూ గతంలో వెల్లడించిన అంచనాలను తగ్గించింది. అమెరికా టారిఫ్‌లు, వాణిజ్య ఆంక్షలతో వృద్ధి నిదానించొచ్చని పేర్కొంది. అంతర్జాతీయంగా ఉన్న భౌగోళిక ఉద్రిక్తతలకు తోడు.. భారత్–పాక్ మధ్య ఉద్రిక్తతలు సైతం జీడీపీ వృద్ధి అంచనాలపై ప్రభావం చూపిస్తాయని తెలిపింది. దీంతో ఎక్కడ ఇన్వెస్ట్ చేయాలి, ఎక్కడ విస్తరణ చేపట్టాలి, ముడి పదార్థాల సమీకరణ తదితరాల వ్యయాలు పెరిగిపోవచ్చని పేర్కొంది. అయితే, 2026 సంవత్సరానికి మాత్రం లోగడ ప్రకటించిన 6.5 శాతం వృద్ధి రేటు అంచనాలనే మూడీస్ కొనసాగించింది. 2024 కేలండర్ సంవత్సరంలో జీడీపీ వృద్ధి రేటు 6.7 శాతంగా ఉండడం గమనార్హం. విధానపరమైన అస్పష్టత, అమెరికా–చైనా మధ్య వాణిజ్య ఉద్రిక్తతలతో 2025, 2026 సంవత్సరాలకు సంబంధించి అంతర్జాతీయ వృద్ధి రేటు అంచనాలను తగ్గిస్తున్నట్టు మూడీస్ రేటింగ్స్ తెలిపింది.

ప్రపంచ వృద్ధిపైనా ప్రభావం..

టారిఫ్‌లకు అమెరికా స్వల్పకాలం పాటు విరామం ఇచ్చినప్పటికీ చైనా–అమెరికా మధ్య ఉద్రిక్తతలు జీ–20 దేశాల వ్యాప్తంగా అంతర్జాతీయ వాణిజ్యం, పెట్టుబడులకు విఘాతం కలిగిస్తాయని మూడీస్ రేటింగ్స్ తెలిపింది. 2025లో అమెరికా, చైనా జీడీపీ అంచనాలను సైతం కుదించింది. అమెరికా జీడీపీ 2025లో 1 శాతం, 2026లో 1.5 శాతం చొప్పున వృద్ధిని నమోదు చేయొచ్చని అంచనా వేసింది. గత అంచనాలు కుదించింది. చైనా 2025లో 3.8 శాతం, 2026లో 3.9 శాతం చొప్పున వృద్ధి చెందొచ్చని పేర్కొంది. మొత్తం మీద అమెరికాకు సంబంధించి టారిఫ్‌లు గరిష్ట స్థాయికి చేరాయని.. రానున్న రోజుల్లో ఇవి తగ్గుతాయని అంచనా వేస్తున్నట్టు తెలిపింది. తరచుగా ఆర్థిక మార్కెట్లలో అస్థిరతలు లిక్విడిటీని (ద్రవ్య లభ్యత) కఠినతరం చేస్తాయని, ఇది నిధులపై వ్యయాలు గణనీయంగా పెరిగేందుకు దారితీస్తుందని మూడీస్ తెలిపింది. వృద్ధికి ఇది విఘాతం కలిగించొచ్చని పేర్కొంది.

ప్రభుత్వ రుణం దిగిరావాలి

- వడ్డీ చెల్లింపులు ఆదా అవుతాయి
- అప్పుడే రేటింగ్ అప్‌గ్రేడ్
- ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి అజయ్‌సేత్



న్యూఢిల్లీ: పెరిగిన ప్రభుత్వ రుణం మోస్తరు స్థాయికి దిగిరావాల్సి ఉందని కేంద్ర ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి అజయ్‌సేత్ అన్నారు. తద్వారా వడ్డీ చెల్లింపులు తగ్గుతాయని, సార్వభౌమ రేటింగ్ అప్‌గ్రేడ్ అవుతుందన్నారు. ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడారు. అనిశ్చితులు పెరిగిపోతున్న నేపథ్యంలో భారత్ ఏదో ఒక నిర్దిష్టమైన మార్గానికి పరిమితం కాకూడదన్నారు. ''మారుతున్న పరిణామాలకు మనం చురుగ్గా స్పందించాలి. నేడు భారత ఆర్థిక వ్యవస్థ 4 ట్రిలియన్ డాలర్ల స్థాయికి సమీపించింది. మిగిలిన ప్రపంచ వ్యాప్తంగా ఏం జరుగుతుందన్నది తెలుసుకునేంత సామర్థ్యం మనకు ఉంది. ఈ దిశగా మనదైన మార్గాన్ని గుర్తించాలి'' అని వివరించారు. ప్రభుత్వ రుణం ప్రస్తుత స్థాయిల నుంచి కచ్చితంగా దిగిరావాలంటూ.. అందుకు ద్రవ్య స్థిరీకరణను మార్గంగా పేర్కొన్నారు. దేశ జీడీపీలో పన్నుల వాటా దశాబ్దం క్రితం 16.5 శాతంగా ఉంటే, అది ప్రస్తుతం 18 శాతానికి చేరినట్టు అజయ్ సేత్ తెలిపారు. ప్రస్తుత ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకుని చూస్తే మరో 5–6 ఏళ్లలో 20 శాతానికి పన్నుల వాటా చేరుకోగలదన్నారు. వ్యయాల గురించి మాట్లాడుతూ.. మూలధన వ్యయాలకు అనుకూలంగా తగిన సర్దుబాట్లు జరుగుతున్నట్టు చెప్పారు.

యాపిల్ మొబైల్స్ అన్నీ భారత్‌లోనే తయారీ

కేంద్ర టెలికం మంత్రి సింధియా

న్యూఢిల్లీ: ప్రస్తుత పరిస్థితుల్లో భారత్‌లో ఉత్పత్తి చేయడం ప్రతి కంపెనీకి ఆర్థికంగా ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని కేంద్ర టెలికం మంత్రి జ్యోతిరాదిత్య సింధియా చెప్పారు. తాము అమెరికాలో విక్రయించబోయే అధిక శాతం ఐఫోన్లు భారత్‌లో తయారైనవే ఉంటాయంటూ టెక్ దిగ్గజం యాపిల్ ప్రకటించడం ఇందుకు నిదర్శనమని ఆయన తెలిపారు. 'రాబోయే రోజుల్లో తమ మొబైల్ ఫోన్లు అన్నింటినీ భారత్‌లోనే తయారు చేయాలని, సోర్సింగ్ చేయాలని యాపిల్ నిర్ణయించుకుంది. కాబట్టి భారత్‌లో ఇన్వెస్ట్ చేశారంటే విశ్వసనీయతను, సహజత్వాన్ని, అఫోర్డబిలిటీని (తక్కువ వ్యయాల ప్రయోజనాలు) ఎంచుకున్నట్లే' అని భారత్ టెలికం కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా మంత్రి చెప్పారు. ప్రభుత్వం ప్రకటించిన ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం దన్నుతో దేశీయంగా టెలికం పరికరాల మార్కెట్ అనేక రెట్లు వృద్ధి చెందిందని ఆయన తెలిపారు. రూ. 4,000 కోట్ల పెట్టుబడులనేవి రూ. 80,000 కోట్ల విక్రయాలకు, రూ. 16,000 కోట్లు విలువ చేసే ఎగుమతులతో పాటు 25,000 ఉద్యోగాల కల్పనకు దోహదపడినట్లు సింధియా చెప్పారు.



తుది దశలో స్టార్‌లింక్ అనుమతులు



న్యూఢిల్లీ: ఎలాన్ మస్క్‌కి చెందిన శాటిలైట్ ఇంటర్నెట్ సేవల సంస్థ స్టార్‌లింక్‌కు అనుమతుల అంశం తుది దశలో ఉందని కేంద్ర టెలికం శాఖ సహాయ మంత్రి చంద్రశేఖర్ పెమ్మసాని తెలిపారు. భారత వ్యవస్థను పాకిస్తాన్ హ్యాక్ చేసేందుకు ప్రయత్నిస్తున్న తరుణంలో స్టార్‌లింక్‌కు అనుమతులనేది కొంత సంక్లిష్టమైన విషయం కావడంతో భద్రత సహా అన్ని కోణాల నుంచి ఈ అంశాన్ని కూడా పరిశీలించాల్సి ఉంటుందన్నారు. మరోవైపు, మొత్తం మార్కెట్‌ను స్టార్‌లింక్ ఆక్రమించేస్తుందని, ప్రస్తుత టెల్కోలకు ముప్పుగా పరిణమిస్తుందని ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మారుమూల ప్రాంతాలను కనెక్ట్ చేయడానికే శాట్‌కామ్ సర్వీసులు ఎక్కువగా ఉపయోగపడతాయని, సాంప్రదాయ టెలికం నెట్‌వర్క్‌లతో పోలిస్తే కనెక్టివిటీలో వీటి పాత్ర తక్కువేనని మంత్రి తెలిపారు.

మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక ఆర్థిక ఉత్పత్తులు

- టైర్ 2, చిన్న పట్టణాల నుంచి డిమాండ్
- భారత్ ఉమెన్స్ యాస్పిరేషన్ ఇండెక్స్ నివేదిక



న్యూఢిల్లీ: టైర్ 2, ఇతర పట్టణాల్లో చిన్నతరహా వ్యాపారాలు నిర్వహించే మహిళలు తమ అవసరాలకు అనుగుణంగా ప్రత్యేకమైన ఆర్థిక ఉత్పత్తులను కోరుకుంటున్నట్టు 'భారత్ ఉమెన్ యాస్పిరేషన్ ఇండెక్స్ (బీడబ్ల్యూఏఐ) 2025' నివేదిక వెల్లడించింది. బిజినెస్ మేనేజ్‌మెంట్ ప్లాట్‌ఫామ్ 'టైడ్' దీన్ని విడుదల చేసింది. అంతేకాదు ఆయా పట్టణాల్లో చిన్నతరహా మహిళా పారిశ్రామికవేత్తల్లో మూడింట ఒక వంతు మంది రుణం పొందే విషయంలో సవాళ్లను ఎదుర్కొంటున్నారు. తనఖా నిబంధనలు కఠినంగా ఉండడం, ఆర్థిక అక్షరాస్యత తగినంత లేకపోవడం వీరిని రుణ సదుపాయానికి దూరం చేస్తోందని, వీరికి తనఖా రహిత సూక్ష్మ రుణాలు సహా తదితర ప్రత్యామ్నాయ రుణ సదుపాయాలు అందించేందుకు సత్వర విధానపరమైన చర్యలు అవసరమని ఈ నివేదిక సూచించింది. ''టైర్ 2, 3, అంతకంటే చిన్న పట్టణాల్లో మహిళా పారిశ్రామికవేత్తలు డిజిటల్ అవగాహనతో వృద్ధి చెందాలన్న ఆకాంక్షలతో ఉన్నారు. కానీ, రుణ సదుపాయం, నెట్‌వర్క్‌లు, తదితర సంస్థాగత అంతరాలు వారిని వెనకడుగు వేసేలా చేస్తున్నాయి''అని తెలిపింది.

మహిళల అభిప్రాయాలు..

- 1,300 మంది మహిళా వ్యాపారవేత్తల అభిప్రాయాలను బీడబ్ల్యూఏఐ సర్వే చేసింది. ఆర్థిక, వ్యాపార నిర్వహణ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాల్సి ఉందని 58% మంది చెప్పడం గమనార్హం.
- డిజిటల్ నైపుణ్యాలను పెంచుకోవాలన్న బలమైన ఆకాంక్ష 12 శాతం మందిలో కనిపించింది.
- 28 శాతం మంది నిధుల విషయంలో తమ కుటుంబం నుంచి పురుష సభ్యుడి సహకారం అవసరమని చెప్పారు. వ్యవస్థాపకులుగా వారి ప్రయాణంలో ఇదొక పెద్ద అడ్డంకిగా నివేదిక పేర్కొంది.
- డిజిటల్ నైపుణ్యాల పెంపు, వారికి లభిస్తున్న వివిధ పథకాల సమాచారం అందించడం, నెట్‌వర్కింగ్ పెంపు ద్వారా మహిళా పారిశ్రామికవేత్తల లక్ష్యాలను సులభతరం చేయొచ్చని ఈ నివేదిక సూచించింది.

మార్చి త్రైమాసిక ఫలితాలు

ఎన్ఎస్ఈ లాభం అప్

- క్యూ4లో రూ. 2,650 కోట్లు
- షేరుకి రూ. 35 డివిడెండ్



న్యూఢిల్లీ: స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజం ఎన్ఎస్ఈ గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 7 శాతం పుంజుకుని రూ. 2,650 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో రూ. 2,488 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం 13 శాతం క్షీణించి రూ. 4,397 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం క్యూ4లో రూ. 5,080 కోట్ల టర్నోవర్ అందుకుంది. వాటాదారులకు షేరుకి రూ. 35 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. దీనిలో రూ. 11.46 ప్రత్యేక డివిడెండ్ కలసి ఉంది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి ఎన్ఎస్ఈ నికర లాభం 47 శాతం జంప్‌చేసి రూ. 12,188 కోట్లకు చేరింది. మొత్తం ఆదాయం సైతం 17 శాతం ఎగసి రూ. 19,177 కోట్లకు బలపడింది. ఈ కాలంలో మొత్తం రూ. 59,798 కోట్లమేర సెక్యూరిటీ లావాదేవీల పన్ను(ఎస్‌టీటీ) చెల్లించింది.

బీఎస్ఈ లాభం హైజంప్

- క్యూ4లో రూ. 494 కోట్లు
- షేరుకి రూ. 23 డివిడెండ్



న్యూఢిల్లీ: స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజం బీఎస్ఈ గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో నికర లాభం హైజంప్ చేసి రూ. 494 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో కేవలం రూ. 107 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 543 కోట్ల నుంచి రూ. 926 కోట్లకు ఎగసింది. వాటాదారులకు షేరుకి రూ. 23 డివిడెండ్ ప్రకటించింది. దీనిలో రూ. 5 ప్రత్యేక డివిడెండ్ కలసి ఉంది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి బీఎస్ఈ నికర లాభం 3 రెట్లు దూసుకెళ్లి రూ. 1,322 కోట్లను తాకింది. 2023–24లో కేవలం రూ. 404 కోట్ల లాభం ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 1,596 కోట్ల నుంచి రూ. 3,236 కోట్లకు బలపడింది. ఈ కాలంలో ఈక్విటీ డెరివేటివ్స్‌లో 30.5 బిలియన్ కాంట్రాక్టులు ట్రేడ్‌కాగా.. రూ. 1,415 కోట్ల ఆదాయం నమోదైనట్లు బీఎస్ఈ వెల్లడించింది.

ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈ షేరు ఎన్ఎస్ఈలో 3.2 శాతం నీరసించి రూ. 6,250 వద్ద ముగిసింది.

పిరమల్ ఎంటర్‌ప్రైజెస్ లాభం 102 కోట్లు

25 శాతం క్షీణత



ముంబై: పిరమల్ ఎంటర్‌ప్రైజెస్ మార్చి త్రైమాసికానికి రూ.102 కోట్ల లాభాన్ని ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.137 కోట్లతో పోల్చి చూసినప్పుడు 25 శాతం తగ్గిపోయింది. ఆదాయం మాత్రం ఇదే కాలంలో రూ.2,473 కోట్ల నుంచి రూ.2,854 కోట్లకు వృద్ధి చెందింది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి కన్సాలిడేటెడ్ లాభం రూ.485 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఆర్థిక సంవత్సరంలో ఇది రూ.1,684 కోట్లుగా ఉండడం గమనార్హం. కంపెనీ నిర్వహణలోని ఆస్తులు 17 శాతం పెరిగాయి. 2025–26లో 25 శాతం వృద్ధిని నమోదు చేస్తామని కంపెనీ అంచనాలను ప్రకటించింది. నికర లాభం రెండు రెట్ల వృద్ధితో రూ.1,500 కోట్లకు చేరుకోవచ్చని తెలిపింది. పోర్ట్‌ఫోలియోలో చిన్న రుణాల వాటా 80 శాతానికి చేరగా, 85 శాతానికి చేర్చాలని నిర్ణయించింది. స్థూల ఎన్‌పీఏలు 2.8 శాతానికి పెరిగాయి. రుణ వ్యయాలు సైతం 1.2 శాతం నుంచి 1.8 శాతానికి చేరాయి.

బీఎస్ఈలో కంపెనీ షేరు 4.25 శాతం క్షీణించి రూ.965 వద్ద ముగిసింది.

డీసీఎం శ్రీరామ్ పటిష్ట పనితీరు

52 శాతం ఎగసిన లాభం



న్యూఢిల్లీ: డీసీఎం శ్రీరామ్ లిమిటెడ్ మార్చితో అంతమైన మూడు నెలల కాలంలో పటిష్ట పనితీరు నమోదు చేసింది. కన్సాలిడేటెడ్ లాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూసినప్పుడు 52 శాతం ఎగసి రూ.179 కోట్లకు చేరుకుంది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.118 కోట్లుగా ఉంది. మొత్తం ఆదాయం క్రితం ఏడాది ఇదే కాలంలో ఉన్న రూ.2,555 కోట్ల నుంచి 18 శాతం వృద్ధితో రూ.3,041 కోట్లకు వృద్ధి చెందింది. ఇక 2024–25 ఆర్థిక సంవత్సరానికి డీసీఎం శ్రీరామ్ లిమిటెడ్ రూ.604 కోట్ల లాభాన్ని ప్రకటించింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరంలో ఇది రూ.447 కోట్లుగా ఉంది. ఆదాయం రూ.12,883 కోట్లకు వృద్ధి చెందింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరంలో ఇది రూ.11,530 కోట్లుగా ఉండడం గమనార్హం. రసాయనాలు, చక్కెర, సాగు రంగ పరిష్కారాలు, ఎరువులు తదితర వ్యాపారాల్లో డీసీఎం శ్రీరామ్ కార్యకలాపాలు నిర్వహిస్తోంది.

ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో కంపెనీ షేరు 4 శాతం ఎగసి రూ.1,018 వద్ద ముగిసింది.

జేబీఎమ్ ఆటో లాభం జూమ్

క్యూ4లో రూ. 66 కోట్లు



న్యూఢిల్లీ: ఆటోమోటివ్, ఎలక్ట్రిక్ వాహన తయారీ కంపెనీ జేబీఎమ్ ఆటో గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 20 శాతం ఎగసి రూ. 66 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో రూ. 55 కోట్లు ఆర్జించింది. నికర అమ్మకాలు 11 శాతం వృద్ధితో రూ. 1,646 కోట్లకు చేరాయి. అంతక్రితం క్యూ4లో రూ. 1,486 కోట్ల ఆదాయం సాధించింది. నిర్వహణ లాభం(ఇబిటా) రూ. 177 కోట్ల నుంచి రూ. 214 కోట్లకు జంప్ చేసింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం 11 శాతం పుంజుకుని రూ. 273 కోట్లకు చేరింది. 2023–24లో రూ. 246 కోట్ల లాభం ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 5,009 కోట్ల నుంచి రూ. 5,472 కోట్లకు బలపడింది. పీఎంఈ బస్ సేవా పథకంలో భాగంగా క్యూ4లో రూ. 5,500 కోట్ల విలువైన 1,021 ఎలక్ట్రిక్ బస్‌లకు ఆర్డర్ లభించినట్లు కంపెనీ వెల్లడించింది.

ఫలితాల నేపథ్యంలో జేబీఎమ్ ఆటో షేరు బీఎస్ఈలో 1.2% లాభపడి రూ. 683 వద్ద ముగిసింది.

రాడికో ఖైతాన్ లాభం అదుర్స్

71 శాతం వృద్ధితో రూ.92 కోట్లు



న్యూఢిల్లీ: లిక్కర్ తయారీ కంపెనీ రాడికో ఖైతాన్ మార్చితో ముగిసిన త్రైమాసికంలో బలమైన పనితీరు నమోదు చేసింది. కన్సాలిడేటెడ్ నికర లాభం క్రితం ఏడాది ఇదే కాలంలో పోల్చి చూస్తే 71 శాతం జంప్ చేసి రూ.92 కోట్లకు చేరింది. ప్రధానంగా అమ్మకాలు పెంచుకోవడం ఇందుకు అనుకూలించింది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.54 కోట్లుగా ఉండడం గమనార్హం. ఆదాయం 15 శాతం వృద్ధితో రూ.4,485 కోట్లుగా నమోదైంది. క్రితం ఏడాది ఇదే కాలంలో ఆదాయం రూ.3,894 కోట్లుగా ఉంది. ఐఎంఎఫ్ఎల్ అమ్మకాలు 28 శాతం పెరిగి 9.15 మిలియన్ కేసులుగా ఉన్నాయి. డిసెంబర్ త్రైమాసికంలో మాదిరిగా బలమైన పనితీరు చూపించినట్టు కంపెనీ ఎండీ అభిషేక్ ఖైతాన్ ప్రకటించారు. 28 శాతం వృద్ధి రేటు అన్నది గత మూడేళ్లలోనే త్రైమాసికం వారీ గరిష్టంగా పేర్కొన్నారు. 2025–26 మొదటి త్రైమాసికంలో రెండు లగ్జరీ బ్రాండ్లను విడుదల చేయనున్నట్టు చెప్పారు. దీంతో ప్రీమియం ఉత్పత్తుల పరంగా మరో ముందడుగు అవుతుందన్నారు. ఈ ఏడాది ప్రథమార్థంలోనే సూపర్ ప్రీమియం విస్కీని ప్రవేశపెట్టనున్నట్టు తెలిపారు. ఇక 2024–25 సంవత్సరానికి రాడికో ఖైతాన్ నికర లాభం అంతక్రితం ఆర్థిక సంవత్సరంతో పోల్చి చూసినప్పుడు 32% పెరిగి రూ.346 కోట్లకు చేరింది. ఆదాయం 10 శాతం వృద్ధితో రూ.17,103 కోట్లుగా నమోదైంది.

బీఎస్ఈలో కంపెనీ షేరు పెద్దగా మార్పు లేకుండా రూ.2,534 వద్ద ముగిసింది.

ఏడు స్థానాలు పడిపోయి...

18వ ర్యాంక్‌లో సాత్విక్–చిరాగ్ జోడీ



కౌలాలంపూర్: ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ తర్వాత మరే టోర్నీలోనూ ఆడకపోవడంతో... భారత డబుల్స్ స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి ర్యాంక్‌పై ప్రభావం చూపింది. మంగళవారం విడుదల చేసిన ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) తాజా ర్యాంకింగ్స్‌లో సాత్విక్–చిరాగ్ ద్వయం ఏడు స్థానాలు పడిపోయింది. గత వారం 11వ ర్యాంక్‌లో ఉన్న సాత్విక్–చిరాగ్ జంట తాజాగా 18వ ర్యాంక్‌కు దిగజారింది. మహిళల సింగిల్స్‌లో భారత స్టార్ పీవీ సింధు రెండు స్థానాలు పురోగతి సాధించి 16వ ర్యాంక్‌లో నిలిచింది. మాళవిక బన్సోద్ 23వ స్థానంలో, రక్షిత శ్రీ 41వ స్థానంలో, అనుపమ 42వ స్థానంలో, ఆకర్షి కశ్యప్ 47వ స్థానంలో ఉన్నారు. పురుషుల సింగిల్స్‌లో లక్ష్య సేన్ ఒక స్థానం పడిపోయి 19వ ర్యాంక్‌కు చేరుకున్నాడు. ప్రియాన్షు రజావత్ మూడు స్థానాలు మెరుగుపర్చుకొని 33వ ర్యాంక్‌లో నిలిచాడు. హెచ్‌ఎస్ ప్రణయ్ ఐదు స్థానాలు పడిపోయి 35వ ర్యాంక్‌కు, కిరణ్ జార్జి రెండు స్థానాలు పడిపోయి 37వ ర్యాంక్‌కు చేరుకున్నారు. మహిళల డబుల్స్‌లో పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ ద్వయం పదో ర్యాంక్‌లోనే కొనసాగుతోంది. మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిల–తనీషా క్రాస్టో జోడీ 18వ ర్యాంక్‌లో నిలిచింది.

శ్రీలంక క్రికెటర్లకు ఆర్.శ్రీధర్ శిక్షణ

న్యూఢిల్లీ: టీమిండియా మాజీ ఫీల్డింగ్ కోచ్ ఆర్. శ్రీధర్ శ్రీలంక క్రికెటర్లకు కోచింగ్ ఇవ్వనున్నారు. హైదరాబాద్‌కు చెందిన ఈ సీనియర్ కోచ్ పది రోజుల శిక్షణలో లంక జట్లకు మెళకువలు నేర్పనున్నట్లు తెలిసింది. భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) లెవెల్–3 కోచ్ అయిన శ్రీధర్... లంక పురుషులు, మహిళల జట్లతో ఎమర్జింగ్, ప్రీమియర్ క్లబ్, అండర్–19, మహిళల 'ఎ' జట్ల క్రికెటర్లకు స్వల్పకాలిక శిక్షణ ఇస్తారని లంక బోర్డు తెలిపింది. 'లంక క్రికెట్‌లో ఫీల్డింగ్ ప్రమాణాలు పెంచేందుకు ఈ ప్రత్యేక శిబిరాన్ని నిర్వహిస్తున్నాం. ఫీల్డింగ్ కోచింగ్‌లో అపార అనుభవమున్న శ్రీధర్ భారత్‌కు ఏళ్ల తరబడి సేవలందించారు. 2014 నుంచి 2021 వరకు సుమారు 300 అంతర్జాతీయ మ్యాచ్‌లకు టీమిండియా ఫీల్డింగ్ కోచ్‌గా పని చేశారు' అని శ్రీలంక క్రికెట్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది. బుధవారం మొదలయ్యే ఈ 10 రోజుల కార్యక్రమంలో ఫీల్డింగ్ డ్రిల్స్, ప్రత్యేక నైపుణ్య శిక్షణ, మ్యాచ్ పరిస్థితులకు తగినట్లుగా ఫీల్డింగ్ మోహరింపు విషయాల్ని శ్రీధర్ నేర్పించనున్నారు.



చైనా నుంచి తొలిసారి...

ప్రపంచ స్నూకర్ చాంపియన్‌గా జావో జిన్‌టాంగ్



విన్నర్స్ ట్రోఫీతో జావో జిన్‌టాంగ్

షెఫీల్డ్ (ఇంగ్లండ్): బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, డైవింగ్, స్విమ్మింగ్, జిమ్నాస్టిక్స్, షూటింగ్, వెయిట్‌లిఫ్టింగ్ క్రీడాంశాల్లో ఎంతోమంది ప్రపంచ చాంపియన్‌లను అందించిన చైనా నుంచి తాజాగా ప్రొఫెషనల్ స్నూకర్ క్రీడాంశంలో తొలిసారి విశ్వ విజేత అవతరించాడు. ఇంగ్లండ్‌లో జరిగిన ప్రపంచ ప్రొఫెషనల్ స్నూకర్ చాంపియన్‌షిప్‌లో చైనాకు చెందిన 28 ఏళ్ల జావో జిన్‌టాంగ్ మొదటిసారి చాంపియన్‌గా నిలిచాడు. 'బెస్ట్ ఆఫ్ 35' ఫ్రేమ్స్ పద్ధతిలో రెండు రోజులపాటు జరిగిన ఫైనల్లో క్వాలిఫయర్ జావో జిన్‌టాంగ్ 18–12 ఫ్రేమ్‌ల తేడాతో వేల్స్‌కు చెందిన మూడుసార్లు ప్రపంచ చాంపియన్ మార్క్ విలియమ్స్‌పై విజయం సాధించాడు. జావో జిన్‌టాంగ్ 141–0, 100–38, 47–44, 28–66, 77–49, 71–61, 119–0, 95–0, 0–86, 8–65, 85–9, 74–0, 14–62, 0–72, 96–23, 71–63, 43–71, 76–5, 18–66, 65–7, 85–45, 104–1, 14–84, 79–26, 63–36, 30–101, 1–62, 6–96, 0–73, 110–8 స్కోరుతో 50 ఏళ్ల విలియమ్స్‌ను ఓడించాడు. విజేత జిన్‌టాంగ్‌కు 5,00,000 పౌండ్లు (రూ. 5 కోట్ల 63 లక్షలు) ప్రైజ్‌మనీగా దక్కింది.

బాగా ఆడినంత కాలం రోహిత్, కోహ్లి జట్టులో ఉంటారు: కోచ్ గంభీర్



న్యూఢిల్లీ: సీనియర్ ప్లేయర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లిల భవిష్యత్తు గురించి తాను ఏమీ చెప్పలేనని భారత క్రికెట్ జట్టు హెడ్ కోచ్ గంభీర్ అన్నాడు. వారిద్దరి ఆట బాగున్నంత కాలం వయసుతో సంబంధం లేదని అతను అభిప్రాయపడ్డాడు. 'జట్టును ఎంపిక చేయడం సెలక్టర్ల బాధ్యత. అది నా చేతుల్లో లేదు. బాగా ఆడుతున్నంత వరకు కోహ్లి, రోహిత్ జట్టులో ఉంటారు. అతని వయసు 40 అయినా 45 అయినా సమస్య ఏముంది. కోచ్, సెలక్టర్ లేదా బీసీసీఐ కూడా ఫలానా ఆటగాడిని నువ్వు తప్పుకోవాలని చెప్పదు. ప్రదర్శన బాగుంటే 2027 వన్డే వరల్డ్ కప్ వరకు కూడా ఉంటారేమో. అయినా వారి ఆట ఎలా ఉందో చాంపియన్స్ ట్రోఫీలో ప్రపంచమంతా చూసింది కాబట్టి నేను కొత్తగా చెప్పేదేముంది. నా అభిప్రాయం ప్రకారం క్రికెటర్లకు వీడ్కోలు మ్యాచ్ లేదా సిరీస్ అనేది ఉండరాదు. అలాంటి ఒక్క మ్యాచ్‌కంటే ఇన్నేళ్లు జట్టు కోసం ఏం చేశాడో గుర్తు చేసుకోగలిగితే అదే పెద్ద గౌరవం. దేశపు అభిమానులు మిమ్మల్ని, మీ ఆటను ఇన్నేళ్లు ఇష్టపడటానికి మించి ఫేర్‌వెల్ ఏముంటుంది' అని గంభీర్ ప్రశ్నించాడు.



నిలవాలంటే గెలవాలి

- కీలకపోరుకు సిద్ధమైన కోల్‌కతా నైట్‌రైడర్స్
- నేడు చెన్నై సూపర్ కింగ్స్‌తో 'ఢీ'
- రాత్రి గం. 7:30 నుంచి స్టార్‌స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లలో ప్రసారం

కోల్‌కతా: డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్ భవితవ్యం ఈ మ్యాచ్‌లో తేలనుంది. ఐపీఎల్ 18వ సీజన్ ప్లేఆఫ్స్ రేసులో కోల్‌కతా ఉంటుందా లేదంటే లీగ్‌తోనే సరిపెట్టుకుంటుందా అనే విషయం నేడు చెన్నై సూపర్‌కింగ్స్‌తో జరిగే మ్యాచ్ ఫలితంపై ఆధారపడి ఉంది. మరోవైపు ధోని బృందం ఇది వరకే లీగ్ నుంచి నిష్క్రమించింది. అయితే ఐపీఎల్ కెరీర్ చరమాంకంలో ఉన్న ధోని ఆటతీరును, లోయర్‌ఆర్డర్‌లో క్రీజులోకి వస్తున్న తీరును పరిశీలిస్తే ఈ సీజనే చివరిదైనా ఆశ్చర్యపోనక్కర్లేదు. ఇదే జరిగితే... భారత విఖ్యాత స్టేడియం ఈడెన్ గార్డెన్స్‌లో తాను ఆడే ఆఖరి పోరును ధోని చిరస్మరణీయం చేసుకోవాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో చెన్నైకి నామమాత్రమైనా... నైట్‌రైడర్స్‌కు కీలకమైన ఈ పోరు ఆసక్తికరంగా జరగడం ఖాయం.

బ్యాటింగే కోల్‌కతా బలం

కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్)కు బ్యాటింగే బలం. ఇప్పటికే ఈ సీజన్‌లో నాలుగుసార్లు 200 పైచిలుకు పరుగుల్ని సాధించింది. లక్నోతో ఎదురైనా 239 పరుగుల భారీ లక్ష్యఛేదనలోనూ నైట్‌రైడర్స్ 4 పరుగుల తేడాతోనే ఓడింది. దీన్నిబట్టి చెప్పొచ్చు కోల్‌కతా బ్యాటర్ల బలమెంతో! తొలిదశను పక్కన బెడితే గత రెండు మ్యాచ్‌ల్లో చేసిన 200 ప్లస్ స్కోరు కేకేఆర్ ప్లేఆఫ్స్‌కు ఎంత కష్టపడుతుందో సూచిస్తోంది. ఢిల్లీ క్యాపిటల్స్, రాజస్తాన్ రాయల్స్‌లతో జరిగిన ఈ మ్యాచ్‌ల్లో ఏ ఒక్కరి విధ్వంసంతోనూ, ఒకరిద్దరి మెరుపు ఇన్నింగ్స్‌లతోనూ అంతపెద్ద స్కోరు సాధ్యమవలేదు. బ్యాటింగ్ ఆర్డర్ అంతా మూకుమ్మడిగా రాణించింది. గుర్బాజ్, కెప్టెన్ అజింక్య రహానే, అంగ్‌క్రిష్ రఘువంశీ, రసెల్ అందరూ బ్యాట్‌లకు పని చెప్పారు. ఇక అంతకుముందు ఢిల్లీతో జరిగిన పోరులో ఏ ఒక్కరు కూడా అర్ధసెంచరీ సాధించలేదు. అయినాసరే టాపార్డర్ 20 ప్లస్ స్కోర్లు, రింకూ సింగ్ (36), టాప్‌స్కోరర్ రఘువంశీ (44) చేసిన పరుగులతోనే కోల్‌కతా సులువుగా 200 పైచిలుకు స్కోరును సాధించింది. బౌలింగ్‌లోనూ వరుణ్ చక్రవర్తి, సునీల్ నరైన్‌ల స్పిన్ మ్యాజిక్ ప్రత్యర్థులను చుట్టేస్తుంది. వైభవ్ అరోరా, హర్షిత్ రాణాలు తమ పేస్ బౌలింగ్‌లో నిప్పులు చెరుగుతున్నారు. ఇలాంటి సమష్టి ప్రదర్శన సొంతగడ్డపై ఈ మ్యాచ్‌లో కనబరిస్తే కోల్‌కతాకు ఎదురే ఉండదు.

చెన్నైకిది చేదు సీజన్

ఐపీఎల్‌కే వన్నెతెచ్చిన టీమ్‌లలో చెన్నై ముందు వరుసలో ఉంటుంది. ఇప్పటివరకు జరిగిన 17 సీజన్‌లలో ఐదుసార్లు చాంపియన్‌గా నిలిచిన జట్టు చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే). 5 టైటిల్స్‌తో ముంబై ఇండియన్స్‌తో సమానంగా ఉన్నప్పటికీ... పదిసార్లు ఫైనల్ చేరిన (5సార్లు రన్నరప్) ఏకైక జట్టు సీఎస్‌కే. లీగ్ చరిత్రలో ఇంతటి ఘనచరిత్ర కలిగిన ధోని జట్టుకు ఈ సీజన్ అత్యంత చెత్తగా సాగుతోంది. ఇప్పటివరకు 11 మ్యాచ్‌లాడితే రెండంటే రెండే మ్యాచ్‌ల్లో నెగ్గింది. ఏకంగా 9 పరాజయాలతో లీగ్ నుంచి నిష్క్రమించిన సూపర్‌కింగ్స్‌కు మిగిలిందల్లా మిగతా మ్యాచ్‌లు ఆడి గెలవడమే! జోరు మీదున్న కోల్‌కతాను ఆపుతుందా... మరో భంగపాటుతో అట్టడునే నిలుస్తుందో చూడాలంటే చీకటి పడేదాకా ఆగాల్సిందే!

ఫైనల్ బెర్త్ లక్ష్యంగా...

- నేడు దక్షిణాఫ్రికాతో భారత మహిళల పోరు
- ఉదయం 10 గంటల నుంచి ఫ్యాన్‌కోడ్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం



వోల్వర్ట్, హర్మన్‌ప్రీత్

కొలంబో: ముక్కోణపు వన్డే క్రికెట్ టోర్నీలో ఫైనల్ బెర్త్ లక్ష్యంగా భారత మహిళల జట్టు నేడు దక్షిణాఫ్రికాతో పోరుకు సిద్ధమైంది. వరుస విజయాలతో జోరు మీదున్న భారత్‌కు గత మ్యాచ్‌లో ఆతిథ్య శ్రీలంక చెక్ పెట్టింది. దీంతో వరుసగా 8 విజయాల జైత్రయాత్రకు బ్రేక్ పడింది. ఈ పరాభవం నుంచి వెంటనే బయట పడాలని, ఈ మ్యాచ్ ఎలాగైనా గెలవాలనే కసితో హర్మన్‌ప్రీత్ బృందం బరిలోకి దిగుతోంది. నిజానికి భారత్ ఈ మ్యాచ్‌లో గెలిస్తేనే ఫైనల్‌కు అర్హత సాధిస్తుందనే క్లిష్టమైన సమీకరణమైతే లేదు. అమ్మాయిల బృందం రెండు విజయాలు, నెట్‌రన్‌రేట్ పరంగా పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉంది. అయినాసరే తుదిపోరుకు ముందే మళ్లీ గెలుపుబాట పట్టాలని భారత మహిళల జట్టు భావిస్తోంది. మరోవైపు ఇంతవరకు అసలు బోణీనే కొట్టలేకపోయిన సఫారీ మహిళల జట్టు లంక గడ్డపై పెను సవాళ్లను ఎదుర్కొంటోంది.

ఫేవరెట్‌గా...

ఈ సిరీస్‌లో గత పరాజయం మినహా భారత జట్టు అన్ని రంగాల్లో ఆధిక్యాన్ని ప్రదర్శిస్తోంది. ముఖ్యంగా ఓపెనింగ్‌లో ప్రతీక రావల్ సూపర్‌ఫామ్ కొనసాగిస్తోంది. ఇప్పటివరకు ఆడిన మూడు మ్యాచ్‌ల్లో రెండు అర్ధసెంచరీలు సహా 163 పరుగులతో సత్తా చాటుకుంది. స్మృతి మంధాన తన బ్యాటింగ్ పవర్‌ను చూపెట్టాల్సి ఉంది. హర్లీన్ డియోల్, కెప్టెన్ హర్మన్‌ప్రీత్, రిచా ఘోష్, దీప్తి శర్మలు రాణిస్తే ప్రత్యర్థి బౌలర్లకు కష్టాలు తప్పవు. బౌలింగ్‌లో స్నేహ్ రాణా ఈ సిరీస్‌లో అద్భుతంగా బౌలింగ్ చేస్తోంది. ఆంధ్రప్రదేశ్ అమ్మాయి శ్రీచరణితో పాటు హైదరాబాద్ బౌలర్ అరుంధతి రెడ్డి, కాశ్వీ గౌతమ్‌లు కూడా నిలకడగా రాణిస్తుండటంతో ఈ మ్యాచ్‌లో భారతే ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది.

ఒత్తిడిలో దక్షిణాఫ్రికా

ఈ టోర్నీలో ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ ఓడిన సఫారీ అమ్మాయిల జట్టు గెలుపు కోసం పెద్ద కసరత్తే చేయాల్సి ఉంటుంది. ముఖ్యంగా బ్యాటర్ల నిలకడలేమి జట్టుకు ప్రతికూలంగా మారింది. కెప్టెన్ లారా వోల్వార్ట్, తజ్‌మిన్ బ్రిట్స్ భారత్‌తో గత మ్యాచ్‌లో బాగా ఆడినప్పటికీ లంకతో చేతులెత్తేశారు. గుడాల్, మెసో, సునే లుస్ సమష్టిగా రాణిస్తేనే పటిష్టమైన భారత్‌కు సవాల్ విసురుతుంది. లేదంటే ఈ టోర్నీలో 'హ్యాట్రిక్' ఓటమి తప్పదు! ఒకవేళ ఈ మ్యాచ్‌లో గనక దక్షిణాఫ్రికా జట్టు ఓడిపోతే ఆఖరి పోరుతో సంబంధం లేకుండా ఆతిథ్య లంక, భారత జట్లు అమీతుమీకి అర్హత సంపాదిస్తాయి.

తుదిజట్లు (అంచనా)

భారత్: హర్మన్‌ప్రీత్, ప్రతీక రావల్, స్మృతి మంధాన, హర్లీన్ డియోల్, జెమీమా, రిచా ఘోష్, దీప్తిశర్మ, కాశ్వీ గౌతమ్, అరుంధతీ, స్నేహ్ రాణా, శ్రీ చరణి.

దక్షిణాఫ్రికా: లారా వోల్వార్ట్, తజ్‌మిన్ బ్రిట్స్, లారా గుడాల్, కరబొ మెసో, సునే లూస్, క్లో ట్రయాన్, డెర్క్‌సన్, నదిన్ డిక్లెర్క్, మసబత క్లాస్, ఎమ్‌లాబా, అయబొంగ కాకా.

వెంకటేశ్ ప్రసాద్ నియామకం చెల్లదు: తెలంగాణ హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: క్రికెట్ ఆపరేషన్స్ అండ్ గేమ్ డెవలప్‌మెంట్ కన్సల్టెంట్‌గా భారత మాజీ క్రికెటర్ వెంకటేశ్ ప్రసాద్ నియామకం చెల్లదని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. అలాగే సిబ్బంది సహా కోచ్‌ల నియామకాన్ని కూడా పక్కకు పెడుతూ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు చర్యలు చేపట్టాలని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌ను ఆదేశించింది. క్రికెట్‌లో నాణ్యత పెంపునకు ఏర్పాటు చేసిన హైదరాబాద్ క్రికెట్ అకాడమీ ఆఫ్ ఎక్సలెన్స్ (హెచ్‌సీఏఈ)లో భాగంగా కోచ్‌లు, డైరెక్టర్ల నియామకాలను హెచ్‌సీఏ ఉపాధ్యక్షుడు సర్దార్ దల్జీత్‌సింగ్, సంయుక్త కార్యదర్శి బసవరాజు హైకోర్టులో సవాల్ చేశారు. హెచ్‌సీఏ చట్టాలు, నిబంధనలకు విరుద్ధంగా నియామకాలు జరిగాయని, వీటిని నిలిపివేయాలని కోరారు. అపెక్స్ కౌన్సిల్ ఆమోదం లేకుండానే పలువురితో ఒప్పందం కుదుర్చుకున్నారని, ప్రసాద్‌కు ఏటా రూ.75 లక్షల వేతనం ఇచ్చేలా అగ్రిమెంట్ చేసుకున్నారన్నారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ నగేశ్ భీమపాక విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి... వెంకటేశ్‌ప్రసాద్, హిమానీ యాదవ్, మమత, అర్జున్, రాజశేఖర్ తదితరులకు హెచ్‌సీఏ నుంచి చెల్లించిన గౌరవ వేతనాన్ని ఈ కేసులో హెచ్‌సీఏ ప్రతివాదులైన వ్యక్తుల నుంచి రికవరీ చేయాలని స్పష్టం చేసింది.



సెరెనా



వీనస్



సిమోన్ బైల్స్



షకారి



హామిల్టన్



నోవా లైల్స్

క్రీడా 'తార'లు దిగివచ్చిన వేళ...

ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మక గ్లామరస్, ఫ్యాషన్ ఈవెంట్‌గా పేరొందిన 'మెట్ గాలా' అమెరికాలోని న్యూయార్క్ సిటీలో జరిగింది. అన్ని రంగాలకు చెందిన సెలబ్రిటీలు ఈ ఈవెంట్‌కు కళ్లు చెదిరే డిజైనర్ కాస్ట్యూమ్స్ ధరించి హాజరయ్యారు. క్రీడా రంగం నుంచి టెన్నిస్ స్టార్స్ సెరెనా విలియమ్స్, వీనస్ విలియమ్స్... ఫార్ములావన్ ప్రపంచ మాజీ చాంపియన్ హామిల్టన్... దిగ్గజ మహిళా జిమ్నాస్ట్ సిమోన్ బైల్స్... అథ్లెటిక్స్‌లో మహిళల 100 మీటర్ల విశ్వవిజేత షకారి రిచర్డ్‌సన్... పురుషుల 100 మీటర్ల ఒలింపిక్ చాంప్ నోవా లైల్స్ తళుక్కుమన్నారు.

20న సుప్రీం బార్ ఎన్నికలు

- ఖరారు చేసిన అత్యున్నత న్యాయస్థానం
- కార్యదర్శి పోస్టు మహిళా లాయర్లకే

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్(ఎస్సీబీఏ) ఎన్నికల తేదీని అత్యున్నత న్యాయస్థానం ఖరారు చేసింది. ఈ నెల 20వ తేదీన ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించింది. ఎన్నికల్లో అసోసియేషన్ కార్యదర్శి పోస్టును మహిళా లాయర్లకు ప్రత్యేకంగా రిజర్వు చేయాలని స్పష్టం చేసింది. అదేవిధంగా, ఎగ్జిక్యూటివ్ కమిటీలో మూడింట ఒక వంతు సీట్లను మహిళలకే ఇవ్వాలని కూడా తెలిపింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కోటీశ్వర్ సింగ్‌ల ధర్మాసనం మంగళవారం ఈ మేరకు స్పష్టతనిచ్చింది. 2024 ఓటరు జాబితానే ప్రాతిపదికగా తీసుకోవాలని, ఫిబ్రవరి 28వ తేదీతో అర్హత పొందిన లాయర్ల పేర్లను కూడా 2025 ఎస్సీబీఏ ఓటరు జాబితాలో చేర్చాలని తెలిపింది. మే 21వ తేదీన ఓట్లు లెక్కించి, ఫలితాలను ప్రకటించాలని ధర్మాసనం పేర్కొంది. ఎస్సీబీఏ ఎన్నికల్లో సంస్కరణలను సూచించేందుకు నియమించిన సుప్రీం మాజీ న్యాయమూర్తి ఎల్ నాగేశ్వర రావు ఇచ్చిన నివేదికను ఎస్సీబీఏ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచాలని ధర్మాసనం తెలిపింది. ఈ నివేదికపై తగు సూచనలు ఇవ్వడమే తప్ప, ఎవరూ సవాల్ చేయరాదని స్పష్టం చేసింది. మే 19వ తేదీతో ఎస్సీబీఏ ప్రస్తుత ఎగ్జిక్యూటివ్ గడువు ముగుస్తున్నందున కమిటీ సిఫారసులను ఈ పోలింగ్‌కు అమలు చేయడం సాధ్యం కాదని తెలిపింది.

పాక్ రక్షణ వ్యయం 18% పెంపు


- సంకీర్ణ ప్రభుత్వం నిర్ణయం
- రూ.2.50 లక్షల కోట్లకు చేరనున్న రక్షణ బడ్జెట్

ఇస్లామాబాద్: పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్‌తో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో పాకిస్తాన్‌లోని సంకీర్ణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాబోయే బడ్జెట్‌లో రక్షణ వ్యయాన్ని 18 శాతం పెంచాలని తీర్మానించింది. 2025-26 బడ్జెట్‌ను వచ్చే నెల తొలివారంలో పాక్ ప్రభుత్వం ప్రవేశపెట్టబోతోంది. పాకిస్తాన్‌లో జూలై 1 నుంచి నూతన ఆర్థిక సంవత్సరం ప్రారంభమవుతుంది. 18 శాతం పెంపుతో పాక్ రక్షణ వ్యయం ఏకంగా రూ.2.50 లక్షల కోట్లకు చేరుకోనున్నట్లు స్థానిక మీడియా వెల్లడించింది. రక్షణ రంగానికి బడ్జెట్‌లో ఎంతమేరకు కేటాయింపులు చేయాలన్న దానిపై ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్, పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ(పీపీపీ) చీఫ్ బిలావల్ భుట్టో తాజాగా ఆర్థిక శాఖ అధికారులతో సమావేశమై చర్చించారు. రూ.17.5 లక్షల కోట్లతో కొత్త బడ్జెట్ ప్రవేశపెట్టబోతున్నట్లు తెలిసింది. రక్షణ వ్యయాన్ని 18 శాతం పెంచాలన్న ప్రతిపాదనకు సంకీర్ణంలోని భాగస్వామ్య పార్టీలు అంగీకారం తెలిపాయి. 2023-24లో పాక్ రక్షణ బడ్జెట్ రూ.1.80 లక్షల కోట్లు కాగా, 2024-25లో 14.98 శాతం పెంచారు. దాంతో అది రూ.2.12 లక్షల కోట్లకు చేరుకుంది. తాజా పరిణామాల నేపథ్యంలో 18 శాతం పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. అప్పుల చెల్లింపులకే పాకిస్తాన్ బడ్జెట్‌లో సింహభాగం నిధులు కేటాయించాల్సి వస్తోంది. ఆ తర్వాత అధికంగా వ్యయం చేస్తున్నది రక్షణ రంగానికే.

అల్కట్రాజ్.. అమెరికా కాలాపానీ!

దేశంలోకెల్లా అత్యంత కరడుగట్టిన జైలు • తిరిగి తెరవాలని ట్రంప్ సంచలన నిర్ణయం

అమెరికాలో అత్యంత కఠినమైన జైలు అల్కట్రాజ్‌ను తెరవాలని అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ నిర్ణయించారు. శాన్‌ఫ్రాన్సిస్కో సముద్ర జలాల్లో ఉన్న ఈ జైలు ఒకప్పుడు తీవ్ర అపఖ్యాతి పాలైంది. ది రాక్‌గా ప్రసిద్ధికెక్కిన జైలు 60 ఏళ్ల కింద మూతపడింది. దశాబ్దాల క్రితం పర్యాటక ప్రాంతంగా మారింది. ఏటా లక్షలాది మంది సందర్శిస్తున్నారు. అలాంటి జైలును మళ్లీ ఉపయోగంలోకి తెచ్చేందుకు ట్రంప్ ప్రయత్నిస్తున్నారు. శిథిలావస్థలో ఒకప్పటి ప్రమాదకర జైలును పునరుద్ధరించడం సరికాదని నిపుణులు అంటున్నా పట్టించుకోవడం లేదు.


శాన్‌ఫ్రాన్సిస్కో సమీపంలోని అల్కట్రాజ్ ద్వీపం

అల్కట్రాజ్ గురించి ట్రంప్

ఈ ద్వీప జైలును తెరవడమే గాక విస్తరించాలని ఆదేశించినట్లు ట్రంప్ తన సొంత సోషల్ మీడియా హ్యాండిల్ ట్రూత్ సోషల్‌లో పోస్టు చేశారు. దుర్మార్గులు, హింసాత్మక, ప్రమాదకర నేరస్తులతో అమెరికా చాలాకాలంగా ఇబ్బందులు పడుతున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొన్నారు. అల్కట్రాజ్ తన దృష్టిలో శాంతిభద్రతలను కాపాడగల అతి బలమైన, శక్తివంతమైన ప్రదేశమని అనంతరం మీడియాతో కూడా చెప్పుకొచ్చారు. దేశంలో ప్రస్తుతం శాంతిభద్రతలు చాలా అవసరం గనుక దాన్ని మళ్లీ తెరవబోతున్నట్టు చెప్పారు. జైలు ప్రస్తుతం శిథిలావస్థలో ఉన్నప్పటికీ దాన్ని తెరిచే ఆలోచన బాగుందన్నారు. అమెరికా పౌరులు, జాతీయ భద్రత కోసం ఇప్పుడా జైలు అత్యంత అవసరమని సరిహద్దు అధికారి టామ్ హోమన్ కూడా అన్నారు.

షార్క్‌ల కాపలా...

అల్కట్రాజ్. ఒక్కమాటలో చెప్పాలంటే అండమాన్‌లోని కరడుగట్టిన కాలాపానీ వంటి జైలు. శాన్‌ఫ్రాన్సిస్కోకు రెండు కిలోమీటర్ల దూరంలో ఒక చిన్న ద్వీపంలో ఉంది. దీన్ని మొదట నావికా రక్షణ కోటగా నిర్మించారు. 20వ శతాబ్ద ప్రారంభంలో సైనిక జైలుగా మార్చారు. 1934లో అధికారికంగా ఫెడరల్ జైలుగా మార్చేశారు. దీని భద్రత అత్యంత కట్టుదిట్టంగా ఉంటుంది. తప్పించుకోజూడటమంటే ప్రాణాలు పణంగా పెట్టడమే. ఎందుకంటే ద్వీపం చుట్టూ సముద్రంలో షార్కులుంటాయి. జైలు నుంచి ఎలాగోలా తప్పించుకున్నా వాటికి ఆహారంగా మారతారు. అమెరికాలోని అత్యంత క్రూరమైన నేరస్తులను ఇక్కడ ఉంచేవారు. బలమైన సముద్ర అలలతో పాటు అతి శీతల పసిఫిక్ జలాలతో కూడిన అల్కాట్రాజ్ ఖైదీలకు అక్షరాలా నరకప్రాయం. ఈ జైలులో గ్యాంగ్‌స్టర్ అల్ కాపోన్, జార్జ్ మెషీన్ గన్ కెల్లీ వంటి కరడుగట్టిన నేరస్తులను ఉంచారు. దీనిపై అనేక సినిమాలు వచ్చాయి. నిర్వహణ అత్యంత ఖరీదుగా మారడంతో 1963లో అటార్నీ జనరల్ రాబర్ట్ కెన్నెడీ దీని మూసివేయించారు. ఈ జైలు, ద్వీపం ఇప్పుడు నేషనల్ పార్క్ సర్వీస్ నిర్వహణలో ఉన్నాయి. ఏటా 14 లక్షల మంది దీన్ని సందర్శిస్తున్నారు.

గతంలోనూ ప్రయత్నాలు

ఈ కేంద్రాన్ని డిటెన్షన్ సెంటర్‌గా తెరవాలని గతంలోనూ పలువురు నేతలు విఫలయత్నం చేశారు. 1981లో 'మారియల్ బోట్ లిఫ్ట్'లో క్యూబా నుంచి ఫ్లోరిడాకు వచ్చిన 20,000 మంది శరణార్థులను ఉంచడానికి నాటి అధ్యక్షుడు రోనాల్డ్ రీగన్ ప్రతిపాదించిన 14 ప్రాంతాల్లో ఇదీ ఒకటి. చారిత్రక పర్యాటక ప్రదేశం కావడం, అంతమందికి సౌకర్యాలు లేకపోవడంతో వెనక్కు తగ్గారు.


కారాగారంలో ఇరువైపులా జైలు గదులు

నిర్వహణ అసాధ్యమంటున్న నిపుణులు..

అల్కట్రాజ్‌ను తిరిగి తెరవడంపై జైలు నిపుణులు, చరిత్రకారులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. మొదట ఈ విషయం వినగానే జోక్ అనుకున్నట్టు బీఓపీ తాత్కాలిక డైరెక్టర్‌గా చేసిన హ్యూ హుర్విట్జ్ చెప్పారు. ''దాన్ని మరమ్మతు చేయాలనుకోవడం హాస్యాస్పదం. ఆరడుగుల వ్యక్తి నిటారుగా నిలబడలేని గదులతో కూడిన భవనాలవి. పైగా కూలిపోతున్నాయి. సరైన భద్రత, ఫెన్సింగ్, కెమెరాలు కూడా లేవు. ఆ జైలును ఇప్పుడు నడపడం అసాధ్యమన్నారు. ''1963లో జైలును మూసినప్పుడు ఖైదీల తలసరి నిర్వహణ ఖర్చు 13 డాలర్ల దాకా ఉండేది. ఇతర ఫెడరల్ జైళ్లలో అది ఐదు డాలర్లలోపే. ఇప్పుడు ఇతర జైళ్లలోనే 120 డాలర్లకు పెరిగింది. ఆ లెక్కన అల్కట్రాజ్‌లో కనీసం 500 డాలర్లు కావాలి. అంతంత వెచ్చించి దోషులను అక్కడుంచడం చాలా ఖరీదైన వ్యవహారం''అని చరిత్రకారుడు జాన్ మార్టిని తెలిపారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

కుబేరుల కోసం భూగర్భ నగరి

- రహస్యంగా నిర్మించిన అమెరికా!
- 21 లక్షల కోట్ల డాలర్లు వెచ్చించింది • మాజీ ఉన్నతాధికారి వెల్లడి

వాషింగ్టన్: అత్యంత సంపన్నులు, ఉన్నతాధికారుల కోసం అమెరికా ఏకంగా భూగర్భ నగరమే నిర్మించిందట! ఆ దేశ మాజీ ఉన్నతాధికారి కేథరిన్ ఆస్టిన్ ఫిట్స్ ఈ మేరకు వెల్లడించారు. అంతేకాదు, అందుకు ఏకంగా 21 లక్షల కోట్ల డాలర్ల మేరకు ప్రజల సొమ్మును వెచ్చించిందని ఆరోపించారు. జార్జ్ హెచ్.డబ్ల్యూ.బుష్ అధ్యక్షునిగా ఉండగా కేథరిన్ హౌసింగ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ అసిస్టెంట్ సెక్రటరీగా పని చేశారు. తాను చెబుతున్నది పచ్చి నిజమని ఆమె చెప్పుకొచ్చారు. ''21 లక్షల కోట్ల డాలర్లు లెక్కాపత్రం లేకుండా మాయమయ్యాయి. ఎక్కడికి పోయాయని ఏళ్ల తరబడి పరిశోధించా. వాటిని 170 భూగర్భ స్థావరాలతో కూడిన భారీ నెట్‌వర్క్ నిర్మాణానికి వెచ్చించినట్టు చివరికి కనిపెట్టా. వాటి మధ్య అత్యాధునిక రవాణా తదితర సదుపాయాలు కూడా ఉన్నాయి. 1998 నుంచి 2015 వరకు రక్షణ, గృహనిర్మాణం, పట్టణాభివృద్ధి శాఖల్లో అత్యంత భారీ మొత్తాలను అనధికారికంగా ఖర్చు చేసినట్లు మిషిగన్ స్టేట్ వర్సిటీ ఆర్థికవేత్త మార్క్ స్కిడ్మోర్ అధ్యయనంలో కూడా వెల్లడైంది''అని చెప్పుకొచ్చారు. కేథరిన్ చెబుతున్న బంకర్లలో కొన్ని సముద్రం అడుగున కూడా ఉన్నట్లు సమాచారం. ''అమెరికాలో భూగర్భంలోనూ, సముద్రం అడుగునా ఈ స్థావరాలున్నాయి''అని చెప్పారు. దాని పరిమాణం, పరిధి, యాక్సెస్ ప్రోటోకాల్స్ తదితర వివరాలేవీ ఆమె బయటపెట్టలేదు. విపత్తుల వేళ ఆ బంకర్లలోకి ప్రవేశమున్న ఉన్నత వ్యక్తుల పేర్లను కూడా ప్రస్తావించలేదు.

అమెరికా సైన్యాధికారులకు ఉద్వాసన

ట్రంప్ సర్కార్ మరో వివాదాస్పద నిర్ణయం

వాషింగ్టన్: ఫెడరల్ ఉద్యోగులను భారీగా తగ్గిస్తూ, కొన్ని ప్రభుత్వ విభాగాలను మూసేస్తూ భారీ స్థాయిలో వ్యయ నియంత్రణ చర్యలకు పాల్పడుతున్న ట్రంప్ సర్కార్ ఇప్పుడు సైన్యంపైనా దృష్టిపెట్టింది. అత్యధిక సంఖ్యలో ఉన్న 4 నక్షత్రాల(ఫోర్ స్టార్) హోదా సైనిక జనరల్ అధికారులను తగ్గించుకోవాలని అమెరికా రక్షణ శాఖ భావిస్తోంది. ఇందులోభాగంగా ఫోర్‌స్టార్ జనరళ్లలో 20 శాతం మందిని తప్పించాలని రక్షణ శాఖ మంత్రి పీట్ హెగ్సెత్ సోమవారం రక్షణ శాఖ అధికారులను ఆదేశించారు. అత్యున్నత పదవుల్లోని అధికారులను 20 శాతం మందిని తొలగించాలని హెగ్సెత్ నేషనల్ గార్డ్‌కు సైతం సూచించారు. నేషనల్ గార్డ్‌లో జనరల్/ఫ్లాగ్ ఆఫీసర్‌లలో అదనంగా 10 శాతం మందిని తొలగించాలని ఆదేశించారు. వీరిలో నావికాదళంలో అధికారి/వన్ స్టార్ హోదా అధికారులు సైతం ఉన్నట్లు తెలుస్తోంది. జనవరి నుంచి చూస్తే ఇప్పటికే ఆరుగురు అత్యున్నత ర్యాంక్ జనరల్ ఆఫీసర్‌లను ట్రంప్ సర్కార్ తొలగించింది. జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ చైర్మన్ జనరల్ సీక్యూ బ్రౌన్ జూనియర్ సైతం ఉద్వాసనకు గురయ్యారు. ఫోర్ స్టార్ ఆఫీసర్లలో విధుల్లో ఉన్న ఇద్దరు మహిళలనూ తప్పించారు. స్వలింగసంపర్కులను విధుల నుంచి తప్పిస్తూ, అసమర్థులను తొలగిస్తూ సాయుధ బలగాలను మరింత శక్తివంతం చేయడమే లక్ష్యంగా ఉద్యోగాల కోత మొదలెట్టామని గతంలోనే హెగ్సెత్ వ్యాఖ్యానించారు. వాస్తవానికి సైన్యంలో ఎంతమంది 'జనరల్ ఆఫీసర్'హోదా సైన్యాధికారులు ఉండాలో అమెరికా రాజ్యాంగం నిర్దేశిస్తుంది. కోతల విషయంపై అమెరికా దిగువ సభ, ఎగువ సభ సభ్యులకు ఏమాత్రం ముందస్తు సమాచారం ఇవ్వకుండా నిర్ణయాలు తీసుకున్నారని తెలుస్తోంది.

హార్వర్డ్‌కు రీసెర్చ్ గ్రాంట్లు బంద్

ట్రంప్ సర్కారు మరో కక్షసాధింపు నిర్ణయం

వాషింగ్టన్: హార్వర్డ్ యూనివర్సిటీపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం మరోసారి కక్షసాధింపు చర్యలకు దిగింది. ఫెడరల్ రీసెర్చ్ గ్రాంట్లపై నిషేధం విధించింది. హార్వర్డ్ అధ్యక్షుడు అలన్ ఎం.గార్బర్‌కు విద్యా శాఖ మంత్రి లిండా మెక్‌మాన్ ఈ మేరకు మూడు పేజీల లేఖ రాశారు. ''హార్వర్డ్‌కు ఇకపై ఫెడరల్ గ్రాంట్లేవీ అందవు. ఎందుకంటే వర్సిటీ వాటి దుర్వినియోగానికి పాల్పడుతోంది. విద్యా విలువలకు సంస్థ నీళ్లొదిలింది. జవాబుదారీతనం లేకుండా పోయింది''అంటూ లేఖలో ఆక్షేపించారు. ''అమెరికా ఉన్నత విద్యా వ్యవస్థనే హార్వర్డ్ అపహాస్యం చేసింది. హింసాత్మక ప్రవర్తనకు పాల్పడే, అమెరికాను ధిక్కరించే విదేశీ విద్యార్థులను క్యాంపస్‌లోకి ఆహ్వానించింది. చట్టపరమైన బాధ్యతలను, నైతిక, విశ్వసనీయ విధులను, పారదర్శక బాధ్యతలను, అకడమిక్ క్రమశిక్షణను పాటించడంలో పూర్తిగా విఫలమైంది''అంటూ విమర్శించారు. ''ప్రభుత్వ షరతులకు అంగీకరించేదాకా కొత్త ఫెడరల్ గ్రాంట్లు మంజూరు చేయబోం. అందుకు అర్హత సాధించాలంటే ప్రభుత్వంతో చర్చలు జరపాల్సి ఉంటుంది''అని మంత్రి స్పష్టం చేశారు. ఈ నిషేధం రీసర్చ్ గ్రాంట్లకే వర్తిస్తుందని, విద్యార్థుల ట్యూషన్ ఫీజులకు ఆర్థిక సాయం కొనసాగుతుందని విద్యా శాఖ తెలిపింది.

దుయ్యబట్టిన హార్వర్డ్

ప్రభుత్వ చర్యలను హార్వర్డ్ తీవ్రంగా తప్పుబట్టింది. విద్యాపరమైన వ్యవహారాల్లో రాజకీయ జోక్యాన్ని ట్రంప్ ప్రభుత్వం తారస్థాయికి తీసుకెళ్తోందని సోమవారం ఒక ప్రకటనలో దుయ్యబట్టింది.

మానవాభివృద్ధి సూచికలో 130 స్థానం

- 2022 కంటే 2023లో మెరుగుపడిన ఇండియా ర్యాంకు
- లింగ అసమానత సూచీలో 102వ స్థానం
- భారతీయుల సగటు జీవితకాలం 72 ఏళ్లు

న్యూఢిల్లీ: ప్రపంచ మానవాభివృద్ధి సూచిక (హెచ్‌డీఐ)లో 193 దేశాలకు గాను భారత్‌కు 130వ ర్యాంకు లభించింది. హ్యూమన్ డెవలప్‌మెంట్ రిపోర్టు-2025ను ఐక్యరాజ్యసమితి డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ మంగళవారం విడుదల చేసింది. 2023కు సంబంధించిన గణాంకాలను వెల్లడించింది. ఈ సూచికలో ఇండియా ర్యాంకు మెరుగుపడడం విశేషం. 2022 నుంచి 2023 మధ్య 133 నుంచి 130కి చేరుకుంది. ఇండియా హెచ్‌డీఐ విలువ 2022లో 0.676 ఉండగా, 2023లో 0.685కు చేరింది. అయితే, మధ్యస్థ మానవాభివృద్ధి కేటగిరీలోనే ఇండియా నిలిచింది. మరోవైపు లింగ అసమానత సూచీలోనూ భారత్ వృద్ధిని నమోదు చేసింది. 2023లో మొత్తం 193 దేశాలకుగాను భారత్‌కు 102వ స్థానం దక్కింది. 2022లో 166 దేశాలకుగాను 108వ స్థానం లభించింది. ఏడాది వ్యవధిలో ఆరు స్థానాలు మెరుగుపడడం గమనార్హం. భారతీయుల సగటు జీవిత కాలం కూడా మెరుగుపడుతున్నట్లు స్పష్టమవుతోంది. 2023లో సగటు జీవితకాలం 72 ఏళ్లుగా నమోదైంది. 2022లో ఇది 71.7 ఏళ్లుగా ఉంది. 1990లో భారతీయుల సగటు జీవితకాలం 58.6 ఏళ్లుగా ఉన్నట్లు హ్యూమన్ డెవలప్‌మెంట్ రిపోర్టు-2025 స్పష్టంచేసింది.

మానస సరోవర యాత్రకు వేళాయె

- ఐదేళ్ల తర్వాత ప్రారంభం కానున్న యాత్ర
- 13వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు అవకాశం
- వివరాలను వెల్లడించిన విదేశాంగ శాఖ
- ఒక్కొక్కరికి అయ్యే ఖర్చు రూ.2 లక్షలు




సాక్షి, న్యూఢిల్లీ: కైలాస మానససరోవర యాత్ర ఐదేళ్ల తర్వాత త్వరలోనే మళ్లీ మొదలుకానుంది. యాత్రకు వెళ్లాలనుకునే వారు ఈనెల 13వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని విదేశాంగ శాఖ తెలిపింది. తొలి యాత్ర జూన్ 30న ఢిల్లీ నుంచి ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో విదేశాంగ శాఖ సంబంధిత ఉత్తరఖండ్, సిక్కిం రాష్ట్రాల ప్రతినిధులతో సుదీర్ఘ చర్చలు జరిపింది. యాత్రకు సంబంధించిన వివరాలను రెండు రోజుల క్రితం తన వెబ్‌సైట్‌లో ఉంచింది. కరోనా సమయంలో బ్రేక్ పడిన ఈ యాత్రకు కేంద్రం తాజాగా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో దేశవ్యాప్తంగా కోట్లాది మంది భక్తులు దరఖాస్తు చేసుకునేందుకు సిద్ధపడుతున్నారు.

పాస్‌పోర్టే తొలి అర్హత

యాత్రలో పాల్గొనే వారు భారత పౌరుడై, కచ్చితంగా పాస్‌పోర్టు కలిగి ఉండాలని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. ఈ పాస్‌పోర్టే తొలి అర్హతని ప్రకటించింది. ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి పాస్‌పోర్టుకు 6 నెలల వ్యాలిడిటీ ఉండాలి. ఈ ఏడాది జనవరి 1వ తేదీ నాటికి 18-70 ఏళ్ల మధ్య వయస్కులై ఉండాలి. బీఎంఐ(బాడీ మాస్ ఇండెక్స్) 25, అంతకంటే తక్కువ ఉన్న వారినే యాత్రకు అనుమతి ఇస్తారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసేప్పుడు అన్ని కాలమ్‌లను కచ్చితంగా పూర్తి చేయాలి. ఒక్క కాలమ్ నింపకున్నా సిస్టం ఆ దరఖాస్తును తీసుకోదు. పాస్‌పోర్టు మొదటి పేజీ, చివరి పేజీని అప్‌లోడ్ చేయాలి. ఒక అకౌంట్ నుంచి రెండు దరఖాస్తులు మాత్రమే చేయాల్సి ఉంటుంది. అధిక రక్తపోటు, మధుమేహం, ఉబ్బసం, గుండె జబ్బులు, మూర్ఛ తదితర సమస్యలు ఉన్న వారు యాత్రకు అనర్హులు. రూట్‌ను బట్టి యాత్రకయ్యే ఖర్చు మారుతుంది. రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు ఖర్చయ్యే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. యాత్రికులే పూర్తిగా ఈ ఖర్చులను భరించాల్సి ఉంటుంది.

డ్రా పద్ధతిలో ఎంపిక

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన వారిని విదేశాంగ శాఖ డ్రా పద్ధతిలో ఎంపిక చేయనుంది. ఎంపికైన వారికి ఈ-మెయిల్, మొబైల్ నంబర్‌కు మెసేజ్ అందుతుంది. యాత్రికులు ఢిల్లీ హార్ట్ అండ్ లంగ్ ఇన్‌స్టిట్యూట్, ఐటీబీపీ బేస్ హాస్పిటల్‌లో నిర్వహించే నిర్దిష్ట వైద్య పరీక్షలకు హాజరు కావాల్సి ఉంటుంది. లిపులేఖ్ పాస్ (ఉత్తరాఖండ్) , నథులా పాస్ (సిక్కిం) ఈ రెండు ప్రాంతాల నుంచి యాత్ర కొనసాగనుంది. డ్రా తర్వాత ప్రయాణికుల బ్యాచ్‌ను, మార్గాన్ని నిర్దేశిస్తారు. యాత్ర ప్రారంభమయ్యేది దేశ రాజధాని ఢిల్లీ నుంచే. యాత్రలో ఇప్పటికే నాలుగుసార్లు పాల్గొన్న వారిపై తాత్కాలికంగా నిషేధం ఉంది. ఇతర వివరాలను 011-23088133 హెల్ప్‌లైన్ నంబర్ ద్వారా సమాచారం తెలుసుకోచ్చు.



సమ్మతి పత్రంపై సంతకం తప్పనిసరి

పర్వత ప్రాంతంలో 19,500 అడుగుల ఎత్తులో కొనసాగే మానస సరోవర యాత్రలో భక్తులు తీవ్ర వాతావరణ పరిస్థితులను ఎదుర్కోవాల్సి ఉంటుంది. అననుకూల పరిస్థితుల్లో ట్రెక్కింగ్ చేసే అవసరం కూడా రావచ్చు. శారీరకంగా ఆరోగ్యంగా లేని వారికి ఇది ప్రమాదకరంగా మారే అవకాశాలూ ఉన్నాయి. యాత్ర సమయంలో ప్రకృతి వైపరీత్యాలు వంటి కారణాలతో యాత్రికులు మరణించినా, గాయపడినా భారత ప్రభుత్వం బాధ్యత వహించదు. మరణించే యాత్రికులను దహన సంస్కారాల కోసం తిరిగి తీసుకువచ్చే బాధ్యతను కూడా తీసుకోదు. అందువల్ల చైనా భూభాగంలో దహనం చేయడానికి ముందుగానే సమ్మతి పత్రంపై సంతకం చేయాల్సి ఉంటుంది.

రిజర్వేషన్ రైలు లాంటిది

లోపల ఉన్న వాళ్లు ఇతరులను రానివ్వరు • సుప్రీంకోర్టు వ్యాఖ్య

న్యూఢిల్లీ: దేశంలో అమలవుతున్న రిజర్వేషన్ విధానంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్య చేసింది. మహారాష్ట్ర స్థానిక ఎన్నికల్లో ఓబీసీలకు రిజర్వేషన్ కల్పించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను మంగళవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌ల ధర్మాసనం విచారించింది. రాజకీయంగా ఓబీసీలు వెనకబడ్డారా లేదా అనేది సహేతుంగా నిర్ధారించుకోకుండానే జయంత్ బంథియా కమిషన్ 27 శాతం రిజర్వేషన్ సిఫార్సుచేసిందని మంగేశ్ శంకర్ ససానే తరఫున అడ్వకేట్ శంకరనారాయణన్ వాదించారు. దీంతో జస్టిస్ సూర్యకాంత్ స్పందించారు. '' మన దేశంలో రిజర్వేషన్ విధానం అనేది ఒక రకంగా రైలులో కంపార్ట్‌మెంట్ లాంటిది. అప్పటికే ఆ బోగీలోకి ఎక్కిన వాళ్లు ఇక కొత్తగా ఎవ్వరినీ ఎక్కనివ్వరు. అయితే అదే బోగీలోకి అదనదంగా ఎవరినీ ఎక్కించలేని సందర్భాల్లో కొత్తగా వేరే బోగీలను అదే రైలుకు వెనకాల తగిలిస్తారు'' అని జడ్జి వ్యాఖ్యానించారు. '' రిజర్వేషన్లకు సంబంధించి ఓబీసీల్లో కూడా మళ్లీ రాజకీయంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాలను వేర్వేరుగా గుర్తించాలి. కొన్ని కుటుంబాలు, సమూహాలే ప్రయోజనాలు పొందుతున్నాయి'' అని వ్యాఖ్యానించారు.

రోడ్డు ప్రమాద బాధితులకు రూ.లక్షన్నర దాకా నగదురహిత వైద్యం

దేశవ్యాప్తంగా నిర్దేశిత ఆస్పత్రుల్లో అమలు

న్యూఢిల్లీ: రోడ్డు ప్రమాద బాధితుల కోసం దేశవ్యాప్తంగా నగదురహిత చికిత్స పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. ప్రమాదం జరిగిన ఏడు రోజుల్లోపు నిర్దేశిత ఆసుపత్రుల్లో చికిత్స కోసం ప్రతి వ్యక్తికి రూ.1.5 లక్షల దాకా కవరేజీని అందిస్తుంది. ఏ రోడ్డుపై అయినా మోటారు వాహనం ఢీకొని ప్రమాదానికి గురైనవాళ్లు ఈ చికిత్సకు అర్హులని కేంద్ర రోడ్డు రవాణా, హైవేల శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రమాద తేదీ నుంచి గరిష్టంగా ఏడు రోజుల పాటు నిర్దేశిత ఆసుపత్రిలో రూ.1.5 లక్షల దాకా నగదు రహిత చికిత్స పొందవచ్చని పేర్కొంది.

ముగ్గురు జవాన్లు సహా ఆరుగురు మృతి

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లో మంగళవారం చోటుచేసుకున్న రెండు వేర్వేరు ప్రమాద ఘటనల్లో ముగ్గురు జవాన్లు సహా ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. పూంఛ్ జిల్లా ఘనీ నుంచి మెంధార్ వైపు వెళ్తున్న ప్రైవేట్ బస్సు మంగళవారం ఉదయం అదుపు తప్పి లోయలోకి జారిపడింది. ఈ ఘటనలో జవాను సహా నలుగురు ప్రాణాలు కోల్పోగా 44 మందికి గాయాలయ్యాయి. మృతుల్లో ఘనీ గ్రామానికి చెందిన ముగ్గురు, అసోం నుంచి సెలవుపై ఇంటికి వస్తున్న మజీద్ అనే సైనికుడు ఉన్నారు. మొత్తం 15 అంబులెన్సులు ఏర్పాటు చేసి అందరినీ హుటాహుటిన రాజౌరీలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు.

డ్రోన్ దాడితో మాస్కో విమానాశ్రయాలు మూత

మాస్కో: రాజధాని మాస్కోతోపాటు రష్యాలోని సుదూర ప్రాంతాల్లోని లక్ష్యాలపైకి ఉక్రెయిన్ డ్రోన్లతో దాడి చేసింది. ఈ దాడుల నేపథ్యంలో మంగళవారం మాస్కోలోని మొత్తం నాలుగు విమానాశ్రయాలతోపాటు మరో 9 ప్రాంతీయ ఎయిర్‌పోర్టును మూసివేశారు. డజను వరకు ప్రాంతాలపైకి ఉక్రెయిన్ ప్రయోగించిన 100కుపైగా డ్రోన్లను ధ్వంసం చేసినట్లు రక్షణ శాఖ తెలిపింది. మాస్కో లక్ష్యంగా ఉక్రెయిన్ సోమవారం రాత్రి సైతం డ్రోన్‌లను ప్రయోగించింది.

చొరబాటు యత్నం... మరో పాకిస్తానీ అరెస్టు

పూంఛ్: భారత్‌లోకి చొరబడేందుకు ప్రయత్నించిన మరో పాకిస్తానీని సరిహద్దు భద్రతా దళం అరెస్టు చేసింది. జమ్మూ కశ్మీర్‌లోని పూంఛ్ సెక్టార్‌లో నియంత్రణ రేఖ (ఎల్‌ఓసీ) వద్ద మంగళవారం ఓ పాక్ జాతీయుడిని అదుపులోకి తీసుకుంది. పహల్గాం ఉగ్ర దాడి అనంతరం ఇలాంటి ఘటన జరగడం ఇది మూడోసారి. మే 3 రాత్రి పంజాబ్‌లోని గురుదాస్‌పూర్‌లో భారత్‌లోకి చొరబడజూసిన పాక్ పౌరుడిని బీఎస్ఎఫ్ అరెస్టు చేయడం తెలిసిందే. అదే రోజు పాక్ రేంజర్‌ను కూడా రాజస్తాన్‌లో అరెస్టు చేశారు. అతను భారత్‌లో గూఢచర్యానికి పాల్పడ్డట్టు ప్రాథమిక దర్యాప్తులో తేలిందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

బుద్ధుని నగల వేలం ఆపండి

హాంకాంగ్‌లోని సోథెబీ సంస్థకు భారత్ హెచ్చరిక

న్యూఢిల్లీ: గౌతమ బుద్ధుని అవశేషాలకు చెందిన నగల వేలాన్ని వెంటనే ఆపేయాలని హాంకాంగ్‌కు చెందిన సోథెబీ సంస్థను భారత ప్రభుత్వం కోరింది. వాటిని తిరిగి తమకు అప్పగించకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించింది. ఇటువంటి అత్యంత అరుదైన పురాతత్వ సంపదను వేలం వేయడం భారతీయ, అంతర్జాతీయ చట్టాలకు, ఐక్యరాజ్యసమితి సంప్రదాయాలకు పూర్తి విరుద్ధమని పేర్కొంది. పవిత్రంగానే భావించే నగలను విక్రయించడంపై పలు బౌద్ధ సంఘాల నేతలు, పలువురు ప్రముఖులు సైతం ఖండించారు. బుద్ధునికి చెందిన పవిత్ర, చారిత్రక సంపదపై పెప్పె కుటుంబసభ్యులకు ఎటువంటి అధికారం ఉండదని స్పష్టం చేసింది. వేలానికి పెట్టిన సోథెబీ, పెప్పె కుటుంబం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. బుద్ధుని జన్మస్థలంగా భావించే యూపీ రాష్ట్రం లుంబిని సమీపంలోని పిప్రహ్వా స్తూపం వద్ద 1898లో బ్రిటిష్ వ్యాపారి విలియం పెప్పె సారథ్యంలోని చేపట్టిన తవ్వకాల్లో అవశేషాలతోపాటు 1,800 వరకు ముత్యాలు, పగడాలు తదితర విలువైన రాళ్లు, బంగారు రేకులు లభ్యమయ్యాయి. అవశేషాల్లో కొన్నిటిని కోల్‌కతా మ్యూజియంలో భద్రపరిచారు. విలువైన అభరణాల్లో అప్పటి ఒప్పందం ప్రకారం ఐదో వంతు వరకు పెప్పె కుటుంబం ఆధీనంలోనే ఉన్నాయి. వీటిని తాజాగా పెప్పె ముని మనవడు క్రిస్ పెప్పె సోథెబీ ద్వారా అమ్మకానికి పెట్టాడు.

2027లో మానవ సహిత గగన్‌యాన్ మిషన్!

న్యూఢిల్లీ: ప్రతిష్టాత్మక మానవ సహిత గగన్‌యాన్ మిషన్‌ను 2027 తొలి త్రైమాసికంలో చేపట్టనున్నట్లు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(నాసా) చైర్మన్ వి.నారాయణన్ తెలిపారు. గగన్‌యాన్ ప్రాజెక్టులో భాగంగా తొలి మానవ రహిత వ్యోమనౌకను ఈ ఏడాదే అంతరిక్షంలోకి పంపించే అవకాశం ఉందన్నారు. ఇదే తరహాలో 2026లో మరో రెండు ప్రయోగాలు నిర్వహిస్తామని వెల్లడించారు. మానవ సహిత ప్రయోగం కంటే ముందే హాఫ్-హ్యూమనాయిడ్ రోబో 'వ్యోమమిత్ర'ను లో-ఎర్త్ ఆర్బిట్‌లోకి పంపించబోతున్నట్లు వివరించారు. ఆయన మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. మానవ సహిత గగన్‌యాన్ ప్రాజెక్టు విజయవంతమైతే.. వ్యోమగాములను సొంతంగా అంతరిక్షంలోకి పంపించిన నాలుగో దేశంగా ఇండియా చరిత్ర సృష్టించనుందని అన్నారు.

క్యుయెట్-యూజీ వాయిదా?

న్యూఢిల్లీ: ఈ నెల 8వ తేదీన ప్రారంభం కావాల్సిన కామన్ యూనివర్సిటీ ఎంట్రన్ టెస్ట్(క్యూయెట్)-యూజీ వాయిదా పడే అవకాశముందని అధికారులు మంగళవారం తెలిపారు. పరీక్షలను మళ్లీ ఎప్పుడు నిర్వహించేదీ త్వరలోనే ప్రకటిస్తారని చెప్పారు. గురువారం నుంచి పరీక్షలు మొదలవుతాయని ప్రకటించినప్పటికీ, సబ్జెకుల వారీగా తేదీలను ఇవ్వలేదు. ప్రస్తుతం నీట్- యూజీని పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) యంత్రాంగం తలమునకలై ఉన్నందున, క్యూయెట్-యూజీని వాయిదా వేయాలనే ఆలోచనలో ఉన్నట్లు అధికార వర్గాలు వివరించాయి.

'పహల్గాం' బాధిత కుటుంబానికి రాహుల్ పరామర్శ

చండీగఢ్: 'పహల్గాం'ఘటనలో ఉగ్ర మూకల కాల్పులకు బలైన నేవీ అధికారి లెఫ్టినెంట్ వినయ్ నర్వాల్(26) కుటుంబాన్ని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ పరామర్శించారు. మంగళవారం చండీగఢ్‌లోని నర్వాల్ నివాసానికి వెళ్లిన రాహుల్ గాంధీ ఆ కుటుంబంతో గంటన్నరపాటు గడిపారు. ఈ సందర్భంగా నర్వాల్‌కు నివాళులర్పించారు. నివాసం వెలుపల ఎదురుచూస్తున్న మీడియాతో ఆయన మాట్లాడకుండానే తిరిగి ఢిల్లీ వెళ్లిపోయారు. 'లెఫ్టినెంట్ వినయ్ నర్వాల్ జీ కుటుంబాన్ని కలుసుకున్నాను. వారికి సానుభూతి తెలిపి, ఓదార్చాను. ఇంతటి కష్ట కాలంలోనూ ఆ కుటుంబం చూపిన గుండె నిబ్బరం దేశానికే సందేశం 'అని అనంతరం రాహుల్ 'ఎక్స్'లో పేర్కొన్నారు.

పౌరహక్కుల రక్షణ చట్టాన్ని ఎప్పుడు చేశారు?



సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ

రాజ్యాంగబద్ధ సంస్థలు

అటార్నీ జనరల్

భారత రాజ్యాంగంలోని ఐదో భాగం, ఒకటో అధ్యాయంలో అటార్నీ జనరల్ పదవి గురించి వివరించారు. ఆర్టికల్ 76 ప్రకారం ప్రధానమంత్రి సూచన మేరకు రాష్ట్రపతి అటార్నీ జనరల్‌ను నియమిస్తారు. ఆర్టికల్ 76(1) ప్రకారం సుప్రీంకోర్టు న్యాయమూర్తి నియామకానికి ఉండాల్సిన అర్హతలన్నీ అటార్నీ జనరల్ నియామకానికి అవసరం. 'అటార్నీ జనరల్ ఆఫ్ ఇండియా' పదవిని బ్రిటన్ నుంచి గ్రహించారు. అటార్నీ జనరల్ కేంద్ర ప్రభుత్వానికి మొదటి న్యాయాధికారి, భారతదేశంలోనూ తొలి న్యాయాధికారి. సుప్రీంకోర్టులో, దేశంలోని అన్ని హైకోర్టుల్లో వాదించే అధికారం ఉన్న ఏకైక వ్యక్తి అటార్నీ జనరల్. కేంద్రానికి సంబంధించిన అన్ని రకాల వివాదాంశాలపై న్యాయస్థానాల్లో వాదించే అధికారం ఉన్న ప్రధాన న్యాయాధికారి ఇతడే. విధి నిర్వహణలో అటార్నీ జనరల్‌కు ఇద్దరు సోలిసిటర్ జనరల్స్, నలుగురు అసిస్టెంట్ సోలిసిటర్ జనరల్స్ సహాయం చేస్తారు.

అటార్నీ జనరల్ పదవిలో ఉన్న వ్యక్తి ఏ కంపెనీలోనూ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించరాదు. ఆర్టికల్ 88 ప్రకారం అటార్నీ జనరల్ పార్లమెంట్‌లో సభ్యుడు కాకపోయినా ఉభయ సభల చర్చల్లో పాల్గొనే అధికారం ఉంది. కానీ ఓటు వేసే అధికారం లేదు. కేంద్రం అనుమతి లేకుండా అటార్నీ జనరల్ ఎవరి కేసుల్లోనూ వాదనలు వినిపించకూడదు. ఆర్టికల్ 76(4) ప్రకారం రాష్ట్రపతి విశ్వాసం చూరగొన్నంత వరకు అటార్నీ జనరల్ అధికారంలో ఉంటాడు.

రాష్ట్రపతి నిర్ణయించిన జీతభత్యాలను పొందుతాడు. అటార్నీ జనరల్ ప్రస్తుత వేతనం రూ. 90,000. వేతనంతోపాటు ఇతర సౌకర్యాలను పొందుతాడు. అటార్నీ జనరల్ రాజీనామా లేఖను రాష్ట్రపతికి సమర్పించాలి.

భారత రాష్ట్రపతి న్యాయపరమైన అంశాలపై సూచనలు, సలహాలు కోరితే వివరణాత్మకమైన సూచనలు, సలహాలు ఇచ్చే అధికారం అటార్నీ జనరల్‌కు ఉంది.

అడ్వకేట్ జనరల్ (ఎ.జి.)

రాజ్యాంగంలోని ఆర్టికల్ 165 ప్రకారం సంబంధిత రాష్ట్ర ముఖ్యమంత్రి సూచన మేరకు అడ్వకేట్ జనరల్‌ను గవర్నర్ నియమిస్తారు.రాష్ట్రంలో మొదటి న్యాయాధికారి అడ్వకేట్ జనరల్. గవర్నర్ విశ్వాసం చూరగొన్నంత వరకు ఎ.జి. పదవిలో కొనసాగుతాడు. రాష్ట్ర శాసనసభ చర్చల్లో అడ్వకేట్ జనరల్ పాల్గొంటాడు, కానీ ఓటువేసే అధికారం లేదు. అడ్వకేట్ జనరల్‌గా నియమితుడయ్యే వ్యక్తికి హైకోర్టు న్యాయమూర్తికి ఉండాల్సిన అర్హతలుండాలి. ఆర్టికల్ 165(1), 165(3)లో అడ్వకేట్ జనరల్ అర్హతలు, జీతభత్యాలను స్పష్టంగా ప్రస్తావించారు. గవర్నర్ నిర్ణయం మేరకు రాష్ట్ర సంఘటిత నిధి నుంచి అడ్వకేట్ జనరల్ వేతనాన్ని చెల్లిస్తారు. ఆర్టికల్ 194(4) ప్రకారం ఎమ్మెల్యేలకు వర్తించే హక్కులు, రక్షణలన్నీ అడ్వకేట్ జనరల్‌కు వర్తిస్తాయి. ఆయన రాష్ట్ర కార్య నిర్వాహక వర్గంలో అంతర్భాగం. కానీ రాష్ట్ర మంత్రి మండలిలో అంతర్భాగం కాదు.

కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్)

రాజ్యాంగంలోని ఐదో భాగం, ఐదో అధ్యాయంలో 148 నుంచి 151 వరకు ఉన్న అధికరణలు కాగ్ గురించి తెలుపుతున్నాయి. ఆర్టికల్ 148 ప్రకారం కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్‌ను రాష్ట్రపతి నియమిస్తారు. ఆర్టికల్ 149 ప్రకారం కేంద్రం, రాష్ట్రాల ఖాతాలను కాగ్ నిర్వహిస్తాడు. ఆర్టికల్ 150 ప్రకారం కేంద్ర, రాష్ట్రాల ఖాతాలను కాగ్ తనిఖీ చేస్తాడు. ఆర్టికల్ 151 ప్రకారం కేంద్ర ప్రభుత్వ ఆడిట్ వార్షిక నివేదికను కాగ్ రాష్ట్రపతికి సమర్పిస్తాడు. రాష్ట్రపతి పార్లమెంట్‌కు పంపిస్తారు.

రాష్ట్రాలకు సంబంధించిన ఖాతాలను కాగ్ తనిఖీ చేసి, వార్షిక నివేదికను గవర్నర్‌కు సమర్పిస్తాడు. గవర్నర్ రాష్ట్ర శాసనసభకు సమర్పిస్తారు. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ పదవీ కాలం ఆరేళ్లు లేదా ఆ పదవిని చేపట్టిన వ్యక్తికి 65 ఏళ్లు వచ్చే వరకు. కాగ్ అధికార దుర్వినియోగానికి పాల్పడితే పార్లమెంట్ అభిశంసన ద్వారా రాష్ట్రపతి అతణ్ని పదవి నుంచి తొలగిస్తారు. ప్రభుత్వ ఖాతాల సంఘానికి కాగ్ కళ్లు, చెవుల్లాంటివాడు. భారత సంఘటిత నిధి నుంచి కేంద్రం ఖర్చు చేసిన ధనం చట్ట ప్రకారం ఉందా? లేదా అని కాగ్ తనిఖీ చేస్తాడు.

1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా కాగ్ పరిధి నుంచి అకౌంటింగ్ బాధ్యతలను వేరు చేశారు. కాగ్ ప్రభుత్వ కంపెనీల ఖాతాలను వ్యాపార పద్ధతిలో ఆడిట్ చేస్తాడు. భారత ప్రభుత్వంలో రాజ్యాంగ సృష్టించిన ముఖ్య అధికారి కాగ్ అని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. కాగ్ వేతనం, ఇతర సౌకర్యాలను భారత సంఘటిత నిధి నుంచి చెల్లిస్తారు. కాగ్ వేతనాన్ని పార్లమెంట్ చట్ట ప్రకారం నిర్ణయిస్తారు. పదవిని స్వీకరించేటప్పుడు రాజ్యాంగ ఔన్నత్యాన్ని కాపాడతానని కాగ్ ప్రమాణం చేయాలి. కాగ్‌గా పనిచేసి పదవీ విరమణ చేసిన వ్యక్తి ఏ ఇతర ప్రభుత్వ నియామకాలకు అర్హుడు కాదు.

కేంద్ర సంఘటిత నిధి, రాష్ట్ర సంఘటిత నిధి, కేంద్ర ఆగంతుక నిధి, కేంద్ర పబ్లిక్ నిధి, రాష్ట్ర పబ్లిక్ నిధి, శాసనసభ ఉన్న కేంద్రపాలిత ప్రాంతాల ఖాతాలను కాగ్ పరిశీలించి నివేదిక ఇస్తాడు. కాగ్ పదవిని బ్రిటిష్ వ్యవస్థ నుంచి తీసుకున్నారు. బ్రిటన్‌లో ఈ పదవిని కాంప్ట్ అని పిలుస్తారు. ఆర్‌బీఐ, ఎస్‌బీఐ, ఎల్‌ఐసీ, ఎఫ్‌సీఐ లాంటి సంస్థలు, కార్పొరేషన్లు పూర్తిగా ప్రైవేట్ ఆడిటర్లతో తమ ఖాతాలను ఆడిట్ చేయిస్తాయి. ఈ అంశంలో కాగ్‌కు సంబంధం ఉండదు. ఈ సంస్థలు తమ వార్షిక ఖాతాల నివేదికలను పార్లమెంట్‌కే సమర్పిస్తాయి.

కాగ్ వెలికితీసిన కుంభకోణాలు

- టెలికాం 2జీ (రెండోతరం) స్పెక్ట్రం వేలం.
- ముంబై ఆదర్శ్ హౌసింగ్ సొసైటీ కుంభకోణం కామన్‌వెల్త్ క్రీడల్లో అవినీతి, బొగ్గు గనుల కేటాయింపులో అవకతవకలు.
- ఓఎన్‌జీసీ(ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్) నుంచి వేలం ప్రక్రియ నిర్వహించకుండానే గ్యాస్ నిక్షేపాలను వెలికి తీసేందుకు రిలయన్స్ సంస్థకు అనుమతి ఇవ్వడం. దేవాస్ అనే ప్రైవేట్ కంపెనీకి లాభం చేకూర్చేలా అత్యంత విలువైన ఎస్-బ్యాండ్ ప్రసారాలకు రహస్యంగా అనుమతి మంజూరు చేయడం.
- మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో లోపాలు.
- అగస్టా వెస్ట్‌ల్యాండ్ కంపెనీ హెలికాప్టర్ కొనుగోలు ఒప్పందం.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ పదవీకాలం?
ఎ) ఐదేళ్లు బి) ఆరేళ్లు
సి) ఏడేళ్లు డి) నాలుగేళ్లు
2. అటార్నీ జనరల్ ఆ పదవిలో ఎంత కాలం పాటు కొనసాగుతారు?
ఎ) నాలుగేళ్లు బి) ఆరేళ్లు
సి) ఏడేళ్లు
డి) రాష్ట్రపతి విశ్వాసం ఉన్నంత వరకు
3. కింద పేర్కొన్న ఏ బాధ్యతను భారత కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ నిర్వర్తించరు?
ఎ) భారత సంఘటిత నిధికి చెందిన వ్యయానికి సంబంధించి తనిఖీ, నివేదిక
బి) ఆగంతుక నిధి, పబ్లిక్ అకౌంట్ల తనిఖీ, నివేదిక
సి) అన్ని రకాల వాణిజ్యం, ఉత్పత్తి, లాభం, నష్టాలకు సంబంధించిన తనిఖీ, నివేదిక
డి) ప్రజా ధనానికి సంబంధించిన వసూళ్లు, విడుదల నియంత్రణ; కోశాధికారి వద్ద ప్రభుత్వ ఆదాయాన్ని నిల్వ చేసేలా చూడటం
4. ఏ నివేదికలను పార్లమెంట్‌కు సమర్పించేలా రాష్ట్రపతి చర్యలు తీసుకుంటారు?
ఎ) కేంద్ర ఆర్థిక సంఘం
బి) కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్
సి) జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్
డి) పైవన్నీ
5. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఉమ్మడిగా వర్తించే రాజ్యాంగ సంస్థలు?
ఎ) కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్
బి) అటార్నీ జనరల్
సి) సోలిసిటర్ జనరల్ డి) పైవన్నీ సరైనవే
6. అటార్నీ జనరల్‌కు సంబంధించి సరైంది?
ఎ) సుప్రీంకోర్టు న్యాయమూర్తికి ఉండాల్సిన అర్హతలు ఉండాలి
బి) పార్లమెంట్ సమావేశాల్లో పాల్గొనవచ్చు
సి) పార్లమెంట్ సభ్యులకు ఉన్న అధికారాలు ఉంటాయి
డి) పైవన్నీ సరైనవే
7. ఏ రాజ్యాంగ బద్ధమైన పదవిని చేపట్టిన వారు పదవీ విరమణ తర్వాత ప్రభుత్వ నియామకాలకు అర్హులు కారు?
ఎ) కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్
బి) యూపీఎస్సీ చైర్మన్
సి) అటార్నీ జనరల్ డి) ఎ, బి
8. అటార్నీ జనరల్‌గా నియమితుడయ్యే వ్యక్తికి కింద పేర్కొన వారిలో ఎవరితో సమానమైన అర్హతలు ఉండాలి?
ఎ) హైకోర్టు న్యాయమూర్తి
బి) సుప్రీంకోర్టు న్యాయమూర్తి
సి) హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి
డి) సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి
9. భారతదేశంలో అత్యున్నత న్యాయాధికారి ఎవరు?
ఎ) సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి
బి) అటార్నీ జనరల్
సి) అడ్వకేట్ జనరల్ డి) సోలిసిటర్ జనరల్

సమాధానాలు

1) బి; 2) డి; 3) డి; 4) డి;
5) ఎ; 6) డి; 7) డి; 8) బి;
9) బి.

మాదిరి ప్రశ్నలు

1. ఫ్యాక్టరీలు, కర్మాగారాల్లో బాలకార్మికులు పనిచేయడాన్ని నిషేధించే ఆర్టికల్?
ఎ) ఆర్టికల్ 24 బి) ఆర్టికల్ 25
సి) ఆర్టికల్ 26 డి) ఆర్టికల్ 22
2. ఏ ఆర్టికల్ ప్రకారం రాష్ట్రపతి సుప్రీంకోర్టు న్యాయ సలహా కోరవచ్చు?
ఎ) 142 బి) 144 సి) 143 డి) 145
3. రాష్ట్రపతిగా ఎన్నికయ్యేందుకు గరిష్ఠ వయసు?
ఎ) 75 బి) 70
సి) 80 డి) పరిమితి లేదు
4. భారత రాజ్యాంగంలో ప్రాథమిక హక్కుల గురించి తెలుపుతున్న ఆర్టికల్స్?
ఎ) 12-32 బి) 13-32
సి) 13-25 డి) 12-35
5. రాజ్యాంగ సవరణ గురించి తెలిపే ఆర్టికల్ ఏది?
ఎ) ఆర్టికల్ 367 బి) ఆర్టికల్ 368
సి) ఆర్టికల్ 369 డి) ఆర్టికల్ 370
6. అత్యవసర పరిస్థితుల్లో ప్రాథమిక హక్కులను తాత్కాలికంగా రద్దు చేయడానికి రాష్ట్రపతికి అధికారం కల్పించే అంశాన్ని ఏ దేశ రాజ్యాంగం నుంచి గ్రహించారు?
ఎ) ఫ్రాన్స్ బి) ఐర్లాండ్
సి) కెనడా డి) జర్మనీ
7. ప్రధానమంత్రి సమానుల్లో ప్రథముడు అని అభిప్రాయపడింది?
ఎ) లాస్కీ బి) లార్డ్‌మార్లీ
సి) ఐవర్ జెన్నీ డి) రామ్‌సే మ్యూర్
8. పార్లమెంట్‌కు ఏజెంట్‌గా వ్యవహరించేది?
ఎ) స్పీకర్ బి) అటార్నీ జనరల్
సి) కాగ్ డి) సొలిసిటర్ జనరల్
9. జాతీయ మహిళా కమిషన్ తొలి అధ్యక్షురాలు?
ఎ) మోహినిగిరి బి) పూర్ణిమా అద్వానీ
సి) విభా పార్థసారథి
డి) జయంతీ పట్నాయక్
10. పౌరహక్కుల రక్షణ చట్టాన్ని ఎప్పుడు చేశారు?
ఎ) 1951 బి) 1952
సి) 1953 డి) 1955
11. కనీస వేతనాల చట్టాన్ని ఎప్పుడు చేశారు?
ఎ) 1996 బి) 1980
సి) 1982 డి) 1948

సమాధానాలు

1) ఎ; 2) సి; 3) డి; 4) డి;
5) బి; 6) డి; 7) బి; 8) సి;
9) డి; 10) డి; 11) డి.

అటార్నీ జనరల్స్

పేరు	పదవీకాలం
ఎం.సి. సెతల్వాడ్	1950-1963
సి.కె. దఫ్తరి	1963-1968
నిరెండె	1968-1977
ఎస్.వి.గుప్తా	1977-1979
ఎల్.ఎన్. సిన్హా	1979-1983
కె.పరాశరన్	1983-1989
సోలి జె. సొరాబ్జీ	1989-1990
జి.రామస్వామి	1990-1992
మిలాన్ కె. బెనర్జీ	1992-1996
అశోక్ కె. దేశాయ్	1996-1998
సోలీ జె. సొరాబ్జీ	1998-2004
మిలాన్ కె. బెనర్జీ	2004-2009
గులాం ఇ. వాహనవతి	2009-2014
ముకుల్ రోహిత్గి	2014-2017
కె.కె. వేణుగోపాల్	2017-2022
ఆర్.వెంకటరమణి	2022-2025

భారతదేశంలో రెండుసార్లు అటార్నీ జనరల్‌గా వ్యవహరించినవారు.. సోలీ జె. సొరాబ్జీ, మిలాన్ కె. బెనర్జీ.



కాగ్ పదవిని చేపట్టిన వ్యక్తులు

పేరు	పదవీకాలం
నరహరి రావ్	1949-1954
ఎ.కె. చాంద్	1954-1960
ఎస్.హెచ్.ఎ.కె.రాయ్	1960-1966
ఎస్.రంగనాథన్	1966-1972
ఎ.భక్షి	1972-1978
జి.ప్రకాశ్	1978-1984
టి.ఎన్. చతుర్వేది	1984-1990
సి.జి. సోమయ్య	1990-1996
వి.కె. షుంగ్లు	1996-2002
వి.ఎన్. కౌల్	2002-2008
వినోద్‌రాయ్	2008-2013
శశికాంత్ శర్మ	2013-2017
రాజీవ్ మహర్షి	2017-2020
గిరీష్‌చంద్ర ముర్మూ	2020-2024
సంజయ్‌మూర్తి	2024- ప్రస్తుతం

ప్లనేరియాలో విసర్జకావయవాలు ఏవి?



మాదిరి ప్రశ్నలు

1. 'ఫ్లేమ్ ఆఫ్ ది ఫారెస్ట్' అని దేన్ని పిలుస్తారు?
ఎ) మామిడి బి) వేప
సి) మోదుగ డి) తుమ్మ
2. లెగ్యూమ్ మొక్కల్లో నత్రజని స్థాపన చేసే బ్యాక్టీరియా ఏది?
ఎ) రైజోబియం బి) అజటోబాక్టర్
సి) అజోస్పైరిల్లం డి) రోడోస్పైరిల్లం
3. వరి పొలాల్లో నత్రజని కోసం ఏ జీవ ఎరువును వాడతారు?
ఎ) రైజోబియం బి) గ్రీన్‌మాన్యూర్
సి) అజొల్లా డి) క్లాస్ట్రీడియం
4. శంకువు రూపంలో ఉండే పుష్పాలు వేటిలో ఉంటాయి?
ఎ) వివృత బీజాలు బి) ఆవృత బీజాలు
సి) టెరిడోఫైటా డి) బ్రయోఫైటా
5. కిందివాటిలో వేగంగా పెరిగే మొక్క ఏది?
ఎ) చిక్కుడు బి) మల్లె
సి) వెదురు డి) నందివర్ధనం
6. నత్తల ద్వారా జరిగే పరాగ సంపర్కం?
ఎ) కీరొప్టిరోఫిలి బి) మెలకోఫిలి
సి) సర్పెంటోఫిలి డి) ఎంటమోఫిలి
7. ఆధునిక జన్యు శాస్త్ర పితామహుడెవరు?
ఎ) మెండల్ బి) వాట్సన్
సి) హెచ్.జి. ఖొరానా డి) టి.హెచ్. మోర్గాన్
8. వరిలో క్రోమోజోముల సంఖ్య?
ఎ) 12 బి) 24 సి) 36 డి) 46
9. చెరకులో ఎర్రకుళ్లు తెగులు దేని వల్ల సోకుతుంది?
ఎ) పైరిక్యులేరియా బి) ఫైటాఫ్‌థోరా
సి) కొలిటోట్రైకం డి) పక్సీనియా
10. వైరస్ అంటే అర్థమేమిటి?
ఎ) స్పాంజ్ బి) విషం
సి) ఆమ్లం డి) ఏదీకాదు
11. పించ్ పక్షులపై పరిశోధనలు చేసినవారు?
ఎ) డార్విన్ బి) మెండెల్
సి) మోర్గాన్ డి) రాబర్ట్‌హుక్
12. రిసర్పిన్ దేని నుంచి లభిస్తుంది?
ఎ) రావుల్ఫియా బి) కేసియా
సి) ఆసిమం డి) కాల్షియా
13. మొదటి నిజమైన నేల మొక్కలేవి?
ఎ) బ్రయోఫైటా బి) టెరిడోఫైటా
సి) జిమ్నోస్పెర్మ్స్ డి) ఆంజియోస్పెర్మ్స్
14. C_3 పథంలో ఏర్పడే మొదటి పదార్థం ఏది?
ఎ) OAA బి) PGA
సి) PHB డి) RUBP
15. మొక్కలు వాతావరణంలోకి విడుదల చేసే O_2 దేని నుంచి లభిస్తుంది?
ఎ) CO_2 బి) సూర్యరశ్మి
సి) పత్రహరితం డి) H_2O
16. నీటి బిందువుల రూపంలో పత్రం శీర్షం నుంచి విడుదలవడాన్ని ఏమంటారు?
ఎ) ట్రాన్స్‌పిరేషన్ బి) ఎవాపరేషన్
సి) గట్టేషన్ (Guttation) డి) ట్రాన్స్‌క్రిప్షన్
17. ఫలాలు త్వరగా పక్వం చెందడానికి ఉపయోగపడే హార్మోన్ ఏది?
ఎ) ఆక్సిన్లు బి) జిబ్బరెలిన్లు
సి) సైటోకైనిన్లు డి) ఇథిలిన్
18. ఏ కాంతిలో కిరణజన్య సంయోగక్రియ ఎక్కువగా జరుగుతుంది?
ఎ) నీలం బి) ఎరుపు
సి) ఆకుపచ్చ డి) ఇండిగో
19. 'కణ భాండాగారం' అని దేన్ని పిలుస్తారు?
ఎ) మైటోకాండ్రియా బి) రైబోజోమ్స్
సి) రిక్తిక డి) హరిత రేణువు
20. ఏ మూలక లోపం వల్ల 'చిన్న ఆకుతెగులు' సంభవిస్తుంది?
ఎ) Mn బి) Zn సి) Fe డి) K
21. 'ప్రకృతి పారిశుధ్య కార్మికులు'గా వేటిని పేర్కొంటారు?
ఎ) వైరస్ బి) బ్యాక్టీరియా
సి) ప్రోటోజోవా డి) ఫంగస్
22. కిందివాటిలో ఉప ఉత్పన్నం ఏది?
ఎ) జిగురు బి) లేటెక్స్
సి) రెజిన్లు డి) పైవన్నీ
23. గోల్డెన్‌రైస్‌లో ఉండే విటమిన్ ఏది?
ఎ) విటమిన్ -ఎ బి) విటమిన్ - సి
సి) విటమిన్ - డి డి) విటమిన్ -ఇ
24. కణజాలవర్ధనంలో పూర్తి మొక్కను/మొక్కలను ఏర్పరచగలిగే కణ సామర్థ్యాన్ని ఏమంటా రు?
ఎ) టొటిపొటెన్సీ బి) ఎఫిసియెన్సీ
సి) పార్థినోకార్పి డి) ఎఫినిటీ
25. సాధారణంగా శిలీంద్రాలు అనేవి?
ఎ) స్వయం పోషకాలు
బి) పరాన్నజీవులు సి) పూతికాహారులు
డి) సహజీవన జీవులు
26. ట్రైకోడెర్మా అనేది ఒక..?
ఎ) శిలీంధ్రం బి) శైవలం
సి) బ్యాక్టీరియా డి) ప్రోటోజోవా
27. అలెగ్జాండర్ ఫ్లెమింగ్‌కు నోబెల్ బహుమతి ఎప్పుడు లభించింది?
ఎ) 1928 బి) 1930
సి) 1919 డి) 1945
28. జంతు రాజ్యంలో అతి పెద్ద వర్గం ఏది?
ఎ) ప్రోటోజోవా బి) ఆర్థ్రోపొడ
సి) మొలస్కా డి) క్షీరదాలు
29. జీవితాంతం నీటిని తీసుకోని జీవి ఏది?
ఎ) డెవిల్ ఫిష్ బి) కటిల్ ఫిష్
సి) సిల్వర్ ఫిష్ డి) స్టార్ ఫిష్
30. 'గైనకోమాస్టిజం' దేనిలో కనిపిస్తుంది?
ఎ) ప్లాటిపస్ బి) ఎఖిడ్నా
సి) కంగారు డి) వానపాము
31. కుక్కలో క్రోమోజోముల సంఖ్య?
ఎ) 72 బి) 36 సి) 78 డి) 46
32. దయాఫ్రాం ఏ వర్గానికి చెందిన జీవుల్లో ఉంటుంది?
ఎ) క్షీరదాలు బి) సరీసృపాలు
సి) పక్షులు డి) ఉభయచరాలు
33. వానపాములో చలనాంగాలేవి?
ఎ) వాజాలు బి) పిచ్చాలు
సి) సీటాలు డి) ఈకలు
34. కీటకాల రక్తంలో ఉండేది?
ఎ) హీమోగ్లోబిన్ బి) హీమోసయనిన్
సి) హీమోక్లోరిబియం డి) పైవన్నీ
35. ఉద్దయ కందరాలు వేటిలో ఉంటాయి?
ఎ) పక్షులు బి) కీటకాలు
సి) సరీసృపాలు డి) క్షీరదాలు
36. ఏనుగు గర్భావధి కాలం ఎంత?
ఎ) 330-350 రోజులు
బి) 630-660 రోజులు
సి) 270-280 రోజులు
డి) 150-160 రోజులు
37. చేపల ద్వారా లభించే విటమిన్లేవి?
ఎ) బి, సి బి) ఎ, ఇ
సి) ఎ, డి డి) బి, డి
38. రక్తవర్గం ఆలో ఉండే యాంటీబాడీస్?
ఎ) A బి) B సి) AB డి) O
39. జీర్ణాశయంలో హైడ్రోక్లోరిక్ ఆమ్లం PH విలువ ఎంత?
ఎ) 3.0 బి) 2.0 సి) 4.5 డి) 7.4
40. గాంబియా జ్వరం దేనివల్ల సంభవిస్తుంది?
ఎ) ట్రిపానోసోమా బి) ప్లాస్మోడియం
సి) లీష్మానియా డి) పైలేరియా
41. పాలలో ఉండే చక్కెర ఏది?
ఎ) లాక్టోస్ బి) కేసిన్
సి) సుక్రోస్ డి) ఫ్రక్టోస్
42. నాడీ వ్యవస్థలో ముఖ్యంగా ఉపయోగపడే మూలకం ఏది?
ఎ) Na బి) Ca సి) P డి) I
43. తెలంగాణ రాష్ట్ర పక్షి ఏది?
ఎ) పావురం బి) పాలపిట్ట
సి) కోకిల డి) నెమలి
44. ఎముకల గురించి అధ్యయనం చేసే శాస్త్రాన్ని ఏమంటారు?
ఎ) కాంకాలజీ బి) ఆంకాలజీ
సి) ఆస్టియాలజీ డి) ఆప్తమాలజీ
45. ప్లనేరియాలో విసర్జకావయవాలు ఏవి?
ఎ) మాల్పీజియన్ నాళాలు బి) ఫ్లేమ్ సెల్స్
సి) వృక్కాలు డి) ట్రాఖియా
46. 'S' ఆకారంలో కేంద్రకం వేటిలో ఉంటుంది?
ఎ) ఆసిడోఫిల్స్ బి) న్యూట్రోఫిల్స్
సి) బేసోఫిల్స్ డి) లింఫోసైట్స్
47. పెరుగుదల హార్మోన్ లోపం వల్ల చిన్న పిల్లల్లో సంభవించే వ్యాధి?
ఎ) క్రిటినిజం బి) జిగాంటిజం
సి) ఆస్టియోమలేషియా డి) ఆర్థ్రైటిస్
48. స్త్రీలలో ఉండే క్రోమోజోములు?
ఎ) XX బి) XY
సి) XXY డి) XYX
49. యూరికోటెలిక్ జీవులు ఏవి?
ఎ) సరీసృపాలు బి) పక్షులు
సి) ఆర్థ్రోపొడ డి) పైవన్నీ
50. మొదటగా కనుగొన్న క్లోన్ ఏది?
ఎ) జియోజియో బి) స్పాటి
సి) డాలి డి) విజి-బి

సమాధానాలు

1) సి; 2) ఎ; 3) సి; 4) ఎ;
5) సి; 6) బి; 7) డి; 8) బి;
9) సి; 10) బి; 11) ఎ; 12) ఎ;
13) బి; 14) బి; 15) డి; 16) సి;
17) డి; 18) బి; 19) ఎ; 20) బి;
21) బి; 22) డి; 23) ఎ; 24) ఎ;
25) సి; 26) ఎ; 27) డి; 28) బి;
29) సి; 30) ఎ; 31) సి; 32) ఎ;
33) సి; 34) బి; 35) ఎ; 36) బి;
37) సి; 38) ఎ; 39) బి; 40) ఎ;
41) ఎ; 42) ఎ; 43) బి; 44) సి;
45) బి; 46) సి; 47) ఎ; 48) ఎ;
49) డి; 50) సి.

విద్య, ఉద్యోగ సమాచారం

ఏపీ డీఈఈసెట్-2025

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, పాఠశాల విద్యా విభాగం 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి రెండేళ్ల డీఈఎల్‌ఈడీ కోర్సులో ప్రవేశాలకు డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (డీఈఈ సెట్) -2025 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ పరీక్షలో వచ్చిన ర్యాంక్ ద్వారా ప్రభుత్వ డైట్‌లు/ప్రైవేట్ ఎలిమెంటరీ టీచర్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో ప్రవేశాలు కల్పిస్తారు.

- **అర్హత:** కనీసం 50 శాతం మార్కులతో ఇంటర్మీడియట్ లేదా దానికి సమానమైన పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయసు:** కనిష్ఠంగా 01.09.2025 నాటికి 17 ఏళ్లు నిండి ఉండాలి. గరిష్ఠ వయోపరిమితి లేదు.
- **ఎంపిక విధానం:** డీఈఈసెట్‌లో సాధించిన ర్యాంక్, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా
- **పరీక్ష విధానం:** మొత్తం 100 మార్కులకు ఆబ్జెక్టివ్ విధానంలో పరీక్ష ఉంటుంది. పార్ట్-ఎకి 60 మార్కులు, పార్ట్-బికి 40 మార్కులు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
- **దరఖాస్తులకు చివరితేది:** 08.05.2025.
- **హాల్ టికెట్ల డౌన్‌లోడ్ తేది:** 20.05.2025.
- **ప్రవేశ పరీక్షతేది:** 02.06.2025, 03.06.2025.
- **ఫలితాల వెల్లడి తేది:** 10.06.2025.
- **వెబ్‌సైట్:** https://apdeecet.apcfss.in/

బీఐఆర్‌ఏసీలో యంగ్ ప్రొఫెషనల్ పోస్టులు

ఢిల్లీలోని బయోటెక్నాలజీ ఇండస్ట్రీ రీసెర్చ్ అసిస్టెన్స్ కౌన్సిల్(బీఐఆర్‌ఏసీ) ఒప్పంద ప్రాతిపదికన యంగ్ ప్రొఫెషనల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 02.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీటెక్/బీఈ(సీఎస్/ఐటీ)లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** 23.05.2025 నాటికి 28 ఏళ్లు
- **వేతనం:** నెలకు రూ.30,000 నుంచి రూ.50,000.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
- **దరఖాస్తులకు చివరితేది:** 23.05.2025.
- **వెబ్‌సైట్:** https://www.birac.nic.in/

ది వేర్‌హౌసింగ్ చట్టాన్ని ఎప్పుడు చేశారు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ ఎకానమీ

నిల్వ సామర్థ్యం
(Storage Capacity)

వ్యవసాయమే ప్రధాన జీవనోపాధిగా ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో 'సమ్మిళిత వృద్ధి' సాధ్యపడాలంటే వ్యవసాయ రంగంలో సమూల ప్రగతి అవసరం. ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం భారత్‌లో ఆహార ఉత్పత్తుల నిల్వ సామర్థ్యం సరిపోయినంతగా లేదు. ఈ కారణంగా ఏటా మొత్తం ఉత్పత్తిలో 12 నుంచి 16 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉత్పత్తులు వృథా అవుతున్నాయి. వీటి విలువ రూ. 50,000 కోట్ల వరకు ఉన్నట్లు అంచనా.

1994-95 తర్వాతి కాలంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి సగటు వార్షిక వృద్ధి 1.20 శాతంగా నమోదైంది. 1990-91లో మొత్తం ఆహార ధాన్యాల ఉత్పత్తి 176.4 మిలియన్ టన్నులు కాగా, 2013-14 నాటికి 264.4 మిలియన్ టన్నులకు పెరిగింది. ఇటీవల రబీలో గోధుమ, బియ్యం, Cereals, పప్పు ధాన్యాల ఉత్పత్తిలో పెరుగుదల కారణంగా ఖరీఫ్, రబీ కాలంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి సమానంగా ఉండటాన్ని గమనించవచ్చు. ఉత్పత్తిలో పెరుగుదలకు అనుగుణంగా నిల్వ సామర్థ్యాలను పటిష్టపరిస్తేనే సత్ఫలితాలుంటాయి.

నిల్వ సౌకర్యాలు - గిడ్డంగులు

వ్యవసాయ ఉత్పత్తుల నిల్వకు సంబంధించి భారత్‌లో గిడ్డంగులు (గోడౌన్లు) ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. గిడ్డంగుల నిర్మాణం శాస్త్రీయంగా ఉన్నప్పుడే వ్యవసాయ ఉత్పత్తుల నాణ్యత, పరిమాణాలను పరిరక్షించవచ్చు. భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ), సెంట్రల్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్, స్టేట్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్లు గిడ్డంగులను నిర్వహిస్తున్నాయి. భారత్‌లో సెంట్రల్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్‌ను అతిపెద్ద ప్రభుత్వ రంగ గిడ్డంగి నిర్వహణదారుగా పేర్కొనవచ్చు. ఇది సుమారుగా 120 వ్యవసాయ, పారిశ్రామిక ఉత్పత్తులకు భద్రతతో కూడిన నిల్వ సౌకర్యాలను కల్పిస్తోంది. వ్యవసాయ ఉత్పత్తుల సేకరణ, శ్రేణీకరణ, పంపిణీ లాంటి సేవలను కూడా నిర్వహిస్తోంది. దేశంలో అనేక రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ప్రత్యేక గిడ్డంగి కార్పొరేషన్లను ఏర్పాటు చేశాయి. రాష్ట్ర గిడ్డంగి కార్పొరేషన్లు ఆయా రాష్ట్రాలకు సంబంధించి జిల్లా స్థాయిలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. రాష్ట్ర గిడ్డంగి కార్పొరేషన్ ఏర్పాటుకు అవసరమైన వాటా మూలధనాన్ని సంబంధిత రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర గిడ్డంగి కార్పొరేషన్ సమానంగా సమకూరుస్తాయి. కేంద్ర, రాష్ట్ర గిడ్డంగి కార్పొరేషన్లతో పాటు భారత ఆహార సంస్థ కూడా వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ సౌకర్యాలను కల్పిస్తోంది. 2010 చివరి నాటికి కేంద్ర గిడ్డంగి కార్పొరేషన్ (సీడబ్ల్యూసీ), రాష్ట్ర గిడ్డంగి కార్పొరేషన్లు, భారత ఆహార సంస్థల మొత్తం నిల్వ సామర్థ్యం 75 మిలియన్ టన్నులకు చేరింది. రైతులు వారి ఉత్పత్తులను తక్కువ ధరకే విక్రయించకుండా నిరోధించే క్రమంలో గ్రామీణ గోడౌన్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వ స్పాన్సర్డ్ పథకాన్ని ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని 2001 మార్చి నుంచి అమలు పరుస్తోంది. ఇప్పటివరకు 67 మిలియన్ టన్నుల సామర్థ్యం ఉన్న గ్రామీణ గోడౌన్లను ఏర్పాటు చేసినట్లు అంచనా. ఉత్పత్తి ధోరణి, విక్రయమైన మిగులు పరిశీలించినప్పుడు భారత్‌లో వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ సామర్థ్యం తక్కువగా ఉన్నట్లు భావించవచ్చు. 2012 ఫిబ్రవరి 1 నాటికి భారత ఆహార సంస్థ 300.83 లక్షల టన్నుల నిల్వ సామర్థ్యం (సొంత, అద్దె గోడౌన్లు కలిపి) కలిగి ఉండగా రాష్ట్ర ఏజెన్సీలు 153.54 లక్షల టన్నుల నిల్వ సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. మొత్తంగా భారత్‌లో వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ సామర్థ్యం 91 మిలియన్ టన్నులకు పైగా పెరిగింది. ప్రభుత్వ ఏజెన్సీలకు సంబంధించి నిల్వ సామర్థ్యాన్ని ప్రజాపంపిణీ వ్యవస్థ, ఇతర ప్రభుత్వ పథకాల అమల్లో భాగంగా ఆహార ధాన్యాల నిల్వకే ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. ఆహార భద్రత కల్పించే క్రమంలో ప్రభుత్వ ఏజెన్సీల ఆహార ధాన్యాల సేకరణ పెరుగుతున్న క్రమంలో లభ్యమయ్యే నిల్వ సామర్థ్యంపై అధిక ఒత్తిడి ఉంది. అధిక మద్దతు ధరల కారణంగా ఆహార ధాన్యాల సేకరణలో నిమగ్నమవుతున్న రాష్ట్ర ఏజెన్సీల నిల్వ సామర్థ్యంపై కూడా ఒత్తిడి పెరుగుతోంది. నాబార్డ్ మంజూరు చేసిన గోడౌన్ల సగటు నిల్వ సామర్థ్యం 1261 మెట్రిక్ టన్నులు కాగా, మొత్తం గోడౌన్లలో 75 శాతం నిల్వ సామర్థ్యం వెయ్యి మెట్రిక్ టన్నుల కంటే తక్కువగా ఉంది. నాబార్డ్ సహకారంతో రైతులు ఏర్పాటు చేసుకున్న చిన్న, మధ్య తరహా గోడౌన్ల వల్ల వారి ఉత్పత్తులను తక్కువ ధర వద్ద విక్రయించే పరిస్థితి తగ్గి, గిట్టుబాటు ధర పొందగలుగుతున్నారని అనుభవ పూర్వక ఆధారాలు తెలియజేస్తున్నాయి.



నిల్వ సామర్థ్యం - ప్రాంతీయ అసమానతలు

ఉత్పత్తి కేంద్రాలుగా భారత్‌లో నిల్వ సామర్థ్యం కొన్ని ప్రాంతాల్లో అధికంగా కేంద్రీకృతమై ఉంది. వ్యవసాయ ఉత్పత్తుల వినియోగం అధికంగా ఉన్న ముఖ్య రాష్ట్రాల్లో 22 శాతం నిల్వ సామర్థ్యం లభ్యమవుతోంది. అవసరాలకు అనుగుణంగా కొన్ని రాష్ట్రాలు నెల లోపు నిల్వ సామర్థ్యాన్ని కూడా కలిగి ఉన్నాయి. రాష్ట్రాల మధ్య ఆహార, పప్పు ధాన్యాల ఉత్పత్తిలో తేడా; వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ నిమిత్తం మండీల ఏర్పాటులో వ్యత్యాసాలు నిల్వ సామర్థ్యానికి సంబంధించి ప్రాంతీయ అసమానతలు పెరగడానికి ప్రధాన కారణాలుగా ఉన్నాయి. స్థానిక ఉత్పత్తిదారులకు గ్రామీణ గిడ్డంగుల ఏర్పాటులో ప్రభుత్వ ప్రోత్సాహకాలకు సంబంధించి వారిలో అవగాహన, బ్యాంక్ అధికారుల వైఖరి లాంటివి కూడా వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ సామర్థ్యాన్ని పెంపొందించుకోవడంలో ప్రాంతాల మధ్య అసమానతలకు కారణంగా ఉన్నాయి. మొత్తం గోడౌన్లు, నిల్వ సామర్థ్యంలో ఆహార ధాన్యాలు, సంబంధిత వ్యవసాయ ఉత్పత్తులను అధికంగా పండించే కొద్దిమంది రైతులే ఎక్కువగా కలిగి ఉన్నారు. అందువల్ల ధనిక రైతులే గిట్టుబాటు ధరలు పొందుతున్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో ఆదాయ అసమానతలతో పాటు ప్రాంతీయ అసమానతలు పెరిగాయి. భారత్‌లో మొత్తం వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ సామర్థ్యాన్ని ప్రాంతాల వారీగా పరిశీలిస్తే.. ఉత్తర భారతదేశం వాటా 48 శాతం ఉండగా, దక్షిణ భారతదేశం 22%, పశ్చిమ ప్రాంతం 13%, మధ్య భారత దేశం 9%, తూర్పు ప్రాంతం 7% వాటా కలిగి ఉన్నాయి. ఈశాన్య రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల వాటా దేశంలోని మొత్తం వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ సామర్థ్యంలో 1% మాత్రమే. నిల్వ సామర్థ్యంలో ప్రాంతాల మధ్య అసమానతల కారణంగా వ్యవసాయ ఉత్పత్తుల సేకరణకు సంబంధించి ప్రభుత్వ సామర్థ్యం పరిమితంగా ఉంది. గోడౌన్లలో నిల్వ చేస్తున్న వ్యవసాయ ఉత్పత్తుల్లో ఆహార ధాన్యాలపై గోధుమ, బియ్యం వాటా అధికంగా ఉంది. తర్వాతి స్థానాల్లో నూనె గింజలు, సుగంధ ద్రవ్యాలు, పత్తి నిలిచాయి. నిల్వ సామర్థ్యాన్ని పెంచడానికి ప్రభుత్వం అనేక పథకాల ద్వారా ప్రోత్సాహకం అందిస్తున్నప్పటికీ గోధుమ, బియ్యం నిల్వల్లోనే పెరుగుదల కనిపిస్తోంది.

గిడ్డంగుల నియంత్రణ విధానం

గిడ్డంగుల ఏర్పాటులో ప్రైవేటు భాగస్వామ్యాన్ని పెంపొందించడం, వేర్‌హౌసింగ్ పరిశ్రమ అభివృద్ధి, నియంత్రణకు సంబంధించి భారత ప్రభుత్వం సెప్టెంబర్ 2007లో 'ది వేర్‌హౌసింగ్ (డెవలప్‌మెంట్ అండ్ రెగ్యులేషన్)' చట్టాన్ని తీసుకువచ్చింది. దీని ప్రకారం 2010 అక్టోబర్‌లో వేర్‌హౌసింగ్ డెవలప్‌మెంట్ అండ్ రెగ్యులేటరీ అథారిటీని ఏర్పాటు చేశారు. వేర్‌హౌసింగ్ అభివృద్ధి, నియంత్రణ చట్టం ముఖ్య ఉద్దేశం నెగోషియబుల్ వేర్‌హౌస్ రిసిప్ట్ (NWR) మంజూరులో నియంత్రణ వాతావరణాన్ని కల్పించడం. NWR మంజూరు చేసే గిడ్డంగులకు వేర్‌హౌసింగ్ డెవలప్‌మెంట్ అండ్ రెగ్యులేటరీ అథారిటీ (WDRA) గుర్తింపునిస్తుంది. ఇది 2011 మార్చి 31 నాటికి పరిశీలనకు వచ్చిన 300 దరఖాస్తుల్లో 51 అప్లికేషన్లకు అనుమతినిచ్చింది.

కోల్డ్ స్టోరేజీలు


భారత్‌లో పండ్లు, కూరగాయల సాంవత్సరిక ఉత్పత్తి 130 మిలియన్ టన్నులుగా అంచనా. వైవిధ్య వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో వీటి ఉత్పత్తిలో గణనీయమైన పెరుగుదల ఏర్పడింది. వీటి ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడానికి అనేక అవకాశాలున్నప్పటికీ ఆయా ఉత్పత్తులను నిల్వ చేయడానికి అవసరమైన శీతల గిడ్డంగులు (Cold Storages) తగినంతగా లేవు. శీతల గిడ్డంగుల సౌకర్యం అధికంగా సింగిల్ కమోడిటీస్ అయిన బంగాళాదుంప, ఆరెంజ్, ఆపిల్, ద్రాక్ష, దానిమ్మ, పూలు లాంటి వాటికి మాత్రమే అందుబాటులో ఉంది. అంటే శీతల గిడ్డంగుల సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకోవడం లేదు. బహుళ ఉత్పత్తులను నిల్వ చేసే విధంగా శీతల గిడ్డంగులను ఏర్పాటు చేయాలి. ఇది ఉత్పత్తిదారుల ఆర్థిక స్థోమతపై ఆధారపడి ఉంటుంది. రిఫ్రిజిరేషన్ వ్యవస్థను శీతల గిడ్డంగులు నిర్వహిస్తాయి. వస్తువులు నిల్వ చేయడానికి వీలుగా గది వాతావరణాన్ని రిఫ్రిజిరేషన్ వ్యవస్థ నియంత్రిస్తుంది. దేశంలోని 5274 శీతల గిడ్డంగుల నిల్వ సామర్థ్యం 24.31 మిలియన్ టన్నులుగా అంచనా. శీతల గిడ్డంగులు ఎక్కువగా ప్రైవేటు రంగంలో ఏర్పాటయ్యాయి. ప్రభుత్వ, సహకార రంగంలో ఏర్పాటైన శీతల గిడ్డంగుల వాటా చాలా తక్కువ. ప్రస్తుతం దేశంలోని శీతల గిడ్డంగుల్లో పండ్లు, కూరగాయలు, పత్తి, మిరపకాయల నిల్వలు కొనసాగుతున్నాయి. అసోం, హిమాచల్ ప్రదేశ్, జమ్మూకశ్మీర్, కేరళ, సిక్కిం, తమిళనాడు రాష్ట్రాల్లోని పండ్లు, కూరగాయల ఉత్పత్తిలో 1% మాత్రమే శీతల గిడ్డంగుల్లో నిల్వ చేస్తున్నారు. పంజాబ్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, రాజస్థాన్ రాష్ట్రాల్లో భారత్‌లోని మొత్తం శీతల గిడ్డంగుల సగటు నిల్వ సామర్థ్యం కంటే అధిక నిల్వ సామర్థ్యం ఉంది. మొత్తం మీద వీటి డిమాండ్ వ్యవసాయ ఉత్పత్తులకే అధికంగా ఉంది.

నిల్వ సామర్థ్యం పెంపునకు చర్యలు

- గత దశాబ్ద కాలంలో నిల్వ సామర్థ్యం సగటు సాంవత్సరిక వృద్ధి 6.7%గా నమోదైంది. నిల్వ సామర్థ్యం సరిపోయినంతగా లేనందు వల్ల ఏటా మొత్తం ఆహార ధాన్యాల ఉత్పత్తిలో 20 నుంచి 30 శాతం వృథా అవుతున్నాయి. ఈ నేపథ్యంలో అదనపు నిల్వ సామర్థ్యాన్ని పెంచడంతో పాటు ప్రస్తుతం అందుబాటులో ఉన్న రాష్ట్ర గిడ్డంగులను ఆధునికీకరించడంపై ప్రభుత్వాలు దృష్టి సారించాలి. రాష్ట్ర ఏజెన్సీలు నిర్వహిస్తున్న గిడ్డంగులు 20 ఏళ్ల పైబడి ఉన్నాయి. అందువల్ల ఆయా గిడ్డంగుల ఆధునికీకరణ ప్రాధాన్యం సంతరించుకుంది. వీటి ఆధునికీకరణకు 37 నుంచి 40 బిలియన్ రూపాయల వ్యయం అవుతుందని అంచనా.
- ఖరీఫ్, రబీ కాలాల్లో వినియోగాన్ని దృష్టిలో పెట్టుకొని ఆహార ధాన్యాల ఉత్పత్తిలో సమతౌల్యం సాధించాలి. వినియోగ అవసరాల దృష్ట్యా సాంవత్సరిక ఉత్పత్తిలో 70% నిల్వ చేసే విధంగా నిల్వ సామర్థ్యాన్ని పెంచాల్సిన అవసరం ఉంది. దీని కోసం గ్రామీణ గోడౌన్ల ఏర్పాటు పథకాన్ని ప్రభుత్వం తిరిగి ప్రారంభించాలి. ప్రస్తుతం సగటు ఆహార ధాన్యాల ఉత్పత్తిలో సుమారుగా 30% ఉత్పత్తి అవుతున్నట్లుగా భావించి, మొత్తం 70 మిలియన్ టన్నుల ఆహార ధాన్యాల నిల్వ నిమిత్తం నిల్వ సామర్థ్యాన్ని పెంచాలి. వృథా అవుతున్న ఆహార ధాన్యాల ఉత్పత్తిని 70 మిలియన్ టన్నులుగా భావిస్తే వాటి మొత్తం విలువ 70 నుంచి 100 బిలియన్ రూపాయల వరకు ఉంటుంది.
- ప్రభుత్వ ఏజెన్సీల నిల్వ సామర్థ్యానికి సంబంధించి గోధుమ, బియ్యం అధిక మొత్తంలో ఆక్రమించినందువల్ల ఇతర ఆహార ధాన్యాలు, వ్యవసాయ వస్తువుల నిల్వకు అవరోధం ఏర్పడుతోంది. జొన్నలు, సజ్జలు, కార్న్, పప్పుధాన్యాలు, నూనె గింజలు, పత్తి, సుగర్ కేన్ లాంటి వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ కోసం ప్రభుత్వ ఏజెన్సీల నిల్వ సామర్థ్యాన్ని పెంచాలి. నిర్వహణలో ఉన్న గిడ్డంగుల సామర్థ్యాన్ని పరీక్షించడానికి వేర్‌హౌస్ పర్‌ఫార్మెన్స్ ఇండికేటర్లను ప్రవేశపెట్టాలి.
- ప్రైవేటు రంగంలో నిల్వ సామర్థ్యం పెంపునకు ప్రోత్సాహకాలు అవసరం. నాబార్డ్, నేషనల్ కో-ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ల ద్వారా గిడ్డంగి పరిశ్రమ అభివృద్ధిలో ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించాలి. 2010 మార్చి నాటికి మొత్తం నిల్వ సామర్థ్యం 91 మిలియన్ మెట్రిక్ టన్నుల్లో నాబార్డ్ పథకం కింద లబ్ధి పొందిన గిడ్డంగుల సామర్థ్యం 24 శాతం కాగా, నేషనల్ కో-ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కింద లబ్ధి పొందిన గిడ్డంగుల నిల్వ సామర్థ్యం 17 శాతం. గిడ్డంగుల ఏర్పాటులో ప్రభుత్వ - ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలి.
- పంట చేతికి వచ్చే సమయంలో వ్యవసాయ ఉత్పత్తుల ధరలు తక్కువగా ఉంటున్నాయి. రుణగ్రస్తత కారణంగా చిన్న, సన్నకారు రైతులు గిట్టుబాటు ధర లభించే వరకు వేచి చూడకుండా ఉత్పత్తులు విక్రయిస్తున్నారు. అందువల్ల వ్యవసాయ ఆదాయాలు తగ్గి వ్యవసాయ రంగంపై పెట్టుబడులు తగ్గుతున్నాయి. ఈ పరిస్థితిని నివారించడానికి రైతులు తమ ఉత్పత్తులను గిడ్డంగుల్లో నిల్వ చేసుకునేవిధంగా ప్రోత్సహించాలి. గుర్తింపు ఉన్న గిడ్డంగుల్లో నిల్వ చేసిన వ్యవసాయ ఉత్పత్తులకు నెగోషియబుల్ వేర్‌హౌస్ రిసిప్ట్‌ను అందిస్తే బ్యాంకుల నుంచి రైతులు స్వల్పకాల రుణాన్ని పొందగలుగుతారు. తద్వారా గిట్టుబాటు ధర లభించే వరకు వారి ఉత్పత్తులను విక్రయించకుండా వేచి చూస్తారు. ఈ స్థితి వ్యవసాయ ఆదాయాలు, వ్యవసాయ రంగంలో పెట్టుబడుల పెంపునకు దారితీస్తుంది. NWR మంజూరు గ్రామీణ ప్రాంతాల్లో పరపతి ప్రవాహం పెంపునకు, కాస్ట్ ఆఫ్ క్రెడిట్ (పరపతి వ్యయం) తగ్గింపునకు తోడ్పడుతుంది. ప్రామాణీకరణ, శ్రేణీకరణ, ప్యాకేజింగ్, బీమా సేవలు లాంటి ఇతర కార్యకలాపాలు గ్రామీణ ప్రాంతాల్లో మెరుగవుతాయి. గ్రామీణ ప్రాంతాల్లో అగ్రి - బిజినెస్‌లోని లాజిస్టిక్ చైన్‌లో ఉన్న తారతమ్యాన్ని ఇది పూరిస్తుంది.
- గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాల పెంపుతో పాటు మూలధన సబ్సిడీ లాంటివి కల్పించడం ద్వారా రైతులను సహకార సంఘాల ఏర్పాటు దిశగా ప్రోత్సహించాలి. సహకార సంఘాల ద్వారా అదనపు నిల్వ సామర్థ్యాన్ని పెంచుకోవచ్చు.

The antonym of 'stretched' is

Competitive exams have provided many aspiring candidates to get jobs in various public and private sectors. Candidates appearing for these exams are from various backgrounds and vernacular mediums. English remained a thing of concern for many as they find it as a stumbling block in getting through the exam. In many competitive exams it is mandatory to go through the English language paper and thus it comes out as a challenge for such candidates who lack in English language skills. Hence, it is essential for these candidates to put extra effort on their preparation to score well and be victorious. The English language part consists of questions pertaining to various sections like, grammatical skills, vocabulary knowledge and comprehension.



COMPREHENSION

The comprehension section demands a good reading and understanding capacity of the candidate. You are expected to go through the paragraph given, understand, analyze and derive meaning out of it. Before attempting any passage, skim it as it's very important to understand the tone of the author. It may be optimistic, pessimist, sarcastic, angry or contemplative. If you are able to understand what author is trying to say then there is high probability that you will mark right answers. The passage usually contains 10 questions related to the passage which include synonyms and antonyms of particular words from the paragraph that needs to be answered. If you find that questions are beyond the understanding you found from the passage, simply skip that question, never try to mark nearest answer. Mark the answer only if you are sure about it. Here are a few tips while attempting this section:

- Skim the passage that is given.
- Read the questions first which helps to have an idea as you will be focused.
- Casual reading is not advisable, stay focused and don't miss any detail while reading.
- Make a note of what you read which might help you while you come back in search of answers.
- If doubt persists re-read the passage to make sure you understand it well before answering.
- Understand the author's tone and answer the questions based on author's opinion rather than your opinion.

A methodical and well planned preparation always gives fruitful results. It is essential to have a basic foundation in English which can be acquired by regular reading habits. Time management is crucial during the test. Use time saving techniques. In order to accomplish this you must become familiarize with the directions prior to taking the exam, and practice all the given exercises from this section.

- Keep in mind that you need not dwell too long on any one question or become concerned that you have answered a previous question incorrectly.
- Answer all questions by applying the techniques; keep track of any question that you may want to return to if you have enough time.
- The most important thing is be confident and remember that you have prepared well. Relax and do the best you can.

Model Questions

Directions (Q. 1-15): Read the following passages carefully and answer the questions given below it. Certain words have been printed in bold to help you locate them while answering some of the questions.

PASSAGE 1

"Let us laugh" says, W. Mathews, "it is the cheapest luxury man enjoys. It stirs up the blood, expands the chest, clears away the cobwebs from the brain and gives the whole system a healthy treatment," So is it not nice to laugh a lot? It is said, "Laughter is the best medicine." For those who dislike medicine, sweet or bitter. A good joke that provokes laughter is prescribed. It is nice to have a good laugh but a "guffaw" may sometime lock one's jaws and so it is suggested that those who enjoy a loud guffaw go slow and subside into a gurgle but the best thing is, as done in Hon'ble courts before a Hon'ble Judges, just titter. And be able to enjoy all jokes including ones directed at myself, but never making a laughing stock of myself in the process. Let us remember the wise saying, "He is not laughed at that laughs at himself."

1. It is said that laughter is the best medicine because
   1) It is the cheapest luxury man enjoys
   2) It is available free of cost
   3) It is cheaper whereas medicines in the shops are costly
   4) It is not mentioned
   5) It provides better treatment than costly medicines.
2. The writer says he would never make a laughing stock of himself. It means he should not
   1) let others ridicule him
   2) show disrespect to Judges
   3) laugh, but simply smile at others
   4) let others laugh
   5) laugh at others
3. The writer feels laughter is to be prescribed to those who
   1) are seriously ill
   2) dislike medicines
   3) cannot buy medicines
   4) who are happy
   5) do not need medicines
4. What may sometime lock one's jaws?
   1) Laughter 2) Mirth
   3) Guffaw 4) Gurgle
   5) Titter
5. By quoting a wise saying in the last line the writer
   1) Reiterates the point that laughter is the best medicine for us
   2) Pity on those who laugh
   3) Guides us about what we should do from being laughed at
   4) Cautions us as to how we should conduct ourselves in the Hon'ble Courts
   5) Censures those who cannot laugh at themselves

PASSAGE 2

I once saw a tigress stalking a month old kid. The ground was very open and the kid saw the tigress while she was still some distance away and started bleating, where on the tigress gave up her stalk and walked straight up to it. When the tigress has approached to within a few yards, the kid went forward to meet her, and on reaching the tigress stretched out its neck and put up its head to smell her. For the duration of a few heart beats the month-old kid and the queen of the forest stood nose to nose, and then the queen turned and walked off in the direction from which she came.

6. 'Stalking' in this context means
   1) Running threateningly
   2) Moving about in circles
   3) Attacking
   4) Targeting a victim
   5) Moving quietly without being seen or heard
7. The tigress walked straight up to the kid because
   1) It makes the kid joyous
   2) Running would frighten the kid
   3) Stalking was useless now
   4) The tigress was patient
   5) She was sure of her victim
8. The kid's behavior indicates that
   1) It was familiar with the sight of tigress
   2) It was attracted by the tigress's smell
   3) It was attracted to the tiger's food
   4) It took the tigress for a playmate
   5) It was not aware of the danger involved
9. The expression 'for the duration of a few heart beats' suggests
   1) The few seconds the tigress and the kid spent smelling each other
   2) The fear of the kid
   3) The excitement of the tigress
   4) The anxiety of the watcher
   5) The anxiety of the author
10. 'Queen' in the passage refers to
   1) The queen who came to see
   2) The lady 3) The kid
   4) The tigress 5) The author
11. The synonym of forward is
   1) Rearward 2) Onward
   3) Inward 4) Review
   5) Rejoice
12. The antonym of 'stretched' is
   1) Expand 2) Prolong
   3) Lengthen 4) Elongate
   5) Contract

PASSAGE 3

India is not a backward country. It is the version of the outside world which is outdated. India is growing every day. It has a population of more than 100 million in the middle class, out of which a segment of 70 million is earning monthly wages more than that the average weekly pay of an Australian worker, which makes India an economic power as great as France.

13. What is meant by segment in the above paragraph
   1) The total population
   2) A large part of the population
   3) Some part of the population
   4) Half of the population
   5) Less than half of the population
14. What is the underlying theme of the paragraph?
   1) India is a great military power
   2) India is a backward country
   3) India is fast developing into a big power
   4) India has poor economy
   5) India can never develop

ANSWERS:

1) 1 2) 1 3) 2 4) 3 5) 3
6) 5 7) 5 8) 5 9) 4 10) 4
11) 1 12) 5 13) 3 14) 3